అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

మంగళవారం 06-08-2024 సమగ్ర తెలుగు దినపత్రిక

9వ వార్షికోత్సవం

సంపుటి : 10 సంచిక : 218 Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar 16 పేజీలు వెల:6.50

వాస్తవాలే ఆయువుపట్టుగా..

ప్రజల చేతుల్లో వజ్రాయుధం : రచయిత్రి ఓల్గా



తెలంగాణ ఆవిర్భావంతో ప్రజలంతా సరికొత్త ఆలోచనల కోసం, ఆదర్శాల కోసం ఎదురు చూస్తున్న సమయంలో నవ తెలంగాణా పత్రిక మొదలయింది. ప్రజలకు అత్యవసరంగా అందించాల్సిన వార్తలను, సంచలనంగా చేయకుండా వాస్తవాలుగా అందిస్తోంది. ప్రజలలో సైంటిఫిక్ టెంపర్‌మెంట్ కలిగి, అది పెరిగే వ్యాసాలను ప్రచురించి వైజ్ఞానిక ప్రగతికి దోహదం చేస్తున్నది. ప్రజా ...15లో

సైన్యం చేతుల్లోకి బంగ్లాదేశ్

కుప్పకూలిన హసీనా సర్కార్ | రాజీనామా చేసి దేశం విడిచిన ప్రధాని

బంగ్లాదేశ్‌లో గత 24గంటల్లో పరిణామాలు వేగంగా మారిపోయాయి. ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రతిపాదిత రిజర్వేషన్ కోటా తెచ్చిన తంటాలతో షేక్ హసీనా ప్రభుత్వం కుప్పకూలింది. విద్యార్థుల ఆందోళనలకు తలొగ్గాల్సి వచ్చింది. ఆందోళనకారులు తమ పట్టు విడవకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రధాని హసీనా తన పదవికి రాజీనామా చేసి, దేశం కూడా విడిచివెళ్ళినట్టు వార్తలందాయి. సైన్యం ఈ విషయాలను ధ్రువీకరించింది. అయితే ఆమె ఎక్కడకు వెళ్ళారన్నదానిపై స్పష్టత లేదు. భారత్‌లో ఆశ్రయం పొంది వుంటారని వార్తలు వినిపిస్తున్నా, ఇప్పటి వరకూ ఎలాంటి నిర్దిష్టమైన సమాచారం లేదు. ప్రధాని రాజీనామా చేశారని తెలియగానే వేలాదిమంది ఆందోళనకారులు ప్రధాని అధికార నివాసంలోకి చొచ్చుకువెళ్లారు.

- ధ్రువీకరించిన ఆర్మీ, తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటుకు యత్నాలు



- విద్యార్థుల ఆందోళనలకు తలవంచిన ప్రభుత్వం
- దేశమంతా ఇంటర్‌నెట్ బంద్ వివరాలు 7లో
- హసీనా ఆశ్రయానికి భారత్ నిరాకరణ
- వేగంగా మారుతున్న పరిణామాలు





తెలంగాణకు రండి.. పెట్టుబడులు పెట్టండి..

అభివృద్ధిలో భాగస్వాములుకండి

- తెలుగు రాష్ట్రాల ప్రవాసులకు సీఎం రేవంత్ పిలుపు
- తమ ప్రభుత్వంపై అపోహలు, ఆందోళనలు అవసరం లేదని వ్యాఖ్య
- ఆర్థిక వృద్ధిని వేగంగా సాధించే విధంగా వివరాలు 6లో
- నూతన పారిశ్రామిక విధానం తెస్తామని వెల్లడి
- న్యూజెర్సీలో ప్రవాసుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న సీఎం

కార్పొరేట్ల కోసమే సింగరేణి ప్రయివేటీకరణ

కొత్తగూడెంలో ముగిసిన సింగరేణి పరిరక్షణ యాత్ర


నియంత్రించకుంటే బీఎస్ఎన్ఎల్ తరహాలోనే కోల్‌బ్లాక్‌ల దుస్థితి

- పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది
- మోడీ ప్రభుత్వ విధానాలతో సామాన్యులకు తీరని నష్టం : బహిరంగసభలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు విజయరాఘవన్ వివరాలు 16లో



డెత్ చాంబర్లుగా మారాయి

ఢిల్లీ కోచింగ్ సెంటర్ మరణాలపై సుప్రీం ఆగ్రహం



న్యూఢిల్లీ : ఢిల్లీ కోచింగ్ సెంటర్‌లో సంభవించిన మరణాలపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఢిల్లీలో భారీగా కురిసిన వర్షాలకు రాజిందర్ నగర్‌లోని కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్‌లోకి వరద నీరు పోటెత్తి ముగ్గురు విద్యార్థులు మరణించిన సంఘటనను సుమోటోగా తీసుకున్న సుప్రీం కోర్టు, కోచింగ్ సెంటర్లు డెత్ చాంబర్లుగా మారాయని వ్యాఖ్యానించింది. 'ఈ సంఘటన నేపథ్యంలో ఇప్పటివరకు ఢిల్లీ ప్రభుత్వం లేదా కేంద్రం ...15లో

కృష్ణమ్మ ఉరకలు

నాగార్జునసాగర్ 20 రేడియల్ క్రస్ట్ గేట్ల ఎత్తివేత





1,18,848 క్యూసెక్కుల నీరు విడుదల

నీటిని విడుదల చేసిన కలెక్టర్ సి.నారాయణరెడ్డి, సీఈ నాగేశ్వరరావు

- సాగర్‌లో 583.80 అడుగులు దాటిన నీటిమట్టం
- రెండేండ్ల తర్వాత భారీగా వరద

నవతెలంగాణ-నాగార్జునసాగర్

శ్రీశైలం నుంచి కృష్ణమ్మ పరవళ్లతో నాగార్జునసాగర్ డ్యామ్ ఎట్టకేలకు నిండింది. దాదాపు రెండేండ్ల తర్వాత భారీగా వరద వస్తుండటంతో గేట్లు తెరుచుకున్నాయి. శ్రీశైలం నుంచి 3,23,331 క్యూసెక్కుల నీరు వస్తుండటంతో సోమవారం ఉదయం 11గంటలకు నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ సీఈ నాగేశ్వరరావు 6 క్రస్ట్ గేట్లను ఎత్తి 43,986 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. మధ్యాహ్నం కలెక్టర్ నారాయణరెడ్డి మరో 8 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేశారు. మొత్తం 20 గేట్ల గేట్ల ద్వారా 1,18,848 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్‌లోకి కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తుండటంతో రిజర్వాయర్ నిండుకుండలా మారింది. సాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో ...15లో



మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై

కేసీఆర్‌కు కోర్టు నోటీసులు

- జారీ చేసిన భూపాలపల్లి ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి
- హరీశ్‌రావు సహా అప్పటి ముఖ్య అధికారులకు కూడా..
- సెప్టెంబరు 5న హాజరుకావాలన్న న్యాయస్థానం
- 'రాజలింగ మూర్తి' రివిజన్ పిటిషన్‌పై విచారణ

వివరాలు 7లో

స్కిల్ వర్సిటీ ఛైర్మన్‌గా ఆనంద్ మహీంద్ర

న్యూజెర్సీలో సీఎం రేవంత్ వెల్లడి



వివరాలు 2లో

బేరమన్న మార్కెట్లు

బోరుమన్న మదుపర్లు 15లో..

- రూ.15 లక్షల కోట్ల సంపద ఆవిరి
- సెన్సెక్స్ 2200 పాయింట్ల పతనం
- అమెరికాలో మందగమనం భయాలు
- ఒత్తిడిలో ప్రపంచ మార్కెట్లు

దుర్మార్గం

మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగంతో సభ్యసమాజం తలెత్తుకోలేని దుస్థితి

నవతెలంగాణ- షాద్‌నగర్

దొంగతనం నెపంతో పోలీసుస్టేషన్‌లో థర్డ్ డిగ్రీ ప్రయోగానికి గురైన బాధిత దళిత మహిళను సోమవారం పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు పరామర్శించారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో దొంగతనం కేసు నెపంతో మహిళ సునీతపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించిన విషయం ...15లో

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఆ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- రాత్రి సమయంలో మహిళను పోలీస్ స్టేషన్‌లో ఉంచే హక్కు ఎక్కడిది? సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి :కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు
- డీఐ రాంరెడ్డితోపాటు మరో ఐదుగురిపై వేటు
- సస్పెండ్ చేస్తూ సైబరాబాద్ సీపీ ఉత్తర్వులు



నిజాం కాలేజీ యూజీ విద్యార్థుల ధర్నా

- హాస్టల్‌లో పీజీ విద్యార్థినులకు అడ్మిషన్లు ఇవ్వొద్దని డిమాండ్
- రోడ్డుపై బైటాయింపు.. పలువురి అరెస్ట్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

హైదరాబాద్ నిజాం కళాశాల గర్ల్స్ హాస్టల్‌లో యూజీలకు మాత్రమే అడ్మిషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. గర్ల్స్ హాస్టల్‌లో పీజీ విద్యార్థినులకు అడ్మిషన్‌లు ఇవ్వొద్దంటూ సోమవారం కళాశాల విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. తొలుత కళాశాల ప్రాంగణంలో ధర్నా నిర్వహించారు. అనంతరం బషీర్‌బాగ్ రోడ్డుపై బైటాయించి ప్రిన్సిపాల్ "డౌన్ డౌన్" అంటూ నినాదాలు చేశారు. దీంతో అబిడ్స్, బషీర్‌బాగ్, లిబర్టీ, ఎల్బీ స్టేడియం చుట్టు పక్కల మార్గాల్లో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ.. 2022లో రాష్ట్ర ప్రభుత్వం యూజీ విద్యార్థినుల కోసమే నిజాం కళాశాల గ్రౌండ్‌లో హాస్టల్ భవనం నిర్మించిందన్నారు. గతేడాది హాస్టల్‌లో యూజీ విద్యార్థుల అడ్మిషన్లు తక్కువగా ఉండటం వల్ల పీజీ విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చారని తెలిపారు. కానీ, ఈ ఏడాది యూజీ విద్యార్థుల ఆడ్మిషన్లు ఎక్కువగా వచ్చాయని, వారందరికీ అవకాశం రాక.. బయట ప్రయివేటు హాస్టల్స్‌లో డబ్బులు చెల్లించలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. అందువల్ల హాస్టల్ భవనంలో నిజాం కళాశాలకు చెందిన యూజీ విద్యార్థులకు మాత్రమే వసతి సౌకర్యం కల్పించాలని, పీజీ విద్యార్థులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వొద్దని డిమాండ్ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ హామీ ఇచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. దీంతో పోలీసులు విద్యార్థులను అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా, 2022లో ప్రభుత్వం పీజీ విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వడానికి ప్రయత్నించగా.. చాలా రోజులపాటు విద్యార్థులు ఆందోళనలు చేపట్టారు.



వాదనలు వినిపించకపోతే పిటిషన్ వెనక్కి తీసుకోవాలి

- కవిత బెయిల్ పిటిషన్‌పై ట్రయల్ కోర్టు వ్యాఖ్యలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వాదనలు వినిపించకపోతే తాము దాఖలు చేసిన పిటిషన్ వెనక్కి (విత్ డ్రా) తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తరపు న్యాయవాదులకు రౌస్ ఎవెన్యూ (ట్రయల్) కోర్టు స్పష్టం చేసింది. కవిత దాఖలు చేసిన డిఫాల్ట్ బెయిల్ పిటిషన్ పై రెండు సార్లు వాయిదా పడిన నేపథ్యంలో కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. లిక్కర్ స్కాంలో కవిత పాత్రపై ఇటీవల సీబీఐ దాఖలు చేసిన సప్లిమెంటరీ చార్జిషీట్ ట్రయల్ కోర్టు పరిగణనలోకి తీసుకుంది. అయితే, అసలు ఛార్జిషీటే సరిగా లేదని, తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ కవిత రౌస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ సోమవారం సీబీఐ స్పెషల్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు అందుబాటులో లేనందున, విచారణ వాయిదా వేయాలని కవిత తరపు న్యాయవాది అభ్యర్థించారు. ఈ విజ్ఞప్తిపై స్పందించిన స్పెషల్ జడ్జి, న్యాయవాదులు నితీశ్ రాణా, మోహిత్‌రావులు రాలేదా? అని ప్రశ్నించారు. 'వాదనలు వినిపించకపోతే తాము దాఖలు చేసిన పిటిషన్ వెనక్కి (విత్ డ్రా) తీసుకోండి. డిఫాల్ట్ బెయిల్ పిటిషన్‌పై వాదనలకు చివరి సారి అవకాశం కల్పిస్తున్నాం' అని చెప్పారు. తదుపరి విచారణ ఆగస్టు 7న (రేపు) మధ్యాహ్నం 12:30 వాయిదా వేశారు. కాగా, ఢిల్లీ లిక్కర్ కేసులో కవితను మార్చి 15న ఈడీ, ఏప్రిల్ 11న సీబీఐ అరెస్టు చేశాయి. తొలుత ఈడీ ఆ తరువాత సీబీఐ కస్టడీలోకి తీసుకుని విచారించాయి. అనంతరం కవితతోపాటు మరో నలుగురి ప్రమేయంపై సీబీఐ సప్లిమెంటరీ చార్జిషీట్ దాఖలు చేసింది.

నేడు కవితతో కేటీఆర్, మాజీ మంత్రుల ములాఖాత్

తీహార్ జైలులో ఉన్న కవితను మంగళవారం ఆమె సోదరుడు, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్ రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిలు కలువనున్నారు. గత కొంత కాలంగా ఆమె అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు ఆమె కుటుంబ సభ్యులు చెబుతున్నారు. తొలుత సోమవారమే కవితతో ములాఖాత్ కావాలని భావించగా పార్టీ ఫిరాయింపుల విషయంలో సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశంపై కేటీఆర్, హరీశ్‌రావు, ఇతర మాజీ మంత్రులు న్యాయ నిపుణులతో సమావేశం అయ్యారు. దీంతో కవితతో ములాఖాత్ సమావేశం నేటికి వాయిదా వేసుకున్నట్టు తెలిసింది.

స్కిల్ వర్సిటీ చైర్మెన్‌గా ఆనంద్ మహీంద్ర

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర నూతనంగా ఏర్పాటు చేసిన ప్రతిష్టాత్మక 'తెలంగాణ స్కిల్ యూని వర్సిటీ'కి చైర్మెన్‌గా ప్రఖ్యాత పారిశ్రామికవేత్త, మహీంద్రా గ్రూప్ అధినేత, పద్మభూషణ్ ఆనంద్ మహీంద్ర వ్యవహరిస్తారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న సీఎం న్యూజెర్సీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. తెలంగాణ స్కిల్ యూని వర్సిటీకి చైర్మన్‌గా వ్యవహరిం చాలంటూ తాను కోరటంతో ఆనంద్ మహీంద్ర అంగీకరించారని తెలిపారు. కొద్ది రోజుల్లోనే ఆయన బాధ్యతలు స్వీకరిస్తారని చెప్పారు. తెలంగాణ యువతను ప్రపంచం లోనే ఉత్తమ నైపుణ్యం కలిగి నవారిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వ -ప్రయివేటు భాగస్వామ్యంతో ఏర్పాటు చేయబోతున్న తెలంగాణ స్కిల్ యూని వర్సిటీకి అంతర్జాతీయంగా పేరున్న ప్రముఖుడినే అధినేతగా నియమిస్తామని ముఖ్యమంత్రి ఇటీవల అసెంబ్లీలో ప్రకటించిన సంగతి విదితమే.


రాజ్యాంగ ప్రవేశిక తొలగింపు

3, 6 తరగతుల పాఠ్య పుస్తకాలపై ఎన్సీఈఆర్టీ నిర్ణయం

కేంద్ర ప్రభుత్వంపై విద్యావేత్తల ఆగ్రహం

న్యూఢిల్లీ : భారత రాజ్యాంగ ప్రవేశిక మన దేశాన్ని సర్వసత్తాక, సోషలిస్ట్, లౌకిక, ప్రజాస్వామ్య రిపబ్లిక్‌గా ప్రకటించింది. దేశంలో నివసించే పౌరులందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం లభించేలా చూడడమే దీని లక్ష్యం. దేశ ఐక్యత, సమగ్రతలను కాపాడాలని, ప్రజల మధ్య సోదరభావాన్ని పెంపొందించాలని రాజ్యాంగ ప్రవేశిక కోరుకుంది. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ ప్రవేశిక ఎన్సీఈఆర్టీ పాఠ్యపుస్తకాల నుండి కనుమరుగైపోయింది. ఈ సంవత్సరం ఎన్సీఈఆర్టీ జారీ చేసిన 3, 6 తరగతులకు చెందిన అనేక పాఠ్య పుస్తకాలలో ప్రవేశిక కన్పించడం లేదు.

ప్రధాన సబ్జెక్టులుగా భావిస్తున్న లాంగ్వేజెస్, పర్యావరణ అధ్యయనాలు (ఈవీఎస్) వంటి కొన్ని పాఠ్య పుస్తకాల నుండి రాజ్యాంగ ప్రవేశికను తొలగించారు. ఎన్సీఈఆర్టీ 2005-06, 2006-07 మధ్య అన్ని తరగతులకు చెందిన పాఠ్య పుస్తకాలను ప్రచురించింది. ఎన్డీఏ ప్రభుత్వం 2020లో నూతన విద్యా విధానాన్ని తీసుకురావడంతో ప్రస్తుతం ఎన్సీఈఆర్టీ ఆ పాఠ్య పుస్తకాలను సవరిస్తోంది. ఈ సంవత్సరం 3, 6 తరగతుల కోసం నూతన పాఠ్య పుస్తకాలను విడుదల చేసింది. వీటి రూపకల్పనలో జాతీయ పాఠ్య ప్రణాళికల ఫ్రేమ్‌వర్క్‌ను కూడా దృష్టిలో పెట్టుకుంది.





3వ తరగతి పుస్తకాలలో...

ఇక 3వ తరగతి పాఠ్య పుస్తకాల విషయానికి వస్తే హిందీ, ఇంగ్లీష్, గణితం, ఈవీఎస్ స్థానంలో తీసుకొచ్చిన వరల్డ్ అరౌండ్ అజ్ పుస్తకాలలో దేనిలోనూ ప్రవేశికను ముద్రించలేదు. పాత ఈవీఎస్ పుస్తకం లుకింగ్ అరౌండ్, హిందీ పుస్తకంలో మాత్రం ప్రవేశికలు ఉన్నాయి.

6వ తరగతి పుస్తకాలలో...

6వ తరగతికి సంబంధించిన పాత హిందీ, ఇంగ్లీష్, సైన్స్, ఈవీఎస్ పాఠ్య పుస్తకాలలోని మొదటి పేజీల్లో ఒక దానిలో ప్రవేశికను ముద్రించారు. కొత్తగా ప్రవేశపెట్టిన పాఠ్య పుస్తకాలలో హిందీ, సైన్స్ పుస్తకాలలోనే ప్రవేశిక కన్పించింది. పర్యావరణ అధ్యయనాలపై గతంలో మూడు పుస్తకాలు ఉండేవి. వాటి స్థానంలో ఇప్పుడు ఒక్క పుస్తకాన్నే ముద్రించారు. దీనిలో కూడా ప్రవేశిక లేదు. కానీ ప్రాథమిక హక్కులు, విధుల ప్రస్తావన ఉంది. గణిత పుస్తకం ఇంకా అందుబాటులోకి రాలేదు. కొత్త ఆంగ్ల పుస్తకంలో జాతీయ గీతం మాత్రమే ఉండగా సంస్కృత పుస్తకంలో దానితో పాటు వందేమాతర గీతం కూడా ఉంది. కానీ ప్రవేశిక లేదు. పాత సంస్కృత పుస్తకంలో కూడా ప్రవేశిక లేదు.

ప్రభుత్వం భయపడుతోంది

ప్రవేశిక అనేది రాజ్యాంగానికి సూక్ష్మ రూపమని, జాతీయ గీతం, జాతీయ పాట, ప్రాథమిక హక్కులు, విధులు అది లేని లోటును భర్తీ చేయలేవని ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని సెయింట్ స్టీఫెన్స్ కాలేజీ మాజీ అధ్యాపకురాలు నందితా నారాయణ్ తెలిపారు. అనేక పాఠ్య పుస్తకాల నుండి ప్రవేశికను ఎందుకు తొలగించారో ఎన్సీఈఆర్టీ వివరణ ఇవ్వాల్సి ఉంటుందని అంటూ ఇది యాదృచ్ఛికంగా జరిగిందని తాను భావించడం లేదని అన్నారు. 'బీజేపీ ప్రభుత్వం ప్రవేశికను చూస్తే భయపడుతోంది. ఎందుకంటే స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం వంటి రాజ్యాంగంలోని కీలకమైన విలువలను అది చాటిచెబుతోంది. ఈ ప్రభుత్వం ఆ విలువలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోంది. అందుకే అనేక పుస్తకాల నుండి ప్రవేశికను తొలగించింది' అని నందితా నారాయణ్ చెప్పారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు హర్షనీయం

- రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలి
- ఎస్టీ, బీసీల వర్గీకరణా చేపట్టాలి:

విలేకరుల సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ-సూర్యాపేట

ఎస్సీల వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో విలేకరుల సమావేశంలో తమ్మినేని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జీవో తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఎన్నో సంవత్సరాల పోరాట ఫలితంగా వర్గీకరణకు చట్టబద్ధత వచ్చిందన్నారు. ఎస్సీ, ఎస్టీ కేటగిరిలో మరింత వెనుకబడిన కులాలకు విడివిడిగా కోటాలు ఇచ్చుకోవడానికి అనుమతించడం సానుకూలమైన అంశమన్నారు. బీసీలలో కూడా అత్యంత వెనుకబడిన సామాజిక తరగతులు కడుపేదరికం అనుభవిస్తున్నా యని తెలిపారు. రిజర్వేషన్ల ఫలితాలు అన్ని తరగతులకూ దక్కాలంటే బీసీల్లోనూ వర్గీకరణ చేపట్టాలని కోరారు. ఈ వర్గీకరణను స్థానిక సంస్థల రాజకీయ రిజర్వేషన్లకు వర్తింపజేసేం దుకు ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. బీసీ, ఎస్టీ వర్గీకరణలు శాస్త్రీయంగా చేయాలన్నారు.

"రైతులకు రుణమాఫీ చేయడాన్ని స్వాగతిస్తున్నాం.. కానీ, రేషన్ కార్డు ఆధారంగా రుణమాఫీ అమలు చేయడం సరికాదు.. కొన్ని జిల్లాల్లో గతంలో భర్త పేరుతో బ్యాంకులో వ్యవసాయ అవసరాల కోసం రుణం తీసుకుంటే.. ఇప్పుడు భర్త చనిపోతే రుణమాఫీ కావడం లేదు.." అని అన్నారు. అలాగే, నాలుగు బ్యాంకుల్లో రుణాలు తీసుకుంటే ఒక్క బ్యాంకు మాత్రమే మాఫీ చేస్తామని చెప్పడం సరైంది కాదన్నారు. అన్ని బ్యాంకుల్లో రైతులు తీసుకున్న అన్ని రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 8 నెలలు అవుతున్నప్పటికీ కొన్ని హామీలు మాత్రమే అమలు చేసిందని మిగతా హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనం దున ప్రభుత్వం వెంటనే రైతు భరోసా విడు దల చేయాలని కోరారు. కల్తీ విత్తనాలు, ఎరు వులు, పురుగుల మందులను నివారించాల న్నారు. నాగార్జునసాగర్ పరిధిలో ఉన్న లిఫ్టుల నిర్వహణను ప్రభుత్వమే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, నగరపు పాండు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి పాల్గొన్నారు.

కర్నాటక ఆశ్రమంలో పెన్ను దొంగిలించాడని

మూడో తరగతి విద్యార్థికి చిత్రహింసలు

- కట్టెలతో కొట్టి.. మూడ్రోజులు గదిలో బంధించి..

నిందితులపై కేసు నమోదు

బెంగళూరు : కర్నాటకలోని రాయచూర్‌లోని ఒక ఆశ్రమంలో పెన్ను దొంగిలించాడనే ఆరోపణతో మూడో తరగతి విద్యార్థిని చిత్రహింసలకు గురి చేశారు. కట్టెలతో కొట్టి మూడ్రోజుల పాటు గదిలో బంధించారని బాధితుడి కుటుంబం ఆరోపించింది. బాధితుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయచూరులోని రామకృష్ణ ఆశ్రమంలో ఉంటున్న బాలుడు తరుణ్‌కుమార్‌ను ఇన్‌చార్జి వేణుగోపాల్, ఆయన సహాయకులు తీవ్రంగా గాయపరిచారు. నిందితులపై కేసు నమోదైంది. "ఇద్దరితో పాటు ఒక టీచర్ నన్ను కొట్టారు. వారు నన్ను కట్టెలతో కొట్టారు. అది విరిగిపోయినప్పుడు వారు బ్యాట్‌ను ఉపయోగించారు. వాటితో నా శరీరంపై గాయాలయ్యాయి. రైల్వే స్టేషన్‌లో భిక్షను అడుక్కోవడానికి నన్ను యాగ్దీర్‌కు తీసుకెళ్లారు. ఒక్క పెన్ను కారణంగానే నన్ను కొట్టారు" అని బాధితుడు చెప్పాడు. కాగా, ఈ దాడిలో బాలుడికి అనేక గాయాలు కాగా.. కండ్లు పూర్తిగా వాచిపోయాయి. బాధితుడు ప్రస్తుతం ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు.బాలుడి కుటుంబ ఆర్థిక పరిస్థితి అనుకూలంగా లేకపోవటంతో బాధి తుడు సదరు ఆశ్రమంలో ఉంటున్నాడు. ఆశ్రమంలో ఆడు కుంటున్న సమయంలో ఆయన సహవిద్యార్థులు తరుణ్ కుమార్ పెన్ను దొంగిలించాడని ఆరోపించారు. ఆశ్రమ అధికారులకు జరిగిన సంఘటనను నివేదించారు. వారు కనికరం లేకుండా బాలుడిని కొట్టారు. తరుణ్ తల్లి రామకృష్ణ ఆశ్రమానికి వచ్చినప్పుడు ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. బాలల హక్కుల కార్యకర్త సుదర్శన్ మాట్లాడుతూ.. బాలుడిని రక్షించామని తెలిపారు. ఈ విషయాన్ని మహిళా శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖలోని ప్రభుత్వ అధికారులకు తెలియజేశామన్నారు. నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు చెప్పారు.

ఎంసీడీకి సభ్యులను నామినేట్ చేయవచ్చు

లెఫ్టినెంట్ గవర్నరుకు ఆ హక్కు ఉంది

- ఢిల్లీ ప్రభుత్వ పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : ఢిల్లీలోని ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. నైపుణ్య పరిజ్ఞానం కలిగిన వ్యక్తులను ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ)కి నామినేట్ చేసే అధికారం లెఫ్టినెంట్ గవర్నరుకు ఉన్నదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. అందుకు మంత్రిమండలి సాయం కానీ, సలహా కానీ అవసరం లేదని తేల్చి చెప్పింది. మంత్రిమండలిని సంప్రదించకుండా పది మందిని ఎంసీడీకి నామినేట్ చేస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా తీసుకున్న నిర్ణయంపై ఢిల్లీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

దీనిపై ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలో జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దివాలాతో కూడిన బెంచ్ సోమవారం తీర్పు వెలువరించింది. 1957వ సంవత్సరపు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ చట్టానికి 1993లో తొలిసారి చేసిన సవరణ ద్వారా ప్రత్యేక పరిజ్ఞానం కలిగిన వ్యక్తులను నామినేట్ చేసే చట్టబద్ధమైన అధికారం లెఫ్టినెంట్ గవర్నరుకు సంక్రమించిందని న్యాయస్థానం తెలిపింది. నామినేటెడ్ సభ్యుల నియామకంపై గత సంవత్సరం జనవరి 1, 4 తేదీలలో లెఫ్టినెంట్ గవర్నర్ జారీ చేసిన ఆదేశాలు, నోటిఫికేషన్లను కొట్టివేయాలని రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థించింది.



నియామకాల విషయంలో మంత్రిమండలి సాయం, సలహా తీసుకునేలా లెఫ్టినెంట్ గవర్నరును ఆదేశించాలని కోరింది. అయితే ఈ అభ్యర్థనను న్యాయస్థానం అంగీకరించలేదు. 2022 డిసెంబరులో జరిగిన ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఆప్ విజయం సాధించింది. దీంతో పదిహేను సంవత్సరాల బీజేపీ పాలనకు తెరపడింది. ఎన్నికల్లో ఓడిపోయినా దొడ్డిదారిన అధికారాన్ని చేజిక్కించుకునేందుకు బీజేపీ పావులు కదిపింది. ఈ క్రమంలోనే తనకు అనుకూలురైన పది మంది సభ్యులను లెఫ్టినెంట్ గవర్నరుతో నామినేట్ చేయించింది.

ఆ వర్గం డ్రైవర్లు అలర్ట్

కన్వర్ యాత్ర సమయంలో మత గుర్తింపు బయటపడకుండా జాగ్రత్తలు

వాట్సాప్ గ్రూపులలో యూనియన్ల హెచ్చరికలు

యూపీ, ఢిల్లీలలో భయంతోనే కాలం వెళ్లదీస్తున్న డ్రైవర్లు

లక్నో : యూపీలో హిందూత్వ శక్తుల చర్యలు మైనారిటీ వర్గాలను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా, కన్వర్ యాత్ర సమయంలో యూపీతో పాటు ఢిల్లీ, ఉత్తరాఖండ్‌లలో రెచ్చిపోతున్నాయి. వీరికి రాష్ట్రంలో యోగి సర్కారు తీరు కూడా తోడై పరిస్థితులను మరింత దిగజార్చుతున్నాయి. దీంతో మైనారిటీ వర్గ ప్రజలు తమ గుర్తింపును బయటపడకుండా జాగ్రత్త పడుతున్నారు. ఎక్కడ తమ మత గుర్తింపు బయటపడితే హిందూత్వ శక్తుల చేతిలో దాడికి గురవుతామనే భయాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. ముస్లిం డ్రైవర్లు కూడా తమ గుర్తింపును దాచిపెట్టుకుంటున్నారు. కార్ల నుంచి మతపరమైన గుర్తులను తొలగించటం చేస్తున్నారు.

వీరు తమ వాట్సప్ గ్రూపులలో ఈ ముందు జాగ్రత్త చర్యల గురించి చర్చించుకుంటున్నారు. ఈ సందేశం ఢిల్లీ, యూపీలలోని హిందూయేతర డ్రైవర్లనుద్దేశిస్తూ ప్రచారం సాగుతున్నది. ముఖ్యంగా, హర్యానా కన్వర్ యాత్ర మార్గంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. యూనియన్ జాతీయ కార్యదర్శి షేక్ సలావుదీన్ వాయిస్ నోట్‌లో కన్వర్ యాత్ర గురించి ప్రస్తావించలేదు. అయితే కేవలం కొన్ని రోజుల క్రితం ప్రారంభమైన యాత్ర మార్గంలో ముస్లిం డ్రైవర్‌పై హింసపై తీవ్ర చర్చ జరిగింది. సలావుదీన్ మాట్లాడుతూ.. యూనియన్ డ్రైవర్‌లను స్టిక్కర్లు లేదా హ్యాంగింగ్ యాక్సెసరీస్ వంటి వారి మతానికి సంబంధించిన గుర్తులను తీసివేయాలని కోరామని చెప్పారు. ఐఎఫ్ఏటీ అనేక టాక్సీ డ్రైవర్ల సంఘాల నెట్‌వర్క్‌ను కలిగి ఉన్నది. దేశవ్యాప్తంగా 75,000 మందికి పైగా గిగ్ వర్కర్లను కలిగి ఉన్నది. ఈ గిగ్ వర్కర్లు వివిధ సంస్థలకు పని చేస్తున్నారు. దీంతో ఢిల్లీలో కొంత మంది ముస్లిం డ్రైవర్లు తమ మతపరమైన గుర్తింపును దాచిపెట్టారు. అంతేకాకుండా, కన్వార్ యాత్ర మార్గంలో ప్రయాణాలు చేయటం తగ్గించారు.

గతనెల 27న తెల్లవారుజామున 4:30 గంటల ప్రాంతంలో లక్నో-గురుగ్రామ్ హైవేపై ముస్లిం డ్రైవర్‌పై దాడి జరిగిన తర్వాత హైదరాబాద్‌కు చెందిన సలావుదీన్ వాయిస్ నోట్ వచ్చింది. ముస్లిం డ్రైవర్‌తో రైడింగ్ చేసినందుకు కొంత మంది హిందువులను బెదిరించారు. ఇకపై ముస్లిం డ్రైవర్‌తో రైడ్‌ను బుక్ చేయబోమని ప్రయాణికులు హామీ ఇవ్వడంతో కన్వారియాలు వారిని విడిచిపెట్టారు. కాగా, ఈ విషయంలో ఎటువంటి ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని డ్రైవర్ చెప్పాడు. "ముఖ్యమైన విషయం ఏమిటంటే ఈ సంఘటన జరిగింది ఎందుకంటే వారు డ్రైవర్ మతాన్ని దూరం నుంచి గుర్తించగలిగారు. అందుకే మేము మా డ్రైవర్‌లకు వారి గుర్తింపును దాచిపెట్టి, అలాంటి సంఘటనల నుంచి తమను తాము రక్షించుకోవాలని చెబుతున్నాము. ముస్లిం డ్రైవర్లు ఈ సంవత్సరం మరింత బెదిరింపులకు గురవుతున్నారు. ఎందుకంటే యూపీ ప్రభుత్వం అటువంటి ఉత్తర్వులను జారీ చేయటం ద్వారా మతం ఆధారంగా వివక్షను చట్టబద్ధం చేసింది" అని సలావుదీన్ తెలిపారు.

కన్వర్ యాత్ర మార్గంలో తినుబండారాలు, ఆహార దుకాణాల యజమానులు.. వారి పేర్లు, వారి సిబ్బంది పేర్లను బహిర్గతపర్చాలన్న ఆదేశాలున్నాయి. యూపీ, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు ఇలాంటి ఆదేశాలను ఆమోదించాయి. అయితే సుప్రీంకోర్టు వాటిపై స్టే విధించింది. ఆహార దుకాణాలు, తినుబండారాల యజమానులను అలా చేయాలని బలవంతం చేయలేమని పేర్కొన్నది. "మేము డ్రైవర్లను వారి మతానికి సంబంధించిన స్టిక్కర్లు లేదా హ్యాంగింగ్ యాక్సెసరీస్ వంటి గుర్తులను తొలగించమని కోరాం. తటస్థంగా ఉండాలని అన్ని సంఘాల డ్రైవర్లకు మేము దీన్ని సూచించాం. ఎవరైనా వారిపై దాడికి వస్తే ఏమి చేయాలో కూడా మేము వారికి చెప్తున్నాం. దాడుల సమయంలో జాగ్రత్త వహించి.. పోలీసులకు డయల్ చేయాలనీ, ఆ సమయంలో మాకు సమాచారమందిస్తే మేము వారికి వెంటనే సహాయం చేయడానికి వారి స్థానాన్ని వాట్సాప్ గ్రూపులలో పంపుతామని చెప్పాం" అని ఐఎఫ్ఏటీ సభ్యులు చెప్తున్నారు. హరిద్వార్, గౌముఖ్, గంగోత్రి, సుల్తాన్‌గంజ్, డియోఘర్‌తో సహా ప్రముఖ గమ్యస్థానాల నుంచి ఆగస్టు 5 నాటికి కన్వారియాలు తమ ఇండ్లకు తిరిగి వచ్చే అవకాశమున్నందున మైనారిటీ వర్గాల వాట్సప్ గ్రూపులలో హెచ్చరికలు చర్చనీయాంశంగా మారాయి. గతనెల 22న ప్రారంభమై ఆగస్టు 2న ముగిసిన కన్వర్ యాత్రలో హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్న విషయం విదితమే.

బెయిల్ కోసం సుప్రీంకోర్టుకు కేజ్రీవాల్



న్యూఢిల్లీ : బెయిల్ మంజూరు కోసం సుప్రీంకోర్టును ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఆశ్రయించారు. తన బెయిల్ పిటీషన్‌ను ఢిల్లీ హైకోర్టు తిస్కరించడాన్ని, సీబీఐ తనను అరెస్టు చేయడాన్ని హైకోర్టు సమర్థించడాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో కేజ్రీవాల్ పిటీషన్ వేశారు. ఈ విషయాన్ని ఆప్ సోమవారం వెల్లడించింది. 'హైకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మద్యం పాలసీకి సంబంధించి ఈడీ నమోదు చేసిన మనీలాండరింగ్ కేసులో సుప్రీంకోర్టు కేజ్రీవాల్‌కు ఇప్పటికే మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది' అని ఆప్ తన ప్రకటనలో తెలిపింది. మద్యం పాలసీకి సంబంధించిన అవినీతి కేసులో కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్టు చేయడాన్ని ఢిల్లీ హైకోర్టు గత నెలలో సమర్థించింది. అలాగే కేజ్రీవాల్ బెయిల్ పిటీషన్‌ను తిరస్కరించింది. అయితే ట్రయిల్ కోర్టును ఆశ్రయించే స్వేచ్ఛను ఇచ్చింది.

హోం, రక్షణ శాఖలపై చర్చ జరపాలి

రాజ్యసభలో ప్రతిపక్షాల డిమాండ్

ఆర్టికల్ 370 రద్దు ఒక "నల్లచట్టం"

ఆ పదాలను రికార్డుల్లోంచి తొలగింపు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర హోం, రక్షణ శాఖలపై చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. సోమవారం రాజ్యసభలో పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ, వ్యవసాయ మంత్రిత్వ శాఖ డిమాండ్స్ అండ్ గ్రాంట్స్‌పై చర్చ జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర హోం, రక్షణ మంత్రిత్వ శాఖలపై చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఆ రెండు శాఖలు చాలా ముఖ్యమైనవని, వాటిపై చర్చ అవసరమని డిమాండ్ చేశాయి. అయితే ఈ డిమాండ్‌ను రాజ్యసభ చైర్మెన్ తిరస్కరించారు. రాజ్యసభలో రైతులు పండించే పంటలకు ఎంఎస్పీ చట్టం చేయాలని, రుణమాఫీ చేయాలని ప్రతిపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. ఎరువులు, విత్తనాల సబ్సిడీని పెంచాలని, అలాగే నాణ్యమైన విత్తనాలు ఇవ్వాలని సూచించారు. రైతుల ఆత్మహత్యలను నియంత్రించాలని కోరారు. కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ, "మేము కిసాన్ సమ్మాన్ నిధి గురించి చర్చిస్తున్నాం. రైతులకు ప్రత్యక్ష సహాయం గురించి కాంగ్రెస్ మాట్లాడింది. కానీ కాంగ్రెస్ ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి వంటి పథకాన్ని ఎప్పుడూ చేయలేదు. ప్రధాని మోడీ ఈ పథకాన్ని రూపొందించారు. వారికి (ప్రతిపక్షం) అర్థం కాదు. కానీ చిన్న రైతులకు రూ.6,000 అందుతుంది. ఈ కిసాన్ సమ్మాన్ నిధి వల్ల రైతులు స్వావలంబన పొందారు. రైతుల పట్ల కూడా గౌరవం పెరిగింది. ప్రతిపక్షాలు రైతుల గౌరవాన్ని చూడలేవు" అని విమర్శించారు.



గోవా అసెంబ్లీలో ఎస్టీ సీట్ల రిజర్వ్ బిల్లు

గోవా శాసనసభలో షెడ్యూల్డ్ తెగలకు సీట్లను రిజర్వ్ చేయడానికి ఉద్దేశించిన బిల్లును కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు.

మత్స్యకార, రైతులకు ఆదాయ భద్రత కల్పించాలి

లోక్‌సభలో కేంద్ర ఫిషరీస్, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ మంత్రిత్వ శాఖ, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ డిమాండ్స్ అండ్ గ్రాంట్స్‌పై చర్చ జరిగింది. టీఎంసీ ఎంపీ సయానీ ఘోష్ మాట్లాడుతూ దేశంలో పశుగ్రాసం సంక్షోభాన్ని ఎత్తిచూపారు. జాతీయ పశుగ్రాసం కొరత ఉందని కేంద్ర మంత్రి గుర్తించారని, ప్రభుత్వ ఆధీనంలోని గోశాలలో, ముఖ్యంగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆవులు ఆహారం లేకపోవడంతో చనిపోవడం ఆందోళన కలిగిస్తోందని ఆమె ఎత్తిచూపారు. కాంగ్రెస్ ఎంపీ బెన్నీ బెహనాన్ మాట్లాడుతూ మత్స్యకార, రైతు సంఘాలకు మద్దతు ఇవ్వాలని, ఆదాయ భద్రత కల్పించాలని కోరారు. ఈ కమ్యూనిటీలను రక్షించడానికి సకాలంలో, తగిన పరిహారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. తీర ప్రాంత పర్యాటక కార్యక్రమాలను కూడా విమర్శించారు. అవి సముద్ర పర్యావరణ వ్యవస్థకు విఘాతం కలిగిస్తున్నాయని, మత్స్యకారుల జీవనోపాధిని ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు.

కేరళలో ఎందుకు ఎయిమ్స్ పెట్టరూ?

కేరళలో ఎందుకు ఎయిమ్స్ పెట్టరని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ మంత్రి జేపీ నడ్డాను ప్రతిపక్షాలు ప్రశ్నించాయి. కాంగ్రెస్ ఎంపీ కెసి వేణుగోపాల్ మాట్లాడుతూ కేరళకు ఎయిమ్స్ సౌకర్యం కల్పిస్తామని కేంద్ర మంత్రి జెపి నడ్డా గతంలోనే హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా అనేక ఎయిమ్స్ మంజూరు చేసినప్పటికీ కేరళను పట్టించుకోలేదు. ప్రస్తుతం రాష్ట్రం తీవ్ర సంక్షోభంలో ఉంది.కేంద్ర ప్రభుత్వం 22 ఎయిమ్స్ ప్రాజెక్టులను ఆమోదించింది. కేరళను ఎందుకు చేర్చలేదు" అని ప్రశ్నించారు.

ఆర్టికల్ 370 రద్దు ఒక "నల్ల చట్టం"

ఐదేండ్ల కిందట ఆర్టికల్ 370 రద్దును నేషనల్ కాన్ఫరెన్స్ ఎంపీ సయ్యద్ రుహుల్లా మెహదీ తీవ్రంగా ఖండించారు. ఈ చర్యను "నల్ల చట్టం"గా అభివర్ణించారు. లోక్‌సభలో ఆయన మట్లాడుతూ దీనిని ద్రౌపది చారిత్రక వస్త్రాలను తొలగించడంతో పోల్చారు. జమ్ము కాశ్మీర్ గౌరవం, స్వయంప్రతిపత్తిని కోల్పోయినందుకు ప్రభుత్వం నవ్వుతోందని ఆరోపించారు. అయితే ఎంపీ సయ్యద్ రుహుల్లా మెహదీ వ్యాఖ్యలపై కేంద్ర సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ స్పందించారు. ఆయన వ్యాఖ్యలను తొలగించాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ ప్యానల్ స్పీకర్ జగదాంబికా పాల్ వ్యాఖ్యలను అధికారిక రికార్డు నుంచి తొలగించాలని సూచించారు.

ఆర్టికల్ 370 రద్దుతో పురోగతి : ప్రధాని మోడీ

ఆర్టికల్ 370 రద్దుపై ప్రధాని మోడీ ట్వీట్ చేశారు. "మన దేశ చరిత్రలో కీలకమైన ఆర్టికల్ 370, 35(ఎ)లను పార్లమెంటు రద్దు చేసి నేటికి ఐదేండ్లు పూర్తయింది. ఈ నిర్ణయం జమ్మూ కాశ్మీర్, లడఖ్‌ల పురోగతి, శ్రేయస్సుకు సంబంధించి కొత్త శకానికి నాంది పలికింది.

దేశ రాజ్యాంగ రూపకర్తలు ఊహించిన విధంగా రాజ్యాంగాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయడం వల్ల మహిళలు, యువత, అట్టడుగు వర్గాలకు మెరుగైన భద్రత, గౌరవం, అవకాశాలు లభించాయి. జమ్మూకాశ్మీర్, లడఖ్ ప్రజల ఆకాంక్షలను ముందుకు తీసుకువెళ్లడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. రాబోయే సంవత్సరాల్లో వారి అభివృద్ధి కోసం నిరంతరం .కృషి చేస్తుందని నేను హామీ ఇస్తున్నాను" అని పేర్కొన్నారు.

కుల గణనకు కేంద్రం సిద్ధంగా లేదు

ఓబీసీ క్రిమి లేయర్‌కు సంబంధించి లోక్‌సభలో తన వాయిదా తీర్మానం నోటీసును కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాకూర్ ఇచ్చారు. "2017 నుంచి పెండింగ్‌లో ఉన్న ఓబీసీ క్రిమిలేయర్ సమస్యపై వాయిదా తీర్మానాన్ని ఇచ్చారు. తాను ఒబిసి అని ప్రధాని మోడీ అంటారు. ఆయన ప్రభుత్వంలో 2017 నుంచి క్రిమిలేయర్ ఉంది. కానీ వారు పట్టించుకోలేదు. వారి ఉద్దేశం కేవలం ఒబిసి పేరుతో పబ్లిసిటీ చేసుకోవడమే. కుల గణన అనేది చాలా కీలకమైన అంశమని అందరికీ తెలుసు. ఇప్పుడు, ఈ ప్రభుత్వం జనాభా గణనతో పాటు కుల గణనను కూడా నిర్వహించడానికి పూర్తిగా సిద్ధంగా లేదు" అని అన్నారు.

పత్రికా స్వేచ్ఛలో ఇండియా స్థానం చాలా దారుణంగా...

పత్రికా స్వేచ్ఛలో ఇండియా స్థానం చాలా దారుణంగా ఉందని సీపీఐ(ఎం) ఎంపీ వి. శివదాసన్ అన్నారు. రాజ్యసభలో ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీలో 180 దేశాల్లో 159వ స్థానంలో ఉన్న పరిస్థితిని ఆయన లేవనెత్తారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సవాళ్లను ఉటంకిస్తూ, పోలీసు కేసులు, అరెస్టులు, ఉపా వంటి చట్టాల ప్రకారం జైలు శిక్షలు కూడా ఉన్నాయి. జర్నలిస్టులు ప్రబీర్ పుర్కాయస్తా, సిద్ధిక్ కప్పన్‌ల అరెస్టులను ఆయన ప్రస్తావించారు. గత దశాబ్ద కాలంలో దేశంలో ప్రముఖ ఎడిటర్ గౌరీ లంకేశ్‌తో సహా 100 మందికి పైగా జర్నలిస్టులు హత్యకు గురయ్యారని శివదాసన్ ఎత్తి చూపారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వారికి సరైన వేతనాలు అందజేయడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు.

సహారా డబ్బులు వాపస్‌పై జోక్యం చేసుకోం : నిర్మలా సీతారామన్

లోక్‌సభలో సహారా గ్రూప్, పీఏసీఎల్ లిమిటెడ్‌లో డిపాజిట్ చేసిన డబ్బు వాపసుకు సంబంధించిన అంశాన్ని ఎంపీలు ప్రస్తావించారు. దీనికి స్పందించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సుప్రీంకోర్టు పర్యవేక్షణలో రీఫండ్‌లపై కేంద్రం చురుగ్గా పనిచేస్తోందని ఆమె తెలిపారు. కోర్టు సంబంధిత విషయాలపై ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోదని సీతారామన్ పేర్కొన్నారు. ప్రభుత్వ చర్యల కారణంగా వాపసులో జాప్యం జరిగిందని ఎంపిలు సూచిస్తున్నారని విమర్శించారు. తమిళనాడు ఎంపీ డి.రవికుమార్ రాష్ట్రాలకు జీఎస్టీ పరిహారం కొనసాగింపుపై ప్రశ్నించారు. దీనికి స్పందించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రస్తుత జీఎస్టీ పరిహార సెస్, కోవిడ్-19 మహమ్మారి సమయంలో తీసుకున్న రుణాలను రాష్ట్రాలకు పరిహారంగా చెల్లించడానికి ఉపయోగించబడుతుందని వివరించారు. జీఎస్టి పరిహారం సెస్ అధికారికంగా జూన్ 2022లో ముగిసిందని, జీఎస్టీ కౌన్సిల్ సమిష్టి నిర్ణయంతో దానిని మార్చి 2026 వరకు పొడిగించినట్లు అన్నారు.

సాధనలేకుండా విజయాన్ని ఆశించడం ఎడారిలో
మంచినీళ్లకోసం వెతకటం వంటిది - మోక్షగుండం విశ్వేశ్వరయ్య


సంపాదకీయం

వట్టి మాటలు చెప్పకోయ్..

నేటి పరిస్థితికి, దేశ పాలకులకు 'ఇంట్లో ఈగల మోత.. వీధిలో పల్లకీల మోత...' అన్న సామెత సరిగ్గా సరిపోతుంది. మాటలు కోటలు దాటుతాయి కానీ, చేతలు పేదోడికి ఒక పూట తిండి కూడా పెట్టడం లేదు. శనివారం ఢిల్లీలో జరిగిన 32వ అంతర్జాతీయ వ్యవసాయ ఆర్థికవేత్తల సదస్సులో 'ప్రపంచ ఆహార భద్రతకు పరిష్కారాలు చూపించేందుకు భారత్ సన్నద్ధమవుతోందని, ఇప్పటికే ఆహార మిగులు దేశంగా ఎదిగింది' అని ప్రధాని నరేంద్రమోడీ తెలిపారు. ప్రధాని చెప్పినట్టు ఉంటే దేశంలో పరిస్థితి ఇలా ఎందుకుండేది? ఒక వైపు దేశ పరిస్థితి ఆందోళనకరంగా తయారవుతున్నది. అయినా మేం గొప్పవాళ్లం, దేశాన్ని ముందుకు తీసుకెళు తున్నామంటూ చెప్పుకోవడం సిగ్గుచేటు.

"తిండి కలిగితే కండ కలదోయ్ / కండ కలవాడేను మనిషోయ్" అని వందేండ్ల క్రితమే ఆహార భద్రత గురించి మహాకవి గురజాడ చాటి చెప్పాడు. సరైన తిండిలేక ఆకలి, అనారోగ్యాలతో వున్న సమాజంలో "ఈసురోమని మనుషులుంటే/ దేశ మేగతి బాగుపడునోయ్" అని ఆయన నిలదీశాడు. మనిషి బతికి వుండాలంటే కనీస తిండి కావాలి. ఏదో ఆహారాన్ని పొందడమే కాదు, పౌష్టికాహారం పొందడం ప్రజల జీవిత హక్కు. ఆ హక్కు సక్రమంగా అమలు కావాలంటే పంటలు బాగా పండాలి. పండిన పంటలు ప్రజలకు అందుబాటులో వుండాలి. వాటిని కొనగలిగే స్థితి ప్రజలందరికీ వుండాలి. ఈ పురోగామి చక్రం సక్రమంగా నడిచేటట్టు చిత్తశుద్ధితో పాలకులు చూడాలి. కానీ, అలా జరగడం లేదు. అందుకే ప్రపంచంలో కొన్ని దేశాల ప్రజలు ఆహార భద్రతతో జీవిస్తుంటే, అనేక దేశాల్లో ఆకలి కేకలతో హాహారెత్తుతున్నారు. మన దేశంలో మాత్రం దిగుమతుల మీద ఆధారపడి జీవిస్తున్నాము. దీనికి బాధ్యత ఎవరిది?

> దేశంలోని పిల్లల్లో 80శాతం, మహిళల్లో 56శాతం రక్తహీనతతో బాధపడుతున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలుస్తోంది. ఇతర అన్ని రంగాల్లో మాదిరిగానే పౌష్టికాహార లోపాల్లోనూ అణగారిన వర్గాల ప్రజలు తీవ్రస్థాయిలో వెనుకబడి ఉన్నారనేది వాస్తవం. 'ఉట్టికి ఎగరలేనమ్మ స్వర్గానికి ఎగురుతాను' అన్నట్టు దేశంలో పరిస్థితి ఇలా ఉంటే.. ప్రధాని ఆహార భద్రతకు పరిష్కారాలు ప్రపంచానికి నేర్పుతామని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది.



ఆహారం కొనుగోలు సామర్థ్యం విషయంలో పొరుగు దేశాలైన పాకిస్థాన్, శ్రీలంక కంటే భారత్ వెనుకబడి ఉందని ప్రపంచ ఆహార భద్రత (జీఎఫ్ఎస్) సూచీ చెబుతోంది. ఆ నివేదిక ప్రకారం మొత్తంగా ఆహార భద్రతలో ఐర్లాండ్, ఆస్ట్రేలియా, బ్రిటన్, ఫిన్లాండ్, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్, అమెరికా అగ్రస్థానంలో ఉన్నాయి. గడిచిన దశాబ్ద కాలంలో ఆహార భద్రతలో భారత్ పెద్దగా పురోగతి సాధించలేదని నివేదిక వెల్లడించింది. ఈ విషయంలో పాకిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్, చైనా..భారత్కంటే ఎంతో ముందున్నట్టు వివరించింది. ఈ వాస్తవాలను బుల్డోజ్ చేస్తూ 65 ఏండ్ల తర్వాత మన దేశంలో జరుగుతున్న అంతర్జాతీయ వ్యవసాయ ఆర్థికవేత్తల సదస్సులో పచ్చి ప్రధాని పచ్చి అబద్దాలు చెప్పారు.

దేశంలోని ఐదేండ్లలోపు చిన్నారుల్లో పెరుగుదల సమస్యలున్నాయి. 35.5శాతం పిల్లల్లో వయసుకు తగ్గ ఎదుగుదల లేదు. ఎత్తుకు తగిన బరువులేని వారు 19.3శాతం ఉంటే, అయిదేండ్లలోపు పిల్లల్లో 44.3శాతం మంది తక్కువ బరువుతో ఉన్నారని స్వయనా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖే గతంతోనే పార్లమెంట్కు తెలపింది. దేశంలోని మూడేండ్లలోపు పిల్లల్లో 47శాతం తక్కువ బరువుతో ఉన్నారని యునిసెఫ్ అంచనా. ప్రపంచంలోని మొత్తం పౌష్టికాహార లోపాలతో ఉన్న పిల్లల్లో మూడోవంతు మనదేశంలోనే ఉన్నారని యూనిసెఫ్ స్పష్టం చేస్తోంది. మరోవైపు ఆహార సంక్షోభం, ప్రపంచ ఆర్థిక మాంద్యం ఇప్పటికే తీవ్రంగా ఉన్న ఈ పౌష్టికాహార సమస్యను మరింత జటిలం చేశాయని నివేదికలు చెబుతున్నాయి. దేశంలోని పిల్లల్లో 80శాతం, మహిళల్లో 56శాతం రక్తహీనతతో బాధపడుతున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలుస్తోంది. ఇతర అన్ని రంగాల్లో మాదిరిగానే పౌష్టికాహార లోపాల్లోనూ అణగారిన వర్గాల ప్రజలు తీవ్రస్థాయిలో వెనుకబడి ఉన్నారనేది వాస్తవం. 'ఉట్టికి ఎగరలేనమ్మ స్వర్గానికి ఎగురుతాను' అన్నట్టు దేశంలో పరిస్థితి ఇలా ఉంటే.. ప్రధాని ఆహార భద్రతకు పరిష్కారాలు ప్రపంచానికి నేర్పుతామని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది.

'భారతీయ వ్యవసాయంలో ప్రత్యేకత గురించి, తమ దూర దృష్టి ప్రణాళికల గురించి చెప్పిన ప్రధాని, ఈ వైవిధ్యమే ప్రపంచ ఆరోగ్యభద్రతకు భారత్ను ఆశాకిరణంలా నిలుపుతోం దని తెలిపారు. 90శాతం మంది రైతులకు చాలా తక్కువ భూమే ఉంటుంది. చిన్నరైతులే దేశ ఆహార భద్రతకు అతిపెద్ద బలం' అని కూడా వివరించారు. 70 దేశాల నుంచి వచ్చిన వెయ్యిమంది ప్రతినిధుల సదస్సులో ప్రధాని రైతులపై వల్ల మాలిన ప్రేమను ఒలకపోశారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడానికి ఇదే మోడీ ప్రభుత్వం మూడు నల్ల వ్యవసాయ చట్టాలుతెస్తే... ఈ దేశ రైతులు వాటిని అడ్డుకునేందుకు ఉద్యమిస్తే ఎంత తీవ్రంగా అణిచివేసిందో ప్రపంచమంతా చూసింది. అలాంటి మోడీ వెన్నపూసిన మాటలు విన్న అంతర్జాతీయ వ్యవసాయ ఆర్థికవేత్తలు 'వట్టిమాటలు చెప్పకోకోయి...' అంటూ పాడుకున్నారు.

మిర్చి రైతుల కన్నీళ్లకు బాధ్యులెవరు?



యలమంచి వంశీకృష్ణ
9908997969

రాష్ట్రంలో మిర్చి రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. పెరిగిన పెట్టుబడులకు తోడు చీడపీడలతో మిర్చి సాగు తలకు మించిన భారమవుతున్నది. దిగుబడులు పెంచడం కోసం పురుగు మందులు వాడకం పెరిగింది. అయితే భారీ వర్షాలు, వాతావరణ పరిస్థితుల్లో హెచ్చుతగ్గులతో పొలాల్లో కీటకాలు వ్యాప్తి చెందాయి. అండగా ఉండాల్సిన ప్రభుత్వం వారిని పట్టించుకున్న దాఖలాలు లేవు. అధికార యంత్రాంగం నుంచి సలహాలు, సూచనలు కూడా లేవు. దీనికితోడు 'మూలిగే నక్కపై తాడిపండు పడ్డట్టు' మిర్చి కొనుగోళ్లు బాగా క్షీణించాయి. దక్షిణాది రాష్ట్రాల్లో శీతల గిడ్డంగుల్లో భారీగా మిర్చి నిలువ ఉండటంతో ధరలు బాగా తగ్గిపోయాయి. ఎమార్కెట్లో రాబడి అయిన మొత్తం సరుకు అమ్మకం కావడం లేదు. కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లో రాబోయే సీజన్ కోసం మిర్చి సేద్యం తగ్గనున్నట్లు సంకేతాలు అందుతున్నాయి. వాస్తవానికి గత కొంతకాలంగా మిర్చి ధరలు ఆశాజనకంగా ఉండటంతో చాలామంది మిర్చి సాగుకి మొగ్గు చూపారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ఎండు మిరప కోసం అధిక విస్తీర్ణంలో ఈ పంట సాగు చేస్తున్నారు. దేశంలో మిర్చి పంట పండించడంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానం గాను తెలంగాణ రెండో స్థానంలోనూ ఉంది. ముఖ్యంగా తెలంగాణలో గత కొన్నేండ్లుగా మిర్చి సాగుభారీగా పెరిగింది. మిర్చి సాగుకి అనుకూలమైన మెట్ట, రేగడి, ఎర్ర నేల భూములు తెలంగాణలో ఉండటం, సాగునీరు కూడా తక్కువగా పట్టడంతో మిర్చి సాగు భారీగా పెరిగింది. తెలంగాణలో వాణిజ్య పంటల్లో మిరపది అగ్రస్థానం. వరి, పత్తి తర్వాత ఎక్కువగా మిరప వైపు మొగ్గు చూపుతున్నారు. పత్తిని తెల్ల బంగారంగా పిలిస్తే మిరపను ఎర్ర బంగారంగా పిలుస్తారు. మొక్కలు వేడి, తేమతో కూడిన వాతావరణం రెండిట్లోనూ వృద్ధి చెందుతాయి.పంట కాలం 210 రోజులే కావటం, 140 రోజుల నుంచి కాపు కాసి నాలుగైదు సార్లు కాపు రావటంతో 20 నుంచి 25 క్వింటాలు దిగుబడి వస్తుంది. ఇతర పంటలతో పోలిస్తే పెట్టుబడి మిర్చిపంట పండితే తమ కష్టాలు దూరమవుతాయని రైతులు ఆశ పడ్డారు. అయితే తామర పురుగు, నల్ల పురుగు, ఎర్రనల్లి, తెగుళ్లకు తోడు ప్రకృతి వైపరీత్యాలు, ధరలు పతనం వంటి అంశాలతో దిక్కుతోచని పరిస్థితుల్లో పడిపోయారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయ చర్యలు లేకపోగా కనీసం సానుభూతి కూడా లేదు.

గతేడాది మిర్చి సాగు చేసిన రైతులకు మొదట ఎల్నినో వర్షాభావ పరిస్థితిల వల్ల మొక్క సరిగా ఎదగలేదు. తర్వాత వచ్చిన పెను తుఫాను మిగ్ జామ్ తోటలు దెబ్బతిని దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. రైతాంగం పంటను కాపాడుకోవడానికి అందినకాడికి అప్పులు చేసి పంట మీద పెట్టారు. ఇంత చేసిన దిగుబడి సగానికి సగం పడిపోయింది.తెగుళ్ల బాధలు తట్టుకోలేక మిరపను పీకేసి కొందరు కూరగాయలు, మొక్కజొన్న సాగు మొదలు పెట్టారు. కనీసం వ్యవసాయ అధికారులు తోటలవైపు కన్నెత్తి కూడా చూడలేదు. 2022-23కు గాను రెండు లక్షల 76 వేల ఎకరాలు సాగు చేసి సుమారుగా 5.06 లక్షల టన్నులు దిగుబడి సాధించారు.ఈ ఏడాది కాస్త అటూఇటుగా అంతే సాగైంది. కానీ ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం లేదనేది రైతులను వేదనకు గురిచేస్తోంది.

అధికారుల సలహాలు శూన్యం

రాష్ట్రంలో మిర్చి పంటకు వేరకుళ్ళు తెగుళ్లు, నల్ల తామర, మచ్చలు, కాయ కుళ్ళు, ఆకు ముడత, కొమ్మ ఎండు తెగులు సోకుతున్నాయి. చలికాలం ఆరంభం నుంచే తెగులు ఉధృతి ఉంటుంది. తెగులు నివారణకు నిర్దిష్ట పురుగుమందు లేకపోవడంతో ఇతర పంటలకు



వాడే మందుల్ని రైతులు వాడుతున్నారు. పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు పెద్దగా దిశ నిర్దేశం చేయకపోవడంతో ప్రయివేటు కంపెనీలు లాభం కోసం అనేక రకాల పురుగుమందును సిఫార్సు చేస్తుండటంతో వాటిని వాడి మరింత నష్టపోతున్నారు. బయోమందుల మీద ప్రభుత్వం నియంత్రణ లేకపోవడంతో తక్కువ ధరకు తయారయ్యే మందులను అత్యధిక ధరలకు అమ్మడంతో రైతులు మీద మరింత భారం పడుతున్నది. ఈ మందుల నియంత్రణ మీద ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుపోవటం బాధాకరం. అనేక సంవత్సరాలుగా ఒకే న నేల లో మిర్చి పంట సాగు చేయడం, పంట మార్పిడి చేయకపోవడం, నేలబలం గురించి రైతుకి అవగాహన లేకపోవడం పంట నష్టాలను మరింత తీవ్రతరం చేస్తున్నది.

అలాగే జీవ నియంత్రణ మందులు వాడించడంలో ప్రభుత్వ వైఫల్యం రైతుల అవగాహన లోపంతో రసాయన మందుల మీద ఆధారపడాల్సి వస్తుంది. జీవ నియంత్రణ మందులు ప్రభుత్వం తక్కువ ధరకు జిల్లా కేంద్రాలలో సరఫరా చేస్తుంది. కానీ అది మొత్తం రైతాంగానికి సరిపడే విధంగా ఉండకపోవడంతో 150 రూపాయలకే ప్రభుత్వం ఇచ్చే జీవ శిలీంద్ర మందుని బయట వెయ్యి రూపాయలు పెట్టి కొనుక్కోవాల్సి వస్తుంది. దీని నాణ్యత మీద సరైన నమ్మకం ఉండదు. ప్రభుత్వం జీవ శిలింద్రాలను ఎలా వాడాలో అవగాహనా సదస్సులు పెడితే ఎంతోకొంత ప్రయోజనం చేకూరుతుంది.

విత్తనం దగ్గరినుంచే రైతన్నకు నష్టం

మిర్చి పంట ద్వారా లాభాలు అందుకుని అప్పులు తీర్చాలనుకున్న రైతన్న విత్తనం దగ్గర నుంచే నష్టపోతున్నాడు. రైతుల ఆశను అవకాశంగా తీసుకొని పలువురు డీలర్లు దళారులు రైతులకు బ్లాక్ మార్కెట్లో విత్తనాలు అంటగడుతున్నారు. పంట దిగుబడి ఎక్కువగా వస్తుందని తెగులు తట్టుకుంటాయని కంపెనీ వత్తనాలు దొరకటం లేదంటూ రైతులను నమ్మబలికి అమ్ముతున్నారు. రైతుల నుంచి డిమాండ్ పెరగడంతో వ్యాపారులు అవకాశంగా మల్చుకుంటున్నారు. విత్తనాలను బ్లాక్ మార్కెట్కు తగిలించి డబుల్ రేటుకి అమ్ముతున్నారు. సాధారణంగా కిలో విత్తనాలు 35 వేల నుంచి 50 వేలు ఉండే విత్తనాలను 1,20,000 దాకా పెంచి బ్లాక్లో అమ్ముతున్నారు. ఎంఎన్సి అని చెప్పుకునే కంపెనీలు 100 గ్రాముల విత్తనాలకు గాను 1500 విత్తనాలను లెక్కపెట్టి కేవలం 70 గ్రాములు మాత్రమే రైతుకి ఇస్తున్నారు. దీంతో 30 గ్రాముల విత్తనాలను రైతు నష్టపోవాల్సి వస్తుంది. అంటే ఒక కేజీ విత్తనాలు కొన్న రైతుకి 700 గ్రాముల విత్తనాలు మాత్రమే వస్తాయి. దీంతో రైతు మీద ఆర్థిక భారం పెరిగిపోతుంది. అలాగే నర్సరీల మీద నియంత్రణ లేకపోవడంతో వారు బ్రాండ్ పేరు చెప్పి సాధారణ విత్తనాలు వాడటం వల్ల. రైతాంగం భారీగా నష్టపోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఇంత జరిగినా ప్రభుత్వా నికి చీమకుట్టినట్టు కూడా లేదు.

తెలంగాణలో ఖమ్మం మిర్చి యార్డ్తో పాటు, వరంగల్ మిర్చి యార్డులో ఎక్కువగా మిర్చి అమ్మకాలు కొనుగోలు సాగుతాయి. కేశసముద్రం, హైదరాబాద్, మధిర లలో పాక్షికంగానూ కొనుగోళ్ల ఉంటాయి. ఆంధ్రప్రదేశ్లోని గుంటూరులో ఉన్న మిర్చి యార్డు దేశంలోనే కాదు ఆసియాలోనే అతిపెద్ద మిర్చి యార్డు. ఇక్కడికి తెలంగాణ నుంచి కూడా ఎక్కువ మిర్చి అమ్మకానికి వెళుతుంది. గతంలో ప్రతిరోజు ఒక లక్ష క్వింటాళ్ల అమ్మకం జరిగేది. ఇప్పుడు లక్ష నుంచి రెండు లక్షల క్వింటాలు అమ్మకం జరుగుతుంది. వరంగల్ ఖమ్మం మధిర ప్రాంతాల్లో ఉన్న మిర్చి నిల్వ కొరకు ఉన్న శీతల గిడ్డంగులతో పాటు అటు గుంటూరు నుంచి చిలకరావుపేట ఇటు విజయవాడ వైపు వందకు పైగా శీతల గిడ్డంగులు ఉన్నాయి. రైతులు కంటే వ్యాపారులే లాభాల కోసం ఎక్కువ నిలవ బెట్టుకున్నారు. ఈ గిడ్డంగులు మీద ప్రభుత్వం ఎటువంటి పర్యవేక్షణ లేదు. యార్డులలోకి మిర్చి ఎక్కువగా రావడంతో వ్యాపారస్తులు సిండికేట్గా మారి రేట్లు తగ్గిస్తున్నారు. ఇప్పుడు కోల్డ్ స్టోరేజ్ లు కూడా ఖాళీ లేకపోవడంతో ధరలు మరింత పతనావస్థకు చేరుకున్నాయి. ఖమ్మం వరంగల్ మిర్చి యార్డులలో జెండా పాట ఒకటి ఉండగా, మార్కెట్ ధర మరొకటి ఉంటుంది. పైకి చెప్పే ధరకి రైతుకిచ్చే ధరకు పొంతనే ఉండదు. మార్కెట్లు పాలకదారులకి, వ్యాపారులకి లాభదాయకంగా ఉన్న రైతులు మాత్రం తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రజా ప్రతినిధులు మంత్రు లు వచ్చినప్పుడు జెండా పాట అంతో ఎంతో పెరుగుతుంది. నలుగురు ఎంపిక చేసిన రైతుల దగ్గర మాత్రమే కొంటారు. ధర అమాంతం తగ్గించేస్తారు.నాణ్యత లేదంటారు కొన్నిసార్లు రైతుల సరుకు కన్నా వ్యాపారస్తులు సరుకుని అధిక ధరకు కొనుగోలు చేస్తున్నారు. విదేశాలకు ఆఫర్లు లేవంటూ రైతుకి వ్యాపారస్తుల మధ్య కొలుగోలులో వ్యత్యాసం చూపెడుతున్నారు. దీంతో తీవ్రమైన నష్టం రైతాంగానికి జరుగుతుంది. ఒక్కొక్కసారి 5వేల రూపాయల ధరలు వ్యత్యాసం ఉంటుంది. జెండా పాట 20వేలు చూపెట్టి నాణ్యత లేదంటూ 12 వేలనుంచి 15 వేలకు లోపు ధరకు కొనుగోలు చేయడంతో సాగు దారులు కన్నీళ్ల పర్యంతమవుతున్నారు. పంట కోత సమయంలో పంటపై తెగుళ్ల దాడి ఉంటే మార్కెట్ దళారుల దాడి ఎక్కువనేది దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు.

అంతర్జాతీయంగా మిర్చికి డిమాండ్

తెలంగాణలో పండే చపాట మిర్చికి ఇంటర్నేషనల్ మార్కెట్ లో మంచి డిమాండ్ ఉన్నది. తక్కువ కారం ఉండే ఈ మిర్చిని లిక్విడ్ రూపంలో కారము ఘాటు ఇలా రకరకాలుగా ప్రాసెస్ చేసి ఏదో ఎక్కువ డిమాండ్ ఉంటే అక్కడికి ఎగుమతి చేస్తే రైతుకి మంచి రోజులు వస్తాయి. మనం పండించిన పంటను ఇక్కడే ప్రాసెస్ చేసి ఎక్స్పోర్ట్ చేసే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.రాష్ట్రంలో రోజువారీగా కారం వినియోగం 93 మెట్రిక్ టన్నులుగా ఉంది. ఏటా రాష్ట్ర అవసరాలకు వాడేది 33.950 మెట్రిక్ టన్నులు. మిగిలిన దాన్ని ఇతర రాష్ట్రాలకు విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. భారతదేశ నుండి మిరప దిగుమతి చేసుకునే దేశాలు శ్రీలంక, అమెరికా, కెనడా, ఇంగ్లాండ్, సౌదీ అరేబియా సింగపూర్, మలేషియా జర్మనీ. మిరప ఉత్పత్తి చేసే దేశాలు భారత్, చైనా, పాకిస్తాన్, మెక్సికో, టర్కీ, బంగ్లాదేశ్. మిరప ఎగుమతి చేయడానికి భారతదేశానికి ఉన్న పోటీదారులు పాకిస్తాన్, బంగ్లాదేశ్.

ఇంతటి డిమాండ్ ఉన్న మిర్చిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరిగా వినియోగించుకోకపోవడంతో పాటు ఎగుమతి చేసే అవకాశం ఉన్నా పట్టించుకోకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. పైగా అమ్మేటపుడు తక్కువ రేటు, కొనేటప్పుడు మాత్రం ఎక్కువ రేటు ఉండటంతో మరింత అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారు. కనీసం పంటకు తగిన ధర వచ్చే వరకైనా శీతల గిడ్డంగుల్లో దాచుకుందామంటే అవి కూడా వ్యాపారుల పాలే అవుతున్నాయి. ఇలా అనేక రకాలుగా మిర్చి రైతుల కంట్లో కారం కొడుతున్నది ప్రభుత్వం. పర్యవేక్షించి చర్యలు తీసుకోవాల్సిన అధికారయంత్రాంగం జాడే లేదు. ఇప్పటికైనా మిర్చి రైతులకు రాష్ట్ర సర్కార్ భరోసా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.


పోరుబాట..గద్దర్



ఎనుపోతుల వెంకటేష్
9573318401

గద్దర్.. ఇది ప్రజలకు పరిచయం అవసరం లేని పేరు. యావత్ తెలుగు నేలపైన ఆయన పాట ఒక అలజడి. ఆయన పాట ఒక కదలిక. ఆయన పాట ఒక ప్రవాహం. ఒక్కమాటలో చెప్పాలంటే ఆయన పాట ఒక ధిక్కార స్వరం. గద్దర్ భౌతికంగా దూరమై ఏడాది గడిచినా ఆయన పాట, బాట, మాట మాత్రం తెలుగురాష్ట్రాల్లో నిరంతరంనే ఉన్నది."కాలం కడుపుతో ఉండి కవిని కంటది" అని శివసాగర్ అన్నట్టు..1949 జనవరి 31న మెదక్ జిల్లాలోని తూప్రాన్ గడ్డమీద ఒక విప్లవ కవి, గద్దర్ పుట్టాడు. నిచ్చెన మెట్ల కులవ్యవస్థలో అట్టడుగునకు నెట్టివేయబడ్డ కులంలో పుట్టిన గద్దర్ అసలు పేరు గుమ్మడి విఠల్రావు. స్వాతంత్ర్యా నికి ముందు పంజాబీ భాషలో గదర్ అంటే విప్లవం. అందుకే దాని మీద గౌరవంతో దానికి గుర్తుగా ఆయన ఆ పేరును తీసుకున్నారు. అదే గదర్ శీర్షికతో ఆయన మొదటి పాటల ఆల్బమ్ని ప్రజల ముందుకు తెచ్చారు. ఆనాటి నుండి గదర్ అనే పదం ఉచ్చారణ దోషం కారణంగా గద్దర్గా రూపాంతరం చెంది అదే ఆయన పేరుగా స్థిరపడింది.

చిన్నప్పటి నుండి చురుకైన మేధస్సు, ఆదర్శవంతమైన భావాలున్న గద్దర్ రోజూ వార్త పత్రికలను అనేక సాహిత్య పుస్తకాలను చదవటం అలవాటు.తల్లిదండ్రుల కారణంగా అప్పటికే అంబేద్కర్, పూలే దంపతుల ఆలోచనలతో పరిచయం ఉన్న ఆయన పత్రికల్లో విప్లవకారుల కథనాలను, వార్తలను చదివి వారి పోరాటాన్ని అర్థం చేసుకుంటూ విప్లవ మార్గానికి ఆకర్షితులయ్యారు. ఈ సమాజంలోని వ్యవస్థల నిర్లక్ష్యానికి అవస్థ పడుతున్న ప్రజలను కండ్లారా చూస్తూ అర్థం చేసుకున్నాడు.



కార్మిక కర్షక లోకాన్ని పీడిస్తున్న శ్రమదోపిడీ విధానాన్ని, పెట్టుబడిదారీ వ్యవస్థలో నష్టపో తున్న ప్రజల కన్నీళ్లను చూసి చలించిపోయాడు. దోపిడీ లేని సమాజాన్ని నిర్మించాలని పోరుబాట పట్టాడు. క్రమంగా 1969 తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని ఊరూరా తిరుగుతూ ప్రచారం చేశాడు. నిరక్షరాస్యులైన ప్రజలకు అర్థం చేయించడం కోసం ఆయన బుర్రకథను ఎంచుకొని గ్రామాల్లో ప్రదర్శించాడు. జాషువా, శ్రీశ్రీ లాంటి వారి సాహిత్యంతో పాటు విప్లవ సాహిత్యాన్ని విరివిగా అధ్యయనం చేశాడు. రైతులు, పారిశుధ్య, రిక్షా కార్మికుల కష్టాలు, సామాజిక సమస్యలు ఇలా వివిధ అంశాలపైన వందలాది పాటలు, బుర్రకథలు రాసి పాడుతూ ప్రదర్శనలిస్తూ అవగాహన కల్పించేవారు.

1973లో రిక్షా కార్మికులు తమ రక్తాన్ని చమురుగా చేసి రిక్షా బండిని లాగుతూ బతుకు బండిని నడిపిస్తున్న వారి జీవితాలను అక్షరికరించిన గద్దర్... "నా రక్తంతో నడుపుతాను రిక్షాను..నా రక్తమే నా రిక్షకు పెట్రోలు..పెట్రోల్ ధర పెరిగింది ..డీజిల్ ధర పెరిగింది నా రక్తం ధరనేమో రోజు రోజు తగ్గబట్టే" అనే పాటను ప్రజల ముందు పాడితే గుండెలు బరువెక్కిపోయేవి.1975 ఎమర్జెన్సీ కాలంలో గద్దర్ని అరెస్ట్ చేయగా 45రోజుల తరువాత విడుదలయ్యారు. 1979 జులై 23న విడుదలైన 'మాభూమి' సినిమా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలోని పరిస్థితులకు అద్దం పట్టింది. తెలంగాణ వ్యాప్తంగా రజాకార్ల, దొరల ఆకృత్యాలకు వ్యతిరేకంగా సాగిన వీరోచిత పోరాటం నాటి తీరును కథాంశంగా బి.నరసింగరావు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో గద్దర్కి మొదటిసారి అవకాశమొచ్చింది. యాదగిరి పాత్రను వేయించి నిజాంకు వ్యతిరేకంగా యాదగిరి పాడిన పాటను..."బండెనక బండికట్టి.. పదహారు బండ్లు కట్టి..ఏ బండ్లె వస్తవు కొడుకో నైజాం సర్కరోడ" అంటూ స్వయంగా పాడి ఆడాడు. 1980 నుంచి ప్రజా జీవితంలో అనేక కళారూపాలలో ప్రజా చైతన్యం కోసం గళమెత్తాడు.'కయ్యం పెట్టిందిరో కలర్టివి ఇంటి కొచ్చి.. దయ్యం పట్టిందిరో నా పెండ్లంపోరలకు' అంటూ ప్రజా జీవితంలో తలెత్తే అనేక సమస్యలపై వందలాది పాటలు రాశాడు.

1997 ఏప్రిల్ 6న మఫ్టీలో ఉన్న కొందరు గద్దర్పైకి తుపాకితో ఆరు రౌండ్ల కాల్పులు జరిపారు. రక్తపు మడుగులో పడిపోయిన గద్దర్ని కుటుంబ సభ్యులు హుటాహుటిన హాస్పిటల్కి తరలించారు. ఆయన శరీరంలో నుండి ఐదు బుల్లెట్స్ని తీయగలిగారు. కానీ ఒక్క బుల్లెట్ను మాత్రం తీయలేకపోయారు. అది తీస్తే చనిపోయే ప్రమాదం ఉంటుందని అలాగే ఉంచారు. దాంతో గద్దర్ మట్టిలో కలిసిపోయేవరకు ఆ బుల్లెట్ తన శరీరంలో అలాగే ఉన్నది. ఇక మలిదశ తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్ర అక్షరాలకు అందనిది. తెలంగాణ ప్రతి పల్లెలోను తన పాటలతో కదిలించాడు. తన మాట, ఆట, పాటలతో యావత్ తెలంగాణను హోరెత్తించారు. దగాపడ్డ తెలంగాణ గుండె దరువయ్యాడు. ఉద్యమ తొలి నాళ్లలో ఆయన పాట "అమ్మా తెలంగాణమా...ఆకలికేకల గానమా" అంటూ మొదలెట్టిన ఈ పాట ఎంతగానో ప్రజాదరణ పొందింది. ఈ పాట తెలంగాణలోని అన్ని ప్రాంతాలను కలుపుతూ అనేక అంశాలను గురించి చెబుతుంది. ఇక చివరిరోజుల్లో "మూగ బోయిన గొంతులో రాగమెవరు తీసేదరో.. జీరపోయిన గొంతులో జీవమెవరు పోసెదరో" అని స్వయంగా రాసి పాడుకున్నాడు.తన మరణాన్ని ముందుగానే ఊహించి రాసుకున్న పాటగా ఆయన చనిపోయిన తర్వాత ఇది చర్చనీయాంశమైంది. గద్దర్ గుండెపోటుతో హైదరాబాద్లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి 2023 ఆగస్టు 6న తుదిశ్వాస విడిచారు.

"నా గీతావళి ఎంత దూరం ప్రయాణంబవునో అందాక ఈ భూగోళమున అగ్గిపెట్టెదను" అని దాశరథి అగ్నిధారలో అన్నట్లుగా గద్దర్ సాహిత్యం తెలుగు సాహిత్య చరిత్రలో ఉన్నంతకాలం ఆయన అమరుడు. గద్దర్ సాహిత్య కృషి కొలమానానికి అందనిది. గద్దర్ ఒక సాహితీ శిఖరం. నేటి సాహితీ విద్యార్థులకు ఆయన సాంస్కృతిక విశ్వవిద్యాలయం. గద్దర్ లాంటి గొప్ప కవి, గాయకుడిని ఈ నేల మరువదు.

(నేడు గద్దర్ ప్రథమ వర్ధంతి)

యుద్ధోన్మాదులు వెనకడుగు వేయకతప్పదు



కె.శాంతారావు
9959745723

యుద్ధం మానవాళిని కకావికలం చేస్తుంది. ఇది ప్రకృతి వైపరీత్యం కాదు, కేవలం మనిషి చేసే విధ్వంసం. బడుగుదేశాల వనరుల దోపిడీకి, ఆ దేశ ప్రజల శ్రమదోపిడీకి ఆయుధాలతో భయ భ్రాంతులు గావించి ఆయా దేశాలను లొంగదీసు కోవడానికి సామ్రాజ్య వాదశక్తులు చేసే దుందుడుకు చర్యలే యుద్ధాల రూపంలో ముందుకొస్తాయి. ఇది చరిత్ర చెబుతున్న పాఠం. ఎంతటి దేశాధినేతైనా కావచ్చు. గుణపాఠాలు నేర్వక యుద్ధహింసకు కారకుడయ్యా డంటే ఆధునిక అనాగరికుడిగా, నరహంతకునిగా మనం జమకట్ట వచ్చు.

1945 ఆగస్టు 6వ తేదీ ఉదయం 8గంటల 15 నిమిషాల ప్రాత:కాలవేళలో అమెరికా, జపాన్ నగరం హీరోషిమాపై ప్రపథమంగా అణుబాంబు వేసింది. అలాగే ఆగస్టు 9న నాగసాకి నగరంపై మరో అణుబాంబు వేసింది. ఈ రెండు బాంబుల ఫలితంగా లక్షమందికి పైగా మరణించారు. మరో యాభైవేల మందికి పైగా క్షత గాత్రులయ్యారు. మరికొన్ని వేలమంది ఆ అగ్నికీలల్లో ఆనవాలు కనిపించక ఆహుతై పోయారు. లక్షలాది మంది ఆ రేడియేషన్ ప్రభావానికి రోగగ్రస్తులయ్యారు. పారంపర్యంగా ఇప్పటికీ ఆ విషమబాధలు అనుభవిస్తున్న వారు ఎంతోమంది ఉన్నారు. అణుబాంబులతో, మారణాయుధాలతో ప్రపంచాన్ని పాదాక్రాంతం చేసుకోవాలను కుంటున్న అమెరికా సామ్రాజ్యవాద రాక్షస దుగ్ధ ఇది.

సమకాలీన ప్రపంచంలో రెండు యుద్ధాలు జరుగుతున్నాయి. 1. ఇజ్రాయిల్-పాలస్తీనా (గాజా)పై చేసే యుద్ధదాడి. 2. రష్యా - ఉక్రెయిన్ యుద్ధం.

దొంగే. దొంగ దొంగ. అని అరచిన చందంగా నరహంతకునిగా పేరొందిన ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు కొత్త పల్లవిని అందుకు న్నాడు. ప్రపంచవ్యాప్తంగా అమెరికాతో సహా వివిధ దేశాల్లో ఇజ్రాయిల్కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు, అల్లర్లు చేయడం కోసం ఇరాన్ నిధులు న మకూ ర్చుకుంటున్నద ని ఆరోపిస్తున్నాడు. ఇటీవల అమెరికా పర్యటనలో, ఆదేశ ఉభయ సభలనుద్దేశించి మాట్లాడుతూ ఇలాగే వాపోయాడు. విశేషం ఏమంటే అదే సందర్భంలో యుద్ధోన్మాది నెత న్యాహును అంతర్జాతీయ కోర్టులు అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది విద్యార్థులతో కలిసిన యువలోకం ఆగ్రహంతో నినదించింది. దిష్టిబొమ్మలను తగల బెట్టింది. ఎందుకంటే అమెరికా ఇజ్రాయిల్కు వత్తాసు పలుకుతున్న విషయం ఎల్లరకూ తెలిసిందే. అయితే ఇదంతా ఇజ్రాయిల్కు వ్యతిరేకంగా ఇరాన్ చేస్తున్న కుట్రగా నెతన్యాహు అభివర్ణిం చాడు. అక్కడితో ఆగలా...తనకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నవారిని 'ఇరాన్ యూజ్ఫుల్ ఇడియట్స్' అని కూడా నిందించాడు. గాజాను ఆదుకోవడం కోసం ప్రపంచవ్యాప్తంగా నిధులు వస్తుంటే వాటిని హమాస్ ఉగ్రవాద సంస్థ కైంకర్యం చేసి తన స్వప్రయోజనాల కోసం వాడుకుంటున్నదని ఏకరువు పెట్టాడు. పైగా పాలస్తీనాకు వ్యతిరేకంగా తాము చేస్తున్న యుద్ధం (దాడి) న్యాయబద్ధమేనని సమర్థించుకున్నాడు. యుద్ధదాడులు చేయడమెందుకు? ఇలా ప్రేలాపనలు పేలడం ఎందుకు? ఉన్మాదులు ఇలానే ప్రవర్తిస్తారని మానసిక నిపుణుల అభిప్రాయం. అమెరికా ప్రెసిడెంట్ బైడెన్, ప్రెసిడెంట్ పోటీలో ఉన్న కమలాహారిస్తో సహా కాల్పుల విరమణకు ఇదే సరైన సమయం అని ఒత్తిడి తెస్తున్నారు కారణాలు ఏమైనా గానీ... .అయినా నెతన్యాహుకు తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్ళు అన్న చందంగా మూర్ఖంగా వ్యవహరిస్తున్నాడు. మధ్యధరా సముద్రం తూర్పుతీరంలో సుమారు 60 కి.మీ. పొడవు, 10 కి.మీ. వెడల్పు గల గాజా పట్టి (గాజా స్ట్రిప్) ప్రాంతంలో దాదాపు పాతిక లక్షల మంది పాలస్తీనీయులు నివసిస్తు న్నారు. దీనిపై ఇజ్రాయిల్ ఆధిపత్య పాలన సాగుతున్నది. ఇజ్రాయిల్ సైనికులు నిత్యం మారణాయుధాలతో పాలస్తీనా ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ



హింసాచర్యలకు పాల్పడుతుంటారు. ఈ సైనిక దాడుల్లో విదేశీ జర్నలిస్టులు సైతం బలైపోవడం గమనార్హం. గత పది నెలలుగా సాగుతున్న ఈ యుద్ధ దాడిని ఖండిస్తూ ఇప్పుడిప్పుడే విద్యార్థి యువజన లోకం వీధుల్లోకి వస్తున్నది. పాలస్తీనీయులకు సంఘీభావం ప్రకటిస్తున్నది. సుమారు నలభైవేల మంది ప్రజానీకం ఈ యుద్ధదాడికి బలైపోయిన విషయం తెలిసిందే.

ఇదిలా ఉండగా ఇజ్రాయిల్-లెబనాన్ యుద్ధ ఛాయలు కొత్తగా తెరమీదకు కమ్ముకొస్తున్నాయి. హమాస్కు మద్దతుగా లెబనాన్ ఎప్పటినుండో ఇజ్రాయిల్పై ప్రతిఘటనా వాణిని విన్పిస్తున్నది. తాజాగా ఇజ్రాయిల్లోని గొలన్హైట్స్ ఫుట్బాల్ కోర్టుపై బాంబుదాడి జరిగింది. ఇది లెబనాన్లోని హిజుబుల్లా ఉగ్రవాదదాడుల పనే అంటూ తగిన ప్రతీకారం తీసుకుంటామని నెతన్యాహు అంటున్నాడు. అసలు ఆ దాడితో తమకెలాంటి సంబంధం లేదని లెబనాన్ మొత్తుకుంటున్నా ఇజ్రాయిల్ వినడానికి సిద్ధంగా లేదు. కక్ష సాధింపు చర్యగా లెబనాన్లోని బక్కావ్యాలీ, కఫార్కిలా ప్రాంతాలను ఇజ్రాయిల్ ధ్వంసం చేసింది. లెబనాన్పై ఇజ్రాయిల్ దాడులు ఆపకపోతే, తీవ్రపరిణామాలు చవిచూడవలసి వస్తుందని ఇరాన్ బాహాటంగా హెచ్చరించింది. ఈ వివాదం ముదిరితే విశ్వశాంతికి, ప్రపంచ మానవాళి భద్రతకు ముప్పు తప్పదని ఇరాన్ విదేశాంగ ప్రతినిధి నాజర్ కనాని పేర్కొంటున్నాడు.

ఇజ్రాయిల్ పిచ్చివాదనలు ఇకనైనా కట్టిపెట్టి, నిజానిజాలు తెలుసుకుని సఖ్యత కోసం రాజీకై ముందుకు రావాలని కనాని విజ్ఞప్తి చేశారు. తమదేశాల పౌరుల అశాంతిని చల్లార్చేందుకు ఇతరదేశాలపై కాలుదువ్వడం రెచ్చగొట్టడం ఎప్పటికీ సరికాదని కూడా అన్నారు. ఈ నేపథ్యంలో గత బుధవారం నాడు హమాస్ అధినేత ఇస్మాయిల్ హనియాను ఇరాన్ దేశంలోనే ఇజ్రాయిల్ సైన్యం హతమార్చింది. హిజుబుల్లా కమాండర్ ఫహీద్ షక్రును కూడా బీరుట్లో అదే సైన్యం మట్టుబెట్టింది. ఈ ఘటనలతో ఇరాన్, ఇజ్రాయిల్పై ప్రతీకార జ్వాలలతో రగిలి పోతున్నది. ఈ రెండు ఘటనల వెనుక అమెరికా హస్తం ఉన్నట్టు ఇరాన్ తలపోస్తున్నది.

కాగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ, రష్యాతో రాజీమార్గం వైపునకు ప్రయాణించడం. శాంతికాముకులకు ఊరట కలిగిస్తున్నది. ఇదో శుభపరిణామం. రష్యా-ఉక్రెయిన్ యుద్ధకాలం దాదాపు రెండున్నరేండ్లు. సుమారు ఐదు లక్షల మంది ప్రజానీకం నేలకొరిగారు.

జూలై 20న తన జాతి ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ రష్యాతో చర్చలు అవసరమని జెలెన్స్కీ అభిప్రాయ పడ్డారు. వచ్చే నవంబరులో జరిగే శాంతి-శిఖరాగ్ర సభలకు ప్రతినిధులను పంపమని రష్యాను కోరారు. అంతేకాదు ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి దిమిత్రి కులేబా ఇటీవల చైనా వెళ్లి, ఆ చైనా విదేశాంగ మంత్రి వాంగ్యూతో చర్చల కోసం రష్యాను ఒప్పించమని ప్రాధేయ పడ్డారు. యుద్ధ పరిష్కార చర్చలు ఉభయుల మధ్య జరగాలి తప్ప బయటవారి జోక్యం ఉండరాదనేది చైనా ఉద్దేశ్యంగా కనిపిస్తున్నది.

ఉక్రెయిన్ను అడ్డం పెట్టుకుని నాటో విస్తరణకు అవకాశం ఇవ్వడమంటే, తమ దేశ ప్రజలపై యుద్ధ ప్రమాదాన్ని నేరుగా ముంగిట్లోకి ఆహ్వానించడమేనని రష్యా గగ్గోలు పెట్టడం అందరికీ తెలిసిందే. తమ ఆత్మరక్షణ కోసమే ఉక్రెయిన్ను నాటోకి బయటే ఉంచాలన్నది రష్యా వాదన. అమెరికా కనుసన్నల్లోనే నాటో నడుస్తుంది మరి.

వాస్తవం ఏమిటంటే సోషలిస్టు దేశాలుగా పేరుగాంచిన రష్యా- చైనా మైత్రి చాలాకాలం తర్వాత బల పడటానికి బాటలు పడటం, రష్యా - ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాది పైచేయి కావడం, ఉక్రెయిన్ మరింత ఆయుధ సహకారానికి నాటో చేతులెత్తేయడం, అన్నింటికంటేమించి నాటో యుద్ధోన్మాదాన్ని ప్రజలు నానాటికి ప్రతిఘటించడం వలన జెలెన్స్కీ వెనక్కి తగ్గవలసి వచ్చింది.

ఈ ఆధునిక యుగంలో యుద్ధం ఎప్పటికీ సమస్యకు పరిష్కారం కాదు, ప్రకృతి మానవాళి విధ్వంసం తప్ప. యుద్ధోన్మాదులు వెనక్కి తగ్గాలంటే ప్రజా ఉద్యమాలు తప్పనిసరి. ఆ క్రమంలో నెతన్యాహు వంటి యుద్ధోన్మాదులు ఈ రోజు కాకపోయినా రేపైనా వెనకడుగు వేయక తప్పదు.

బోడేపూడి స్ఫూర్తితో రైతాంగ సమస్యలపై ఐక్య ఉద్యమాలు

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బోడేపూడి స్ఫూర్తితో రైతాంగ సమస్యలపై ఐక్య ఉద్యమాలు నిర్వహించేందుకు సిద్ధం కావాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ పిలుపు ఇచ్చారు. రైతులు పండించిన పంటలకు సాగు నీరందించేందుకు అహర్నిశలూ కృషి చేసి తన జీవితాన్ని రైతాంగ సమస్యల పరిష్కారం కోసం అంకితం చేసిన రైతు బాంధవుడు బోడేపూడి వెంకటేశ్వరరావు అని కొనియాడారు. హైదారాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో అమరజీవి బోడేపూడివెంకటేశ్వరరావు 27వ వర్ధంతి కార్యక్రమం మూడ్ శోభన్ అధ్యక్షతన జరిగింది. ముందుగా బోడేపూడి చిత్రపటానికి రైతు సంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, సాగర్ పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంతరం సాగర్ మాట్లాడుతూ... బోడేపూడి మరణించే వరకు ప్రజా సేవలోనే గడిపారని చెప్పారు. రైతు సంఘం ఉమ్మడి రాష్ట్రం అధ్యక్షులు పని చేశారని తెలిపారు. 1985, 1989, 1994 ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు మధిర ఎమ్మెల్యేగా బోడేపూడి వెంకటేశ్వరరావు విజయం సాధించారని



గుర్తు చేశారు. మధిర నియోజకవర్గ అభివృద్ధి బోడేపూడి నుంచే ప్రారంభమైందన్నారు. ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులుగా నందమూరి తారక రామారావు, నారా చంద్రబాబు నాయుడు ఉన్న సమయాల్లో బోడేపూడి ఎమ్మెల్యేగా, సీపీఐ(ఎం) శాసనసభాపక్ష నాయకులుగా వ్యవహరించారని తెలిపారు. శాసనసభలో అధికార, ప్రతిపక్షాల మధ్య వాదోపవాదాలు జరిగిన సమయంలో ఆ రెండు పార్టీల నేతలు బోడేపూడి చెప్పిన సూచనలకు కట్టుబడి ఉండేవారని తెలిపారు. మధిర నియోజకవర్గ ప్రజలు మంచినీటి సమస్యతో ప్రధానంగా ఫ్లోరైడ్ నీటితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శాసనసభలో బోడేపూడి ప్రస్తావించారు. ఫ్లోరైడ్ నీటిని తాగటం వల్ల కాళ్లు వాపులు వస్తున్నాయని స్వయంగా తన కాళ్లను శాసనసభలో చూపించారని గుర్తు చేశారు. దాంతో వైరా చెరువులో పైలెట్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి మధిర నియోజకవర్గంలోని 104 గ్రామాలకు మంచినీటి సరఫరా చేశారని సాగర్ వివరించారు.

మల్లారెడ్డి, అరిబండి ప్రసాదరావు మాట్లాడుతూ. ..బోడేపూడి మరణాంతరం మంచినీటి పైలెట్ ప్రాజెక్టుకు బోడేపూడి సుజల స్రవంతి పథకంగా నామకరణం చేశారని తెలిపారు. రైతుల సమస్యలు విన్న వెంటనే ఆయన పర్యటించేవారు. వయసు మీద పడినా లెక్కచేయకుండా రైతుల కోసం రాత్రి, పగలు తేడా లేకుండా కృషి చేసి నీటిని విడుదల చేయించడంలో, పంటలను కాపాడటంలో బోడేపూడి నిర్విరామంగా కృషి చేశారని కొనియాడారు. అందుకే ప్రజలు బోడేపూడికి రైతు బాంధవుడుగా నామకరణం చేశారని వెల్లడించారు. నాగార్జున సాగర్ నీరు అనగానే రైతులందరికీ గుర్తుకు వచ్చేది నేటికీ బోడేపూడి వెంకటేశ్వరరావే అని తెలిపారు. అందుకే ఆయన ప్రజల హదయాల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు.

నేటి కేంద్ర ప్రభుత్వం భూములను కార్పొరేట్ పరం చేసి రైతులను భూముల నుంచి దూరం చేస్తున్నదని విమర్శించారు. రైతాంగ ఆత్మహత్యల పరంపర కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాల విధానాలు మారకుండా రైతాంగ ఆత్మహత్యలు ఆపడం సాధ్యం కాదని తేల్చి చెప్పారు. బోడేపూడి స్ఫూర్తితో రైతాంగ సమస్యలపై ఉద్యమించాలనీ, అదే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రాహుల్, కౌసల్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలను విద్యార్థులకు ఇవ్వాల్సిందే

- ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదనే సాకుతో నిరాకరించొద్దు
- నిబంధనలు ఉల్లంఘించే కాలేజీలపై కఠిన చర్యలు తీసుకుంటాం : ఉన్నత విద్యామండలి హెచ్చరిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఇంజినీరింగ్ సహా వృత్తి విద్యా కాలేజీ యాజమాన్యాలు ఫీజురీయింబర్స్‌మెంట్ రాలేదనే కారణంతో విద్యార్థుల చదువు పూర్తయినా ఒరిజినల్ ధ్రువపత్రాలను ఇవ్వకుండా నిరాకరించడం సరైంది కాదని ఉన్నత విద్యామండలి తెలిపింది. ఫీజురీయింబర్స్‌మెంట్ రాలేదనే సాకు చూపొద్దనీ, విద్యార్థులకు ఇవ్వాల్సిందేనని ఆదేశించింది. ఈ మేరకు విశ్వవిద్యాలయాల రిజిస్ట్రార్లకు ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ సోమవారం లేఖ రాశారు. ధ్రువపత్రాలు విద్యార్థులకు ఇవ్వకపోవడం వల్ల వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉన్నత విద్యకు వెళ్లాలన్నా, ఉద్యోగం చేయాలన్నా, ఇతర అవసరాలకు ధ్రువపత్రాలు అవసరమవుతాయని పేర్కొన్నారు. ధ్రువపత్రాలను కాలేజీల్లో ఉంచుకోవడాన్ని యూజీసీ 2018 మార్గదర్శకాల్లో నిషేధించిందని గుర్తు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత ఉన్న విద్యార్థుల నుంచి విశ్వవిద్యాలయాల పరిధిలో అనుబంధ గుర్తింపు పొందిన ప్రయివేటు కాలేజీలు ఆ సొమ్మును తీసుకోవద్దని ఆదేశించారు. ఫీజు రాలేదనే సాకుతో ధ్రువపత్రాలను ఇవ్వకుండా ఉండడం సరైంది కాదని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే కాలేజీలను బ్లాక్‌లిస్టులో చేర్చుతామనీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ అర్హత లేకుండా చేస్తామనీ, అనుబంధ గుర్తింపు రాకుండా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా కాలేజీ యాజమాన్యాలు పాటించాలని ఆదేశించారు. లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మధ్యాహ్న భోజనం కార్మికుల పారితోషికం రూ.18.06 కోట్లు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మధ్యాహ్న భోజనం పథకానికి సంబంధించి వంట కార్మికుల పారితోషికం నెలకు రూ.రెండు వేల చొప్పున 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటి, రెండో త్రైమాసికం నిధులు రూ.18.06 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వంట కార్మికుల పారితోషికానికి మొత్తం రూ.108.40 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశామని తెలిపారు. అందులో రూ.36.13 కోట్లు ఇప్పటికే విడు దల చేశామని పేర్కొన్నారు.తాజాగా రూ.18.06 కోట్లు విడుదల చేశామని వివరించారు. వంట కార్మికులకు పారితోషికం రూ.వెయ్యికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.రెండు వేలు ఇవ్వాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఉండే జనరల్ కార్మికులకు రూ.10.90 కోట్లు, ఎస్సీ కార్మికులకు రూ.4.20 కోట్లు, ఎస్టీ కార్మికులకు రూ.2.96 కోట్లు కలిపి మొత్తం రూ.18.06 కోట్లు విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు.

ఆగస్టు 10లోగా ఖాళీల భర్తీ

మంత్రి దామోదర ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఏడు ప్రభుత్వాస్పత్రుల్లో ఖాళీలను డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ద్వారా కాంట్రాక్ట్ పద్ధతిలో ఆగస్టు 10లోగా భర్తీ చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. సోమవారం మంత్రి ఉన్నతాధికారులతో సమీక్షించారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో 407 ఖాళీలున్నట్టు తెలిపారు. ప్రస్తుత పరిస్థితిలో రోగులకు ఇబ్బంది కలగకుండా ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో సూపర్ స్పెషాలిటీ వైద్యుల బదిలీలను నిలిపివేయాలని మంత్రి ఆదేశించారు.

నౌహెరా షేక్ నివాసం నుంచి రూ.89 లక్షలు సీజ్ చేసిన ఈడీ

- మరో 12 కార్లు కూడా స్వాధీనం

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి : డిపాజిటర్ల నుంచి కోట్లాది రూపాయలను సేకరించి కుచ్చుటోపీ తొడిగిన హీరా గోల్డ్ కంపెనీ యజమాని నౌహెరా షేక్ నివాసం నుంచి రూ.89 లక్షలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు సోమవారం సీజ్ చేశారు. నౌహెరా షేక్ కోట్ల రూపాయల్లో మనీలాండరింగ్‌కు పాల్పడ్డారంటూ ఈడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు మరో రూ.400 కోట్ల మేరకు ఆమె మనీలాండరింగ్‌కు పాల్పడ్డారనే ఆరోపణలపై గత రెండ్రోజులుగా టోలీచౌకీలోని ఆమె నివాసంలో ఈడీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్న విషయం విదితమే. తాజా సోదాల్లో రూ.89 లక్షల నగదుతో పాటు మరో 12 ఖరీదైన కార్లను కూడా ఆమె నివాసం నుంచి ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మరికొన్ని కీలకమైన డాక్యుమెంట్లను కూడా సీజ్ చేసినట్టు తెలిసింది.

నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువు అక్టోబర్ 31

ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువు అక్టోబర్ 31 వరకు ఉందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్‌ను విద్యార్థులకు అందిస్తున్నదని తెలిపారు. జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్ కోసం తాజాగా దరఖాస్తు చేసుకోవడంతోపాటు పునరుద్ధరణ దరఖాస్తులను అక్టోబర్ 31 వరకు సమర్పించేందుకు అవకాశముందని పేర్కొన్నారు. 2024 వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు తాజాగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అంతకుముందు ఉత్తీర్ణులైన వారు దరఖాస్తులను పునరుద్ధరణ చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలనుకునే విద్యార్థులు http://scholarship.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఇన్‌స్టిట్యూట్ నోడల్ అధికారులు (ఐఎన్‌ఓ) పరిశీలించేందుకు చివరి తేదీ నవంబర్ 15 వరకు ఉందని తెలిపారు. టాప్ 20 పర్సెంటైల్ సాధించి తాత్కాలికంగా ఎంపికైన 59,355 మంది విద్యార్థుల జాబితాను "ప్రఎఐవ.ఎప్రప్ర.ప్రశీజ.అఅ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని వివరించారు. వారిలో జనరల్ అభ్యర్థులు 13,676 మంది, ఓబీసీలు 32,392 మంది, ఎస్సీలు 8,089 మంది, ఎస్టీలు 5,198 మంది ఉన్నారని తెలిపారు.

రూ.85 కోట్లు బాధితులకు వెనక్కి ఇచ్చిన సీఐడీ అధికారులు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి : రాష్ట్రంలో సైబర్ మోసగాళ్ల బారిన పడి బ్యాంకు అకౌంట్ల నుంచి డబ్బులను పోగొట్టుకున్న బాధితులకు సంబంధించి రూ.85.04 కోట్లను సీఐడీలోని సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ) అధికారులు రిఫండ్(వాపసు) చేశారు. ఈ విషయాన్ని రాష్ట్ర సీఐడీ అదనపు డీజీ, సీఎస్‌బీ ఇంచార్జ్ అయిన షికా గోయెల్ సోమవారం తెలిపారు. సైబర్ మోసగాళ్ల ద్వారా ఈ ఏడాది మార్చి నుంచి జులై వరకు రూ. కోట్లను బాధితులు తమ ఖాతాల నుంచి పోగొట్టుకున్నారని ఆమె చెప్పారు. సైబర్ నేరస్థుల ద్వారా తాము మోసపోయినట్టు వెంటనే పసిగట్టిన బాధితులు.. 1930కి డయల్ చేసి సమాచారం అందించటం ద్వారా వీరి డబ్బులు అకౌంట్ మారకుండా మధ్యలోనే ఆపివేయగలిగామని ఆమె తెలిపారు. ఈ మేరకు 6440 మంది బాధితులకు చెందిన రూ.85.04 కోట్లను తిరిగి వాపసు చేయగలిగామని షికా గోయెల్ వివరించారు. ఇందుకోసం తెలంగాణ లీగల్‌సెల్ అథారిటీ ద్వారా కోర్టులను ఆశ్రయించి మరోవైపు బాధితుల నుంచి కూడా కోర్టులలో పిటిషన్లు వేయించి ఈ ఫలితాన్ని సాధించామని ఆమె చెప్పారు. భవిష్యత్తులో సైబర్ మోసగాళ్ల ఎత్తుగడలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు.



దిగజారుతున్న రైతుల ఆర్థిక పరిస్థితి


- ప్రభుత్వాలవి మాటలే.. చేతలు శూన్యం : మాజీ శాసనసభ్యులు నంద్యాల నర్సింహారెడ్డి

నవతెలంగాణ-వైరాటౌన్

దేశంలో రోజురోజుకూ రైతుల పరిస్థితి ఆర్థికంగా దిగజారిపోతోందని మాజీ శాసనసభ్యులు, రైతు సంఘం నాయకులు నంద్యాల నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం బోడేపూడి వెంకటేశ్వరరావు 27వ వర్ధంతి సందర్భంగా ఖమ్మం జిల్లా వైరామండల కేంద్రంలో మల్లెంపాటి రామారావు అధ్యక్షతన జరిగిన స్మారకోపన్యాసంలో నంద్యాల నరసింహారెడ్డి "రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు – పరిష్కారం మార్గాలు" అంశంపై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలపై చట్టబద్ధత కల్పించడం లేదన్నారు. దేశంలో ఆహార స్వయం సమృద్ధి కోసం అనేక ప్రణాళికలు అమలు చేశారని, ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచ వాణిజ్య సంస్థ ఆదేశాల అమలు వల్ల కొన్ని రకాల పంటల సాగు గణనీయంగా తగ్గిందని చెప్పారు. లక్షల టన్నుల పప్పుధాన్యాలు విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పరిస్థితుల్లో మనమున్నామని, దేశంలో చిరుధాన్యాలు తృణధాన్యాలు, ఆయిల్ పంటలకు సరైన ధరలు కల్పించి ప్రభుత్వం మద్దతుగా ఉంటే విదేశీ దిగుమతులపై ఆధారపడాల్సిన అవసరం ఏం ఉంటుందని ప్రశ్నించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బోడేపూడి వెంకటేశ్వరరావుతో రైతు ఉద్యమాల్లో, శాసనసభలో కలిసి పని చేసిన అనుభవం తనకు ఉందని గుర్తు చేసుకున్నారు. నిరంతరం ప్రజలు, రైతుల కోసం పరితపించిన రైతు బాంధవుడు బోడేపూడి అని కొనియాడారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడు లక్షల ఎకరాల సాగు భూమికి నీరు అందించే సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర సంస్థల అభ్యంతరాలను పరిష్కారం చేయాలన్నారు. ఆగస్టు 13న గోదావరి రివర్ బోర్డు మేనేజ్‌మెంట్ సమావేశం నాటికి ఉభయ రాష్ట్రాల మధ్య చర్చలు జరిపి సామరస్య పూర్వకంగా ముందుకు సాగాలని అన్నారు. సీతారామ ప్రాజెక్టును పాలేరు రిజర్వాయర్‌కు అనుసంధానం చేసే ప్రధాన కాలువల పనులు తిరిగి మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాలువల నుంచి వైరా రిజర్వాయర్‌కు అనుసంధానం నేరుగా చేయాలని కోరారు. రుణమాఫీలో అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నా ప్రభుత్వం పరిష్కారం చేయకుండా ఆగస్టు 15 తర్వాత అంటూ దాటవేత ధోరణి అనుసరించడం సరికాదన్నారు.కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు చింతనిప్పు చలపతిరావు, శీలం పకీరమ్మ, సీఐటీయు జిల్లా నాయకులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి కిలారు శ్రీనివాసరావు, నాయకులు వనమా చిన్న సత్యనారాయణ, బాణాల శ్రీనివాసరావు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం, సైన్స్ ఉద్యమ నాయకులు మల్లెంపాటి వీరభద్రం, ఠాగూర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ సంక్రాంతి రవి పాల్గొన్నారు.

తెలంగాణకు రండి.. పెట్టుబడులు పెట్టండి...





అభివృద్ధిలో భాగస్వాములుకండి : తెలుగు రాష్ట్రాల ప్రవాసులకు సీఎం రేవంత్ పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'అమెరికాకు ఆయువుపట్టు మీరే.. ఇక తెలంగాణకు రండి, ఇక్కడ పెట్టుబడులు పెట్టండి, తద్వారా రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములుకండి...' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలుగు రాష్ట్రాల ప్రవాసులకు పిలుపునిచ్చారు. రాష్ట్రానికి అత్యధిక పెట్టుబడులు తీసుకురావడంలో భాగస్వాములు కావాలని ఆయన వారిని కోరారు. అమెరికాలోని న్యూజెర్సీలో ఆదివారం నిర్వహించిన ప్రవాసుల ఆత్మీయ సమ్మేళనానికి సీఎం హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి వేలాదిగా తరలొచ్చిన తెలుగువారు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'తెలంగాణ మీ జన్మభూమి, మీ దేశంలో మీరు పెట్టిన ప్రతి పెట్టుబడికి తప్పకుండా ప్రయోజనం ఉంటుంది. అంతకు మించిన అత్యుత్తమ ప్రతిఫలం ఉంటుంది. మన ప్రాంత అభివృద్ధిలో భాగస్వామ్యం పంచుకుంటే అంతకు మించిన సంతృప్తి బోనస్‌గా లభిస్తుంది...' అని వ్యాఖ్యానించారు. గతేడాది టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో తాను అమెరికాకు వచ్చానని రేవంత్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పదేండ్లపాటు సాగిన దుష్పరిపాలనకు, విధ్వంసాలకు విముక్తి పలికి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే మళ్లీ వస్తానంటూ తాను ఆనాడు చెప్పానని వివరించారు. ఇచ్చిన మాట ప్రకారం అమెరికాకు వచ్చానని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని తమ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందంటూ సీఎం పునరుద్ఘాటించారు. ఇప్పటికే రైతులు, మహిళలు, యువకుల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలను చేపట్టామని అన్నారు. రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీతో పాటు, ఇన్‌పుట్ సబ్సిడీగా రైతు భరోసా, నిరుద్యోగులకు ఉద్యోగాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కు వంట గ్యాస్ సిలిండర్, నిరుపేదలకు 200 యూనిట్ల ఉచిత గృహ విద్యుత్తు, ఉపాధ్యాయులకు పదోన్నతులు, విద్యార్థులకు నాణ్యమైన విద్య తదితర పథకాలను అమలు చేశామని వివరించారు. ఇది ప్రారంభం మాత్రమేననీ, భవిష్యత్తులో మరిన్ని ప్రణాళికలతో తమ ప్రభుత్వం ముందుకెళుతుందని భరోసానిచ్చారు.

తమ పరిపాలనపై అపోహలు, ఆందోళనలు అవసరం లేదని సీఎం ఈ సందర్భంగా స్పష్టం చేశారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమ్మిళిత ఆర్థిక వృద్ధిని వేగంగా సాధించేందుకు వీలుగా తమ ప్రభుత్వం కొత్త పారిశ్రామిక విధానాన్ని తీసుకు రానుందని ఆయన వెల్లడించారు. నిధుల సమీకరణతోపాటు ఎక్కువ మందికి ఉపాధి కల్పన, నైపుణ్యాల వృద్ధికి అందులో సమాన ప్రాధాన్యతనిస్తామని తెలిపారు.

ప్రశంసలు.. అభినందనలు...

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు, వాగ్దానాలను నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ చేస్తున్న కృషిని అక్కడి తెలుగువారు ఈ సందర్భంగా ప్రశంసించారు. హైదరాబాద్ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికలను కూడా వారు అడిగి తెలుసుకున్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలనే ప్రభుత్వ ఆలోచనతో కలిసి వస్తామని హామీనిచ్చారు. సీఎంకు స్వాగతం పలికిన ఓవర్సీస్ కాంగ్రెస్ పార్టీ అమెరికా అధ్యక్షుడు మొహిందర్ సింగ్ గిల్జియాన్ మాట్లాడుతూ.. 'మిమ్మల్ని ముఖ్యమంత్రిగా చూడాలన్న మా కోరిక నెరవేరింది. ఇప్పుడు రాహుల్ గాంధీని భారత ప్రధానిని చేయటానికి మనమందరం కష్టపడాలి...' అని అన్నారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, వ్యాక్సిన్‌లు, హెల్త్‌కేర్, ఆర్టిఫిషియల్ రంగాలకు తెలంగాణ బలమైన స్థావరంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. అంతకుముందు తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పే పాటలు, నృత్యాలతో కూడిన చిన్నారుల భారీ ప్రదర్శన ఆకట్టుకుంది.

పలువురు ముఖ్యులతో భేటీ

ఈ సందర్భంగా అమెరికాలోని ఈస్ట్ కోస్ట్ ఇండియన్ కమ్యూనిటీకి చెందిన పలువురు ముఖ్యులతో సీఎం భేటీ అయ్యారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తరహాలో నాలుగో నగరంగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయబోతున్నట్టు ఆయన వారితో చెప్పారు. ప్రపంచస్థాయి మాస్టర్ ప్లాన్‌తో హైదరాబాద్‌ను అత్యున్నత స్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. హైదరాబాద్ అభివృద్ధికి అందరూ కలిసి రావాలని ప్రవాసులకు సీఎం పిలుపునిచ్చారు.

మాపై ఎంతో విషప్రచారం

'ఎన్నికలకు ముందు మాపై ఎంతో విష ప్రచారం చేశారు. గిట్టని వాళ్లందరూ కాంగ్రెస్ అసలు అధికారంలోకే రాదంటూ ఎగతాళి చేశారు. వచ్చినా అది ఉండనే ఉండదంటూ జోకులు వేసుకున్నారు. ఇప్పుడేమో రాష్ట్రంలో అభివృద్ధి మందగిస్తోందంటూ లేనిపోని అపోహలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే వాళ్లకు తగిన బుద్ధి చెప్పాం. అబద్ధాలకోరుల మాటలు తప్పని మరోసారి నిరూపిస్తాం. హైదరాబాద్‌ను భారతదేశంలోనే కాదు.. ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా అభివృద్ధి చేసే విషయంలో పోటీ పడతాం...' అని రేవంత్ వ్యాఖ్యానించారు. 'మీ నైపుణ్యాలు, ప్రతిభా పాటవాలతో అమెరికాను పటిష్టంగా, సంపన్నంగా మార్చారు. ఇకపై తెలంగాణకు మీ సేవలు అందించండి, మన రాష్ట్రాన్ని మెట్రో కోర్ అర్బన్‌తోపాటు, సెమీ అర్బన్, రూరల్ క్లస్టర్లుగా విభజించి పెట్టుబడులకు ప్రత్యేకమైన వ్యవస్థలను రూపొందిస్తాం...'

అని సీఎం ఈ సందర్భంగా తెలిపారు.

అక్రమ పట్టాదారులపై చర్యలు తీసుకోవాలి

- మా భూములు మాకిప్పించండి
- ఆర్డీఓ కార్యాలయం ఎదుట పోతారం గ్రామస్తుల నిరాహార దీక్ష



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

తమ భూములను అక్రమంగా పట్టా చేయించుకున్న వారిపై చర్యలు తీసుకొని.. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పోతారం (ఎస్) గ్రామస్తులు హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ రూరల్ మండల పరిధిలోని పోతారం గ్రామ శివారులో తమకు చెందిన భూములను కొంతమంది భూ ఆక్రమణదారులు అక్రమంగా వారి పేరిట పట్టాలు చేయించుకున్నారని బాధితులు తెలిపారు. ఈ విషయమై ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేయగా.. అధికారులు భూములను సర్వే చేసి పంచనామా నిర్వహించారని చెప్పారు. తమకు న్యాయం చేస్తామన్నారని, కానీ ఇంతవరకు ఎలాంటి న్యాయమూ చేయలేదన్నారు. దాంతో ఆక్రమణదారులు వారి పేరు మీద చేయించుకున్న భూమిని యథేచ్ఛగా మరొకరి పేరు మీద మార్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆ భూములపై ఆధారపడిన 10 నుంచి 12 కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నేర్పడిందన్నారు. తమకు న్యాయం చేసే వరకు దీక్షను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

మాకూ రుణమాఫీ చేయండి

- కలెక్టరేట్, బ్యాంకు ముందు రైతుల ఆందోళన
- గద్వాల, వరంగల్‌లో ఘటనలు



నవతెలంగాణ - జోగులాంబ గద్వాల/లింగాలఘనపురం

"మేమూ.. తెలంగాణ రైతులమే.. మాకెందుకు రుణమాఫీ చేయరు.. వెంటనే మాకూ రుణమాఫీ చేయండి" అంటూ రైతులు ఆందోళనకు దిగారు. గద్వాల, వరంగల్ జిల్లాల్లో సోమవారం కలెక్టరేట్, కెనరా బ్యాంకు ఎదుట ధర్నా చేశారు. వివరాలిలా ఉన్నాయి.. జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని మారమునగాల, పల్లెపాడు, చండూరు, ఇటిక్యాలపాడు గ్రామాల రైతులు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్లో నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. అలంపూర్ నియోజకవర్గం ఎనిమిది మండలాల్లోని గ్రామాల రైతులు కొంతమంది చాలా ఏండ్లుగా కర్నూల్‌లో నివాసముంటున్నామని చెప్పారు.. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు అక్కడి బ్యాంకుల్లో లోన్లు తీసుకున్నట్టు తెలిపారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రెగ్యులర్‌గా రైతుబంధు వేశారు.. కానీ రుణమాఫీ చేస్తామని చెప్పి కొందరికే చేశారని, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి కూడా తమకు అన్యాయం చేయడం సరికాదన్నారు. తక్షణమే తమకు కూడా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ చేయని పక్షంలో పెద్దఎత్తున రైతులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బాసు హనుమంతు నాయుడు, కురువపల్లయ్య, పల్లెపాడు శంకర్‌రెడ్డి, రైతులు బీచుపల్లి, రాముడు, నాగేంద్ర, కృష్ణయ్య నాయుడు, సూర్యాగౌడ్, సత్యారెడ్డి, శ్రీరాములు, గోపాల్ రెడ్డి, శేషన్న, కురువ చిన్న కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ ముందు రైతుల ధర్నా

వరంగల్ జిల్లా లింగాలఘనపురం మండలం నెల్లుట్ల కెనరా బ్యాంకు ఎదుట రైతులు ఆందోళన చేశారు. "మాకు రుణాలు మాఫీ కాలేదు.. మేము రైతులం కాదా? వ్యవసాయం చేయడం లేదా ?" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మొదటి విడత రుణమాఫీలో తమ పేర్లు లేవని, రెండో విడత ప్రకటించినా పేర్లు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిసారీ రెన్యువల్ చేస్తున్నారు కదా ? రూ.లక్ష లోపు అప్పు తీసుకున్నా ఎందుకు మాఫీ కాలేదంటూ బ్యాంక్ అధికారులను రైతులు నిలదీశారు. గోల్డ్ క్రాప్ లోన్‌లు కూడా మాఫీ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకు అధికారులు అందరికీ మాఫీ అవుతుందని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు ఏడమ అంజయ్య, రాగుల ఉప్పలయ్య, గంపల యాదయ్య, నర్సయ్య కడకంచి బీరయ్య, కోతి ఉప్పలయ్య, రాములు, వెంకటేశం, గొరిగే శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సార్.. మేం ఈ భోజనం తినలేం..

- నాసిరకం భోజనంపై విద్యార్థుల ఆవేదన
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-భువనగిరి అర్బన్

నాసిరకం భోజనం మేము తినలేమంటూ యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర కళాశాల వసతి గృహం విద్యార్థులు ఆందోళన చేశారు. పలుమార్లు వార్డెన్‌కు చెప్పినా పట్టించుకోకపోవడంతో ఆదివారం రాత్రి భోజనం చేయకుండా నిరసన తెలిపారు. సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వంట గిన్నెలను తీసుకెళ్లి కలెక్టరేట్ ముందు పెట్టి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చింతల శివ, లావుడియా రాజు మాట్లాడారు. నాణ్యతలేని భోజనం పెడుతున్నారని, హాస్టల్ విద్యార్థుల పట్ల వార్డెన్ దురుసుగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. హాస్టల్ బాత్రూముల్లో నల్లాలు, స్నానం చేయడానికి బకెట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ రూమ్‌లలో ఫ్యాన్లు పనిచేయడం లేదన్నారు. ఈ విషయాలపై అనేకమార్లు హాస్టల్ వార్డెన్ నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా సమస్యలను పరిష్కరించాలని కోరిన విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని చెప్పారు. విద్యార్థుల సంఖ్య కంటే తక్కువగా చికెన్, గుడ్లు పెడుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో గిరిజన అభివృద్ధి శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి, డీఆర్డీఓ ఎంఏ కృష్ణన్ స్పందించి కలెక్టరేట్ బయటకొచ్చి విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు వేముల నాగరాజు, ఈర్ల రాహుల్, నాయకులు ఎండి నేహాల్, భవాని శంకర్, హాస్టల్ విద్యార్థులు బాలకృష్ణ, ప్రశాంత్, మధు, పవన్, నవీన్, ప్రశాంత్, సిద్ధు, వెంకట్ పాల్గొన్నారు.

మీర్జాపూర్‌లో పేలిన నాటుబాంబు

- ఒకరికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని మీర్జాపూర్ గ్రామంలో సోమవారం నాటు బాంబు పేలి ఎండి ఖలీల్ అనే యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం ఉదయం గ్రామానికి చెందిన ఖలీల్ పశువులను మేపేందుకు పొలం వద్దకు తోలుకెళ్లాడు. తాళ్లతో వాటిని కట్టేసి ఉంచేందుకు భూమిలోకి మేకు కొడుతుండగా నాటు బాంబు పేలినట్టు స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనలో ఖలీల్ చేతితోపాటు కాలుకు గాయాలయ్యాయి. అతన్ని వెంటనే 108 అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని హుస్నాబాద్ ఏసీపీ సతీష్, సీఐ శ్రీనివాస్ సందర్శించారు. అడవి పందులను వేటాడేందుకు వేటగాళ్లు నాటుబాంబును పడేసినట్టు అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేటీపీఎస్ పాత ప్లాంట్ కూలింగ్ టవర్ల కూల్చివేత

- కూల్చివేతలో ఆధునిక టెక్నాలజీ వినియోగం



నవతెలంగాణ-పాల్వంచ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో కాలం చెల్లిన కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్) పాత ప్లాంట్ (ఓఅండ్ఎమ్)లోని కూలింగ్ టవర్లు నేలమట్టం అయ్యాయి. సోమవారం ఉదయం 8.25 గంటలకు ఏ-స్టేషన్లోని నాలుగు కూలింగ్ టవర్లను అధికారులు ఒకసారిగా కూల్చేశారు. తరువాత బి- స్టేషన్‌లోని రెండు టవర్లను, సీ- స్టేషన్లోని మరో రెండు టవర్లను ఆధునిక టెక్నాలజీతో ఉన్నచోటనే నేలమట్టం చేశారు.


పాత ప్లాంట్ తొలిగింపు కాంట్రాక్ట్ దక్కించుకున్న హెచ్ఆర్ కమర్షియల్ సంస్థ ఈ టవర్ల కూల్చివేతను రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌కు చెందిన ఎక్సిక్యూడ్ కంపెనీకి అప్పగించింది. కంపెనీ డైరెక్టర్ ఆనంద్ శర్మ సారథ్యంలో ఇంప్లోజన్ పద్ధతిలో ఒకే చోట కుప్పకూలేలా పేలుడు పదార్థాలను ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌కో శాఖ నుంచి విద్యుత్ లైన్ల క్లియరెన్స్ రాగానే, కూల్చివేత పనులు మొదలుపెట్టారు. సెకండ్ల వ్యవధిలో టవర్లు నేలమట్టం అయ్యాయి. టవర్ల శకలాలు దూరంగా పడకుండా అక్కడే కుప్పకూలేలా పిల్లర్ల చుట్టూ ఐరన్ మెస్లను ఏర్పాటు చేసి, క్లాత్‌తో సీల్ చేశారు. ఇప్పటికే కర్మాగారంలోని మిగతా విభాగాలను తుక్కుగా మార్చి తరలించడంతో చివరికి ఈ టవర్లు మాత్రమే మిగిలాయి. అవి కూడా ఈ రోజుతో పూర్తిగా కనుమరుగయ్యాయి.

1965-78లో కేటీపీఎస్ ఓఅండ్ఎం ప్లాంట్ నిర్మాణం చేశారు. పాల్వంచ అంటే కేటీపీఎస్, దానిలో టవర్లు ఆనవాళ్లుగా చెప్పొచ్చు. 115 మీటర్ల ఎత్తులో ఉన్న ఇవి కొన్ని మైళ్లదూరం వరకు కనిపిస్తాయి. జపాన్ టెక్నాలజీతో కేటీపీఎస్ ఓఅండ్ఎమ్ కర్మాగారాన్ని నిర్మించారు. ఏ, బీ, సీ, స్టేషన్లలోని 60 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 1, 2, 3, 4 యూనిట్లు, 120 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 5, 6, 7, 8 యూనిట్లు చేపట్టి 720 మెగావాట్లతో రాష్ట్రానికి వెలుగులు పంచారు. ఒక్కో స్టేషన్‌కు ఒక్కో కూలింగ్ టవర్ చొప్పున మొత్తం 8 నిర్మించారు. విద్యుదుత్పత్తి చేసే క్రమంలో నీరు, బొగ్గు మండించిన క్రమంలో వేడిని తగ్గించేందుకు కూలింగ్ టవర్లు ఉపయోగ పడతాయి. నాణ్యతా ప్రమాణాలతో నిర్మించడంతో ఇప్పటికీ చెక్కుచెదరకపోవడం విశేషం.

హామీలన్నింటినీ అమలు చేస్తాం..

పేదల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- వికారాబాద్ జిల్లా అభివృద్ధికి ఢోకా లేదు
- రైతులకు కరెంట్ ఇబ్బందులు లేకుండా చూడాలి : మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి
- వికారాబాద్ జిల్లాలో పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



నవతెలంగాణ-తాండూరు

పేదల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా నుంచి ఒకరు స్పీకర్ ఉండగా.. మరొకరు సీఎంగా ఉన్నారని.. అందువల్ల వికారాబాద్ జిల్లా అభివృద్ధికి డోకా లేదని చెప్పారు. రైతుల మేలు కోసమే తమ ప్రభుత్వం రుణమాఫీ చేసిందన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లాలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో కలిసి మంత్రులు పర్యటించారు.

వికారాబాద్, తాండూర్ నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. వికారాబాద్ నియోజకవర్గంలో రూ.60 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తాండూర్ నియోజకవర్గంలో రోడ్లు, సెంట్రల్ లైటింగ్, తాగునీటి సరఫరా, సబ్ స్టేషన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

అలాగే తాండూరు మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమానికి స్పీకర్, మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా సమావేశాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం తాగు, సాగు నీరు, విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలలో భాగంగా త్వరలో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభిస్తామన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని దివాలా తీయించిందని, రూ.7లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు కడుతున్నామని చెప్పారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కరెంట్ సరఫరా చేయాలని అధికారులకు సూచించారు స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి రైతు మేలు కోరుతూ రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అన్నిరంగాల్లో వికారాబాద్‌తో పాటు తాండూరు అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి హరిచందన, ఇంజనీర్ ఇన్ చీఫ్ మోహన్‌నాయక్, ఎస్ఈ వసంత నాయక్, ఇన్‌చార్జి ఇఇ శ్రీధర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



తక్షణమే నిజాంషుగర్స్‌కు నిధులు విడుదల చేయాలి

- యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చేపట్టాలి : సీపీఐ(ఎం) నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు

నవతెలంగాణ-బోధన్

నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని నిజాంషుగర్ ఫ్యాక్టరీని తెరిపించడానికి ప్రభుత్వం తక్షణమే కావాల్సిన నిధులు విడుదల చేసి యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ(ఎం) బృందం నిజాంషుగర్ ఫ్యాక్టరీని సందర్శించారు. అనంతరం నాయకులు ఫ్యాక్టరీ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిజాంషుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని అసెంబ్లీలో ప్రకటించినందున.. ముందుగా ఫ్యాక్టరీ పునరుద్ధరణకు, యంత్రాల మరమ్మతుకు నిధులు కేటాయించాలని కోరారు. చాలా సంవత్సరాలుగా మూతపడి ఉండటంతో యంత్రాలు తుప్పు పట్టి పనికిరాకుండా పోయాయని చెప్పారు. వాటిని మరమ్మతు చేస్తేగానీ ఫ్యాక్టరీ తెరుచుకునే అవకాశం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే, కార్మికులను నియమించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో పనిచేసిన కార్మికులకు గత ప్రభుత్వం ఎనిమిది సంవత్సరాలుగా వేతనాలు ఇవ్వలేదని, వాటిని తక్షణమే మంజూరు చేయాలని కోరారు. వేతనాలు లేక.. ఆర్థిక ఇబ్బందుల్లో కార్మికులు మనోవేదనకు గురై అనారోగ్యంతో చనిపోయిన ఆ కుటుంబాలను ఆదుకోవాలన్నారు. చెరుకు బండ్లు, ట్రాక్టర్లు నిలుపుకోవడానికి ప్రస్తుతం స్థలం లేనందున దానిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్యాక్టరీ స్థలాలను గత ప్రభుత్వంలో ప్రయివేట్ వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసినట్టు ఉందన్నారు. గత ప్రభుత్వం లాగా మాయమాటలు చెప్పి ప్రజలను మోసగించొద్దన్నారు. ప్రభుత్వంపై ప్రజలకు పూర్తి విశ్వాసం కలగాలంటే తక్షణమే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు ఏశాల గంగాధర్, శంకర్‌గౌడ్, గంగాధరప్ప, వెంకటేష్, నన్నేసాబ్, కుమారస్వామి ఉన్నారు.

వక్ఫ్ చట్టానికి తూట్లు పొడిచేందుకు బీజేపీ కుట్ర

ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్

నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

వక్ఫ్ బోర్డుకున్న పరిమిత అధికారాలను కూడా కుదించడానికి బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం యత్నించటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్ తెలిపారు. వక్ఫ్ భూములను కబ్జా చేయడానికి ఆ పార్టీ కుట్ర చేస్తున్నట్టు కనిపిస్తున్నదనీ, ఆ చర్యలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అయన ఒక ప్రకటన విడుదల చేశారు. 1995 వక్ఫ్ చట్టం ప్రకారమే వక్ఫ్ బోర్డుకు అధికారాలున్నాయనీ, అవి కూడా అరకొరగానే ఉండటం వల్ల లక్షలాది ఎకరాల వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో 77 వేల ఎకరాల వక్ఫ్ భూములుంటే అందులో 55వేల ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయనీ, దీనిని బట్టే ఆ బోర్డుకు అధికారాలు ఎంత బలహీనంగా ఉన్నాయో అర్థమవుతున్నదని తెలిపారు. వక్ఫ్ బోర్డుకు, దేవాదాయ బోర్డు తరహాలో జ్యూడిషియల్ అధికారాలు కూడా లేవని పేర్కొన్నారు. వక్ఫ్‌బోర్డుకు అపరిమిత అధికారాలున్నాయని బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తున్నదని విమర్శించారు. తమ పేరిట ఉన్న ఆస్తిని ఎవరైనా స్వచ్ఛందంగా వక్ఫ్ చేస్తేనే దానిని రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ చేసి చట్టబద్ధత కల్పిస్తుందని తెలిపారు.

నవతెలంగాణ

తెలంగాణలో ఉప ఎన్నికలు ఖాయం

- పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ప్రజాక్షేత్రంలో బుద్ధి చెప్తాం
- త్వరలోనే సుప్రీంకోర్టులో కేసు వేస్తాం : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో ఉప ఎన్నికలు తప్పవని, పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ప్రజాక్షేత్రంలోనే బుద్ధి చెప్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. ఒకవైపు జాతీయ స్థాయిలో పార్టీ ఫిరాయింపుల పైన సుద్దపూస ముచ్చట్లు చెబుతూ తెలంగాణ రాష్ట్రంలో రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నదని మండిపడ్డారు. త్వరలోనే కోర్టుల సహాయంతో కాంగ్రెస్‌కు సరైన గుణపాఠం చెబుతామన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న కేటీఆర్ సోమవారం సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్లు, న్యాయనిపుణులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నుంచి ఫిరాయించిన ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు ను ఆశ్రయించే అంశంపై వారితో సుదీర్ఘంగా చర్చించారు. ఈ భేటీలో బీఆర్ఎస్ రాజ్య సభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీమంత్రులు హరీశ్ రావు, జగదీశ్ రెడ్డి, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది సి.ఆర్యమా సుందరం, మోహిత్‌రావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల విషయంలో అనర్హత వేటుపై స్పీకరు నిర్ణయం తీసుకోకుండా ఎక్కువ రోజులు నాన్చలేరని రాజ్యాంగ నిపుణులు చెప్పారట్ సి.ఆర్యమా సుందరం కేటీఆర్‌కు వివరించారు. మణిపూర్‌లో ఫిరాయింపులకు పాల్పడ్డ ఎమ్మెల్యే సహా సుప్రీం కోర్టు పలు తీర్పులు ఇచ్చిందన్నారు. అనంతరం ఇదే రీతిలో రాష్ట్రంలో పార్టీ మారిన ముగ్గురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటుకు సంబంధించి హైకోర్టు ను ఆశ్రయించినట్టు కేటీఆర్ న్యాయ నిపుణులకు వివరించారు. అలాగే ఫిరాయించిన ఎమ్మెల్యేల పైన స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన విషయాన్ని అడ్వకేట్లతో చర్చించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై న్యాయపోరాటం చేస్తున్నట్టు సమావేశం అనంతరం కేటీఆర్ ఒక ప్రకటన రిలీజ్ చేశారు. వారిపై అనర్హత వేటు వేసే వరకూ తమ పోరాటం ఆగదన్నారు. ఈ వ్యవహారంపై కొద్దిరోజుల్లో సుప్రీం కోర్టును ఆశ్రయిస్తున్నట్టు తెలిపారు. సుప్రీంను ఆశ్రయించిన నెల రోజుల్లో అనర్హత వేటుపై స్పష్టత వస్తుందన్నారు. స్పష్టత వచ్చిన తర్వాత ఫిరాయింపులకు పాల్పడ్డ పది మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు తప్పవని ధీమా వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు నుంచి అనర్హతపై స్పష్టత వచ్చాక రాష్ట్రంలోని పది నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరగడం ఖాయం అంటూ స్పష్టం చేశారు.

బీఎస్ఎన్ఎల్ దూకుడు

- ప్రయివేటు టెల్కోలకు టారీఫ్ సెగ
- కొత్తగా 27.5 లక్షల ఖాతాదారుల జోడింపు



న్యూఢిల్లీ : ప్రయివేటు టెల్కోలు భారీగా టారీఫ్‌లను పెంచడంతో లక్షలాది మంది ఖాతాదారులు బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌ను ఎంచుకుంటున్నారు. జులై తొలి వారంలో రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా కంపెనీలు తమ ఖాతాదారులపై ఏకంగా 25 శాతం మేర చార్జీలను పెంచాయి. దీంతో వినియోగదారులపై భారం పెరిగడంతో చౌక ధరల్లో మెరుగైన ప్లాన్లను అందిస్తున్న ప్రభుత్వ టెల్కో బీఎస్ఎన్ఎల్‌కు మొబైల్ నెంబర్ పోర్టబిలిటీ (ఎంఎన్‌పీ) పెట్టుకుంటున్నారు. ధరల భారాన్ని తగ్గించుకోవడానికి 27.5 లక్షల మంది ఖాతాదారులు బీఎస్ఎన్ఎల్‌లో చేరారు."ప్రభుత్వ టెల్కో బీఎస్ఎన్ఎల్ చందాదారుల సంఖ్య పెరుగుతోంది. 4జీ నెట్‌వర్క్‌ను కూడా విస్తరిస్తున్నాం. 5జీ సేవలకు మారడానికి కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నాము. మొత్తం మీద 2025 నాటికి 4జీ నెట్‌వర్క్‌కు చెందిన లక్ష టవర్లు ఇన్‌స్టాల్ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది." అని ఐటీ, టెలికం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. 4జీ టవర్ల ఏర్పాటు కోసం తేజస్ నెట్‌వర్క్, సి డాట్, టీసీఎస్ తదితర సంస్థలతో బీఎస్ఎన్ఎల్ ఒప్పందం కుదుర్చుకుని పని చేస్తోంది. 2024 అక్టోబర్ నాటికి 80000 టవర్లు, వచ్చే ఏడాది మార్చి నాటికి 21000 టవర్లను ఇన్‌స్టాల్ చేయాలని నిర్దేశించుకుంది. ఇతర టెలికం కంపెనీల నుంచి బీఎస్ఎన్ఎల్‌లోకి పెద్ద సంఖ్యలో వస్తున్నారని మంత్రి సింధియా తెలిపారు.

బంగారం చోరీ నిందితుని అరెస్ట్

- 2.955 కిలోల ఆభరణాలు రికవరీ
- వాహన తనిఖీల్లో పట్టుబడిన నిందితుడు
- పరారీలో ముగ్గురు
- గత నెల ఓ దాబా వద్ద ట్రావెల్స్ బస్సులో ఆభరణాల బ్యాగు చోరీ : వివరాలు వెల్లడించిన ఎస్పీ రూపేష్



నవతెలంగాణ-జహీరాబాద్

ఓ దాబా వద్ద ఆగిఉన్న ట్రావెల్స్ బస్సులో నుంచి 2.955 కిలోల బంగారం ఆభరణాలను ఎత్తుకెళ్లిన దుండగులను పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి బంగారు ఆభరణాలతోపాటు కారును స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను జహీరాబాద్ సబ్-డివిజన్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ సోమవారం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..గత నెల 26వ తేదీన సంగారెడ్డి జిల్లా చిరాగ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కోహినూర్ దాబా వద్ద భోజనం కోసం ఆరెంజ్ ట్రావెల్స్ బస్సు ఆగింది. ఆ సమయంలో బస్సులో నుంచి 2.955 కిలోల బంగారం ఆభరణాలను దుండగులు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. జహీరాబాద్ డీఎస్పీ రామ్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దుండగుల కోసం విస్తృతంగా గాలించారు. ఆదివారం రాత్రి జహీరాబాద్ డీఎస్పీ రామ్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సీఐ బి.శివలింగం, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ మల్లేశం, సీసీఎస్ ఎస్ఐ శ్రీకాంత్, చిరాగ్‌పల్లి ఎస్ఐ కె.రాజేందర్ రెడ్డి, జహీరాబాద్ రూరల్ ఎస్ఐ ప్రసాద్‌రావు, హద్నూర్ ఎస్ఐ రామానాయుడు, పలువురు సిబ్బందితో కలిసి జాతీయ రహదారి 65 రోడ్డు బూర్దిపాడ్ చౌరస్తా వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో మారుతి బ్రీజా కారు అతివేగంగా రావడంతో ఆపి తనిఖీ చేశారు. కారులో ఉన్న నలుగురు వ్యక్తులు కిందికి దిగి పారిపోయే ప్రయత్నం చేశారు. దాంతో అందులో నుంచి ఒక వ్యక్తిని పోలీసులు పట్టుకుని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని కీర్వజాగీర్ గ్రామానికి చెందిన మాసూమ్ ముస్తాక్‌ఖాన్‌గా గుర్తించారు. అతను, పారిపోయిన ముగ్గురు అష్రాఫ్, ఫెరోజ్, సాజిద్ కలిసి దాబాల వద్ద ఆగి ఉన్న ట్రావెల్స్ బస్సుల్లో దొంగతనాలు చేస్తున్నట్టు నిందితుడు చెప్పాడు. గత నెలలో కోహినూర్ దాబా వద్ద కూడా బస్సులో నుంచి బంగారం ఆభరణాలు ఎత్తుకెళ్లినట్టు చెప్పడంతో పాటు.. కారులోని ఓ బ్యాగులో ఉన్న 2.955 కిలోల ఆభరణాలను పోలీసులకు చూయించాడు. ఆదివారం జహీరాబాద్ ప్రాంతంలో ఓ పెద్ద దొంగతనం చేసి.. మొత్తం బంగారాన్ని హైదరాబాద్‌లో విక్రయించడానికి ప్లాన్ వేసినట్టు చెప్పాడు. ఈ క్రమంలో పోలీసులకు పట్టుబడ్డారు. కాగా, నిందితున్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు, బంగారం ఆభరణాలు, బ్రీజా కారును స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో కీలకంగా పనిచేసిన ప్రతి ఒక్కరినీ ఎస్పీ అభినందించి.. రివార్డ్ అందజేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవరావ్ తదితరులు పాల్గొన్నారు.

సైన్యం చేతుల్లోకి బంగ్లాదేశ్

ఢాకా : అంతకుముందు హసీనా రాజీనామా డిమాండ్ చేస్తూ, లాంగ్ మార్చ్ టు ఢాకా పేరుతో ఆందోళనకారులు ప్రదర్శన చేపట్టారు. వారిపై పోలీసులు జరిపిన కాల్పుల్లో ఆరుగురు మరణించారు. రిజర్వేషన్ వ్యవస్థపై నిరసన వ్యక్తం చేస్తూ స్టూడెంట్స్ అగైనెస్ట్ డిస్క్రిమినేషన్ బ్యానర్‌పై విద్యార్థి లోకం ప్రారంభించిన ఆందోళనలు, నిరసనలు, క్రమేపీ ప్రజా ఉద్యమంగా రూపుదాల్చింది.
నిరసనలు,ఆందోళనలను అణచివేసే లక్ష్యంతో ప్రభుత్వం మొత్తంగా ఇంటర్‌నెట్ సహా సామాజిక మాధ్యమాలపై ఆంక్షలు విధించింది. గత నెల్లో ప్రారంభమైన ఈ ఆందోళనల్లో ఇప్పటివరకు 300మంది వరకు మరణించారు. ఆదివారం నాటి ఘర్షణల్లోనే 94మంది చనిపోయారు. బంగ్లాదేశ్ ప్రధాని నివాసంలోకి చొచ్చుకు వెళ్లి విధ్వంసం సృష్టించిన కొంతమంది దుండగులు హెూం మంత్రి నివాసంపై కూడా దాడి చేశారు. ధనమండిలో అవామీ లీగ్ పార్టీ కార్యాలయానికి నిప్పు పెట్టారు.

అధిక నిరుద్యోగం, అవినీతి వంటి సమస్యలతో ఇప్పటికే అతలాకుతలమవుతున్న బంగ్లాదేశ్‌లో తాజా అనూహ్య పరిణామాలు మరింత అస్థిరతను కలగచేసే ప్రమాదం పొంచి వుంది. తన సోదరితో కలిసి హసీనా మిలటరీ హెలికాప్టర్‌లో కూర్చున్న దృశ్యాలు టివిలో ప్రసారమయ్యాయి. బంగ్లా మిలటరీ చీఫ్ జనరల్ వాకర్ ఉజ్ జమాన్ మాట్లాడుతూ, తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటుపై దేశాధ్యక్షుడి సూచనలు కోరనున్నట్లు చెప్పారు. మిలటరీ ప్రస్తుతం పరిస్థితులను చేతుల్లోకి తీసుకుందని బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ ప్రకటించారు. ఆ వెంటనే స్టూడెంట్స్ అగైనెస్ట్ డిస్క్రిమినేషన్ స్పందిస్తూ, ఆందోళన చేస్తున్న విద్యార్థులు, పౌరులతో చర్చలు జరిపిన తర్వాతనే అధికారం బదలాయింపు జరగాలని స్పష్టం చేసింది. ఈ మేరకు గ్రూపు కో ఆర్డినేటర్ నహిద్ ఇస్లామ్ ఒక ప్రకటన జారీ చేశారు.



తమకు కావాల్సింది హసీనా రాజీనామా మాత్రమే కాదని, ఫాసిస్ట్ పాలనను అంతమొందించాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య రాజకీయ వాతావరణం నెలకొనాలని ఆకాంక్షించారు. దేశంలో రాజకీయ పార్టీలన్నీ ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని నెలకొల్పాల్సిన అవసరం వుందని ప్రముఖ రచయిత్రి తస్లీమా నస్రీన్ వ్యాఖ్యానించారు. ప్రధాని షేక్ హసీనా పతనానికి ఆమే కారణమని విమర్శించారు.

బంగ్లాదేశ్‌లో నెలకొన్న రాజకీయ అనిశ్చితి నేపథ్యంలో బంగ్లాతో రైలు సర్వీసులను భారత్ రద్దు చేసింది. ఢిల్లీలోని బంగ్లాదేశ్ హై కమిషన్ వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు.

ప్రముఖ రచయిత, విద్యావేత్త ప్రొఫెసర్ సాలిముల్లా ఖాన్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడనుందని బంగ్లా రాజకీయ పార్టీ బిఎన్‌పి వర్గాలు తెలిపాయి. ఆర్మీ చీఫ్‌తో సమావేశంలో తమ పార్టీ ప్రతినిధులు కూడా పాల్గొన్నారని చెప్పారు. కాగా బంగ్లా ఆర్మీ చీఫ్ వాకర్ ఉజ్ జమాన్ టివిలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ఆర్మీ తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని చెప్పారు.



జాతీయ ప్రభుత్వ రూపకల్పనలో నిరసనకారులు

బంగ్లాదేశ్‌లో కొత్తగా ఏర్పడనున్న జాతీయ ప్రభుత్వ రూపకల్పనలో యాంటీ డిస్క్రిమినేషన్ స్టూడెంట్స్ మూవ్‌మెంట్ నిర్వాహకులు కూడా పాలు పంచుకోనున్నారు. నిర్వాహకుల్లో ఒకరైన ఆసిఫ్ మహ్మద్ ఈ విషయం వెల్లడించారు. త్వరలోనే విద్యార్థులు, టీచర్ల ప్రతినిధులతో ఆర్మీ చీఫ్ చర్చలు జరుపుతారని ఐఎస్‌పిఆర్ ఒక ప్రకటనలో వెల్లడించింది.

ఢిల్లీలో హసీనా?

బంగ్లాదేశ్ ఎయిర్‌ఫోర్స్‌కి చెందిన రవాణా విమానంలో ఢాకా నుండి బయలుదేరిన హసీనా ఢిల్లీలో ఆగుతారని భావిస్తున్నట్లు భారత పౌర విమానయాన వర్గాలు తెలిపాయి. అయితే ఈ విమానంలోనే భారత్ దాటి వెళతారా లేక ఇక్కడ నుండి వేరే విమానంలో లండన్ వెళతారా అనేది తెలియరాలేదు. ఢిల్లీకి సమీపంలోని హిండర్ ఎయిర్ బేస్‌లో ఆమె దిగుతారని భావిస్తున్నారు.

భారత్‌లో ఆశ్రయం నిరాకరణ

హసీనా భారత్‌లో ఆశ్రయం కల్పించేందుకు ప్రభుత్వం నిరాకరించినట్లు ఎబిపి లైవ్ అనే ఒక న్యూస్ సైట్ పేర్కొంది. ఈ పరిస్థితుల్లో ఆమె యూరప్ వెళ్లే అవకాశం వుందని సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ తెలిపింది.

ఢాకాలోని హజరత్ షాజలాల్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని సాయంత్రం ఆరు గంటల నుండి ఆరు గంటల పాటు మూసివేసి వుంచినట్లు ఐఎస్‌పీఆర్ తెలిపింది. విమానాశ్రయంలోని అన్ని కార్యకలాపాలను నిలిపివేసినట్లు కెప్టెన్ క్రముల్ ఇస్లామ్ తెలిపారు.

హైదరాబాద్‌లో కాగ్నిజెంట్ కొత్త సెంటర్

- 10 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో క్యాంపస్
- దాదాపు 15 వేల మంది యువతకు ఉద్యోగాలు
- అమెరికాలో సీఎంతో కాగ్నిజెంట్ ప్రతినిధుల చర్చలు సఫలం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఐటీ రంగంలో ప్రపంచస్థాయిలో పేరొందిన కాగ్నిజెంట్ కంపెనీ హైదరాబాద్‌లో 15 వేల మంది ఉద్యోగులకు పని కల్పించేలా కొత్త సెంటర్‌ను ఏర్పాటు చేయబోతున్నట్టు ప్రకటించింది. ఇరవై వేల మంది ఉద్యోగులుండేలా పది లక్షల చదరపు అడుగుల స్థలంలో ఈ సెంటర్‌ను స్థాపించనుంది. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కాగ్నిజెంట్ సీఈఓ రవికుమార్, కంపెనీ ప్రతినిధుల బృందం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ..ఐటీ రంగానికి మరింత అనుకూల వాతావరణం కల్పించేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని భరోసానిచ్చారు. కాగ్నిజెంట్ కంపెనీ కొత్త సెంటర్ ఏర్పాటుతో ప్రపంచ టెక్నాలజీ కంపెనీలన్నీ హైదరాబాద్‌ను తమ ప్రధాన గమ్యస్థానంగా ఎంచుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగ్నిజెంట్ కంపెనీకి తమ ప్రభుత్వం తగినంత మద్దతిస్తుందని హామీనిచ్చారు. కొత్త సెంటర్ ఏర్పాటుతో వేలాది మంది యువతకు ఉద్యోగాలతో పాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం ఉంటుందని ఆకాంక్షించారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని టైర్-2 నగరాల్లోనూ ఐటీ సేవలను విస్తరించాలని సూచించారు. దీనికి ఆ కంపెనీ ప్రతినిధులు సానుకూలత వ్యక్తం చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఇప్పటికే ప్రముఖ టెక్ కంపెనీలన్నీ హైదరాబాద్ వైపు చూస్తున్నాయనీ, ఇక్కడ కొత్త కేంద్రాన్ని స్థాపించాలనే కాగ్నిజెంట్ నిర్ణయం హైదరాబాద్ వృద్ధికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగ్నిజెంటర్ సీఈఓ ఎస్.రవికుమార్ మాట్లాడుతూ..టెక్నాలజీ, ఇన్నోవేషన్ హబ్‌గా సత్తా చాటుకుంటున్న హైదరాబాద్‌లో తమ కంపెనీ విస్తరించటం సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్‌లో నెలకొల్పే కొత్త సెంటర్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఐటీ సేవలతో పాటు కన్సల్టింగ్‌లో అత్యాధునిక పరిష్కారాలను అందిస్తుందని హామీనిచ్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజినీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్‌తో సహా వివిధ అధునాతన సాంకేతికతలపై కొత్త కేంద్రం ప్రత్యేకంగా దృష్టి సారిస్తుందని వివరించారు. గతేడాది ముఖ్యమంత్రి బృందం దావోస్ పర్యటన సందర్భంగానే ఈ ఒప్పందానికి పునాదులుపడ్డాయని చెప్పారు.

మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై..

కేసీఆర్‌కు కోర్టు నోటీసులు

నవతెలంగాణ-భూపాలపల్లి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం(కాళేశ్వరం) మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సహా మొత్తం ఎనిమిది మందికి భూపాలపల్లి ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు జడ్జి నోటీసులు జారీ చేశారు. జిల్లా కేంద్రానికి చెందిన నాగవెల్లి రాజలింగమూర్తి అనే వ్యక్తి దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌ను స్వీకరించిన కోర్టు సెప్టెంబరు 5న విచారణ జరపనున్నట్టు పేర్కొంది. విచారణకు రావాల్సిందిగా వారందరికీ నోటీసులు జారీ చేసింది. గతంలో భూపాలపల్లి ఫస్ట్ క్లాస్ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణ అనంతరం రివిజన్ పిటిషన్ దాఖలు చేయడంతో ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి విచారణ జరపనున్నారు. మేడిగడ్డ కుంగుబాటుపై గతేడాది అక్టోబరు 25న స్థానిక పోలీసు స్టేషన్‌లో, ఆ తర్వాత జిల్లా ఎస్పీకి, డీజీపీకి కూడా ఫిర్యాదు చేశానని, ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడంతోపాటు ఎలాంటి చర్యలూ తీసుకోనందున కోర్టును ఆశ్రయించానని నాగవెల్లి రాజలింగమూర్తి రివిజన్ పిటిషన్‌లో పేర్కొన్నారు. తొలుత వేసిన పిటిషన్ ఫస్ట్ క్లాస్ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కొట్టివేసిందని, దానికి కారణాలను కూడా తెలపలేదని, విధిలేని పరిస్థితుల్లో హైకోర్టును ఆశ్రయించానని, ఆ తర్వాత రివిజన్ పిటీషను జిల్లా కోర్టులో దాఖలు చేయాల్సిందిగా సూచించడంతో చేశానని తెలిపారు. బ్యారేజ్ ఏడో బ్లాకులో పిల్లర్ భూమిలోకి కుంగిపోవడం, పెద్ద శబ్దంతో ఒక పిల్లర్‌కు పగుళ్లు రావడంతో అసిస్టెంట్ ఇంజినీర్ స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారని, తీవ్రవాద శక్తుల ప్రమేయం ఉన్నదనే అనుమానాన్ని వ్యక్తం చేశారని పేర్కొన్నారు. పోలీసులు కూడా ఐపీలోని సెక్షన్ 427 ప్రకారం ఎఫ్ఆర్ (నెం.174/2023) నమోదు చేశారని, మరుసటి రోజే దాన్ని క్లోజ్ చేశారని పిటిషనర్ గుర్తుచేశారు.

ప్రధాన ఆరోపణలు

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు 8 మంది ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని పెంచి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, అంతులేని అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని పిటిషనర్ ఆరోపించారు.

మేడిగడ్డ నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక, మెకానికల్ వివరాలను డ్యామ్ సేఫ్టీ అథారిటీ కోరినా నాటి రాష్ట్ర ప్రభుత్వం కీలకమైన డాక్యుమెంట్లను ఇవ్వకుండా, లోపాలను దాచిపెట్టే ప్రయత్నం చేసిందని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ నిపుణుల బృందం అధ్యయనం చేసి కేంద్రానికి సమర్పించిన రిపోర్టులో ఏడో బ్లాకులోని ఒక పిల్లర్‌కు పగుళ్లు వచ్చి భూమిలోకి కుంగిపోయిందని, ఈ కారణంగా ఆ బ్లాకులోని మొత్తం పిల్లర్లను తొలగించి వీలైనంత తొందరగా కొత్త నిర్మాణం చేపట్టాలని, లేదంటే మొత్తం ప్రాజెక్టుకే ప్రమాదం ఉంటుందని వివరించిందని గుర్తుచేశారు.

వారిపైనే ఫిర్యాదు..

మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో కేసీఆర్, హరీశ్‌రావు, నాటి ఇరిగేషన్ సెక్రటరీ రజత్ కుమార్, నాటి సీఎంఓ కార్యదర్శి స్మితా సబర్వాల్, నాటి చీఫ్ ఇంజినీర్లు హరిరామ్, శ్రీధర్, నిర్మాణ బాధ్యతలు తీసుకున్న మేఘా సంస్థ యజమాని కృష్ణారెడ్డి, మరో నిర్మాణ సంస్థ (ఎల్ అండ్ టీ) జనరల్ మేనేజర్ సురేశ్ కుమార్ భాగ స్వాములుగా ఉన్నారని, వీరిపై అభియోగాలు మోపి విచారణ చేపట్టాలని పిటీషనర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

కేసీఆర్ సహా ఎనిమిది మందిపై ఐపీసీ 1200, 420, 386, 406, 409 సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని, సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులను చట్టపరంగా శిక్షించేలా ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిందిగా స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌ను ఆదేశించాలని కోరారు. ఈ నేపథ్యంలో తాజాగా జిల్లా కోర్టు వీరందరినీ సెప్టెంబరు 5న తనముందు హాజరు కావాలంటూ నోటీసులు జారీ చేసింది.

మా గ్రామాలను పక్క జిల్లాలో కలపొద్దు

- అంకుషాపూర్, ఔషపూర్, మధరం ప్రజల ఆందోళన
- మేడ్చల్ జిల్లాలోనే కొనసాగించాలని డిమాండ్



నవతెలంగాణ - ఘట్కేసర్ రూరల్

'గ్రామాల అభివృద్ధి అంటే పక్క జిల్లాలో కలపడమా.. మా గ్రామాలను యథాతథంగా మేడ్చల్ జిల్లాలోనే కొనసాగించాలి' అంటూ సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ మండలంలోని అంకుషాపూర్, ఔషాపూర్, మధరం గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. మూడు గ్రామాలను యాదాద్రి జిల్లాలో కలుపుతున్నారని వస్తున్న వార్తల నేపథ్యంలో అంకుషాపూర్‌లో నిర్వహించిన స్వచ్ఛదనం- పచ్చదనం అవగాహన ర్యాలీని మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కరుణాకర్‌తో కలిసి గ్రామస్తులు బహిష్కరించారు.మూడు గ్రామాల ప్రజల సమక్షంలో సంతకాల సేకరణ చేపట్టి జిల్లా అధికారులకు అందజేశారు. అలాగే మూడు గ్రామాల అఖిలపక్ష నాయకులు తమ గ్రామాలను యాదాద్రి జిల్లాలో కలపొద్దని, ఔటర్ రింగ్ రోడ్డు బయట ఉన్న ఆరు గ్రామాలను మండలంగా కొనసాగించాలి లేదా మున్సిపల్‌గా చేయాలని డిమాండ్ చేశారు.

అలా వీలుకాని పక్షంలో ఘట్కేసర్ మున్సి పల్‌లోనైనా కలపాలని కోరుతూ ఎమ్మెల్యే మల్లారెడ్డికి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్‌కు, జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి వినతిపత్రాలు అందజేశారు. అందరూ సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ.. మూడు గ్రామాలను పక్క జిల్లాలో కలుపుతున్నారని ప్రజలు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో గ్రామాల్లో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం నిర్వహించడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాలను అభివృద్ధి చేయాలిగానీ పక్క జిల్లాలో కలిపి అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదన్నారు. మూడు గ్రామాల విలీనం ఆపకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

వీ-హబ్‌లో భారీ పెట్టుబడులు

- రూ.42 కోట్ల పెట్టుబడులకు వాల్ష్‌కర్రా హెూల్డింగ్స్ ఒప్పందం
- వచ్చే ఐదేండ్లలో స్టార్టప్‌ల్లో మరో రూ.839 కోట్ల పెట్టుబడి : సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఒప్పందం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అమెరికాకు చెందిన వాల్ష్ కర్రా హెూల్డింగ్స్ సంస్థ రాష్ట్రంలోని వీ-హబ్‌లో రూ.42 కోట్ల (ఐదు మిలియన్ డాలర్లు) పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. అలాగే వచ్చే ఐదేండ్లలో రాష్ట్రంలో నెలకొల్పే స్టార్టప్‌ల్లో దాదాపు రూ.839 కోట్ల (వంద మిలియన్ డాలర్ల) పెట్టుబడి పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించింది. ఈ మేరకు అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బృందం సమక్షంలో వాల్ష్‌కర్రా కంపెనీకి చెందిన ఫణి కర్రా, గ్రెగ్ వాల్ష్, వీ హబ్ సీఈవో సీతా పల్లచోళ్ల పరస్పరం ఒప్పందం పత్రాలపై సంతకాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు వీ-హబ్ ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వాల్ష్ కర్రా ప్రతినిధులను సీఎం అభినందించారు. వాల్ష్ కర్రా హెూల్డింగ్స్ కంపెనీ అమెరికా, సింగపూర్ నుంచి పని చేస్తుంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సహకారంతో పెట్టుబడిదారులు గ్రెగ్ వాల్ష్, ఫణి కర్రా దీన్ని నిర్వహిస్తున్నారు. రాబోయే శతాబ్దానికి సుస్థిరమైన ఆర్థిక వ్యవస్థను రూపొందించేందుకు అవసరమైన పెట్టుబడి అవకాశాలను వృద్ధి చేయాలనేది కంపెనీ లక్ష్యం. కొత్త ఆవిష్కరణలు, స్థిరత్వంతో పాటు లాభదాయకమైన సంస్థలకు ఈ కంపెనీ మద్దతు ఇస్తుంది. వీటిలో పెట్టుబడులు పెట్టి కార్యకలాపాల విస్తరణతో పాటు స్థిరమైన భవిష్యత్తు నిర్మించేందుకు సహకరిస్తుంది. ఈ సందర్భంగా గ్రెగ్ వాల్ష్ మాట్లాడుతూ పట్టణాలతో పాటు గ్రామీణ తెలంగాణలోనూ ప్రభుత్వంతో కలిసి వివిధ కార్యకలాపాలు చేపట్టి, నమ్మకమైన భాగస్వామ్యం పంచుకుంటామని తెలిపారు. ఫణి కర్రా మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి కెరీర్ ప్రారంభించి అంతర్జాతీయ స్థాయికి చేరగలిగానన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలకు అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్‌లు రూపొందించడానికి ఈ పెట్టుబడులు ఉపయోగపడుతాయని వీ హబ్ సీఈవో సీతా పల్లచోళ్ల తెలిపారు.

సర్కారు బడిపిల్లలకు 8న ప్రతిభా పురస్కారాలు

- అందజేయనున్న మంత్రి సీతక్క : తెలంగాణ బాలోత్సవం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సర్కారు పాఠశాలల్లో చదువుతూ ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల ఎనిమిదో తేదీన ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్టు తెలంగాణ బాలోత్సవం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, అధ్యక్షులు నల్లవు సోమయ్య, ఉపాధ్యక్షులు కె.సుజావతి చెప్పారు. ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క) పాల్గొంటారని తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆజామాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ఆ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరింజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల ప్రతిభా పాటవాలను వెలికి తీయడానికి తెలంగాణ బాలోత్సవం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని చెప్పారు. అందులో భాగంతో ప్రభుత్వ పాఠశాల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన వారికి ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్నామని చెప్పారు. 10/10 గ్రేడింగ్ సాధించిన 1000 మంది విద్యార్థులకు వాటిని ఇవ్వనున్నట్టు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న అలాంటి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే ఉన్నతస్థాయికి ఎదుగుతారన్నారు. విద్యారంగం ప్రభుత్వ రంగంలోనే ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. పురస్కారాల అందజేత కార్యక్రమంలో మంత్రి సీతక్కతో పాటు స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఇ.వి.నరసింహారెడ్డి, సినీ రచయిత సుద్దాల అశోక్ తేజ, ప్రముఖ రచయిత ఆకెళ్ల రాఘవేంద్ర, తదితరులు హాజరవుతారని తెలిపారు.

కాళేశ్వరాన్ని బద్నాం చేసే చిల్లర ఆలోచన

- కాంగ్రెస్ కుట్రంలో భాగంగా సుందిళ్ల, అన్నారం ఖాళీ
- ఎన్డీఎస్ఏ నుంచి అనుమతి తీసుకోలేదు : బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వానిది కాళేశ్వరం ను బద్నాం చేసే చిల్లర ఆలోచన అని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. ఈ కుట్రలో భాగంగా గత యాసంగిలో నీళ్లు కనిపించినా, ఇవ్వకపోతే రైతుల్లో బద్నాం అవుతామని రాష్ట్ర ప్రభుత్వం ఖాళీ చేసిందని ఆరోపించారు. అంతేకానీ అన్నారం, సుందిళ్ల బ్యారెజ్‌లు తెగిపోయినవి కాదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కు ఏమో అయిందని, రైతుల్ని మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. రాజకీయ దురుద్దేశంతో కరువుకు గురిచేస్తూ లక్షలాది ఎకరాల్ని ఎండబెడుతున్నారని ఫైర్ అయ్యారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాళేశ్వరం పంపులను వెంటనే ప్రారంభించాలి డిమాండ్ చేశారు. సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, కొత్త ప్రభాకర్ రెడ్డిలు మీడియాతో మాట్లాడారు. నేషనల్ డ్యాం సెఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ) రాష్ట్ర ప్రభుత్వానికి చెప్పడానికి లేదని జగదీశ్ రెడ్డి అన్నారు. సూచించిన పద్ధతుల్లో గతంలో గ్రౌండింగ్ పూర్తి చేశామని, అన్ని పరీక్షలు పూర్తి అయ్యాయని, వచ్చి ప్రాజెక్ట్ ను సమీక్షించి అనుమతతులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయాలన్నారు. కానీ ఇప్పటి వరకు ఎన్‌డీఎస్ఎకు లేఖ రాయలేదని, అనుమతులు పొందలేదని ఆరోపించారు. కానీ సుందిళ్ల, అన్నారం బ్యారేజీలపై బీఆర్ఎస్‌ను బద్నాం చేసేందుకు ఎన్డీఎస్ఏ చెప్పలేదని ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందని దుయ్యబట్టారు. గోదావరి, కృష్ణ నుంచి లక్షలాది క్యూసెక్కుల నీళ్లు సముద్రం పాలవుతున్నాయని మండిపడ్డారు. ఈ నీటిని ఎత్తి తెలంగాణలోని ప్రాజెక్ట్ లు, వాగులు, కుంటలు నింపుకోవడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు.

కాళేశ్వరం ప్రాజెక్ట్ వృధా అని, ఎస్ఆర్ఎస్పీ సూర్యాపేటకు నీళ్లు ఇవ్వొచ్చని ఆనాడు కాంగ్రెస్ నేతలు ఊదరగొట్టారన్నారు. మరి ఎందుకు నీళ్లు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఎప్పటికైనా ఎస్ఆర్ఎస్పీ 2 ని బతికించేది కాళేశ్వరం ప్రాజెక్టనే తప్ప మరొకటి కాదన్నారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వర్షాభావం లేక కరువు పరిస్థితులు కనిపిస్తున్నాయని చెప్పారు. ఎల్లంపల్లి నుంచి మాత్రమే నీటిని ఇస్తామంటే సాధ్యంకాదని, ఏనాటికైనా కాళేశ్వరం నీళ్లు మాత్రమే రావాలని అన్నారు. అందువల్ల వెంటనే నాగర్జున సాగర్ ఎడమకాలువ, శ్రీశైలం పైన్న ఉన్న అన్ని ఎత్తిపోతల, జూరాల కాలువలను 100 శాతం కిందికి వదలాలని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎస్ఆర్ఎస్పీలో ప్రస్తుతం 50 టీఎంసీల నీళ్లు చేరాయని, ఇక్కడి నుంచి తక్షణమే ఎల్ఎండీకి 25 లిఫ్ట్ చేయాలని మాజీ మంత్రి గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. గత ఆగస్టులో 3.73 లక్షల ఎకరాలకు బీఆర్ఎస్ సర్కార్ నీటిని అందించిందని మెదక్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చెప్పారు. కానీ ఈ సారి కేవలం 1.25 లక్షల ఎకరాలకు మాత్రమే రైతులు నాట్లు వేసారన్నారన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ అడుగు జాడల్లోనే రాష్ట్ర సాధన

- మాజీ సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రొఫెసర్ జయశంకర్ అడుగు జాడల్లోనే రాష్ట్రాన్ని సాధించినట్టు మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన సేవలను కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ, స్వరాష్ట్ర ప్రగతిలోనూ జయశంకర్ అందించిన స్ఫూర్తిని కొనసాగించినట్టు తెలిపారు. సబ్బండ వర్గాల సమున్నతే లక్ష్యంగా సాగిన పదేండ్ల ప్రగతి ప్రస్థానాన్ని కొనసాగించడమే ప్రొఫెసర్ జయశంకర్‌కు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. తొలిదశ నుంచి మలి దశ ఉద్యమం వరకు తెలంగాణ సాధన దిశగా జయశంకర్ చేసిన భావజాల వ్యాప్తి, దశాబ్దాలపాటు ఉద్యమంలో ఆయన అందించిన అచంచల పోరాట స్ఫూర్తి అజరామరమైనదని కేసీఆర్ కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో తాను మలిదశ తెలంగాణ ఉద్యమానికి సారథ్యం వహించి, చివరి వరకు శాంతియుత పద్ధతిలో, పార్లమెంటరీ పంథాలో ప్రజా ఉద్యమాన్ని కొనసాగించి, అరవై ఏండ్ల స్వయంపాలన ఆకాంక్షను నిజం చేసుకున్నామని కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. రాష్ట్ర సాధన అనంతరం ప్రజల మద్దతుతో స్వరాష్ట్రంలో ప్రారంభమైన మొట్టమొదటి ప్రభుత్వాన్ని ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తితోనే కొనసాగించామని తెలిపారు. పదేండ్ల అనతికాలంలోనే దేశానికే ఆదర్శవంతమైన పాలన అందించడంలోనూ ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తి ఇమిడి ఉందని కేసీఆర్ తెలిపారు. స్వరాష్ట్రంలో సబ్బండ వర్గాలను, సకల జనులను అన్ని రంగాల్లో ముందంజలో నిలిపిన బీఆర్ఎస్ పాలన అందించిన స్ఫూర్తిని కొనసాగిస్తూ, తెలంగాణను మరింతగా ప్రగతి పథంలో నడిపేలా కృషి చేయడమే వారికందించే ఘన నివాళి అని కేసీఆర్ పేర్కొన్నారు.

సీఐను సస్పెండ్ చేస్తే సరిపోదు

- శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి : మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

షాద్‌నగర్ ఘటనలో సీఐని సస్పెండ్ చేసినంత మాత్రాన దళిత మహిళకు న్యాయం జరగదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత వి.శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో నేరాల రేటు తొమ్మిది శాతం పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. నేరాల రేటు ఇలా పెరిగితే రాష్ట్రానికి పెట్టుబడులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. హోంశాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రికి సమయం లేకపోతే ఆ శాఖను ఇతరులకు అప్పగించాలని సూచించారు. హైదరాబాద్, రాష్ట్రం ప్రతిష్ట దెబ్బతిని, శాంతిభద్రతలకు విఘాతం కలిగి, పెట్టుబడులు రాని పరిస్థితి వచ్చాక చేసేది ఏముండదని హెచ్చరించారు. మహిళలపై దాడులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటే భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగవని సూచించారు.

రైతులకు కాంగ్రెస్ పై భ్రమల్లేవు

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్‌పై రైతులు పెట్టుకున్న భ్రమలు తొలగిపోయాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు కేవలం 11.20 లక్షల మందికి రూ.6 వేల కోట్లు మాత్రమే మాఫీ చేసిందని తెలిపారు. రాష్ట్రంలో 60 లక్షల మంది రైతులు రుణాలు తీసుకున్నారని చెప్పారు. రాష్ట్రంలో రూ.లక్ష వరకు రుణం తీసుకున్న రైతుల సంఖ్య 40 నుండి 45 లక్షల మంది వరకు ఉంటారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు విడతల్లో చేసిన రుణమాఫీ లబ్ధి పొందిన రైతుల సంఖ్య 17 లక్షల పైచిలుకు మాత్రమేనని చెప్పారు. .. రైతుల సంఖ్య తగ్గిపోవడంలో అంతర్యం ఏమిటి? అని ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యే కె.పి.వివేకానంద మాట్లాడుతూ తాను ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గంలో 632 మంది రుణాలు తీసుకుంటే 14 మందికి మాత్రమే రుణమాఫీ చేశారని తెలిపారు.

దళిత మహిళపై ఇంత దాష్టీకమా?

- పోలీసుల తీరుపై కేటీఆర్ ఆగ్రహం : ఎక్స్‌లో కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దళిత మహిళపై పోలీసుల దాష్టీకాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. ఈ మేరకు సోమవారం ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. మహిళలపై దౌర్జన్యాలను ఆపాలని డిమాండ్ చేశారు. షాద్‌నగర్ లో దళిత మహిళపై పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత నీచమని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత మహిళకు న్యాయం చేయాలని కోరారు. దళిత వ్యతిరేక.. మహిళా వ్యతిరేక కాంగ్రెస్ సర్కారును తెలంగాణ సమాజం ఎప్పటికీ క్షమించదని హెచ్చరించారు. దళిత మహిళపై ఇంత దాష్టీకమా? ఇదేనా ఇందిరమ్మ పాలన? ఇదేనా ప్రజాపాలన? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఆడబిడ్డలను అవమానిస్తుంటే తామేమీ తక్కువ అన్నట్టు పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యత లేని భోజనం


- కేటీఆర్ ఆగ్రహం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ బడుల్లో నాణ్యత లేని భోజనం పెడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా కొత్తపల్లి స్కూల్‌లో పిల్లలకు కారం మెతుకులతో భోజనం పెట్టడంపై ఆవేదన వెలిబుచ్చారు. ప్రభుత్వ బడుల్లోని పిల్లలకు పౌష్టికాహారం అందించటంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని విమర్శించారు. కొత్తపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో కారం లేని పప్పు వడ్డించారనీ, పిల్లలు తినేందుకు ఇష్టపడకపోవడంతో వాళ్లకు గొడ్డు కారం, నూనె పోసి భోజనం పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలకు ఇలాంటి ఆహారం అందిస్తారా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పిల్లలకు మంచి భోజనం పెట్టకపోగా...కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన బ్రేక్ ఫాస్ట్ స్కీంను కూడా రద్దు చేయడమేంటని ప్రశ్నించారు. పిల్లలకు బడుల్లో పెడుతున్న భోజనం నాణ్యత విషయంలో సమీక్షించాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కేటీఆర్ కోరారు.

భవనంపై నుంచి పడి హెడ్ కానిస్టేబుల్ మృతి

నవతెలంగాణ - కూకట్ పల్లి



పుట్టిన రోజు వేడుకలో ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి హెడ్ కానిస్టేబుల్ మృతిచెందారు. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, సీఐ ముత్తు తెలిపిన వివరాల ప్రకారం.. రాచకొండ కమిషనరేట్ కంట్రోల్ రూమ్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న శేఖర్ తన పుట్టిన రోజు వేడుకల సందర్భంగా దేవినగర్‌లోని స్వగ్రాహానికి స్నేహితులను ఆహ్వానించారు. ఈ వేడుకులకు వచ్చిన 30 మందిలో ఫస్ట్ బెటాలియన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ డేవిడ్(50) కూడా ఉన్నాడు. అయితే డిన్నర్ చేయడానికి కిందకు వస్తుండగా డేవిడ్ మూడో అంతస్తు నుంచి కాలు జారి చెట్టుపైన.. అక్కడి నుంచి కింద పడిపోయాడు. అతనికి తీవ్రగాయాలు కావడంతో వెంటనే స్థానిక ప్రైమ్ ఆస్పత్రికి తరలించారు. తలకు బలమైన గాయం తగలడంతో అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు 194 బీఎన్ఎస్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కూకట్‌పల్లి ఏసీపీ తెలిపారు.

విద్యార్థుల సంఖ్యను బట్టి పాఠశాల సౌకర్యాల నిర్వహణ గ్రాంటు

- బడుల్లో పారిశుధ్య పనుల కోసం నిధుల కేటాయింపు
- 30 మందిలోపుంటే రూ.3 వేలు
- 750 ఆపై ఉంటే రూ.20 వేలు
- ఉత్తర్వులు విడుదల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థలు, మోడల్ స్కూళ్లలో విద్యార్థుల ఆధారంగా పాఠశాల సౌకర్యాల నిర్వహణ గ్రాంటును ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాలల్లో పారిశుధ్యం, పరిశుభ్రత కోసం నిధులు కేటాయించనుంది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీకి స్కూళ్ల నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తున్నట్టు ప్రకటించారు. ప్రతి పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలున్నాయని వివరించారు. గతంలో పాఠశాలల పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, మొక్కలకు నీరు పట్టడం వంటి పనులను గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీరాజ్ శాఖకు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ పరిపాలన శాఖకు అప్పగించిందని పేర్కొన్నారు. ఆ పనులను ఆయా శాఖలు సమర్థవంతంగా నిర్వహించలేకపోయాయని తెలిపారు. పాఠశాలల్లో పారిశుధ్యం నిర్వహణ అత్యంత కీలకమనీ, ప్రభుత్వం ఆలోచించి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు ఆ బాధ్యతను అప్పగించిందని వివరించారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా గ్రాంటు మంజూరు చేస్తామని తెలిపారు. పాఠశాలల్లో పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ, మొక్కలకు నీరు పట్టడం, పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేయాలని కోరారు. పాఠశాలలకు సమగ్ర శిక్ష కేటాయించే నిధులకు అదనంగా ఈ గ్రాంటును కేటాయిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ గ్రాంటును నేరుగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు ప్రతినెలా విడుదల చేస్తున్నట్టు స్పష్టం చేశారు. ఏడాదిలో పది నెలలు ఈ గ్రాంటును చెల్లిస్తామని వివరించారు.

ఎమ్మెల్సీ నర్సిరెడ్డి హర్షం

పాఠశాలలకు నిర్వహణ గ్రాంటును విడుదల చేయడం పట్ల ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి హర్షం ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

టీఎస్‌యూటీఎఫ్ హర్షం

స్కూల్ ఫెసిలిటీ మెయింటెనెన్స్ గ్రాంట్ పేరుతో పాఠశాలల్లో పారిశుధ్యం నిర్వహించటానికి, మొక్కల సంరక్షణకు విద్యార్థుల సంఖ్య ప్రకారం నిధులను కేటాయించడం పట్ల టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి హర్షం ప్రకటించారు. విద్యార్థుల సంఖ్యను బట్టి రూ.మూడు వేల నుంచి రూ.20 వేల వరకు నిధులు కేటాయిస్తున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. గత నాలుగేండ్లుగా పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ పెద్ద సమస్యగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం గ్రామపంచాయతీలకు బాధ్యతను అప్పగించినప్పటికీ 90 శాతం పంచాయతీల్లో అమలు జరగలేదని తెలిపారు. ఎమ్మెల్సీలు, ఉపాధ్యాయ సంఘాలు పలుమార్లు ప్రాతినిధ్యాలు చేసి ఆందోళనలు నిర్వహించినప్పటికీ గత ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి ఆ సమస్యను తీసుకెళ్లిన వెంటనే సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. మార్చి 10న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో జరిపిన సమావేశంలో స్వీపర్లను ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారని తెలిపారు. అదేవిధంగా ఈనెల రెండున పదోన్నతి పొందిన ఉపాధ్యాయులతో నిర్వహించిన ముఖాముఖిలో పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ కోసం ఉత్తర్వులు ఇవ్వనున్నట్టు ప్రకటించారనీ, ఆ మాట ప్రకారం ఉత్తర్వులు విడుదల చేశారని వివరించారు. జిల్లా మినరల్ ఫండ్ ట్రస్ట్ నుంచి పది నెలలకు నిధులను విడుదల చేసి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ, మొక్కల సంరక్షణ కోసం ఈ నిధులను ఖర్చు చేయాలని ఉత్తర్వుల్లో ప్రకటించారని పేర్కొన్నారు.

పాఠశాల నిర్వహణ గ్రాంటు వివరాలు

విద్యార్థుల సంఖ్య	గ్రాంటు
1. సున్నా	--
2. 1 నుంచి 30	రూ.3 వేలు
3. 31 నుంచి 100	రూ.6 వేలు
4. 101 నుంచి 250	రూ.8 వేలు
5. 251 నుంచి 500	రూ.12 వేలు
6. 501 నుంచి 750	రూ.15 వేలు
7. 750 ఆపైన	రూ.20 వేలు

ప్రభుత్వ ఉత్తర్వుల పట్ల ఎస్టీయూ హర్షం

పదోన్నతి పొందిన ఉపాధ్యాయులతో ఈనెల రెండున నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన మేరకు పాఠశాలల్లో పరిశుభ్రత కోసం విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాల సౌకర్యాల నిర్వహణ గ్రాంట్‌ను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయటం పట్ల ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం పర్వత్‌రెడ్డి, జి సదానందంగౌడ్ హర్షం ప్రకటించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా స్వచ్ఛ కార్మికులకు గౌరవ వేతనం చెల్లిస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి హామీ మేరకు త్వరలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విద్యుత్ చార్జీలు ప్రభుత్వమే చెల్లించే విధంగా ఉత్తర్వులు వెలువడే అవకాశముందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం కృషి చేస్తోందనీ, అయితే పాఠశాలల పర్యవేక్షణ లోపం లేకుండా అన్ని స్థాయిల్లో పర్యవేక్షణాధికారులను నియమించాలని కోరారు.

విద్యపై సీఎంకు ప్రత్యేక శ్రద్ధ : ఆర్‌యూపీపీటీఎస్


పాఠశాలల పరిశుభ్రతకు సంబంధించి తగిన ఏర్పాట్లు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాట ప్రకారం పాఠశాల సౌకర్యాల గ్రాంటును విడుదల చేయడం పట్ల ఆర్‌యూపీపీటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు సి జగదీశ్, ప్రధాన కార్యదర్శి ఎస్ నర్సిములు హర్షం ప్రకటించారు. విద్యాశాఖపై ముఖ్యమంత్రికి ప్రత్యేక శ్రద్ధ ఉందని తెలిపారు. గ్రాంటును కేటాయించినందుకు సీఎంకు ధన్యవాదాలు ప్రకటించారు. పాఠశాలలకు స్కావెంజర్లను కేటాయిస్తామన్న మాటను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిలబెట్టుకున్నారని ఎస్జీటీ యూనియన్ ప్రధనా కార్యదర్శి ఎ వెంకటేశం తెలిపారు.

వర్గీకరణపై ఎన్డీఏలో గలాట

రివ్యూ పిటిషన్ వేస్తామన్న చిరాగ్ పాశ్వాన్

- సుప్రీం తీర్పును స్వాగతించిన టీడీపీ
- ఎటూ తేల్చుకోలేకపోతున్న బీజేపీ
- ఉత్తరాదిన నష్టపోతామని ఆందోళన

ఎస్సీల ఉప వర్గీకరణపై పాలక ఎన్డీఏలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో బీజేపీ ఇరకాటంలో పడుతోంది. దాని పరిస్థితి కరవమంటే కప్పకు కోపం...విడవమంటే పాముకు కోపం అన్న చందంగా తయారైంది. ఉప వర్గీకరణకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఎన్డీఏ మిత్రపక్షమైన లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్) వ్యతిరేకించింది. దీనిపై రివ్యూ పిటిషన్ దాఖలు చేస్తామని ఆ పార్టీ అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ ప్రకటించారు. మరోవైపు తీర్పును టీడీపీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వాగతించారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీల వర్గీకరణను చేపట్టింది చంద్రబాబే. 1997లో రెండోసారి ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు, మాదిగలకు చేరువయ్యే ఉద్దేశంతో ఎస్సీలను ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరించారు.



న్యూఢిల్లీ : ఎస్సీల ఉప వర్గీకరణపై రాష్ట్రాలకు అధికారం ఉన్నదంటూ ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ధర్మాసనం గత గురువారం చారిత్రక తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. అయితే దీనిపై బీజేపీ ఇప్పటి వరకూ స్పష్టమైన వైఖరిని వెల్లడించలేదు. ఎస్సీల ఉప వర్గీకరణను చేపట్టాలంటే ముందుగా కులగణనను నిర్వహించాల్సి ఉంటుంది. ఇందుకు బీజేపీ సుముఖత చూపడం లేదు. 'సుప్రీంకోర్టు తీర్పును నిర్ద్వంద్వంగా తిరస్కరించడం కానీ లేదా ఆమోదించడం కానీ బీజేపీ చేయలేదు. ఎందుకంటే ఉప వర్గీకరణ చేపడితే దక్షిణాదిన ఆ పార్టీ లాభపడుతుంది. ఉత్తరాదిన మిత్రపక్షాల నుండే కాకుండా ఓటర్ల నుండి కూడా వ్యతిరేకత వస్తుంది. ప్రతిపక్షాలు కూడా ఇదే మాట చెబుతున్నాయి. అందుకే ఈ విషయంలో బీజేపీ ఆచితూచి అడుగులు వేయాల్సి ఉంటుంది' అని ఎన్డీఏ సీనియర్ నేత ఒకరు తెలిపారు. ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా దీనిపై స్పష్టమైన వైఖరి తీసుకోవడం లేదు. సుప్రీంకోర్టు తీర్పుపై కర్నాటక, తెలంగాణ ముఖ్యమంత్రులు సిద్ధరామయ్య, రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బీఎస్పీ అధినేత మాయావతి వ్యతిరేకించారు.

క్రీమిలేయర్ వర్తించకూడదన్న పాశ్వాన్

రిజర్వేషన్లకు సంబంధించి దళితులకు క్రీమిలేయర్‌ను వర్తింపచేయకూడదని చిరాగ్ పాశ్వాన్ అభిప్రాయపడ్డారు. దళితులను అంటరానివారిగా పరిగణించి శతాబ్దాల తరబడి సామాజిక బహిష్కరణ చేశారని, అందుకే రిజర్వేషన్లను రాజ్యాంగంలో చేర్చడం జరిగిందని ఆయన తెలిపారు. 'క్రీమిలేయర్‌ను వారి విద్య, ఆర్థిక పరిస్థితుల కారణంగా నిర్ధారిస్తారు. అయితే దళితులు ఎంత విద్యావంతులైనా, సంపన్నులైనా సమాజంలో వారి స్థానం ఏమీ మారలేదు' అని చిరాగ్ చెప్పారు. వివాహ ఊరేగింపులలో గుర్రాలు తోలడానికి దళిత యువకులను ఇప్పటికీ అనుమతించడం లేదని, పేరొందిన దళిత నేతలు దేవాలయాలను సందర్శించి వెళ్లిన తర్వాత వాటిని శుద్ధి చేస్తున్నారని గుర్తు చేశారు. సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలన్నది తమ పార్టీ నిర్ణయమని, దీనిపై బీజేపీని సంప్రదించలేదని అన్నారు. లతెలంగాణలో ఎస్సీల ఉప వర్గీకరణను బీజేపీ సమర్థించింది. ఉప కోటాపై మాదిగల దీర్ఘకాల డిమాండ్‌ను పరిశీలించేందుకు కమిటీని ఏర్పాటు చేస్తామని లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించారు. ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ కూడా బీజేపీపై ప్రశంసలు కురిపించారు.

ప్రొఫెసర్ జయశంకర్ ఆశయసాధనకు కట్టుబడి ఉన్నాం : సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తమ ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ ఆశయసాధనకు కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర సాధనే ఉచ్ఛ్వాసనిచ్ఛ్వాసలుగా జీవితాంతం వరకు గడిపిన ప్రొఫెసర్ జయశంకర్‌ను తెలంగాణ సమాజం సదా గుర్తుంచుకుంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకొని ఆయన సేవలను సీఎం గుర్తు చేసుకున్నారు. హైదరాబాద్ రాష్ట్రాన్ని, ఆంధ్ర రాష్ట్రంలో విలీనం చేయడాన్ని జయశంకర్ వ్యతిరేకించారనీ, ఆంధ్రప్రదేశ్‌లో విలీనంతో తెలంగాణ ప్రాంతం, ప్రజలు ఏ విధంగా నష్టపోయారో గణాంకాలతో సహా ఎప్పటికప్పుడు వివరించారని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ఆరు దశాబ్దాలు సజీవంగా ఉంచిన ఘనత ప్రొఫెసర్ జయశంకర్ దేనని ముఖ్యమంత్రి కొనియాడారు. ఆయన ఉద్యమస్ఫూర్తిని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

గిరిజనులపై పీడీ, గుడుంబా కేసులు ఎత్తేయాలి : కళ్యాణ్ నాయక్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో గుడుంబా కాస్తున్నారనే పేరుతో గిరిజనులపై బనాయిస్తున్న పీడీయాక్ట్ కేసులను వెంటనే ఎత్తేయాలని గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కళ్యాణ్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. గిరిజన ఉద్యోగులకు ప్రమోషన్లలో పదిశాతం రిజర్వేషన్లు కేటాయించాలనీ, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ వర్తింపజేయాలని ఆయన్ను కోరారు. తండాల్లో బెల్టు షాపులను అరికట్టాలనీ, వైన్స్‌ల టెండర్లలో గిరిజనులకు ఐదు నుంచి 10 శాతం, ఏజెన్సీ ప్రాంతాల్లో వంద శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు. బ్రీచ్ కేస్ పేరుతో గిరిజనులపై అక్రమంగా బనాయించిన కేసులను, లక్ష రూపాయల వరకు వేస్తున్న జరిమానాలను తొలగించాలని విన్నవించారు. సారాయి తయారీని మానేసిన కుటుంబాలకు ప్రభుత్వం రూ.25 లక్షలిచ్చి ఉపాధి అవకాశాలు చూపెట్టాలని కోరారు.

గాజాలో గత 24గంటల్లో 40మంది పాలస్తీనియన్ల మృతి

- ఇజ్రాయిల్‌ను శిక్షించక తప్పదన్న ఇరాన్



గాజా : గత 10మాసాలుగా గాజాలో ఇజ్రాయిల్ దాడులు కొనసాగుతునే వున్నాయి. తాజాగా గత 24గంటల్లో గాజావ్యాప్తంగా 40మంది మరణించారని, 71మంది గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. ఎలాంటి హెచ్చరికలు జారీ చేయకుండానే, ప్రజలను ఖాళీ చేయాలని ఆదేశాలివ్వకుండానే శరణార్థుల శిబిరాలపై కాల్పులు జరుపుతున్నారని బాధితులు వాపోయారు. ఖాన్‌యూనిస్‌లోని నిర్వాసితుల శిబిరాంలో తన కుటుంబం వుండగానే ఇజ్రాయిల్ ట్యాంక్‌లు దాడి చేశాయని, తన కుటుంబ సభ్యులు చనిపోయారని బాధిత మహిళ ఒకరు గుర్తు చేసుకున్నారు. తాజాగాఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడుల్లో పాలస్తీనా ఆర్థిక శాఖ అండర్ సెక్రటరీ అబ్దుల్ ఫతా అల్‌జురాయి చనిపోయారని మిలటరీ ధృవీకరించింది. హమాస్ పొలిటికల్ చీఫ్ హనియె హత్య నేపథ్యంలో ఇజ్రాయిల్‌పై ప్రతీకార చర్యలు తప్పవని ఇరాన్ హెచ్చరించిన నేపథ్యంలో, ప్రాంతీయ ఉద్రిక్తతలు రెచ్చగొట్టడం తమ అభిమతం కాదని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి నాసర్ కనాని చెప్పారు. అయితే, మరింత అస్థిరత నెలకొనకుండా చూడాలంటే ఇజ్రాయిల్‌ను శిక్షించడంతప్పనిసరని నమ్ముతున్నట్లు చెప్పారు. టెహరాన్‌లో హనియెను హతమార్చడం అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన కిందకే వస్తుందని అన్నారు. తమ దేశ భద్రత, సార్వభౌమాధికారాలను రక్షించుకునే హక్కు ఇరాన్‌కు వుందన్నారు. అలాగే ఇజ్రాయిల్‌ను దారిలో పెట్టేందుకు, నేరాలు చేయకుండా నిలువరించేందుకు శిక్షించే హక్కు కూడా ఇరాన్‌కు వుందని చెప్పారు. ఇప్పటివరకు గాజాలో 39,623మంది మరణించగా, 91,469మంది గాయపడ్డారు. ఇప్పటివరకు గాజాకే పరిమితమైన ఈ దాడులు విస్తృత ఘర్షణలు, అల్లర్లకు దారి తీసే ప్రమాదముందని భావిస్తున్నట్లు ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చీఫ్ ఆందోళన వ్యక్తం చేశారు.



అర్థాకలితో ఉన్నాం...ఆత్మహత్యలే శరణ్యం

ఇందిరాపార్కు వద్ద దీక్షల్లో కరెంట్ బిల్ కలెక్టర్లు

- విద్యుత్ సంస్థలు వారికి ఉపాధి కల్పించాలి : టీజీఎస్‌యూఈఈయూ అధ్యక్షులు కే ఈశ్వరరావు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల వరకు జీరో బిల్లులు ఇస్తుండటంతో ఉపాధి కోల్పోయి,కుటుంబాలు రోడ్డునపడి, అర్థాకలితో బతుకుతున్నామనీ,ఇదే కొనసాగితే ఆత్మహత్యలు చేసుకోవడం తప్ప మరో మార్గం తమకు కనిపించట్లేదని విద్యుత్ బిల్ కలెక్టర్లు ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీజీఎస్‌యూఈఈయూ) ఆధ్వర్యంలో డిస్కంల్లో పనిచేస్తున్న విద్యుత్ బిల్ కలెక్టర్లు సోమవారంనాడిక్కడి ఇందిరాపార్కు వద్ద నిరాహార దీక్షలు నిర్వహించారు. ఆరు నెలలుగా తమకు ఒక్క రూపాయి వేతనం రావట్లేదనీ, గృహలక్ష్మి పథకం వల్ల 80 శాతం మంది వినియోగదారులు బిల్లులు చెల్లించట్లేదని తెలిపారు. కొందరు ఆన్‌లైన్ ద్వారా బిల్లు చెల్లింపులు చేస్తున్నారనీ, తాజాగా ఆగస్టు నెల నుంచి తెలంగాణ రాష్ట్ర ఉత్తర, దక్షిణ ప్రాంతాల విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) బిల్లులపైనే క్యూఆర్ కోడ్‌లు కూడా ముద్రిస్తుండటంతో తాము ఉపాధిని పూర్తిగా కోల్పోయామని ఆందోళన వ్యక్తం చేశారు. కరెంట్ బిల్ కలెక్టర్ల నిరాహారదీక్షల్ని ప్రారంభించిన టీజీఎస్‌యూఈఈయూ అధ్యక్షులు కే ఈశ్వరరావు మాట్లాడుతూ రెండు డిస్కంల పరిధిలో దాదాపు 600 మంది బిల్‌కలెక్టర్లు 20-25 ఏండ్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. గృహజ్యోతితో వారు ఉపాధి కోల్పోయారన్నారు. వీరందరినీ డిస్కంలు ఎస్‌ఈ, ఈఆర్వో, డీఈ అఫీసుల్లో పనిచేసే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పలు రూపాల్లో తమ డిమాండ్లను వారు యాజమాన్యాల దృష్టికి తీసుకెళ్లారని గుర్తుచేశారు. బిల్ కలెక్టర్ల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకొని, మానవతా దృక్పథంతో వారికి ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారుఈ సమస్య పరిష్కారం కోసం మంగళవారం ప్రజాభవన్‌లో జరిగే ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రాలు ఇస్తామనీ,అప్పటికీ ప్రభుత్వం స్పందించ కుంటే విద్యుత్‌సౌధను ముట్టడిస్తామని హెచ్చరించారు.రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన బిల్ కలెక్టర్లు తమ సమస్యల్ని తెలుపుతూ ప్లకార్డులు చేతబట్టి నిరాహారదీక్షల్లో పాల్గొన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వీ గోవర్ధన్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ జే ప్రసాద్‌రాజు, కోశాధికారి జే బస్వరాజ్ పాల్గొన్నారు. బిల్ కలెక్టర్లు జీ లక్ష్మమ్మ (నల్గొండ), బీ కృష్ణయ్య (ఖమ్మం), సోమేష్ (జనగాం), సత్యం (నిర్మల్)తో పాటు పలువురు ఉద్యోగులు నిరాహారదీక్షలో కూర్చున్నారు.

వృద్ధురాలు దారుణ హత్య..!



నవతెలంగాణ-వనస్థలిపురం

వృద్ధురాలు దారుణ హత్యకు గురైన ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకష్ణ నగర్ కాలనీలో చీమల బాలమ్మ (63) గత 30 సంవత్సరాలుగా చిన్న రూమ్ లో ఉంటోంది. బాలమ్మ చుట్టుపక్కల ఉన్న ఇండ్లల్లో పనిచేస్తూ జీవనం గడిపేది. సోమవారం ఇండ్లల్లో పనికి రాకపోవడంతో పక్కనే ఉన్నవారు వెళ్లి చూడగా బాలమ్మ మతి చెంది కనిపించింది. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఆమె తలపై రాయితో కొట్టి హత్య చేసినట్టు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులకు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. స్థానికుడు చింతకాయల హరి బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని వనస్థలిపురం ఎస్హెచ్ఓ అశోక్ రెడ్డి తెలిపారు.

నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరం

- టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస గుప్తా



నవతెలంగాణ-నాగోల్

నిరుపేదలకు ముఖ్య మంత్రి సహాయనిధి వరం లాంటిదని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. సోమవారం నాగోల్ లోని ఉప్పల శ్రీనివాస్ గుప్త క్యాంపు కార్యాలయంలో మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అల్వాల్ పరిధిలోని భరత్ నగర్‌కు చెందిన డి .రమాకాంత్ కు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ. 27000/- చెక్కును ఉప్పల శ్రీనివాస్ గుప్త అందజేశారు.

ఆపదలో ఉన్నప్పుడు ఆదుకున్నప్పుడే గౌరవం



- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ-బడంగ్ పేట్

నేటి సమాజంలో ఆపదలో ఉన్న మనిషిని ఎవరైతే మానవతా హృదయంతో ఆదుకుంటారో ఆ మనిషికే గౌరవం దక్కుతుందని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు.సోమవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాపూర్ గ్రామం అంజిరెడ్డి కాలనీలో నివాసముండే జి.రవీందర్ తండ్రి జి సాయిలు ఆస్పత్రిలో చికిత్స కోసం చేరారు. ఆ విషయం స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుక పోవటంతో ప్రభుత్వం నుండి మంజూరు చేయించిన ఎల్ఓసి రూ.2 లక్షల విలువైన చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆదివారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నా పేదల సంక్షేమం కోసం పాటుపడినప్పుడే ఆ ప్రభుత్వానికి విలువ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు గుండు జి.రఘునందన్ చారి, అత్తాపురం శ్రీనివాస్ రెడ్డి, అరవింద్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా ఆక్సిజన్ వాయువు ఫిల్లింగ్ సేవలు

- రవీంద్ర ఆక్సిజన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు సరఫరా..



నవతెలంగాణ-పెద్ద అంబర్ పేట్

కోవిడ్ లాంటి ఇబ్బందికర పరిస్థితుల్లో ఆక్సిజన్ కోసం ప్రజలు పడిన కష్టాలను దష్టిలో ఉంచుకొని కుంట్లూరు చుట్టుపక్కల ప్రాంత ప్రజలకు ఉచితంగా ఆక్సిజన్ వాయువును ఫిల్లింగ్ చేసి అందజేస్తున్నామని రవీంద్ర ఆక్సిజన్ ప్లాంట్ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపారు.కోవిడ్ పరిస్థితుల్లో ఆక్సిజన్ దొరకక ప్రజలు పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుసారంగా జననివాసాలకు అందుబాటులో ఉంటూ మెరుగైన ఆక్సిజన్ వాయువును ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో తాము పది సంవత్సరాలుగా ఆక్సిజన్ ఫిల్లింగ్ స్టేషన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పెద్ద అంబర్పేట మున్సిపాలిటీతో పాటు అబ్దుల్లాపూర్మెట్, హయత్ నగర్ తదితర ప్రాంతాలలో నివాసముండే ప్రజలకు ఉచితంగా వైద్య అవసరాల నిమిత్తం ఆక్సిజన్ వాయువును అందించాలని తాము నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. ఆక్సిజన్ వాయువు అవసరం ఉన్న రోగి కుటుంబ సభ్యులు రోగి ఆధార్ కార్డుతో పాటు డాక్టర్ సూచించిన మేర ప్రెస్క్రిప్షన్, ఖాళీ సిలిండర్ తెచ్చుకున్న వారికి ఉచితంగా ఆక్సిజన్ ను ఫీల్ చేసి అందజేయనున్నట్టు వివరించారు. కరోనా లాంటి పరిస్థితులను దష్టిలో ఉంచుకొని రానున్న రోజుల్లో ఎటువంటి విపత్తులు వచ్చినా సిద్ధంగా ఉండేందుకుగాను ప్రజలకు మెరుగైన ఆక్సిజన్ అందించేందుకు గాను తమ ప్లాంట్లో అదనంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు మరో ట్యాంక్ ఏర్పాటు చేశామన్నారు. తాము ఉచితంగా అందించే ఆక్సిజన్ వాయువు ను మార్కెట్లో వేల రూపాయల్లో వసూలు చేస్తారన్నారు. ఈ ప్రక్రియ మరో వారం రోజుల్లో ప్రారంభించనున్నట్టు వివరించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ప్లాంట్ కొంత దెబ్బతినడంతో ప్రస్తుతం ప్లాంట్ రిపేర్లు నడుస్తున్నందున తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకునేందుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ముందుకు వెళ్తున్నామని వివరించారు. కుంట్లూరు నుంచి తట్టి అన్నారం వెళ్లే దారిలో గల పల్లవి ఇంజనీరింగ్ కళాశాల పక్కనే ఈ ప్లాంట్ ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని పెద్ద అంబర్‌పేట హయత్ నగర్ చుట్టుపక్కల ప్రాంతవాసులు వినియోగించుకోవాలని కోరారు.

సీపీఐ ఆధ్వర్యంలో కేరళకు విరాళాల సేకరణ



నవతెలంగాణ-హాయత్ నగర్

కేరళ వరద బాధితుల సహాయార్థం సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు పార్టీ హయత్ నగర్ మండల కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి అధ్వర్యంలో సోమవారం విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి హాజరై లెక్షరర్స్ కాలని చౌరస్తాలో ప్రారంభించారు. హయత్ నగర్ చౌరస్తా నుంచి భాగ్యలత వరకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న వ్యాపార సముదాయాలలో విరాళాల సేకరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవీంద్ర చారి మాట్లాడుతూ కేరళలో విపత్కర పరిస్థితుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ స్పందించి మానవతా దక్పథంతో ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా కేరళలో జరిగిన ప్రకతి విలయతాండవాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి ప్రజలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల సహాయ కార్యదర్శి రమావత్ సక్రు,శ్రీదేవి,మహిళా సమాఖ్య నాయకులు సరిత, ఏ.ఐ.టి.యుసి మండల అధ్యక్షులు గోల్కొండ నాగరాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి కృష్ణ,శోభన్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో అతిపెద్ద అవినీతి పార్టీ బీజేపీ

- సుప్రీం కోర్టు జోక్యంతో ఎలక్టోరల్ బాండ్ల బండారం బయటికి..
- కప్పి పెట్టిన ప్రధాన మీడియా
- సీపీఐ(ఎం) రాష్ట నాయకులు ఎం.డి అబ్బాస్
- వాయనాడ్ ప్రజలకు అండగా విరాళాలు సేకరించాలని పిలుపు
- పార్టీ హైదరాబాద్ సౌత్ జిల్లా ప్లీనరీ సమావేశంలో పలు తీర్మానాలు



నవతెలంగాణ-చంపాపేట్

దేశంలో అతిపెద్ద అవినీతి పార్టీ బీజేపీ అని,ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బీజేపీ పాల్పడ్డ చట్టబద్ధమైన అవినీతి వ్యవహారం సుప్రీం కోర్టు జోక్యం తో బట్టబయలైందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం డి అబ్బాస్ పేర్కొన్నారు. సంతోష్ నగర్ లోని పార్టీ కార్యాలయం లో జరిగిన హైదరాబాద్ సౌత్ జిల్లా ప్లీనరీ సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. "నీవు నాకు అనుగుణంగా చట్టాలు చేయ్ - నీ పార్టీ పేరు మీద బాండ్లు కొని మీ పార్టీ ఖాతాలో ఇన్ని కోట్ల రూపాయలు జమ చేస్తా" అనేలా కేంద్ర బీజేపీ పాలకులు బడా కాంట్రాక్టర్ల వద్ద 5 వేల కోట్లకు పైగా అవినీతికి పాల్పడ్డారని ఇంత పెద్ద చట్టబద్ధమైన అవినీతికి దేశ చరిత్రలో ఏ పార్టీ పాల్పడలేదని అన్నారు. అయినా ప్రధాన ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా దీనిని పెద్దగా ప్రజల్లో ప్రచారం కాకుండా జాగ్రత్త వహించాయని గుర్తు చేశారు. గత పది సంవత్సరాలుగా బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తూ వచ్చారని దాని ఫలితమే 370 కి బదులు 240 సీట్లు చాలని ప్రజలు బీజేపీ కి కర్రు కాల్చి వాత పెట్టారని విశ్లేషించారు. కొన్ని ప్రాంతీయ పార్టీల సహకారంతో పీఠమీదకూర్చున్న బీజేపీ ఇంకా ప్రజా వ్యతిరేక విధానాలనే అమలు జేయ చూస్తున్నదని ఈ పరిస్థితుల్లో ప్రజల్ని ఐక్యపోరాటాలవైపు తీసుకురావాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు.

గతవారం కేరళ వాయనాడ్ లో సంభవించిన ఆకస్మిక వరద బీభత్సంతో అతలాకుతలమైన వేలాది కుటుంబాలను ఆదుకోవడానికి పార్టీ శ్రేణులు కదిలి ప్రజల వద్ద విరాళాలు సేకరించి పంపాలని కోరారు. మూసీ అభివృద్ధి పేరుతో సామాన్య ప్రజల ఇండ్లకు ఆటంకం లేకుండా ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించాలని కేంద్ర రాష్ట్ర పాలకులకు ఆయన సూచించారు. 200 యూనిట్ల వరకు "0" బిల్లు లు ఇంకా చాలా కుటుంబాలకు రావట్లేదని ఇటీవలి పాదయాత్రలో ప్రజలు తమ దృష్టికి తెచ్చారని చెప్పారు. రాష్ట్రంలో మత వైషమ్యాలు సృష్టించేందుకు బీజేపీ సోషల్ మీడియా ద్వారా ఇతర అనేక ఇతర పద్ధతుల్లో పాల్పడుతున్నదని, మరో వైపు మైనారిటీ మతోన్మాదాన్ని ఎం.ఐ .ఎం ప్రేరేపిస్తున్నదని చెప్తూ ప్రజలు జాగరూకతతో వ్యవరించాలని సూచించారు.పాతబస్తీ ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చేసిన తీర్మానాలపై 7 నియోజకవర్గాలు నుండి హాజరైన ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు. ఈ విస్తృత జిల్లా సమావేశంలో గత కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్తు కార్యాచరణను ముందుకు తీసుకుపోవాలని నిర్ణయించారు.దీనికిజిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎల్. కోటయ్య అధ్యక్షత వహించారు. ఇందులో రైతు సంఘం రాష్ట్ర నాయకులు శోభన్, జిల్లా నాయకులు పి.నాగేశ్వర్, జి.విఠల్,ఎం.లక్ష్మమ్మ,అబ్దుల్ సత్తార్,మీడియా బాధ్యులు భరత్ తదితరులు పాల్గొన్నారు.

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వం చేపట్టిన 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ర్యాలీలో మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొన్నారు. అనంతరం చౌరస్తాలో మొక్కలు నాటారు. మేయర్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంపై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రత అనేది ప్రతిఒక్కరి బాధ్యతగా గుర్తించాలని, తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తంగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జి.రఘు, కార్పొరేటర్లు, కోఆప్షన్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-బడంగ్‌పేట్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



- కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

నవతెలంగాణ-హాయత్‌నగర్

స్వచ్ఛతనం పచ్చదనం 5 రోజుల కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు వ్యర్థాల తొలగింపు నేపథ్యంలో మన్సూరాబాద్ డివిజన్, వినాయక్ నగర్ కాలనీ, ఆయిల్ మిల్ ఎదురుగా ఉన్న చెత్త వ్యర్థాలను తొలగించాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి అన్నారు. కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఐదు రోజుల కార్యక్రమంలో భాగంగా వ్యర్థాల తొలగింపు, దోమల నివారణ, చెరువుల సంరక్షణ, నాలాల క్లీనింగ్, వనమహోత్సవం వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వ్యర్థాలు తొలగింపులో భాగంగా ముఖ్యంగా కాలనీలల్లో చెత్త బండ్లకు చెత్త వేయకుండా కవర్లలో మూటగట్టి ఎక్కడపడితే అక్కడ వేయడం వల్ల దుర్వాసన, దోమలతో, వివిధ రకాల క్రిములతో రోగాల బారిన పడతామని... కిరాయిదారులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఇండ్ల యజమానులు తీసుకోవాలని కోరారు. అలాగే రోజురోజుకు కాలనీలు పెరుగుతున్న దృష్ట్యా శానిటేషన్ సిబ్బందిని పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. గత 15 సంవత్సరాల క్రితం ఉన్న సిబ్బంది మాత్రమే ఇప్పుడు ఉన్నారని, డిప్యూటీ కమిషనర్ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, వివిధ శాఖల అధికారులు ,సిబ్బంది డీఈ లావణ్య, బలరాం, యాదగిరి, మేధా, చంద్రశేఖర్, మమత, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జోనల్ కమిషనర్‌తో కార్పొరేటర్ సమావేశం

నవతెలంగాణ-హాయత్ నగర్

హాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సోమవారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌ను కాలనీవాసులతో కలిసి వినతిపత్రం అందజేశారు. హయత్ నగర్ డివిజన్‌లోని ఆర్టీసీ మజ్దూర్ కాలనీ, షిరిడి నగర్ కాలనీలో సీసీ రోడ్ల సదుపాయం లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. అలాగే ఆ రెండు కాలనీలలో సీసీ రోడ్ల సదుపాయం లేకపోవడంతో వర్షాలు పడినప్పుడల్లా రోడ్లన్నీ బురదగా మారి కాలనీవాసులకు ఇబ్బందికరంగా మారుతుందని వివరించారు. త్వరగా సీసీ రోడ్ల సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఆర్టీసీ మజ్దూర్ కాలనీ, షిరిడి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం హస్తినాపురం డివిజన్ భూపేష్ నగర్ లో ఉన్న చెత్త వ్యర్థాలను తొలగించడం తో పాటు మొక్కలు నాటినట్టు కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్ తెలిపారు. వారు మాట్లడుతూ డివిజన్ పరిధిలో గల నందనవనం భూపేష్ నగర్ ఆదర్శనగర్ ,తదితర ప్రాంతాల్లో వ్యర్థాలను అడ్డగోలుగా వేయకుండా అవగాహన కల్పిం చాల్సిన బాధ్యత కాలనీ ప్రతినిధులు తీసుకోవాలని సూచించారు. ఐదు రోజుల కార్యక్రమంలో భాగంగా వ్యర్థాల తొలగింపు, దోమల నివారణ, చెరువుల సంరక్షణ, నాలాల క్లీనింగ్ మొక్కలు నాటడం పచ్చదనాన్ని పెంపొందించేలా చర్యలు చేపడతామని ఎల్బీనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా తెలిపారు. శానిటైజేషన్ డి.ఈ వెంకటేష్ ,అర్బన్ బయోడైవర్సిటీ మేనేజర్ సత్యనారాయణ,జి.హెచ్.ఎం.సి సిబ్బంది బృందం,నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మమత మల్లేష్ గౌడ్, దేరంగుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ - హస్తినాపురం

వైదేహి అనాథ బాలికల ఆశ్రమానికి 'నాగార్జున' విద్యార్థుల వితరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

చంపాపేట్ డివిజన్ పరిధి గాయత్రీ నగర్ చౌరస్తా లోని నాగార్జున ది నెక్స్ట్ జెన్ పాఠశాల విద్యార్థులు సోమవారం వైదేహి అనాథ బాలికల ఆశ్రమానికి ఐదు కింటల బియ్యం, 50 కేజీల కందిపప్పు విరాళంగా అందజేశారు. నాగార్జున విద్యాసంస్థల చైర్మెన్ గుమ్మకొండ విట్టల్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఇటీవల పాఠశాలలో చారిటీ డే నిర్వహిం చారు. విద్యార్థుల నుంచి సేకరించిన సరుకులకు తోడు యాజమాన్యం మరికొంత కలిపి ఆశ్రమానికి విరాళంగా అంద జేశారు. ఈ సందర్భంగా నాగార్జున స్కూల్ విద్యాసంస్థల చైర్మెన్ విద్యార్థులలో సేవాభావం పెంపొందించడానికి, సమాజం లోని అభాగ్యుల పట్ల అవగాహన కల్పించడానికి తమ విద్యాసంస్థలో ఏడాదిలో ఒకరోజు చారిటీ డే నిర్వహిస్తున్నామని తెలిపారు. చిన్నారుల్లో ఉన్నత విలువలు పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కషి చేయాలని కోరారు. చిన్నారుల మానసిక వ్యక్తిత్వ వికాసానికి తమ విద్యాసంస్థలలో అధిక ప్రాధాన్యం ఇచ్చి పలు కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కట్టా రవీందర్ రెడ్డి,ఆశ్రమ నిర్వాహకులు డి.సువర్చల, పి.అంబాదాస్, లక్ష్మణరావు,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్తను బహిరంగ ప్రదేశాలలో వేయకూడదు



నవతెలంగాణ-వనస్థలిపురం

చెత్తను బహిరంగ ప్రదేశాలలో వేయకూడదని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. హయత్ నగర్ డివిజన్ పరిధి ద్వారకామాయి నగర్ కాలనీలో "నగర స్వచ్ఛదనం పచ్చదనం" కార్యక్రమంలో భాగంగా సోమవారం హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, డిప్యూటీ కమీషనర్ యాదయ్యతో కలసి చెత్తను బహిరంగ ప్రదేశాలలో వేయకూడదని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హయత్ నగర్ డివిజన్‌లో చెత్త సమస్య రోజురోజుకు పెరిగిపోతున్నదని, శానిటేషన్ సిబ్బంది ఎంత పని చేసినా డివిజన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలంటే డివిజన్ వాసులందరూ వారి వంతు బాధ్యతగా చెత్త ను బహిరంగ ప్రదేశాలలో వేయకూడదని సూచించారు. చెత్తను స్వచ్ఛ ఆటోలలో మాత్రమే వెయ్యాలని వారు విజ్ఞప్తి చేశారు. డివిజన్ వాసుల సహాయ సహకారాలు ఉంటేనే పరిసరాలు పరి శుభ్రంగా ఉంచగలుగుతామని చెప్పారు. శానిటేషన్ డీఈ లావణ్య, జవాన్ యాదయ్య, శానిటేషన్ సూపెర్వైసోర్ శ్రవణ్, కాలనీ వాసులు సురేందర్ కుమార్, రమణ, సురేష్, సాయి, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సచివాలయం నగర్‌లో నిర్వహించిన "స్వచ్ఛదనం - పచ్చదనం" కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ యాదయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛదానం, పచ్చదానం కార్యక్రమం ద్వారా ఇంటి స్థాయిలో, కమ్యూనిటీ స్థాయిలలో మొక్కలు నాటడం, వ్యర్థాలను వేరు చేసి సేకరించడం, రోడ్లను, ప్రజా స్థలాలను శుభ్రం చేయడం, పాఠశాలల్లో పరిశుభ్రతపై పోటీలు నిర్వహించడం, కుక్కల నియంత్రణపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు డివిజన్ పరిధిలోని ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి ఆరోగ్యకరమైన వాతావరణం సృష్టించడానికి ఎంతగానో సహాయపడతాయని తెలిపారు. అనంతరం పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ లావణ్య, హార్టికల్చర్ మేనేజర్ మేధ, జిహెచ్ఎంసి ఎస్ఎస్ అజీమ్ ఉద్దీన్, జవాన్ రామ్ చందర్, ఆఫీసర్ రాజు, ఎస్ ఎఫ్ ఏ చంద్రశేఖర్, రాజేష్, సానిటేషన్ సిబ్బంది, వివిధ కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.



9 వరకు స్వచ్ఛదనం-పచ్చదనం

- డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య



నవతెలంగాణ -ఎల్బీనగర్

ఆగస్టు 5 నుండి 9 వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని హయత్‌నగర్‌లో నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా మొద టి రోజు చెత్త వ్యర్థాల తొలగింపు నిర్వహించినట్టు తెలిపారు. నాగోల్ డివిజ న్‌లో పీఎంఆర్ కన్వెన్షన్ హాల్, బండ్లగూడ రోడ్డు లో, మన్సూరాబాద్ డివిజన్‌లో వినాయక్ నగర్ కాలనీ, ఆయిల్ మిల్ ఎదురుగా ఉన్న ప్రాంతా ల్లో, హయత్ నగర్ డివిజన్ లో ద్వారకమై నగర్ కాలనీలో బి.ఎస్. రెడ్డి నగర్ డివిజన్ సచివాలయ నగర్ లో చెత్త ను తొలిగించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణ, మన్సూరాబాద్ కార్పొరేటర్ నరసింహారెడ్డి, హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి , బి.ఎస్. రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి, హయత్ నగర్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, దివ్య జ్యోతి, ప్రత్యేకాధికారి, ఎస్.డబ్లు.యం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లావణ్య , ప్రాజెక్ట్ అధికారి పి బలరాం, వెటర్నరీ అధికారి యాదగిరి, మేధా, హార్టికల్చర్ మేనేజర్, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ రవీంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు.



నాగోల్ : పరిసరాలతో పాటు మన ప్రాంతం, మన ఊరు, మన గల్లిలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో పరిశుభ్రతను పాటించినప్పుడే రోగాల బారిన పడకుండా ఉండగలమని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ ఎంత అరుణ సురేంద్రనాథ్ యాదవ్ అన్నారు. సోమవారం నాగోల్ డివిజన్‌లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించి తమ ఇండ్లలో ఉన్న చెత్త ను రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వేయకుండా స్వచ్ఛ ఆటో వాహనాలకు వేయాలని తెలిపారు. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడం వల్ల పారిశుధ్యం లోపించి రానున్న వర్షాలకు దోమలు, ఈగల బెడద పెరిగి పలు అంటు రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య , ఏఎంహెచ్ఓ లావణ్య, యూసీడీ సెక్షన్ బలరాం, హార్టికల్చర్ ఏ ఈ మేద, ఎంటమాలజీ ఏఈ రవీంద్రనాథ్ రెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్ రవీంద్ర బాబు, వెటర్నరీ ఏఈ యాదగిరి,రాంకీ సూపర్వైజర్ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
మంగళవారం | ఆగస్టు 06, 2024 | www.navatelangana.com

దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్‌గా ఎ.నాగమణి



నవతెలంగాణ-కీసర

దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్‌గా ఎ.నాగమణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన కమిషనర్‌ను చైర్ పర్సన్ వసుపతి ప్రణీతశ్రీకాంత్ గౌడ్ శాలువాతో సన్మానం చేసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ మాదిరెడ్డి నరేందర్ రెడ్డి, మేనేజర్ వెంకటేశం, కౌన్సిలర్లు కొత్త హేమలత, మంగల్ పురి వెంకటేష్, వరగంటి వెంకటేష్, రామారం శ్రీహరి గౌడ్ , మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

భూ కబ్జాదారుల నుంచి పార్కు స్థలాన్ని కాపాడండి



నవతెలంగాణ-అల్వాల్

భూ కబ్జాదారుల నుంచి పార్కుల స్థలాన్ని కాపాడాలని అల్వాల్ పట్టణంలోని శ్రీసాయి సూర్య ఎంక్లేవ్ మచ్చ బొల్లారం కాలనీవాసులు సోమవారం అల్వాల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వినతి పత్రం అందజేశారు. శ్రీసాయి సూర్య ఎంక్లేవ్ మచ్చ బొల్లారం కాలనీ సర్వే నెంబర్ 164లో పార్కుకు కేటాయించిన స్థలానికి కొందరు దళారులు దొంగ డాకుమెంట్స్ సృష్టించి కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. పార్కు స్థలం అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరారు. ల్యాండ్ డెవలపర్లు అంతర్గత రోడ్లు వేయకుండా కాలయాపన చేస్తున్నారని డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ నర్సింగరావు, రాజిరెడ్డి, సుబ్బారావు, రాజేందర్ రావు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి
- స్వచ్ఛదనం-పచ్చదనం పై అవగాహన ర్యాలీ



నవతెలంగాణ-హైదరాబాద్‌డెస్క్

ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ప్రజలకు సూచించారు. సోమవారం తూంకుంట మున్సిపాలిటీ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మున్సిపల్ చైర్మెన్ కారంగుల రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమాన్ని జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్స్, మున్సిపాలిటీ సిబ్బందితో కలిసి అవగాహనా ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ పన్నాల వాణి వీరారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్, కౌన్సిలర్స్, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపాలిటీ బీఆర్ఎస్‌పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనంతో మానవ మనుగడ : అజయ్ యాదవ్



నవతెలంగాణ-బోడుప్పల్

స్వచ్ఛదనం పచ్చదనంతో మానవ మనుగడ సాధ్యమని, మన ఇంటిని ఎలాగైతే పరిశుభ్రంగా ఉంచుకుంటామో మన నగరాన్ని అలాగే పరిశుభ్రంగా ఉంచుకోవాలని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం సీడీఎంఏ అడిషనల్ డైరెక్టర్‌డీ.జాన్ సాంసన్‌తో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. మన నగరాన్ని మన ఇంటితో సమానంగా పరిశుభ్రంగా ఉంచుకోవడం మన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమం ఆగస్టు 5-9 వరకు జరిగే స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో వీధి కుక్కల నియంత్రణ, చెత్తను వేరు చేయడం, మొక్కలు నాటడం, దోమల నివారణకు కో డ్రై పాటించడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామనిన్నారు. కార్యక్రమంలో నగర కమిషనర్ జీ.రామలింగం, డిప్యూటీ మేయర్ కొత్త శ్రవంతి కిషోర్ గౌడ్, కార్పొరేటర్లు కొత్త దుర్గమ్మ, మహేశ్వరి, జక్కుల పద్మ, బొమ్మకు సుగుణ, సుమన్ నాయక్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత: మేయర్ జక్క



ప్రభుత్వం ఈ నెల 5వ తేది నుంచి 9వ తేదీ వరకు పరిశుభ్రత, పచ్చదనాన్ని ప్రోత్సహించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి చేపట్టిన స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం నిర్వహించిన అవగాహన ర్యాలీకి ముఖ్య అతిథిగా మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కమిషనర్ త్రిశేశ్వర్ రావు హాజరై మొక్కలు నాటారు. మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అడిషనల్ డైరెక్టర్ డి.జాన్ సాంసన్ మొక్కలు నాటారు. అంతకు ముందు కమలానగర్ కాలనీ వాసులతో కలిసి శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ చెట్లను నాటి పచ్చదనాన్ని పెంపొందిస్తే వాతావరణ కాలుష్యం తగ్గి ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మధుసూదన్ రెడ్డి, హరిశంకర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు రాందాస్ గౌడ్, డీఈఈ సాయినాథ్, మేనేజర్ సుదర్శన్, ఆర్వో శ్రీనివాస్ రెడ్డి, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ మురళి, మారీ ప్రాజెక్ట్ మేనేజర్ సుధా పోలేని, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి రఘువర్ధన్ రెడ్డి, జావీద్ ఖాన్, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఫెడరిక్ ఏంగిల్స్ 129వ వర్ధంతి



నవతెలంగాణ-కాప్రా

సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మార్క్సిస్టు మహోపాధ్యాయులు కామ్రేడ్ ఫెడరిక్ ఏంగిల్స్ 129వ వర్ధంతి సభను కమలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ సీనియర్ నాయకులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ముందుగా కామ్రేడ్ ఫెడరిక్ ఏంగిల్స్ చిత్రపటానికి పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి, పార్టీ జిల్లా ఆఫీసు కార్యదర్శి శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోమటి రవి మాట్లాడుతూ.. ప్రపంచ కార్మిక వర్గానికి, పీడిత ప్రజానీకానికి విముక్తి కోసం కార్ల్ మార్క్స్, ఫెడరిక్ ఏంగిల్స్ కృషి చేశారని చెప్పారు. కార్ల్‌మార్క్స్ రూపొందించిన పెట్టుబడి గ్రంథాలను పరిపుష్టం చేయటంలో ఏంగిల్స్ ప్రధాన భూమిక నిర్వహించారని చెప్పారు. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమాల నిర్మాణానికి ఆది పురుషులుగా వెలిగారని తెలిపారు. వారు చేసిన కృషి ప్రపంచ ప్రజానీకానికి మార్గదర్శకంగా ఉందని పేర్కొన్నారు. పార్టీ సీనియర్ నాయకులు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ.. ఏంగిల్స్ మరణానంతరం కామ్రేడ్ లెనిన్ నివాళిగా రాసిన వ్యాసంలోని పలు విషయాలను వివరించారు. అనంతరం సభ్యులందరూ ఏంగిల్స్ చిత్రపటానికి పూలను వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సామాజిక ఉద్యమ నేత కేకే ప్రసాద్ బాబు, శ్రీనివాసరావు, కోమటి రవి, గౌసియా, శోభా, ఎన్ శ్రీనివాస్, రుక్కయ్య శ్రీనివాస్, పీబీ చారి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో వసతులు మెరుగుపరచాలి



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వసతులను మెరుగు పరచాలని, వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కళాశాల అధ్యాపకులు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి విన్నవించారు. సోమవారం ఆయనను కలిసి కళాశాలలోని సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. వసతులు కల్పిస్తే గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో చదవడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతారని తెలిపారు.

విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కోసం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని స్కూల్ హెడ్‌మాస్టర్ బాపురెడ్డి సోమవారం ప్రారంభించారు. కమలానగర్ ప్లానెట్ ఆప్టికల్స్ డాక్టర్ అనిల్ బృందం విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. పద్మసాయి డెంటల్ డాక్టర్ సంతోషి బృందం దంత పరీక్షలు, డాక్టర్ శ్రావణ్ ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహించారు. అంతకుముందు స్కూల్ హెడ్‌మాస్టర్ బాపురెడ్డి మాట్లాడుతూ.. పేదపిల్లల ఆరోగ్యం కోసం ప్రభుత్వ పాఠశాలల్లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు సేవలను అభినందించారు. ఈ క్యాంపులో లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎం.శ్రీదేవి, కార్యదర్శి చనమోలు వరప్రసాద్, డాక్టర్ దినేష్, సునీల్ కుమార్, విజయకుమార్, ఆర్పీసేథ్, పీజే రెడ్డి, మణి పాల్గొన్నారు. స్కూల్ స్టాఫ్ పరీక్షలు చేయించుకొని క్లబ్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

వృథా జలం..మొక్కలకు జీవం



నవతెలంగాణ-పోచారం

పోచారం మున్సిపల్ పరిధిలోని నారపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు వృథా నీటిని సద్వినియోగం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ పాఠశాల ఆవరణలో విద్యార్థులు కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోవడానికి, భోజనం ప్లేట్లు శుభ్రం చేసుకోడానికి వాటర్ ట్యాంక్ వద్ద వినియోగించుకునే నీరు వృథా కాకుండా ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి నీటి ట్యాంకు నుంచి పాఠశాల ఆవరణలో ఉన్న మొక్కల వరకు సన్నటి కాలువను ఏర్పాటు చేశారు. విద్యార్థులు వాడిన నీరు ఆ కాలువలోకి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. ఇంకేముంది వృథాగా పోయే నీరు కాలువల ద్వారా అక్కడున్న మొక్కలకు చేరుతుంది. ఈ ఉపాయం వల్ల నీటి వృథాను నివారించడమే కాకుండా చెట్లకు సమయానికి నీరు అందుతుంది. ఒక్క మొక్క కూడా ఎండిపోకుండా చక్కగా ఎదుగుతున్నాయి.

జలిగం వెంకటేష్‌కు ఎమ్మెల్యే బండారి నివాళి



నవతెలంగాణ-కాప్రా

మాజీ కౌన్సిలర్ జలిగం వెంకటేష్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోమ వారం వెంకటేష్ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌ను కలిసిన 'రియాల్టర్స్' మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మహేష్



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ నూతన సబ్ రిజిస్ట్రార్ హనుమంతరావును తెలంగాణ రియాల్టర్స్ అసోసియేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మహేష్ ఆధ్వర్యంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూల బొకే అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు టి. మహేష్, స్టేట్ సెక్రటరీ పాటి సురేందర్ రెడ్డి, ఘట్కేసర్ మండల అధ్యక్షులు వేముల గోవర్ధన్, జనరల్ సెక్రటరీ ఎం.నందు, ప్రతాప్ రెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి చిన్నారికీ తల్లిపాలే ఆరోగ్యకరం

అదనపు కలెక్టర్ కృష్ణారెడ్డి



నవతెలంగాణ-జవహర్‌నగర్

ప్రతి చిన్నారికి ఆరునెలల వరకు కచ్చితంగా తల్లిపాలు అందించాలని, తల్లిపాలే పిల్లలకు ఆరోగ్యకరమని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని రాజీవ్ గాంధీనగర్ అంగన్వాడీ సెంటర్ పరిధిలో ఆరు నెలల నుండి మూడేండ్ల పిల్లల ఇండ్లను సందర్శించారు. బిడ్డకు 7వ నెల నుండి అదనపు ఆహారం ఇచ్చే ప్రాముఖ్యతను వివరించారు. ప్రతిరోజు బాలమృతం వంద గ్రాములు ఖచ్చితంగా తినిపించాలని సూచించారు. అంగన్వాడీ సెంటర్లలో పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు సరఫరా చేస్తున్న వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ ప్రాజెక్టు సీడీపీవో స్వాతి, సూపర్వైజర్ ధనలక్ష్మి, రాజీవ్ గాంధీ నగర్ అంగన్వాడి టీచర్ మునీషా, మరియు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పూడూరును జీహెచ్‌ఎంసీలో విలీనం చేయొద్దు

- కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం

అందజేసిన గ్రామస్తులు



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామాన్ని మేడ్చల్ మున్సిపాలిటీలో, జీహెచ్‌ఎంసీలో విలీనం చేయొద్దని కోరుతూ గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించి ఉండి ఓఆర్ఆర్ లోపలి గ్రామాలను విలీనం చేస్తున్నట్టుగా ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఇందులో భాగంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ శాఖ నుండి గత నెల 26వ తేదీన మెమో 5924/ఎంఎ/2024 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారని అన్నారు. పూడూరు గ్రామం ఔటర్ రింగ్ రోడ్డుకు 3.5 కిలోమీటర్లు మేడ్చల్ మున్సిపాలిటీకి 5కిలోమీటర్లు ఉంటుందని తెలిపారు. పూడూరు గ్రామం ఇంకా గ్రామీణ నేపథ్యం కలిగి ఉండి అత్యధిక పేద, మధ్యతరగతి కుటుంబాల ప్రజలు నివసిస్తున్నారని చెప్పారు. పెరిగే ఆస్తి, ఇతర పన్నులు చెల్లించే స్థితిలో గ్రామస్తులు లేరని వాపోయారు. గ్రామస్తుల అభ్యంతరాలు తెలుసుకోకుండా ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తూ మున్సిపాలిటీలో విలీనం చేయడని ఆపాలని కోరారు. పూడూరును గ్రామ పంచాయతీగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నక్క మల్లికార్జున్, అనంత్ రెడ్డి, కుమార్ యాదవ్, మాజీ సర్పంచ్‌లు కోలా శ్రవంతి వెంకటేష్, సింగరేణి సుగుణమ్మ, గోంగాళ్ల జ్యోతిశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు నీరుడి రఘు, సింగరేణి పోచయ్య,మాజీ ఉప సర్పంచ్ తాళ్ళ జనార్ధన్ రెడ్డి,మాజీ వార్డు సభ్యులు కోలా వెంకటేష్,తుపాకుల కృష్ణ,నిమ్మల కృష్ణ,మల్లెల కృష్ణ,మాజీ సొసైటీ డైరెక్టర్ శేఖర్ రెడ్డి, గ్రామస్తులు పుట్నాల నర్సింహ, కొండా శివ, అశోక్ యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా నల్ల పోచమ్మ బోనాలు



పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

బోనాల పండుగను పురస్కరించుకొని మౌలాలి డివిజన్ హనుమాన్ నగర్‌లోని నల్ల పోచమ్మ దేవాలయంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు పొతుల వినోద్ యాదవ్ ఆధ్వర్యంలో బోనాల వేడుకలను నిర్వహించారు. ఈ బోనాల వేడుకలకు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ అమ్మవారి దీవెనలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో ఉండేలా చూడాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, బీబ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, ప్రవీణ్, సంపత్, బికె. శీను, అరుణ్ గౌడ్, రైస్ బాయ్, నరసింహ, మల్లేష్, జగదీష్, ముక్తార్, నర్సింగ్, హరీష్, నాని, షకీల్, అజయ్, శ్యామ్, భాగ్యరాణి, జాన్సి, పద్మ, భరత్, చందు, బబ్లు, నవీన్, భాను, మబ్బు బాయ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి



యువ నాయకులు క్యాతం ముద్దుకృష్ణ

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

నవతెలంగాణ-హైదరాబాద్‌డెస్క్

మహిళలు స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని యువ నాయకులు క్యాతం ముద్దుకృష్ణ అన్నారు. సోమవారం మూడు చింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్‌లో మాజీ సర్పంచ్ క్యాతం కృష్ణమూర్తి జ్ఞాపకర్థంగా వారి కుమారుడు క్యాతం మధుకృష్ణ గ్రామంలోని డ్వాక్రా భవనంలో మహిళలకు 30 కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీఓ వత్సలాదేవి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని కుట్టు మిషన్లను పంపిణీ చేయడం గొప్ప విషయమని దాతను అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శోభారాణి, మాజీ సర్పంచులు ఆంజనేయులు, కటికెల శ్యామల, నాయకులు కీసరి నర్సింలు, రవి, శ్రీనివాస్ చారి, మహిళ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- నూతన అధ్యక్ష, కార్యదర్శులు

హజారి నర్సయ్య, మంగళంపల్లి తిరుపతి



నవతెలంగాణ-జవహర్‌నగర్

మున్నూరు కాపుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతనంగా ఎన్నుకోబడ్డ అధ్యక్షులు ఆచారి నర్సయ్య, ప్రధాన కార్యదర్శి మంగళంపల్లి తిరుపతి అన్నారు. మున్నూరు కాపు సంఘం కాప్రా మండల అధ్యక్ష, కార్యదర్శులుగా జవహర్ నగర్ ప్రాంతానికి చెందిన హజారి నర్సయ్య, మంగళంపల్లి తిరుపతిలను నియమించారు. వారికి మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యాలయంలో యువత రాష్ట్ర అధ్యక్షులు బండి సంజీవ్ కుమార్ పటేల్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాప్రా మండల పరిధిలో మున్నూరు కాపు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రయత్నం చేస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పరిచిన కార్పొరేషన్ ద్వారా నిజమైన అర్హులకు పథకాలు అందించడానికి మున్నూరు కాపు కుటుంబాలకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

ఎస్సీ ఉప కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



రాష్ట్ర ఎస్సీ ఉపకులాల ఐక్య వేదిక

నవతెలంగాణ-ఉప్పల్

ఎస్సీ ఉప కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల కేటాయించాలని మాదిగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న అన్నారు. సోమవారం రాష్ట్ర ఎస్సీ ఉపకులాల ఐక్యవేదిక నాయకులు హనుమంతరావు ఆధ్వర్యంలో ఉప్పల్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశానికి మేడి పాపన్న హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 60 ఏండ్లు దాటినా 57 ఎస్సీ కులాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తెలంగాణ ఏర్పడి 10 ఏండ్లు దాటినా ఎస్సీ ఉపకులాలు విద్య, ఆర్థిక, రాజకీయ ఉద్యోగ రంగాలలో పూర్తిగా వెనకబడి ఉన్నామన్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా మా ఉపకులాలపై తగిన శ్రద్ధ చూపడం లేదన్నారు. జనాభా ప్రతి ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఎన్నికల్లో తమ వాటాను ఇవ్వాలన్నారు. ఈనెల ఏడో తేదీన బేగంపేట్ హరిత ప్లాజాలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలతో జరగబోయే ఉప కులాల మీటింగుకు అందరూ హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో హోలియా దసరి జంగిర్, డాక్కరి బాణలు మంగిష్, కర్నే ముత్యాలు మస్తీన్ నాగేల్లి కిష్టయ్య, సంగర మెచే దేవరకొండ రాంరాజ్, డాక్కాలి కరిన కంటి రాములమ్మ, బైండ్ల మురళి, చందు, గడ్డం, సంజీవ్,గగన వెంకటస్వామి, తూర్పటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



- కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా
- నూతన అధ్యక్షుడు చిన్నం బాల నరసింహ

నవతెలంగాణ - జవహర్‌నగర్

కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని ప్రగతి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు చిన్నం బాల నరసింహ అన్నారు. సోమవారం జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని ప్రగతి నగర్‌లో వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీని కాలనీవాసుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ ఉపాధ్యక్షుడిగా ఆనందాస్ ప్రకాష్, జనరల్ సెక్రెటరీగా ఖాతా శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీగా బీరకాయల లక్ష్యం భాయ్, ఆర్గనైజర్ కార్యదర్శిగా కుమారస్వామి, కోశాధికారి చుక్క యాదయ్య, సభ్యులుగా కడారి గణేష్, వాలి శివప్రసాద్, మాతంగి జోజి కుమార్, వీరభద్రరావు, శ్రీనివాస్, పుణ్యవతిలను ఎన్నుకున్నారు.

మారుతున్న జీవన శైలితో ఆరోగ్యంపై ఆహారపు అలవాట్లు ప్రభావం చూపుతాయి

డాక్టర్ ఎంపల్లి సృజన



నవతెలంగాణ-కాప్రా

మారుతున్న జీవన శైలితో ఆరోగ్యంపై ఆహారపు అలవాట్లు ప్రభావం చూపుతాయని డాక్టర్ ఎంపల్లి సృజన అన్నారు. సోమవారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని శివ సాయి నగర్‌లో ఏర్పాటు చేసిన యోగా అండ్ యూ (వైవై) యోగ శిక్షణ తరగతులను జ్యోతి ప్రజ్వలన చేసిప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేవలం ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడే మాత్రమే మన ఆరోగ్యం పట్ల దృష్టి సారిస్తున్నామని తెలపారు. వ్యాధుల బారిన పడకుండా ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను మర్చిపోతున్నామన్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లో అనే విషయాన్ని గుర్తుంచుకొని ప్రతిరోజు యోగా, వ్యాయామం చేయాలన్నారు. నెలరోజులు ఉచితంగా యోగా తరగతులు ఉదయం 5:00 నుంచి 6 గంటల వరకు ఆఫ్ లైన్, ఉదయం 6:00 గంటల నుంచి 7 గంటల వరకు సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు ఆన్లైన్ క్లాసులు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు రామ్ శెట్టి, శివ సాయి నగర్ కుటుంబాలతోపాటు పలు కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు మహిళలు పాల్గొన్నారు.

అయ్యప్ప సొసైటీలో బోనాల వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో బోనాలు వేడుకలు అంగరంగవైభవంగా జరిగాయి. బోనాల అనంతరం ఇ.షణ్ముఖ్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలారం బండి వేడుకల్లో 10వేల మందికి పైగా భక్తులు హాజరయ్యారు. షణ్ముఖ్ యాదవ్ వరుసగా ఆరో ఏడాది బోనాల వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. మ్యూజికల్ బ్యాండ్‌లు, తెలంగాణ స్థానిక కళారూపాలు ఈ ప్రాంతంలోని గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శిస్తూ వేడుకలను రంగులమయంగా మార్చారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను ప్రదర్శించడంలో, ప్రచారం చేయడంతో ఈ పండుగ ప్రత్యేకంగా నిలిచింది. ఈ బోనాలు, ఫలహార ఉత్సవాల్లో పాల్గొనేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వేల సంఖ్యలో హాజరయ్యారు. ఏండ్లుగా ఈ వేడుకలను ఊహించని రీతిలో నిర్వహిస్తున్నందుకు షణ్ముక్ యాదవ్‌ను పలువురు ప్రముఖులు, నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, వెంకటేష్ యాదవ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
మంగళవారం | ఆగస్టు 06, 2024 | www.navatelangana.com

కోడలుతో గొడవ పడి అత్త అదృశ్యం



నవతెలంగాణ-బాలానగర్

కోడలుతో గొడవ పడిన అత్త ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైన ఘటన బాలానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలానగర్ శోభనకాలనీ రోడ్ నంబర్ 2లో నివాసం ఉంటున్న సుందర్ శాంతి సాయిబాబనగర్‌లో మనవరాలు ఐశ్వర్యను కలిసి వచ్చింది. ఈ విషయంలో ఎక్కడికి వెళ్ళావని అత్తతో కోడలు గొడవ పడింది. దీంతో మనస్తాపా నికి గురైన శాంతి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఆధార్ కార్డు తీసుకుని బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దాంతో కుమారుడు శివకుమార్, తల్లి శాంతి ఆచూకీ కోసం పరిసర ప్రాంతాలు, బంధువుల వద్ద విచారించినా ఫలితం లేకుండా పోయింది. వెంటనే శివకుమార్ బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చికెన్ సెంటర్‌ను ప్రారంభించిన కొలన్



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాం పేట్ నివాసితుడు ఎ.పరమేశ్వర్ రాజీవ్ గృహకల్పలోని రామిరెడ్డి చికెన్ సెంటర్‌ను సోమవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం చేసారు. ఈ సందర్భం గా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మీ వ్యా పారం మంచి అభివృద్ధి చెందాలని కోరు కుంటున్నాను అని చెప్పి, అభినందించారు. ఈ కార్యక్రమంలో మేకల వెంకటేష్, కార్పొరేటర్, చందు ముదిరాజ్ మాజీ ఎంపీటీసీ, సాయిలు యాదవ్, రాజమోహన్ రెడ్డి, కృష్ణారెడ్డి, సన్నీ పాల్గొన్నారు.

ముగిసిన బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్



నవతెలంగాణ-సిటీబ్యూరో

క్రిమ్సన్ ఇంటర్-స్కూల్ బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్-సీజన్ 1 ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు అల్వాల్ లోని సెయింట్ మైఖేల్స్ స్కూల్‌లో నిర్వహించారు. తెలంగాణ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ మద్దతుతో జరిగిన ఈ ఈవెంట్‌లో నగరంలోని 17 పాఠశాలల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. మూడు రోజుల పాటు మొత్తం 19 మ్యాచ్‌లు జరిగాయి. ఈ కార్యక్రమా నికి భారత జాతీయ బాస్కెట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్, సెయింట్ మైకేల్స్ పాఠశాల పూర్వ విద్యార్థి, తెలంగాణ జాతీయ జట్టు మాజీ కెప్టెన్ నాథన్ అబ్రహం, భారత సీనియర్ పురుషుల బాస్కెట్‌బాల్ జట్టు మాజీ ప్రధాన కోచ్ సి.వి.సన్నీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ ఛాంపియన్‌గా నిలవగా, ఆర్మీ పబ్లిక్ స్కూల్ రన్నరప్‌గా నిలిచింది. అనంతరం విజేత జట్టు ఛాంపియన్‌షిప్ ట్రోఫీ, పతకాలను అందుకుంది. అనంతరం క్రిమ్సన్ ఎడ్యుకేషన్ సీఈవో హుసియన్ దోహద్వాల్లా మాట్లాడారు.

'నియోజకవర్గ అభివృద్ధే నా లక్ష్యం'



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. షాపూర్ నగర్‌లోని తన నివాసం వద్ద పలు కాలనీల నుండి వచ్చిన ప్రజల సమ స్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. నిజాంపేట్‌కు చెందిన పలువురు యువకులు మాజీ ఎమ్మెల్యేను కలిసి స్థానికంగా నెలకొన్న రోడ్లు, డ్రయినేజీలు వంటి సమస్యల పై ఆయనకి వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, నిజాంపేట్‌లో మౌలిక సౌకర్యాల అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. పలు బస్తీల నుంచి వచ్చిన ప్రజల సమస్యల తెలుసుకొని వారికి అండ గా ఉంటానని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో కుత్బుల్లాపూర్ నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే అన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



- పర్యావరణ ప్రేమికులు, సామాజిక కార్యకర్త కోల రవీందర్ ముదిరాజ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

భావితరాలకు ప్లాస్టిక్ రహిత సమాజాన్ని అందిం చేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకో వాలని పర్యావరణ ప్రేమికులు, సామాజిక కార్యకర్త కోల రవీందర్ ముదిరాజ్ అన్నారు. అందులో భాగంగా సోమ వారం ప్లాస్టిక్‌తో తయారు చేసిన విస్తారాకులను నిర్మూ లించాలని ఆయన కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కి లలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో డిప్యూటి కమిష నర్లకు, దుండిగల్ మున్సిపల్ కమిషనర్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ ముదిరా జ్ మాట్లాడుతూ.. పట్టణాలలో, హెూటల్స్, ఫంక్షన్ హాల్స్, టిఫిన్ సెంటర్లలో ప్లాస్టిక్ కవరు అంటించిన ఇస్త రాకుల ప్లేట్లలో భోజనాలు, టిఫిన్‌లు వినియోగ దారులు చేయడంతో క్యాన్సర్, కిడ్నీ వివిధ రకాల రోగాల భారీన పడడమే కాకుండా పశువులు తినడంతో అనారోగ్యాలకు గురవుతున్నాయన్నారు. అదే విధంగా ఓపెన్ నాలాలో చేరి కాలువలు నిండటంతో దోమలు విపరీతంగా పెరు గుతున్నాయన్నారు. వర్షాలు పడినప్పుడు కాలనీలు మునిగిపోతుండడం మనం చూస్తుంటామన్నారు. ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లు వాడకుండ ఫంక్షన్ హాల్స్, హెూటల్స్, ఆలయ కమిటీలకు నోటీసులివ్వాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లు విక్రయించే దుకాణాలు, కంపెనీలపై దాడులు చేయాలన్నారు. పర్యావరణాన్ని కాపాడకపోతే భావితరా లకు మనం కీడు చేసిన వారమవుతామన్నారు. మోదు గాకుతో తయారు చేసిన ఇస్తరాకులు వాడితే రైతులకు ఉపాధితో పాటు పశువులకు దాణాగా ఉపయోగపడు తుందన్నారు. గతంలో కుత్బుల్లాపూర్ జంట సర్కిల్‌లలో తీసిన ఇంకుడు గుంతలను గుర్తించి, శుద్ధిచేసి ఇసుకను నింపాలన్నారు. వర్షపు నీరు వృథా పోనివ్వకుండ ఇంకు డు గుంతలను మళ్లించి భూగర్భ జలాలను పెంచాల న్నారు. ఈ కార్యక్రమంలో పి.సురేం దర్ రెడ్డి, బసప్ప, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సీఎం సహాయనిధి వరం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సీఎం సహాయ నిధి పేదలకు వరంగా మారింది.. ఆపత్కాలంలో ఆదుకుంటూ రోగుల్లో భరోసా నింపుతు న్నది. రోడ్డు ప్రమాదాలు, వివిధ వ్యాధులతో బాధపడు తున్నవారికి రాష్ట్ర సర్కార్ కొండంత ధైర్యాన్నిస్తున్నది. ముందుగానే ఎల్‌వోసీని అందజేస్తుండడంతో సంబం ధిత దవాఖానల్లో ఉచితంగా వైద్యసేవలందుతు న్నాయి. అందులో భాగంగానే సోమవారం చింతల్‌లోని బీఆర్ ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ఆదేశాల మేరకు నిర్వహించిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, పలు డివిజన్ల అధ్యక్షులు, సీనియర్ నాయకులు హాజరై రూ.90 లక్షల 18 వేల రూపాయల విలువగల 247 సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధి దారులకు అందజే శారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదల్లో ఉన్న నిరుపేదలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపశమ నాన్ని ఇస్తుందన్నారు. గత సంవత్సర కాలంగా ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిన సీఎం సహాయనిధి చెక్కులను నేడు లబ్ధిదారులకు అందజేశామన్నారు. రానున్న రోజు ల్లో కూడా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో.. అర్హులైన ప్రతి ఒక్కరికి సీఎం సహాయనిధి అందే విధంగా కృషి చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మంత్రి సత్యనారా యణ, జగన్, మాజీ కార్పొరేటర్ కె.ఎం.గౌరీష్, సురేష్ రెడ్డి, దూలపల్లి మాజీ సర్పంచ్ చింతల దేవేందర్ యాద వ్, పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, జగద్గిరిగుట్ట శ్రీ వెంకటేశ్వర దేవస్థానం ఛైర్మెన్ వేణు యాదవ్, బీఆర్ ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' దరఖాస్తులను పరిష్కరించాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

నవతెలంగాణ-సిటీబ్యూరో



ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. స్టేట్ లెవెల్ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను శీఘ్రంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. జిల్లా స్థాయిలో పరిష్కారం కాకుండా, ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉండే దరఖాస్తులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి మీటింగ్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులను కలెక్టర్ అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ సైదులుతో కలిసి స్వీకరించారు. ప్రజావాణికి 108 దరఖాస్తులు వచ్చినట్టు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శిగా జి.కృష్ణ



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి మండలం సీపీఐ నిర్మాణా కౌన్సిల్ సమావేశం శ్రీనగర్ సీపీఐ పార్టీ కార్యాలయంలో సోమ వారం జరిగింది. ఈ సమావేశానికి కె.మనోజ్ చారి అధ్యక్షతన... సమావేశానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ మల్కాగిరి జిల్లా సీపీఐ సెక్రటరీ. డీజీ సాయిలగౌడ్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు పరచాలని, అంతేకాకుండా ప్రభుత్వం భూమిలో గుడిసెలు వేసుకున్న వారికి ఇండ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. అనంతరం కూకట్‌పల్లి మండలం కార్యదర్శి సీపీఐ కార్యదర్శి జీ.కృష్ణ మాట్లాడుతూ అర్హులైన వారికి డబుల్ బెడ్ రూములు ఇవ్వాలని కోరారు. అనంతరం సీపీఐ పార్టీ కూకట్‌పల్లి మండలం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కూకట్‌పల్లి మండలం సీపీఐ కార్యదర్శిగా జి.కృష్ణ, 13 మందితో ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులుగా కె.మనోజ్ చారి, ఎండీ నాగ బాలయ్య, ఎం.దావీద్, జీ.ఉమా రాణి, ఎం.చంద్రమ్మ, గోపాల్, బాలయ్య, జీ.రాములు, పి.నాగలక్ష్మి, తదితరులు ఎంపికయ్యారు.

మొక్కల పెంపకంతోనే మానవ మనగడ

- ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని, మొక్కలు పెంపకంతోనే మానవ మను గడ సాధ్యమని కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. సోమవారం 130 డివిజన్ పరిధిలోని సుభాష్ నగర్‌లో నిర్వహించిన స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజ రై మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డితో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛధనం - పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఆయా పరిసరాలలో తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించుకొని, పచ్చ దనాన్ని పెంపొందిస్తేనే వాతావరణ కాలుష్యం తగ్గి ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ నర్సింహా, ఏ.ఎం.హెచ్.ఓ భార్గవ్, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, జీహెచ్ఎంసీ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం..పచ్చదనంతోనే సంపూర్ణ ఆరోగ్యం



- కార్పొరేటర్ కొలుకుల జగన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

స్వచ్ఛదనం పచ్చదనం..తోనే ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరే టర్ కొలుకుల జగన్ అన్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపల్ అధికారులు డివిజన్ ఇన్‌చార్జ్ సునందిని, డాక్టర్ చంద్రశేఖర్‌లతో కలిసి డివిజన్ పరిధిలోని మగ్దూంనగర్ నుంచి పలు ప్రాంతా లలో పర్యటించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటడం వలన లాభాలు తదితర అంశాలపై ప్రజలలో అవగాహన కల్పిస్తూ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో దోమల వలన డెంగ్యూ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఆయన కోరారు. నాలాలలో వ్యర్థ పదార్థాలను వేయకూడదని తెలిపారు. ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ నాయకులు కొలుకుల జైహింద్, దూడల పాపయ్య గౌడ్, చుండూరు దాసు, రాయి రాజేష్, రాయి విగ్నేష్, మున్సిపల్ అధికారులు గజేంద్ర బాబు, సీఓ కిషోర్,ఆయా ప్రాంతవాసులు పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్యను పరిష్కరించడానికి.. బకెట్ క్లినింగ్ చేపట్టాలి



- కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కాలనీలో నెలకొన్న డ్రయినేజీ సమస్యను పరిష్కరిం చడానికి బకెట్ క్లినింగ్ చేపట్టాలని హైదర్నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు అన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని సమతా నగర్‌లో తలెత్తిన డ్రయినేజీ సమస్యను సివరేజ్ బోర్డ్ అధికారులతో, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మ్యాన్ హెూల్ నుంచి ప్రతి మ్యాన్ హెూల్ వరకు బకెట్ క్లినింగ్ ద్వారా మ్యాన్ హెూల్‌లో పేరుకుపోయిన పూడికను తీయాల న్నారు. మ్యాన్ హెూల్‌లో పేరుకుపోయిన చెత్త చెదారం ను తీసి వేసి, నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాల న్నారు. ఎక్కడ డ్రయినేజీ సమస్యాత్మక ప్రాంతంగా నిత్యం పొంగే ప్రదేశాలలో, కాలనీలలో ప్రథమ ప్రాధా న్యతగా పాత లైన్లు మార్చి కొత్త లైన్లను కలపాలన్నారు. బకెట్ క్లినింగ్ పెట్టి సమస్యను పరిష్కరించాలని, ఎక్కడ సమస్య ఉంటే అక్కడే పరిష్కారం చేయాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని సివరేజ్ బోర్డ్ అధికారులకు తెలియజేశారు. ఏదైనా సమస్యలు ఉంటే నేరుగా నా దృష్టికి గాని, కార్పొరేటర్ కార్యాలయం దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను తప్పకుండా పరిష్కరిస్తానని డివిజన్ ప్రజలకు ఎల్లవేళలా అందుబా టులో ఉంటానని ఈ సందర్భంగా కార్పొరేటర్ తెలిపా రు. ఈ కార్యక్రమంలో ఏఈ రాజీవ్, వర్క్ ఇన్ స్పెక్టర్ మహదేవ్, డ్రయినేజీ సూపర్ వైజర్ ఓం.ప్రకాష్, కాలనీ వాసులు బాలు, వాసు, రామకోటేశ్వర రావు, శ్రీనివాస్, నాయకులు నిరంజన్ గౌడ్, నిఖిల్ పాల్గొన్నారు.

వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకూడదు..



- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న "స్వచ్ఛధనం పచ్చదనం" కార్యక్రమంలో భాగంగా సోమవారం బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని శ్రీహరినగర్ వసుంధర హాస్పిటల్ దగ్గర స్థానిక కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు, నోడల్ అధికా రి వాణిశ్రీల ఆధ్వర్యంలో వ్యర్థాలను తొలగించారు. అనంతరం ప్రజలకు పలు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్ మాజీ కార్పొరేటర్ బాబురావు, బాలాజీనగర్ వార్డ్ కార్యాలయం ఇన్‌చార్జి టి.కె ప్రభాకర్, సి.ఓ సురేష్, శ్రీహరినగర్ అసోసియేషన్ అధ్యక్షులు జయరాజ్, కార్యదర్శి డా.రాజేంద్రప్రసాద్, భాస్కర్ రావు, స్థానికులు నాయుడు, జీహెచ్ఎంసీ కార్మికులు పాల్గొన్నారు.

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో నూతనంగ పదవి బాధ్యతలు..



నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఎస్ఎంసీ మేనేజర్ పవన్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ ప్రతాప్ సింగ్, ఏఈ ప్రవీణ్ కుమార్, డీఈ వసంతలు నూతన ంగా విధులు చేపట్టారు. కమిషనర్‌లు అధికారులను మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ నీలా గోపాల్ రెడ్డి శాలువాతో సత్కరించి, అభినందనలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సత్య నారాయణ, ఇతర ముఖ్య అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ సిబ్బందిని నియమించాలి



- 'ప్రజావాణి'లో గుబ్బల లక్ష్మీనారాయణ, భ్రమరాంబ ఫిర్యాదు
- పెండింగ్‌లో ఉన్న పెన్షన్లు కూడా వెంటనే మంజూరు చేయాలి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

గతంలో పెన్షన్ సెక్షన్ ఇన్‌ఛార్జిగా ఉన్న వ్యక్తి బదిలీ కావడంతో ఆ స్థానా న్ని ఇప్పటివరకు భర్తీ చేయలేదని.. అలాగే పెన్షన్ ఆపరేటర్ కూడా లేకపోవడ తో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. శాంతి వికలాంగుల, వయోవృద్ధుల, వితంతువుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు భ్రమరాంబ, సహాయ కార్యదర్శి గుబ్బ ల లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వికలాంగులకు సౌకర్యా ర్థం ర్యాంపును నియమించాలని అన్నారు. ఏటి పరిస్థితుల్లో కార్యాలయంలో సిబ్బందిని పెట్టాలని లేకపోతే జిల్లా కలెక్టర్, జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లి సమస్య పరిష్కారాన్ని కృషి చేస్తామన్నారు. శాంతి వికలాంగుల, వయవృ ద్ధుల, వితంతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో... కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం 'ప్రజావాణి'లో ఉప కమిషనర్ నరసింహకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కుడుపుడి వెంకటేష్, లక్ష్మీ పాల్గొన్నారు.

కవర్ డ్రైవ్ ఇండోర్ క్రికెట్ నెట్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్సీ



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి ప్రగతి నగర్ లోసోమవారం నూతనంగా ఏర్పాటు చేసిన కవర్ డ్రైవ్ ఇండోర్ క్రికెట్ నెట్స్‌ను మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా నిర్వహకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, నిజాంపేట్ కార్పొరేష న్ బీఆర్ఎస్ ప్రెసిడెంట్ రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్లు బాలాజీ నాయక్, శ్రీరాములు, గాజుల సుజాత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ, నాయకులు రవికాంత్, సాంబశివారెడ్డి,స్టాలిన్ రెడ్డి, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సహకారంతో ఆర్‌ఓ ప్లాంట్



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ లా కళాశాల ఈ1 వసతి గృహంలో సోమవారం మంచి నీటి ఆర్‌ఓ ప్లాంట్‌ను లా కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ. రాధికా యాదవ్, సీనియర్ ప్రొఫెసర్, ఓయూ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొ. జీబీ.రెడ్డి ,ప్రోద్బలంతో "లా కాలేజీ "అల్యూమిని ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో 'లా' కాలేజీ విద్యార్థులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. న్యాయ విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ప్రిన్సిపాల్ చెప్పారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల్లో ఉన్న ఐక్యత ను ప్రశంసించారు. వారికి కతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

హబ్సిగూడలో తల్లిపాల వారోత్సవాలు



నవతెలంగాణ-ఓయూ

హబ్సిగూడ డివిజన్ స్ట్రీట్ నెంబర్ 8 గాంధీ గిరిజన బస్తీ అంగన్వాడి సెంటర్ లో సోమవారం తల్లిపాల వారోత్సవం, గర్భవతులకు శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్, అంగన్వాడీ టీచర్ స్వాతి, హెల్పర్స్, మహిళలు పాల్గొన్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ గర్భవతులకు శ్రీమంతం కార్యక్రమంలో భాగంగా పండ్లు, గాజులు, హల్దీ, కుంకుమ, పూలు, గోరింటాకు అందజేసి జాగ్రత్తగా ఆరోగ్య పరమైన చర్యలు జాగ్రత్తలు చూసుకోవాలని సూచించారు. అలాగే తల్లిపాలు పిల్లలకి ఎంతో పౌష్టికాహారం అని పిల్లల తల్లులకు వివరించారు.

ప్రజావాణికి 118 దరఖాస్తులు

- పరిష్కారాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్న కమిషనర్ ఆమ్రపాలి కాట

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ వ్యాప్తంగా ప్రజావాణికి 118 దరఖాస్తులు వచ్చాయని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట తెలిపారు. వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులకు ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యల పరిష్కారానికి నగరం వివిధ ప్రాంతాల నుండి ప్రజలు తరలి వచ్చారు. కమిషనర్ ఆమ్రపాలి కాట ప్రజల నుండి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఆయా విభాగాల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటి కప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఎలాంటి జాప్యం లేకుండా సమస్యను పరిష్కరించి సంబంధిత అర్జీదారులకు తెలియజేయాలని, పరిష్కారం కానట్టయితే అందుకు గల కారణాలు లిఖిత పూర్వకంగా తెలియజేయాలని సూచించారు. ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 8 విన్నపాలు రాగా సంబంధిత అధికారులకు పరిష్కారానికి పంపారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 43 విన్నపాలు రాగా అందులో టౌన్ ప్లానింగ్ 23, రెవెన్యూ 4, అడ్మిన్ 3, సి.ఇ మెయింటెనెన్స్ 3, సి.ఎం.ఓ.హెచ్ 2, హౌసింగ్ 2, యూ.బీ.డీ, సీపీఆర్ఓ, ఎల్.ఏ.ఓ, ఫైనాన్స్, ట్రాన్స్ పోర్ట్, స్పోర్ట్స్ విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున విన్నపాలు వచ్చాయి. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 75 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి 46, ఖైరతాబాద్ 13, సికింద్రాబాద్ 6, శేరిలింగంపల్లి 5, చార్మినార్ జోన్ లో 3, ఎల్బీనగర్ జోన్ లో 2 విజ్ఞప్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, శ్రీవాత్సవ, సత్యనారాయణ, యాదగిరి రావు, గీతా రాధిక, అడిషనల్ సిసిపి లు గంగాధర్, ప్రదీప్, ఎస్.ఎన్.డీ.పీ.సీ.ఇ కోటేశ్వర రావు, సీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ పద్మజ, ఆయా విభాగాల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి

- ఎమ్మెల్యే శ్రీ గణేష్ పిలుపు

నవతెలంగాణ-కంటోన్మెంట్

కాలుష్య నివారణకు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కంటోన్మెంట్ మ్మెల్యే శ్రీగణేష్ పిలుపునిచ్చారు. సోమవారం టీచర్స్ కాలనీ పార్కులో నిర్వహించిన స్వచ్ఛ ధనం పచ్చదనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొక్కలు నాటడంతోపాటు అవి భారీ వృక్షాలుగా ఎదిగే వరకు వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. దోమల నివారణకు, చెరువుల సంరక్షణకు,నాళాల క్లీనింగ్, వనమహోత్సవం వంటి కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు జీహెచ్ఎంసీ తలపెట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు



ప్రభుత్వ పాఠశాలకు దారిని ఏర్పాటు చేయండి

- మరోసారి ప్రజావాణిలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన సీపీఐ, తల్లుల సంఘం

నవ తెలంగాణ-ఓయూ

చిలకలగూడలోని దూద్ బాయ్ ప్రభుత్వ పాఠశాలకు దారి ఏర్పాటులో ప్రభుత్వ నిర్లక్ష్యం వీడి సత్వరమే సరైన మార్గాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం సీపీఐ, తల్లుల సంఘం ఆధ్వర్యంలో ప్రజావాణిలో రెండో సారి కలెక్టర్ దష్టికి తీసుకుపోయారు. ఈ సందర్భంగా సీపీఐ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులు ఉపయోగిస్తున్న రోడ్డు మార్గం చాలా ఇరుకుగా, మురికి నీరుతో ఉండడంతో విద్యార్థులు, అంగన్వాడి కేంద్రానికి వచ్చే గర్భిణులు, తల్లులు, ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అదేవిధంగా స్కూల్‌కు, అంగన్వాడి కేంద్రానికి సంబంధించిన ఆహారం, ఇతర సామాగ్రిని తీసుకురావడానికి వాహనాలు వచ్చే వీలు లేదన్నారు. దాంతో సుమారు 200 మీటర్ల దూరం నుంచి సామాగ్రిని మోసుకు వస్తున్నారని తెలిపారు. ఈ విషయంపైన ప్రత్యేక దష్టి సారించి తక్షణమే దూద్ బావి ప్రభుత్వ పాఠశాలకు తూర్పు వైపున సరైన రోడ్డు మార్గాన్ని, రహదారిని ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు ప్రజావాణిలో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కొమురెల్లి బాబు, గౌరీ నాగరాజ్, తల్లుల సంఘం నాయకులు వరలక్ష్మి, రామ లీల పాల్గొన్నారు.



వెస్ట్ మారేడ్‌పల్లి నెహ్రూ పార్కులో ప్రజలకు మొక్కలను పంపిణీ చేసిన కార్పొరేటర్ కొంతం దీపిక. నవతెలంగాణ-బేగంపేట

ప్రజల సహకారంతోనే పరిశుభ్ర నగరం

- జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి
- పలు ప్రాంతాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ప్రారంభం



బంజారాహిల్స్ డివిజన్‌లో...

నవతెలంగాణ - బంజారాహిల్స్

ప్రజల సహకారంతోనే నగరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దగలమని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. బంజారా హిల్స్ డివిజన్ పరిధిలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సోమవారం ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలా విద్యార్థులకు, స్థానిక ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నగర మేయర్ విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి పాల్గొని కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రజలంతా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నడుం బిగించి ముందుకు సాగాలని సూచించారు. గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ నగర పరిశుభ్రత పై ఎంత దృష్టి సారించినా ప్రజల సహకారం లేనిదే సంపూర్ణ పరిశుభ్రత సాధించలేమని అన్నారు. వర్షాకాలం దోమలు ప్రబలే అవకాశం ఉన్నందున ఎవరికి వారు పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని కోరారు. ముఖ్యంగా విద్యార్థులు ప్రతి ఆదివారం వారి అవకాశాన్ని బట్టి పరిసరాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులే మొదటి వారియర్స్ అని దీన్ని దృష్టిలో ఉంచుకొని వారికి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అంతకుముందు వారు ఎన్‌బీటీనగర్ లో స్వచ్ఛత పచ్చదనం పరిశుభ్రత మన అందరి బాధ్యత అంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రత్యేక వాక్ నిర్వహించారు. నిర్మాణాలు చేపట్టే వారు సైతం వ్యర్థాలను రహదారులపై ఇతరుల నివాసానికి అడ్డుగా ఉండే విధంగా ఉంచవద్దని టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి వాటిని తరలించే ప్రక్రియ వేగవంతంగా చేసుకోవాలని సూచించారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో పనులు పూర్తి కాకుండా చుట్టూరా ఉన్న పిచ్చి మొక్కలు



యూసుఫ్‌గూడ డివిజన్‌లో...

గతంలో నిర్మాణం కోసం తీసుకువచ్చిన సిమెంట్ బస్తాలు తడిసిపోయి నిరుపయోగంగా పడి ఉండటంపై స్థానికులు మేయర్‌కు తెలిపారు. దాంతో ఇలాంటి వారికి కాంట్రాక్టులు ఇవ్వద్దని ఇంత నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకోవాలని మేయర్ కోరారు. ఈ కార్యక్రమంలో డీఎంసీ ప్రశాంతి,వాటర్ బోర్డు సీజీఎం శ్రీధర్,జీఎం హరిశంకర్,సానిటేషన్ అధికారి డాక్టర్ రాంబాబు,ఏ ఎమ్ హెచ్ ఓ రవికుమార్,ఇంజినీరింగ్ అధికారులు విజయ్ కుమార్ యూసీడీ అధికారులు సిబ్బంది తదితరాలు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ : యూసుఫ్ గూడా డివిజన్ కమలాపురి కాలనీ సంక్షేమ సంఘం వారితో కలిసి, ఈ కార్యక్రమాన్ని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, అధికారులు సోమవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాటిన మొక్కలు ఎండిపోకుండా, భద్రంగా ఉండేలా జీహెచ్ఎంసీ కార్మికులు, అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్, ఈఈ రాజ్ కుమార్, డి.ఈ రాజు, స్థానిక కార్పొరేటర్ రాజకుమార్ పటేల్, డివిజన్ ప్రెసిడెంట్ సంతోష్, నర్సింగ్ దాస్, బసవరాజు, శ్రీనివాస్, అమ్మాజీ, అశోక్ నిర్మల, నాగమణి, రేష్మ, దుర్గా తదితరులు పాల్గొన్నారు.



వెంగళరావునగర్ డివిజన్‌లో...

వెంగళరావు నగర్ డివిజన్ జవహర్ నగర్‌లో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్, ఈఈ రాజ్ కుమార్, మల్లికార్జున్, ఏఈ అవినాష్, ఇన్‌చార్జి అలీ, స్థానిక కార్పొరేటర్ దేదీప్య రావు, విజయ ముదిరాజ్, అంబటి రామకష్ణ, వేణు, ఆంజనేయులు యాదవ్, గజ్జల బాలకృష్ణ పవన్ ముదిరాజ్, ఆబిద, మహబూబ్, పూజారి బాలరాజ్, బాలు,



బోరబండ డివిజన్‌లో...

పని , బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బోరబండ డివిజన్‌లో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. బోరబండ డివిజన్‌లోని పీలి దర్గా వద్ద పరిశుభ్రతపై అవగహన కల్పించారు. అనంతరం ఇంటింటికి తిరిగి మొక్కల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటి కమిషనర్ సేవా ఇస్లావత్, ఈ.ఈ. రాజ్ కుమాం ", ఎ.ఈ.- భరత్, సానిటరీ సుపర్ వైజర్ విజయ్ కుమార్, పీడీయూసీడీ వెంకట కష్ణ, హార్టికల్చర్ మేనేజర్ - యుసూఫ్, ఎస్ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

ఓయూ : స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు సోమవారం తార్నాక డివిజన్ లోని నాగార్జున నగర్ కాలనీ పార్కులో సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్, ఐఎన్‌టీయూసీ ప్రెసిడెంట్, కాంగ్రెస్ నేత మోతె శోభన్ రెడ్డి తో కలిసి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి మొక్కలు నాటారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పచ్చదనాన్ని ప్రోత్స హించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. ఇంటింటికి మొక్కలను పంపిణీ చేస్తున్నామన్నారు.నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి శు



తార్నాక డివిజన్‌లో...

భ్రం చేసే ప్రజలకు ఎలాంటి వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సికింద్రాబాద్ డిప్యూటీ కమిషనర్ తదితరులు ఉన్నారు.



హబ్సిగూడ డివిజన్‌లో...

స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం హెచ్ఎంసీ అధికారులతో కలిసి హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ బస్తీలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ సంగీత, యూబీజీ సుష్మ, డీఈ చందన, రంజేశ్వర్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ జవాన్, బీజేపీ సీనియర్ నాయకులు సంజయ్ పటేల్ గారు, మరియు బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై శ్రద్ధ పెట్టాలి

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విద్యార్థులకు సూచించారు. సోమవారం అమీర్‌పేటలోని మున్సిపల్ గ్రౌండ్‌లో మూడు రోజులపాటు నిర్వహించే తలసాని శంకర్ యాదవ్ స్మారక క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా శంకర్ యాదవ్ చిత్రపటం వద్ద పూలు సమర్పించి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే బ్యాట్ పట్టి క్రికెట్ ఆడి పోటీలకు హాజరైన విద్యార్థులను ఉత్తేజపరిచారు. తన సోదరుడు, మోండా మార్కెట్ అధ్యక్షులు



తలసాని శంకర్ యాదవ్ జ్ఞాపకార్థం క్రికెట్ పోటీలను నిర్వహించడం పట్ల నిర్వహకులను అభినందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలు ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తాయని, క్రీడలలో కూడా రాణించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను ఆసక్తి కలిగిన క్రీడలలో ప్రోత్సహించాలని కోరారు. విద్యార్థులు ఇలాంటి క్రీడా పోటీలను వేదికలుగా చేసుకొని తమ ప్రతిభను చాటాలన్నారు. క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడం వల్ల ఒలంపిక్స్ వంటి అంతర్జాతీయ పోటీలలో క్రీడాకారులు రాణించలేకపో తున్నారని తెలిపారు. మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, కూతురు నర్సింహ, బలరాం, వనం శ్రీనివాస్, నిర్వహకులు సచిన్ తదితరులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని తార్నాక డివిజన్ మరియు ఇతర డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు తార్నాక లోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం రూ 4 లక్షల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డితో కలిసి గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకోలేని వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో మేలు చేస్తుందన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల ద్వారా ప్రజలకు వారి కుటుంబ పెద్దగా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తూ ప్రభుత్వం ద్వారా ఆదుకుంటున్నందుకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు.

నవతెలంగాణ-ఓయూ

'నిమ్స్'లో సెక్యూరిటీ గార్డుల వేతన బకాయిలు చెల్లించాలి



- నిమ్స్ కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ (సీఐటీయూ)

నవతెలంగాణ-బంజారా హిల్స్

పంజాగుట్ట నిమ్స్ హాస్పటల్ లో పనిచేస్తున్న కాంట్రాక్టు సెక్యూరిటీ గార్డులకు బకాయి ఉన్న రెండు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ నిమ్స్ కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నిమ్స్ ఆస్పత్రి ప్రధాన గేట్ నుండి ఆంధ్రాబ్యాంక్ వరకు.. అక్కడి నుంచి నిమ్స్ సెక్యూరిటీ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం యూనియన్ అధ్యక్షులు ఎం వెంకటేష్ మాట్లాడుతూ.. వేతనాలు చెల్లించాలని కోరితే విధుల్లో నుంచి తొలగిస్తామని బెదిరిస్తూ కాంట్రాక్టర్ చేస్తున్న వేధింపులపై పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేశామని చెప్పారు. పోలీసులు కలగజేసుకోవడంతో కాంట్రాక్టర్ క్యాపిటల్ సెక్యూరిటీ సంస్థ వారు నిరసన తెలియజేస్తున్న సెక్యూరిటీ యూనియన్ నాయకుల, విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ వద్దకు వచ్చి రెండు రోజుల్లో వేతనాలు చెల్లించేలా చూస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. నిమ్స్ హాస్పిటల్ లో సెక్యూరిటీ సర్వీసు నిర్వహించడానికి శ్రీ కార్తికేయ,క్యాపిటల్ రెండు సెక్యూరిటీ ఏజెన్సీలు ఉన్నాయని అన్నారు. ఈ రెండు సెక్యూరిటీ ఏజెన్సీల కింద పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు కార్తికేయ సంస్థ కింద పనిచేస్తున్న వారికి 2023 జూలై 19 నుండి రూ 15,600/- ఇస్తున్నారని, క్యాపిటల్ సెక్యూరిటీ సంస్థ కింద పనిచేస్తున్న వారికి ఇప్పటికీ రూ 13,500/- మాత్రమే నెల వేతనంగా ఇస్తున్నారని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా పట్టించుకోకపోవడం చాలా దారుణమన్నారు. డైరెక్టర్ దగ్గర నుండి కాంట్రాక్ట్ వర్కర్ల వరకు అందరికీ ప్రతినెల ఒకటవ తేదీ నుండి 5వ తేదీ లోపు వేతనాలు వస్తున్నాయని అట్లాంటిది సెక్యూరిటీ గార్డులకు రెండు నెలలుగా వేతనాలు ఎందుకు చెల్లించడం లేదని అన్నారు. సమయానికి వేతనం కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న క్యాపిటల్ సెక్యూరిటీ సంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. క్యాపిటల్ సెక్యూరిటీ సంస్థ తో పాటు, శ్రీ కార్తికేయ సెక్యూరిటీ సంస్థ కింద పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు అందరికీ ప్రతినెల 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, పే స్లిప్పులు ఇవ్వాలని, చట్ట ప్రకారం ఈఎల్, సీఎల్, పండుగ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్యాపిటల్ సెక్యూరిటీ సంస్థ కింద పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు 2023 జూలై 19 నుండి తక్కువగా ఇచ్చిన వేతనాన్ని ఏరియర్స్ రూపంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఈనెల 8 , 9 తేదీల్లో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఏపీఎస్ విశ్వవిద్యాలయంలో జరుగనున్న "ప్రస్తుత పరిస్థితుల్లో ఉన్నత విద్యకు ప్రభుత్వ పోషకులు, మన బాధ్యతలు" అనే అంశం పై జాతీయ స్థాయిలో సెమినార్‌కు ఎన్‌జీఓస్ అసోసియేషన్ టుస్టియా రాష్ట్ర అధ్యక్షుడు బియాని సోమవారం రాత్రి బయల్దేరారు.

నవతెలంగాణ-ఓయూ

బస్సుల సంఖ్యను పెంచాలి : సీపీఐ(ఎం)



- బోరబండకు వచ్చే బస్సులను ఎస్‌పీఆర్ హిల్స్ నుంచి సైట్ త్రీ వరకు నడపాలని డిమాండ్

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బోరబండ మీదుగా ఎస్పీ ఆర్ హిల్స్ నుండి బోరబండ సైట్ 3 వరకు ఆర్టీసీ బస్సులు నడిపే అవకాశం ఉన్నా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని, వెంటనే బస్సుల సంఖ్యను పెంచి బోరబండ సైట్ త్రీ వరకు బస్సులు నడపాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రయాణికులతో సంతకాలు సేకరణ చేసి అధికారులకు పంపారు. ఈ సందర్భంగా ప్రయాణికులు వారి బాధలు ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు తెలిసే వరకు పంపించాలని సీపీఐ(ఎం) నాయకులను కోరారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) నాయకులు టీ సాయి శేషగిరి రావు మాట్లాడుతూ మూడు సార్లు గెలిచిన ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ స్థానిక ప్రజలకు మినీ బస్సులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇంతవరకు నెరవేరలేదని తెలిపారు. బోరబండ రహమత్ నగర్ ఎస్‌పీఆర్ హిల్స్ ,మోతి నగర్ ప్రజలు, విద్యార్థులు ప్రతిరోజూ ఉన్న బస్సులు చాలక ఇబ్బందులకు గురవుతున్నారని, వాటి సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం కార్మిక నగర్ బస్ స్టాప్‌లో ప్రజల నుంచి సంతకాలు సేకరించి అధికారులకు ఇచ్చినట్టు తెలిపారు. వెంటనే ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకుని బస్సుల సంఖ్య పెంచాలని లేనియెడల ఈ నెల 8న బస్సు భవనం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని చెప్పారు. లేదంటే సమస్య పరిష్కారం అయ్యేవరకు ప్రజలతో కలిసి పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెన్నుపాటి చంద్రశేఖర రావు, రాపర్తి అశోక్, ఆసిఫ్, వై .యాదగిరి, సోమల నాయక్, నగేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

రాంగోపాల్ పేట్ డివిజన్‌లోని డి.వి కాలనీ, కష్ణ నగర్ కాలనీ, సింధి కాలనీ తదితర ప్రాంతాలలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్, బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు చీర శ్రీకాంత్ పాల్గొన్నారు. వారితో పాటు



ప్రభుత్వాధికారులు. సర్కిల్ 30 డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, 148 వార్డ్ ఇన్‌చార్జి కుమార్, శానిటేషన్ సిబ్బంది, ఎంటమాలజీ విభాగ సిబ్బంది, కాలనీవాసులు, స్థానిక నాయకులు శ్రీనివాస్ యాదవ్, కిరణ్, బైరిశెట్టి కిరణ్, రఘు తదితరులు పాల్గొన్నారు .

నవతెలంగాణ-బేగంపేట

నవతెలంగాణ
హైదరాబాద్
HMDA
మంగళవారం | ఆగస్టు 06, 2024 | www.navatelangana.com

హచ్ కుక్క పోయిందని..ఎల్‌బీనగర్‌లో పిర్యాదు..



● ఆలస్యంగా వెలుగులోకి

నవతెలంగాణ-హాయత్ నగర్

కుక్కతో ద్వీ చక్ర వాహనంపై వెళ్తున్న ఓ యువకుడు కింద పడడంతో అటునుంచి వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తులు హచ్ కుక్క ఎత్తుకెళ్లిన ఘటన ఎల్‌బి నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పిర్యాదు దారుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి నుంచి స్కూటీ పై రోడ్డు పైకి రాగా ఎన్‌టీఆర్ నగర్ మార్కెట్ ఎదురుగా ఉన్న బస్ స్టాండ్ వద్ద అదుపు తప్పి కింద పడి పోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు పగ్ జాతికి చెందిన వారు.. హచ్ కుక్కను గత నెల 11న ఎత్తుకెళ్లడంతో ఎల్‌బీ నగర్ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. ఇట్టి విషయంలో క్రైమ్ ఇన్‌స్పెక్టర్ సుధా కర్‌ను నవతెలంగాన వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా స్పందించలేదు.

దుండిగల్ 9వ వార్డులో స్వచ్ఛదనం -పచ్చదనం



నవతెలంగాణ-దుండిగల్

దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని 9వార్డులో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా స్థానిక కౌన్సిలర్ బండారి మహేందర్ యాదవ్ అధ్వర్యలో.. అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆశ వర్కర్స్, మున్సిపాలిటీ సిబ్బంది వివిధ కాలనీ వాసులు పాల్గొన్నారు. కౌన్సిలర్ మహేందర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.

స్వచ్ఛదనం-పచ్చదనం చేపట్టాలి

● జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
● పాఠశాల ఆవరణను చీపురుతో ఊడ్చి చెత్తను ట్రాక్టర్‌లో వేసిన కలెక్టర్





నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం పక్కాగా చేపట్టి విజయవంతం చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులకు సూచించారు. సోమవారం కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమాన్ని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌తో కలసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా చీపురు పట్టుకొని కళాశాల ఆవరణలోని చెత్తను ఊడిచి ట్రాక్టర్‌లో వేశారు. కళాశాల హాస్టల్ గదులను, పాఠశాల పరిసరాలను పరిశీలించి కావాల్సిన ట్యూబ్, ఫ్యాన్, చిన్న చిన్న మరమ్మతులు, వైట్ వాష్, కనీస అవసరాలు చేపట్టుటకు ప్రతిపాదనలు సమర్పించవలసిందిగా అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్యం, పచ్చదనం పెంచడమే లక్ష్యంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంను పక్కాగా చేపట్టి విజయవంతం చేయాలని సూచించారు. వ్యర్థాల తొలగింపు, దోమల నిర్మూలన, నాలాల క్లీనింగ్, చెరువుల సంరక్షణ, వనమహోత్సవంను చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో హాజరు శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లా డాలని సూచించారు. విద్యార్థులు రెగ్యులర్‌గా పాఠశాలలకు వచ్చేలా చూడాలన్నారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ ఉమ రమేష్ యాదవ్, డిస్ట్రిక్ ఇంటర్మీడియట్ ఆఫీసర్ డి.ఒడ్డెన్న, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్, ఎంహెచ్ఓ హేమలత, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిరంజీవి, తహసిల్దార్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'మహిళా అని చూడకుండా దాడి చేయడం దారుణం'



నవతెలంగాణ-సిటీబ్యూరో

దొంగతనం కేసులో అరెస్టు చేసి, విచారణ చేపట్టాల్సిన పోలీసులు కనీసం మహిళ అని కూడా చూడకుండా అర్ధరాత్రి వరకు పోలీస్ స్టేషనులోనే ఉంచి థర్డ్ డిగ్రీ ప్రయోగించడం దారణమని సికింద్రాబాద్ పార్లమెంటు టీడీపీ అధ్యక్షులు పి.సాయిబాబా, ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్ తెలిపారు. సోమవారం అశోక్‌నగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పత్రిక సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీలే తనను గెలిపించారని, డిప్యూటీ సీఎం పదవి వరకు ఎదిగిన నా రాజకీయ అనుభవం ఎస్సీలు తనపై చూపిన ఆదరాభిమా నాలేనని చెప్పుకునే మల్లు భట్టి విక్రమార్క ఈ విషయంలో వెంటనే స్పందించి, భాధ్యుల పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఒక మహిళను అర్ధరాత్రి వరకు పోలీస్ స్టేషన్ లోనే ఉంచి ఇష్టం వచ్చినట్లు కొట్టడంతో పాటు చిత్రహంసలకు గురి చేసినా డిప్యూటీ సీఎం స్పందించక పోవడం విచారకరమని నైతిక భాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. షాద్ నగర్ అంబేద్కర్ కాలనీలో నివాసం ఉంటున్న బాధిత మహిళ సునీత ఆమె కుమారుడిని (18ఏండ్లు) తన కండ్ల ముందే దారుణంగా కొట్టారని వాపోయిందన్నారు. ఘటనకు పాల్పడిన పోలీసులను తక్షణమే సస్పెండ్ చేసి, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవా లని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యద ర్శులు బాలరాజ్ గౌడ్, ఎస్సీ సెల్ నాయకులు భాను ప్రకాష్, మేడిపల్లి శ్యామ్ సుందర్, సత్యనారాయణ, సత్తన్న పాల్గొన్నారు.

జలమండలి ఫైనాన్స్ డైరెక్టర్ స్వచ్ఛంద పదవీ విరమణ



● బోర్డుకు 35 ఏండ్లపాటు సేవలందించిన వాసుదేవ నాయుడు

నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలి ఫైనాన్స్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న వాసు దేవ నాయుడు స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్నారు. వాసుదేవ నాయుడు సెప్టెంబర్ 29, 1989లో అసిస్టెంట్ ఫైనాన్స్ మేనేజర్‌గా బోర్డులో నియామకమయ్యారు. ఆ తర్వాత జీఎంగా, సీజీఎంగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత ఫైనాన్స్ విభాగానికి డైరెక్టర్‌గా సేవలందించారు. దాదాపు 35 ఏండ్ల పాటు ఆయన ఉద్యోగిగా బోర్డులో సేవ లందించారు. ఎవరినీ నొప్పించకుండా ఆయన ముందు కెళ్లేవారని, బోర్డు కష్టనష్టాల్లో ఆయన సేవలు, సూచనలు, సలహాలను అధికారులు, ఉద్యోగులు గుర్తు చేశారు. బోర్డుకు ఆయన చేసిన సేవలను గుర్తు చేస్తూ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కొందరు ఉద్యోగులు మాట్లాడుతూ ఒక మంచి అధికారి స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్నారని భావోద్వేగానికి గురయ్యారు. సోమవారం ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో వాసుదేవ నాయుడుకు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రాజెక్టు డైరెక్టర్-2 సుదర్శన్, ఫైనాన్స్ వింగ్ సీజీఎం చంద్రజ్యోతితో పాటు జలమండలి ఉద్యోగులు, సిబ్బంది హాజరై ఆయన్ను శాలువాలు, బొకేలు, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ బోర్డు ఒక మంచి డైరెక్టర్ సేవల్ని కోల్పోతుందన్నారు. ఆయన బోర్డుకు చేసిన సేవలను బోర్డు ఎన్నటికీ మర్చిపోదన్నారు. ఎలాంటి పరిస్థితినైనా ఆయన చిరునవ్వుతో ఎదుర్కొనేవారన్నారు. తనకు ఆయనతో దీర్ఘకాలంగా అనుబంధం ఉందని గుర్తు చేశారు. పదవీ విరమణ జీవితాన్ని కుటుంబంతో సంతోషంగా గడపాలని సుదర్శన్ ఆకాంక్షించారు. సీజీఎం చంద్రజ్యోతి మాట్లాడుతూ ఎంత ఒత్తిడి ఉన్నప్పటికీ ప్రశాంతంగా పనులు పూర్తి చేయడంతో వాసుదేవ నాయుడు దిట్ట అని కొనియాడారు. మిగిలిన ఉద్యోగులు సిబ్బంది సైతం ఆయనతో వారికున్న అనుబంధాన్ని పంచుకున్నారు. అనంతరం వాసుదేవ నాయుడు మాట్లాడూతూ 35 ఏండ్లపాటు జలమండలిలో పనిచేశానని గుర్తు చేశారు. అసిస్టెంట్ ఫైనాన్స్ మేనేజర్ స్థాయి నుంచి సీజీఎం స్థాయి వరకు ఆయన చేసిన సేవలను, ఆయనతో పనిచేసిన పలువురు ఉద్యోగులతో ఆయనకున్న అనుబంధాన్ని గుర్తు చేశారు. ప్రతొక్క ఉద్యోగికి వాసుదేవ నాయుడు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

హిందూ స్మశానవాటికను అభివృద్ధి పరచాలి

● కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌కు వినతి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

హైదర్ నగర్‌లోని హిందూ స్మశానవాటికను అభివృద్ధి పరచాలని సీపీ ఐ(ఎం) కూకట్‌పల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో.. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం.శంకర్, బి.శీనులు పాల్గొని మాట్లాడుతూ హైదర్ నగర్ బస్తీలోని హిందూ స్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. హిందూ స్మశాన వాటికలో చుట్టూ ప్రహరీ గోడ నిర్మించా లన్నారు. సిమెంట్ స్తంభాలు నాలుగు వేసి వీధిలైట్లు అమర్చాలన్నారు. రెండు బర్నింగ్ ప్లాట్ఫామ్స్ నిర్మించాలని మంచినీళ్ల ట్యాంకు ఏర్పాటు చేయాలని తెలిపారు. బస్తీ నుంచి స్మశాన వాటిక వరకు సిమెంట్ రోడ్డు వేసి స్తంభాలు వేసి వీధిలైట్లు వేయాలని పేర్కొన్నారు. అలీ తలాబ్‌లోని గుర్రపు డెక్కన్ తొలగించి, దోమల నివారణ చేయాలని కోరారు. హైదర్ నగర్‌లోని బస్తీ దవఖానాలో మౌలిక సదుపాయాలు కల్పించి, వెంటనే సిస్టర్ ఏర్పాటు చేసి రక్త పరీక్షలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. దీనికి స్పందించిన జోనల్ కమిషనర్ అపూర్వాచావాన్ వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అంతర్జాతీయ పోటీలలో.. కర్మన్ ఘాట్ శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-చంపాపేట్

నాసా ఎన్ఎస్ఎస్ గెరార్డ్ కెడీనెయిల్ స్పేస్ సెటిల్మెంట్ కానెస్టో కర్మన్ ఘాట్ శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. స్పేస్ హెూటల్ విభాగంలో అంతర్జాతీయ స్థాయిలో విశ్వ, టిం రెండవ బహుమతి సాధించారు. అలాగే పోటీలలో పాల్గొన మరికొందరు విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమం ఎ.జి.యం సతీష్, ఆర్.ఐ రవీందర్ రెడ్డి, కో ఆర్డినేటర్ రఘువంశీ, ప్రిన్సిపాల్ ఫణమాధవి, వైస్ ప్రిన్సిపాల్ సుందర్‌సింగ్, డీన్ వెంకలు రమణ, నాసా ఇన్‌చార్జి స్వాతి, స్థానికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్ని వార్డులలో స్వచ్ఛదనం-పచ్చదనం



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ అన్నివార్డులలో స్వచదనం పచ్చదనం కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని దుండిగల్ మునిసిపల్ కమీషనర్ కె. సత్యనారాయణ తెలిపారు.

సీడీఎంఏ జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారము స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమమును మున్సిపల్ పరిధిలోని 28 వార్డుల నందు ప్రారంభించారు. సోమవారం స్థానిక వార్డ్ కౌన్సిలర్స్, మహిళా సంఘాల సభ్యులు, వార్డ్ కమిటీ మెంబర్స్‌తో సమావేశం నిర్వహించి స్కూల్ పిల్లలతో ర్యాలీ నిర్వహించడం జరిగింది. అదేవిధంగా పాఠశాలలో పారిశుధ్యం వ్యక్తిగత పరిశుభ్రత సీజనల్ వ్యాధులు ప్లాస్టిక్ వాడకం పై అవగాహన కల్పించారు. స్కూలు పిల్లలకు వ్యాసరచన పోటీలు పెట్టడం, డోర్ టు డోర్ కంపెయిన్‌లో భాగంగా తడి చెత్త, పొడి చెత్త పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా వీధులు బహిరంగ ప్రదేశాలను శుభ్రపరచడం, ఓపెన్ ప్రదేశాలలో పిచ్చి మొక్కలను తొలగిం చడానికి ప్రజల ద్వారా శ్రమదానం, అన్ని పారిశుద్ధ వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ పరికరాలను అమర్చడం మొద లగు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ బాబు మోసెస్, మున్సిపల్ కమిషనర్ కే.సత్యనారాయణ రావు, అన్ని వార్డుల కౌన్సిలర్లు, మేనేజర్ సునంద, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ పి.సాత్విక్, వార్డ్ ఆఫీసర్స్, మహిళా సంఘాల సభ్యులు, వార్డ్ కమిటీ మెంబర్స్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు నినాదంతో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం బాలానగర్ డివిజన్ పరిధిలోని దిల్ కుష్ నగర్ లో కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డితో కలిసి మొక్కలు నాటారు.

నవతెలంగాణ-బాలానగర్



కూకట్ పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతే నగర్ డివిజన్ పరిధిలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛ దనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం అధికారులతో కలిసి మొదటి రోజు డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎయిర్ పోర్ట్ రోడ్డులో చెత్త డంపింగ్ యార్డ్ ఉన్న పేరుకు పోయిన చెత్తను ఎత్తివేసి బ్లీచింగ్ పౌడర్ చల్లి పరిశుభ్రత వాతావరణాన్ని కల్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పాండాల సతీష్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం ఈనెల 5 నుంచి 9వరు పారిశుద్ధ్యం, డ్రయినేజీ సమస్యలపై దృష్టి సారించి స్వచ్ఛత మెరుగు పరుస్తూ పచ్చదనం పెంచాలన్నారు.

నవతెలంగాణ-బాలానగర్

అంగరంగ వైభవంగా 'కావడి యాత్ర'



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 129 సూరారం డివిజన్ పరిధిలోని షాపూర్ నగర్‌లో శ్రావణ మాసం సందర్భంగా 'సంగీత పాత్ర' సోమవారం శోభాయమానంగా నిర్వహించిన 'కావడి యాత్ర'లో వందలాది మంది భక్తులతో కలిసి బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి పాల్గొన్నారు. శివలింగానికి పూజలు నిర్వహించి, కుండల్లో జలాన్ని కావళ్లతో మోసుకుంటూ శంభో శంకర అంటూ భజనలతో రెండు కిలో మీటర్ల దూరం వరకు యాత్ర కొనసాగింది. భక్తులు కాషాయ వస్త్రాలు ధరించి, పూజలో పాల్గొన్నారు. వీరా రెడ్డి, నార్లకంటి దుర్గయ్య, నార్లకంటి ప్రతాప్, మద్దెల కృష్ణ గౌడ్,ఎన్.కృష్ణ, సాయిలు, చిత్తారి,శ్రవణ్, పాల్గొన్నారు.

మతి స్థిమితం లేని యువకుడు అదృశ్యం



నవతెలంగాణ-బడంగ్ పేట్

మతి స్థిమితం లేని యువకుడు అదృశ్యమైన సంఘటన పహడి షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం.. చిట్టనూర్ గ్రామం మద్రికల్ మండలం, నారాయణ పేట్ జిల్లాకు చెందిన గంధం గోపాల్ తన కుటుంబ సభ్యులతో కలిసి బతుకు తెరువు కోసం జల్‌పల్లి నివాసం ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. సోమ వారం అతని తమ్ముడు గంధం భాను ప్రసాద్, మతి స్థిమి తం సక్రమంగా లేకపోవటంతో ఈ నెల 4న మధ్యాహ్నం ఇంటి నుంచి ఎవ్వరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో అతని ఆచూకీ కోసం బంధువులను స్నేహితులను సంప్రదించగా.. ఆచూకీ లభించలేదు. దీనితో అతని కుటుంబ సభ్యులు పహడి షరీఫ్ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేయ టంతో... పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE CUM – FAMILY COURT : MEDCHAL – MALKAJGIRI DISTRICT, AT: KUSHAIGUDA
E.P.No 1051 OF 2022
IN
O.S.No. 830 OF 2015

Between:-
Kavitha Shanmukham, ... Decree Holder
-And-
M/s. Prime Constructions and others, ... Judgment Debtors

To,
1. M/s. PRIME CONSTRUCTIONS, rep.by: Sri. T. Sudershan Reddy @ T. Pramod Reddy S/o. Sri. Deva Reddy, aged about 48 years, Occ: Business, R/o. H.No.1-7-21, J.S.Nagar, Habsiguda, Hyderabad.
2. SRI. T. SUDERSHAN REDDY @ T. PRAMOD REDDY S/o. Sri. Deva Reddy, aged about 48 years, Occ: Business, R/o. H.No.1-7-21, J.S. Nagar, Habsiguda, Hyderabad.
3. SRI. KEMASRIDHAR, S/o. Sri. Rangaiah, aged about 55 years, Occ: Business, R/o. H.No.9-11, Vidya Nagar, Chityal, Nalgonda District.
... Respondent No.1,2 & 3.

NOTICE

Please take notice that the above named Decree holder has instituted the above E.P against you. But in spite of sending a notice by registered post as well as by Nazareth, you have failed to appear before the court.
Therefore, Hon'ble court directed issue Order 21 Rule 34 notice to you as a Judgment Debtor No.1, 2 & 3. By way of publication in the above newspaper. Therefore, you are hereby directed to appear before the above court on 02-09-2024 at 10.30 AM either in personal or through an authorized pleader falling of which the case will be heard and decided in your absence in accordance with law.

(By the order of the Hon'ble court)
MALUGARI SUDARSHAN
KANDHI LAKSHMANBABU
Advocates,
Office : 2-2-90/30/2, Turabnagar, Bagh Amberpet, Hyderabad, Telangana-500013.
Cell : 9848039035 / 9948663948

BEFORE THE HON'BLE XII ADDITIONAL CHIEF JUDGE, CCC, AT SECUNDERABAD
I.A. No. 1151 of 2022
IN
OS No. 7 of 2005

Between:
1. Sri P Jagadishwar ...Petitioner /Plaintiff
Vs
Smt, P Lakshmi Bai and 9 Others ...Respondents/Defendants

To,
Latasree, w/o 2 Subash D/O Late P veeredham aged about 50 years occupation; Employee Private service R/o Hno- 7-113, Gautham Nagar, Opp Ferozeguda, Hyd.

Please take notice, that my client Sri P Jagadishwar, filed the above I A no- 1151/2022 for restoration of the suit which was dismissed by Hon'ble Court. The above I A stands posted for your appearance on 21/8/2024 at 10.30am and in case of failure to appear on the date and time specified above, the matter will be decided in your absence.

S Harsha Vardhan Lal
Advocate
Flat no.103, first floor, Maruti Appartment, Phase II, Maruthi Nagar Old Bowenpally, Secunderabad 500011.

IN THE COURT OF HONOURABLE XI ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURTS, HYDERABAD
A.S.NO. 195 OF 2023

Between :
Sri Aakanti Shivanand .....Petitioner
AND
Anil Kumar and others ...Respondents

To
Laxmaiyah s/o Not Known to Petitioner, Aged : Major, occ: Business, R/o. H.No.15-6-571, Siddiamber Bazar, Hyd-12 ...Respondent No.3

Please take Notice that the Petitioner Sri Aakanti Shivanand has filed the above A.S.No.195 OF 2023 against the respondents. The A.S.NO.195 OF 2023 is posted on 23-08-2024 at 10.30 a.m. for your appearance in person or through Advocate/Pleader before the said Hon'ble Court, failing which the matter will be heard and decided as per law.

//BY ORDER OF THE HONOURABLE COURT//
Aakanti Shivanand
14-3-49 & 50, Gosha Mahal, Hyderabad -12
Petitioner
Party - in - person
Ph : 9959990742

Notice to Show Cause Why Execution should not Issue (Order XXI Rule 22 & 16 of Code of Civil Procedure)
IN THE COURT OF VI ADDL DISTRICT & SESSIONS JUDGE: RR DISTRICT, AT: KUKATPALLY
E.P.No. 182 OF 2023
IN
O.S.No. 178 OF 2019
(Decree passed by XXVII Addl. Chief Judge, CCC, Secunderabad)

Between:
G.Shankar Rao and G.Meera ...Decree Holders
AND
Gujjar Sailesh Kumar ...Judgement debtor

To,
Gujjar Sailesh Kumar, S/o Late Nagender Rao Gujjar, Aged: 56 Years,Occ: Business, R/o H.No.4-1-42, 43, 45/A,Old Bhoiguda, Secunderabad-500003.
...Judgment Debtor

Whereas the above-named Decree Holders have made Application to this Court for Execution of Decree in Suit No.182 of 2023 on the allegation that the said Decree has been transferred to him by assignment or without assignment this is to give you Notice that you are to appear before this Court on the 2 nd day of September 2024 to Show Cause why Execution should not be granted.Given under Order of the Court on the 01 st day of August 2024

By Order of the Court
SRIDHAR LENDALAY
P.Lakshman, TV Arvind & P.MANJULA
ADVOCATES
Chambers at 6-3-74, Balanagar, HYD – 42
Mobile: 98480-82044,
Off: 040-40242044

IN THE COURT OF THE HON'BLE FIRST CLASS (EXCISE) RANGA REDDY CUM V TH ADDL JUNIOR CIVIL JUDGE V TH ADDL METROP0LITIAN MAGISTRATE RANGA REDDY : AT : L.B.NAGAR
O.S.No.1452 of 2022

Between:
THE KARUR VYSYA BANK LIMITED, L.B.NAGAR Branch, HYD. ....Plaintiff.
AND
M/S VIHARI LOGISTICS ....Defendant.

To,
(1) M/S VIHARI LOGISTICS ,Rep By its partners,G.Ramesh and V. Shravani Flat no: A3/301,3 rd floor,plotno:23,HUDA Complex, saroornagar, Hyderabad-500035.
(2) Garlapati Ramesh S/o Jagn Garlapathi ,Age: 37 yrs, R/o Hno:11-13-1234,plotno:181,Road No:3, Near, Asthalakshmi Temple .Vasavi Colony,Hyderabad-500035.
(3) Smt.Vasa Shravani W/o Ramesh Garlapati,Age:29 yrs, R.o Hno:5-13/1,Main Road,Valigonda, Nalgona -508112.

Whereas, the above Plaintiff has filed the above suit against you and others for Recovery of Amount of Rs. 15,18,105.41 paisa and other reliefs and the matter is posted for your appearance on 28-08-2024 at 10-30 am, either in person or through an Advocate, failing which the suit will be heard and determined ex-parte.

(BY ORDER OF THE COURT)
C.RAMA KUMARI ,
ADVOCATE,
HYDERABAD.

Notice to Sale (Order XXI Rule 64 of CPC)
IN THE COURT OF III SENIOR CIVIL JUDGE: CITY CIVIL COURTS: AT: SECUNDERABAD
E.P.No. 47 OF 2022
IN
O.S.No. 394 OF 2018

Between:
D.Swaroopa, ...Decree Holders
AND
Gujjar Sailesh Kumar ...Judgement debtor

To,
1. Gujjar Sailesh Kumar, S/o Late G.Nagender Rao, aged 57 years, Occ: Business,R/o H.No.4-1-42, Old Bhoiguda,Secunderabad-03.
...Judgment Debtor
2. The Branch Manager, M/s. Indo Star Capital Finance Ltd., D.No.7-1-621/276, 259/3 RT, 3 rd Floor, NKS Bharati Complex,Above Canara Bank, SR Nagar Main Road,Hyderabad – 500038.
...Mortgagee

Whereas in the above-named Suit, Smt.D.Swaroopa the Decree Holder has applied for the sale of under mentioned immoveable property

SCHEDULE 'A' PROPERTY

All that the part and parcel of H.No.4-1-46 consisting of Ground and First Floor having plinth area of 652 Square feet along with land admeasuring 36.21Sq.Yards or 31.56 Sq. Meters. situated at Old Bhoiguda, Secunderabad, surrounded by following boundaries: **North** : H.No.2313 (New No.4-1-45), **South** : Portion Schedule-22 (H.No.4-1-462)**East** : H.No.4-1-41, **West** : H.No.2313 (New No.4-1-45)

SCHEDULE 'B'PROPERTY

All that the part and parcel of H.No.4-1-42, 43, & 45 (old Nos.2313 to 2315) consisting of Ground plus Four floors, along with land admeasuring 151 Square Yards, situated at Old Bhoiguda, Secunderabad.**North** : H.No.4-1-41, **South** : H.No.4-1-44
East : Road, **West** : H.No.4-1-46

You are hereby informed that on the 13 th day of September 2024 has been fixed for settling the terms of the proclamation and sale.
Given under Order of the Court on the 30 th of July 2024

By Order of the Court
SRIDHAR LENDALAY
P.Lakshman, TV Arvind & P.MANJULA
ADVOCATES
Chambers at 6-3-74, Balanagar, HYD – 42
Mobile: 98480-82044,
Off: 040-40242044

IN THE COURT OF THE HON'BLE IIIRD ADDL DISTRICT JUDGE AT: SANGAREDDY
O.S.No. 159 OF 2013

BETWEEN:
Sri YelmelaChandramouli. ......Plaintiffs
AND
SmtPeddaboinaLaxmamma & others. ......Defendants

To,
1. Smt. Shashirekha w/o Late Pandu, Aged Major, Occ: House Wife,
2. Kum. Hema D/o Late Pandu, Aged Major, Occ: House Wife,
3. Smt. Suhasini D/o late pandu, Aged Major, Occ: House Wife,
4. Sri. Vishal S/o Late Pandu,Aged Major, Occ: Private Job,
All are R/o H.No: 8-1-284/4/126, OU colony, Shaikpet, Hyderabad.

NOTICE

Take notice that the above named Plaintiff filed the Suit for perpetual injunction in respect of the suit schedule property against you and others the said case is posted to 09-09-2024 at 10-30 A.M for your appearance by parson or through an advocate, failing which the case will be decided in your absence on merits against you.

// BY ORDER OF COURT //
M.GIRIDHAR,
G.VISHNU VARDHAN,
Advocate
Sangareddy

IN THE COURT OF THE HON'BL PRINCIPAL JUNIOR CIVIL JUDGE: IBRAHIMPATNAM: RANGA REDDY DISTRICT. AT: IBRAHIMPATNAM
OS.No. 12 OF 2022

BETWEEN:
Mohammed Ayyub & Others. ....Plaintiffs.
AND
Mohammed Khairath Ali & Others ...Defendants.

To,
D3. Yasmeen Banu D/o. Mohammed Anju Pasha, W/o. Mohammed Saiman aged about 27 years, Occ: House-wife,
D4. Mohammed Raheem S/o Mohammed Anjum Pasha aged about 23 years, Occupation: Student.Defendant 2 & 4 R/o H. No. 10-6-129, Lingojiguda, Sainagar Colony,L.B.Nagar,R.R. Dist.
D14. Safina W/o Mohd. Ibrahim, (D/o Late Naseeruddin) aged about 30 years, Occupation: House-wife, R/o H-No. 18-8-233/67/6, Riasath Nagar, Hyderabd
R22. Mohammed Khadeer S/o. Late. Mohd. Anjum Pasha, aged about 30 years, Occ: Business, R/o. Green Park Colony, Saroor Nagar Mandal, Ranga Reddy District.500035.
R23. Imrana Banu W/o. Mohd Eliyas, (D/o. Late.Mohd. Anjum Pasha). Aged about 28 years, Occ: House-wife, R/o. H- No.10-6-129, Lingoji guda, Sainagar Colony, L.B.Nagar, Ranga Reddy Dist-35.
R24. Irfana Banu W/o. Mohd Azem Kurushi, (D/o. Late. Mohd. Anjum Pasha) aged about 27 Years, Occ: House- wife, R/o. Balapur Village and Mandal, Ranga Reddy Dist-05.
R25. Asma Begum W/o. M.D.Jangeer, D/o. Late.Mohd. Anjum Pasha)aged about 26 years, Occ: House-wife, R/o.H-No.10-6-129, Lingoji guda, Sainagar Colony, L.B.Nagar, Ranga Reddy District.

NOTICE

Please take notice that the above-mentioned case plaintiffs filed suit for Partition and separate possession. The case is coming for your appearance i.e., Defendant No.3,4 and 14. and In IA. 333 OF 2024 send the notices to the proposed Respondents R22 to R25 The Hon'ble Court was directed to serve Notices to D3, D4 and D14, and Proposed Respondents R22 to R25 you are hereby directed to appear before this Hon'ble court at, 10:30am on 14.08.2024 otherwise the suit will be heard in your absence.

// BY ORDER OF THE COURT //
M/s. MOHD.GULAM HYDER,
J.P.MAHENDER,
ADVOCATE'S,
#Plot.No.57, Tirumala Hills Colony, Ibrahimpatnam Municipality, Ranga Reddy District-501506.
(Cell: 9912546709).

నేషనల్ కరాటే చాంపియన్షిప్‌లో జీవీఆర్ కరాటే అకాడమి విద్యార్థుల ఉత్తమ ప్రతిభ



నవతెలంగాణ-అంబర్‌పేట

బెంగళూరులో జరిగిన 10వ షోటోఖాన్ జాతీయ కరాటే పోటీలలో తెలంగాణ నుండి జీవీఆర్ కరాటే అకాడమీ విద్యార్థులు 19 మంది కటా, కుమితి విభాగంలో పాల్గొన్నారు. అందులో కటా విభాగాల్లో 16 బంగారు పతకాలు, 2 రజత పతకాలు సాధించారు. కుమతి విభాగంలో 18 బంగారు పతకాలు, 1 రజత పథకం సాధించారు. మొత్తం 33 బంగారు, 3 రజత పతకాలు సాధించి ఓవరాల్ చాంపియన్షిప్ కప్‌ను కైవసం చేసుకున్నామని జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీ.ఎస్. గోపాల్ రెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



నవతెలంగాణ - ముషీరాబాద్

గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..వీఎస్‌టీ ఫంక్షనల్ సుందరయ్య పార్క్ రోడ్డు వద్ద గుర్తు తెలియని యాచకుడు (45) ఫుట్ పాత్‌పై మృతి చెందిపడి ఉన్నాడు. ఇది గమనించిన స్థానికులు చిక్కడపల్లి పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలకై దర్యాప్తు చేపట్టారు.

జనాభాకు తగ్గట్టుగా బస్సులు పెంచాలి



- సీపీఐ(ఎం) ముషీరాబాద్ నాయకులు బాబన్న

నవతెలంగాణ - ముషీరాబాద్

గ్రేటర్ హైదరాబాద్‌లో జనాభాకు తగ్గట్టుగా బస్సుల సంఖ్యను పెంచాలని సీపీఐ (ఎం) ముషీరాబాద్ నాయకులు బాబన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల బస్‌స్టాప్ వద్ద ప్రయాణికులతో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబన్న మాట్లాడుతూ..గ్రేటర్ హైదరాబాద్‌లో జనాభాకు తగ్గట్టుగా బస్సుల సౌకర్యం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు కల్పించడంతో ప్రయాణికుల సంఖ్య అదే తరహాలో పెరిగిందన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో కోటి జనాభాకు పైగా ఉన్నారని ప్రజలు తమ గమ్యస్థానానికి చేరడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్కూల్ , కాలేజీ విద్యార్థులు, ఉద్యోగస్తులు, చిరు వ్యాపారులు అనేకమంది బస్సులు సరిపడలేక, సమయానికి రాక చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం) ముషీరాబాద్ నాయకులు. విమల. పాషా. శ్రీరాములు పాల్గొన్నారు.

'ప్రజావాణి'ని సద్వినియోగించుకోవాలి



నవతెలంగాణ - ధూల్ పేట్

ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న సూచించారు. సోమవారం చాంద్రాయణ గుట్ట నర్కి పూల్ బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ ఖిల్వత్ ప్రాంతంలో వీధి కుక్కల బెడదాపై ఒక్క ఫిర్యాదు అందింది. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ..ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో తమకు అందిన ఫిర్యాదులను సంబంధిత విభాగాల అధికారులతో పరిష్కరిస్తున్నామన్నారు. బస్తీ, కాలనీ వాసులు స్థానికంగా నెలకొన్న సమస్యలపై ఫిర్యాదు చేయాలని సూచించారు.. అందిన ఫిర్యాదులను పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ డిప్యూటీ డైరెక్టర్ (యూ బి డి) అమీనా బీ, డిప్యూటీ డైరెక్టర్ (వెటర్నరీ) డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, టౌన్ ప్లానింగ్ జోనల్ సిటీ ప్లానర్ శ్యాం కుమార్, ఎయంసీ రాజారావు, ఎలక్ట్రికల్ ఈ ఈ రామారావు, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలి

- గీతాంజలి ఉన్నత పాఠశాల హెచ్ఎం శాంత



నవతెలంగాణ-హిమాయత్ నగర్

విద్యార్థుల్లో క్రమశిక్షణ ఎంతో అవసరమని, విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణను అలవర్చుకోవాలని గీతాంజలి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంతా విద్యార్థులకు సూచించారు. సోమవారం గీతాంజలి ఉన్నత పాఠశాలలో విద్యార్థి నాయక బృందం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు రహస్య ఓటింగ్ ద్వారా గాంధీ, అంబేద్కర్, రవీంద్రనాథ్ ఠాగూర్, సర్దార్ వల్లభాయ్ పటేల్ పేర్లతో ఉన్న నాలుగు బృందాలకు నాయకులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జై సూర్య శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆశయ సాధనకు ఎంతో కష్టపడాలని, లక్ష్య సిద్ధికి క్రమశిక్షణ, కృషి, అభ్యాసం అవసరమని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో హరితహారం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై చారిత్రాత్మక నిర్ణయం



- బంధు సొసైటీ మాదిగ మేధావుల ఫోరం సమావేశంలో వక్తలు

నవతెలంగాణ - ముషీరాబాద్

ఎస్సీ వర్గీకరణ ఆమోదం చారిత్రాత్మకమైన నిర్ణయమని పలువురు వక్తలు అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైదరాబాద్ బంధు సొసైటీ మాదిగ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో బంధు సొసైటీ హైదరాబాద్ అధ్యక్షులు పల్లెల వీరస్వామి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లెల వీరస్వామి మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును బంధు సొసైటీ మాదిగ మేధావుల ఫోరమ్స్ స్వాగతిస్తుందన్నారు. ఐఆర్టీఎస్ రిటైర్డ్ అధికారి అప్పికట్ల భరత్ భూషణ్ మాట్లాడుతూ.. గత 30 సంవత్సరాలుగా తెలుగు రాష్ట్రాలలో ఉమ్మడి రిజర్వేషన్ల వర్గీకరణ కోసం ఎంతోమంది మాదిగలు ప్రాణ త్యాగం చేశారని తెలిపారు. వారి ప్రాణ త్యాగం వృథా కాలేదని వారి ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. మాదిగ మేధావుల ఫోరం అధ్యక్షులు చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కేవలం తెలుగు రాష్ట్రాలకే కాదు దేశ చరిత్రలో ఒక చారిత్రాత్మకమైనటువంటి తీర్పుగా భావిస్తున్నామన్నారు. ఇది యావత్ మాదిగల విజయమని పేర్కొన్నారు. మాదిగ మేధావుల ఫోరం జనరల్ సెక్రెటరీ ప్రొఫెసర్ సతానియోలు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణపై మాదిగలకు న్యాయం చేస్తామని చెప్పటాన్ని తెలంగాణ మాదిగ ప్రజానీకం అభినందిస్తుందన్నారు. తక్షణమే ఎస్సీ వర్గీకరణపై ఆర్డినెన్స్ వచ్చేలా కృషి చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణనీ తెలంగాణ రాష్ట్రంలో జనాభా నిష్పత్తి ప్రకారం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన రాజ్యాధికార సమితి అధ్యక్షులు వషాపాక నరసింహ, తెలంగాణ మాదిగ సంరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గడ్డ యాదయ్య, సోషల్ జస్టిస్ పురం అధ్యక్షులు గ్యార శ్రీనివాస్, దాన గళ్ళ పవన్ కుమార్, అశోక్ తదితర నాయకులు పాల్గొన్నారు.

బడి స్వచ్ఛత వైపు అడుగులు..!

- స్కూళ్లలో పారిశుధ్యం పనుల బాధ్యత ఏఏపీలకు అప్పగింత
- కార్మికుల తొలగింపుతో అపరిశుభ్రంగా పాఠశాలలు
- స్వచ్ఛ పాఠశాల నిర్వహణ నిధులు కేటాయిస్తూ సర్కారు నిర్ణయం
- జిల్లాలో 691 ప్రభుత్వ పాఠశాలలు 800కుపైనే కార్మికులకు మేలు





నవతెలంగాణ-సిటీబ్యూరో

సర్కారు బడుల్లో పారిశుధ్యం, శానిటేషన్ ప్రశ్నార్థకంగా మారింది. బడులు ప్రారంభమై రెండు నెలలు పూర్తికావస్తున్నా.. వాటిల్లో పరిశుభ్రత కొరవడింది. అపరిశుభ్రమైన వాతావరణం, టాయిలెట్స్ క్లీనింగ్ సమస్య విద్యార్థులు వారి తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో పారిశుధ్యం పనులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగిస్తూ.. నిర్ణయం తీసుకుంది. అందుకోసం అవసరమైన నిధులు కేటాయించింది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఈ గ్రాంటు మంజూరు చేయడమే కాక.. గతంలో కంటే కూడా రెట్టింపు నిధులు కేటాయించింది. పాఠశాలల నిధులకు ఈ గ్రాంట్ అదనం. మొత్తానికి ప్రభుత్వం తాజా నిర్ణయంతో స్వచ్ఛ వాతావరణంలో సర్కారు స్కూళ్లు నడవనున్నాయి.

ప్రభుత్వ బడుల్లో పారిశుధ్య పనులను గతంలో స్వచ్ఛ కార్మికులు, స్వీపర్లు చూసుకునేవారు. అయితే స్వచ్ఛకార్మికులను, స్వీపర్లను కరోనా సమయంలో అప్పటి ప్రభుత్వం తొలగించడంతో పాఠశాలల్లో స్వచ్ఛత అధ్వానంగా తయారైంది. మరోవైపు పారిశుధ్య పనులను జీహెచ్ఎంసీకి అప్పగించినా అసలే సిబ్బంది కొరత, ఇంటింటి చెత్త సేకరణతోనే సదరు కార్మికులు ఇబ్బందిపడేవారు. అయినప్పటికీ ప్రభుత్వ ఆదేశాల మేరకు వారు బడుల్లోని ప్రాంగణాలను శుభ్రం చేస్తూ వచ్చారు. తరగతి గదులు, మరుగుదొడ్ల జోలికి వెళ్లలేదు. దీంతో ఈ పనుల కోసం ప్రధానోపాధ్యాయులు ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితి. ఈ సమస్యను గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. సర్కారు బడుల బలోపేతంపై దృష్టిసారించింది. ఆ దిశగా చర్యలు చేపట్టింది. మొదటగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల(ఎస్ఎంసీ) స్థానంలో మహిళ స్వయం సహాయక సంఘాలతో కూడిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసింది. వీటి ఆధ్వర్యంలో సర్కారు బడుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టింది. ఇందుకు అవసరమైన నిధులు కేటాయించింది. ఈ కమిటీల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో, విద్యాశాఖ, ఇతర ప్రత్యేక అధికారులు పర్యవేక్షిస్తున్నారు. నగర పరిధిలో దాదాపు 384 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టగా.. ప్రధానంగా పాఠశాలలకు రంగులు వేసి.. అందంగా తీర్చిదిద్దడంతో పాటు టాయిలెట్ల రిపేరింగ్, అదనపు టాయిలెట్ల నిర్మాణం, డ్రయినేజీ వ్యవస్థ సరిచేయడంతో పాటు ఎలక్ట్రికల్ పనులు చేస్తున్నారు. ఇప్పటివరకు 235 పాఠశాలల్లో పనులు పూర్తికాగా.. మరో 145 బడుల్లో పనులు పురోగతిలో ఉన్నాయి. ఈ క్రమంలో ఇప్పుడు స్కూళ్లలో పరిశుభ్రమైన వాతవారాణాన్ని అందించడానికి పాఠశాలలోని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు(ఏఏపీసీ) మరుగుదొడ్లు, ప్రాంగణాలు శుభ్రపరచడం, మొక్కలకు నీరు పోయడం వంటి పనులను బాధ్యత అప్పగించిడంతో పాటు అందుకు కావాల్సిన గ్రాంట్స్ కేటాయించింది. వీటిని పాఠశాలల్లో విద్యార్థులకు సంఖ్య ఆధారంగా మంజూరు చేసింది.

800కుపైనే స్వచ్ఛ కార్మికులకు ఉపాధి

హైదరాబాద్ జిల్లా పరిధిలో 691 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిల్లో ఒక లక్ష వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే ప్రభుత్వ పాఠాశాలల్లో పారిశుధ్య పనుల కోసం గతంలో స్వచ్ఛ కార్మికులను ఉపయోగించేవారు. 40మందిలోపు విద్యార్థులు ఉంటే ఒకరిని రూ.2వేలు, అంతకంటే ఎక్కువ విద్యార్థులుంటే ఇద్దరు కార్మికులకు రూ.2500 చొప్పున వేతనం చెల్లించేవారు.

ఈ వేతనంతోనే సదరు కార్మికులు నిత్యం పాఠశాలల ప్రాంగణాలు, గదులు, టాయిలెట్లను శుభ్రం చేసేవారు. అంతేగాక హైస్కూళ్లలో వందలాది మంది విద్యార్థులకు వీరి సేవలు ఎంతో కీలకం. కానీ గత ప్రభుత్వం స్వచ్ఛ కార్మికుల వ్యవస్థను రద్దు చేయడంతో సిటీలో సుమారు 800కుపైనే.. రాష్ట్రంలో 20వేలకుపైనే కార్మికులు ఉపాధి కోల్పోయిన విషయం తెలిసిందే. ప్రభుత్వం తాజా నిర్ణయంతో 30మంది లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలకు రూ.3వేలు గ్రాంటుగా ఇవ్వనుంది. అలాగే.. 31 నుంచి 100మంది విద్యార్థులున్న స్కూళ్లకు రూ.6వేలు, 101 నుంచి 250 మంది ఉంటే రూ.8వేలు, 251 నుంచి 500 లోపు విద్యార్థులుంటే రూ.12వేలు, 501 నుంచి 750 మంది ఉంటే 15వేలు, 750మంది కంటే అధికంగా ఉన్న స్కూళ్లకు రూ.20వేలు చొప్పున గ్రాంటుగా ఇవ్వనుంది. మొత్తం పది నెలల కాలానికి ఒకేసారి నిధులు విడుదల చేయనుంది. ఈ నిధులను సమగ్ర శిక్షా(ఎస్ఎస్) ద్వారా అందజేయనున్నారు.

స్వచ్ఛ పాఠశాల నిర్వహణ నిధుల విడుదల పట్ల టీఎస్‌యూటీఎఫ్ హర్షం

ఈనెల 2వ తేదీన పదోన్నతి పొందిన ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పాఠశాలల్లో టాయిలెట్స్ నిర్వహణ, మొక్కల సంరక్షణ మొదలగు పనుల కోసం మెయింటనెన్స్ గ్రాంట్ ను విడుదల చేయడం పట్ల టీఎస్‌యూటీఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి. రాజారావు, ఎ. శ్యామ్ సుందర్ సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గతంలో వీటి నిర్వహణ కోసం అరకొర నిధుల కేటాయించడం కొంతకాలం పాటు స్థానిక సంస్థలకు అప్పజెప్పిన ఫలితంగా పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ లోపభూయిష్టంగా సాగిందని, ఎన్నో ఆశలతో ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించిన తల్లిదండ్రులు సరిగా లేని టాయిలెట్స్‌ను చూసి మధ్యలోనే మాన్పించి వేరే పాఠశాలలకు వెళ్లిన పరిస్థితి ఉండేదని వారు తెలియచేశారు. జిల్లాలోని కొన్ని పాఠశాలలకు సరైన నీటి సౌకర్యం లేదని, అటువంటి పాఠశాలలకు ముని పల్ శాఖ ద్వారా నీటి సౌకర్యం కల్పించాలని, కుదరని పక్షంలో రెగ్యులర్‌గా ట్యాంకర్‌ల ద్వారానైనా నీటి సౌకర్యం కల్పించి పాఠశాలల పరిశుభ్రతకు తోడ్పాటును అందించాలని వారు కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషిచేస్తున్న ప్రభుత్వానికి తోడ్పాటునందిస్తూ.. మరింత మెరుగైన ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

వయనాడ్ విధ్వంసాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- బాధితుల కోసం విరాళాలు ఇచ్చి ఆదుకోవాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఊహించని వరదలు, కొండచరియలు విరిగిపడి సర్వం కోల్పోయిన వయనాడ్ బాధితుల కోసం ఉదారంగా విరాళాలు ఇచ్చి ఆదుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి కోరారు. ప్రజలు విరాళంగా ఇచ్చే ప్రతి రూపాయి ఈ విపత్తులో నష్టపోయిన వారికి అవసరమైన సహాయాన్ని అందిస్తుందన్నారు. వయనాడ్ ప్రకృతి విధ్వంసాన్ని జాతీయ విపత్తుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం హిమాయత్ నగర్ 'వై' జంక్షన్ వద్ద కేరళ, వయనాడ్ ప్రకృతి విపత్తు బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి.నరసింహ, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి.స్టాలిన్ తదితరులతో కలిసి చాడ వెంకట్ రెడ్డి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళ రాష్ట్రం వాయనాడ్ లో కొండచరియలు విరిగిపడటంతో పాటు ఘోరమైన ప్రకృతి బీభత్సం కారణంగా 27 మంది అమాయక పిల్లలు, 76 మంది మహిళలతో సహా 296 మంది ప్రాణాలను కోల్పోయారని, చాలా మంది జాడ లేకుండా పోయిందని, తమ ఇండ్లు కొట్టుకుపోవడమే కాకుండా ప్రజలు జీవనోపాధిని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విపత్తులో నష్టపోయిన వారికి అవసరమైన సహాయాన్ని అందించడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.వాయనాడ్ లో సిపిఐ శ్రేణులు రాత్రి, పగలు లెక్క చేయక సహాయక చర్యల్లో పాల్గొంటూ బట్టలు, ఆహారం, ఔషధాలు అందిస్తున్నారని తెలిపారు. ప్రకృతి విపత్తుతో తలక్రిందులైన వాయనాడ్ ప్రజలను వెంటనే ఆదుకోవాల్సిన అవసరం ఉందని, తమ జీవితాలను పునర్నిర్మించుకోవాడానికి ప్రజలు అవసరమైన సహాయాన్ని అందించాలని చాడ వెంకట్ రెడ్డి కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు కంపల్లి శ్రీనివాస్, నేతలు ఎండి.సలీమ్, నరేష్, ఆరుట్ల రాజ్ కుమార్, జేరుపోతుల కుమార్, చైతన్య, ఇమ్రాన్, సహానా అంజుమ్, సిహెచ్.శ్రీనివాస్, నజీబ్, లెనిన్, అశ్విన్ పాల్గొన్నారు.

నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించండి

- సీపీఐ(ఎం) జంగంమెట్ డివిజన్ కార్యదర్శి కృష్ణ నాయక్
- బండ్లగూడ డిప్యూటీ ఎమ్మార్వోకు వినతి



నవతెలంగాణ - ధూల్ పేట్

నిర్మించి ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే కేటాయించాలని సీపీఐ(ఎం) పార్టీ జంగంమెట్ డివిజన్ కార్యదర్శి కృష్ణ నాయక్ అన్నారు. సౌత్ జిల్లా సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో బండ్లగూడ డిప్యూటీ ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం జంగంమెట్ ఎంసీహెచ్ క్వార్టర్స్‌లో 72 కుటుంబాలకు ఇండ్లు కట్టిస్తామని, 16 నెలల్లో ఇండ్లు పూర్తి చేస్తామని నమ్మించి ఉన్న ఇండ్లు ఖాళీ చేయించిందన్నారు. ఇప్పటికే తొమ్మిదేండ్లు అయినా ఇండ్లు కేటాయించలేదన్నారు. వారు ఇంటి కిరాయి కట్టలేక ఇబ్బందులు, అనారోగ్యాలు ఎదురకొంటున్నారన్నారు. కొంతమంది ఆత్మహత్య చే సుకున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో 72 కుటుంబాలు వారే గృహప్రవేశం చేసుకునే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. బండ్లగూడ ఎమ్మార్వో కార్యాలయంలో అధికారులు కనీసం స్పందించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎమ్మార్వో, డిప్యూటీ ఎమ్మార్వో విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. సమస్యలపై వినతిపత్రాన్ని ఇస్తే తీసుకోవలేని పరిస్థితి ఉందని వాపోయారు. ఇది అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ జిల్లా నాయకులు కిషన్, రామ్ కుమార్, స్థానికులు రాజేష్, గణేష్, సురేష్, మహేష్, శ్రీను పాల్గొన్నారు.

దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులను అరెస్టు చేయాలి



- కేవీపీఎస్ నగర అధ్యక్షులు దశరథ్

నవతెలంగాణ-అంబర్‌పేట

షాద్‌నగర్ పట్టణంలో దొంగతనం పేరుతో దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులను అరెస్టు చేయాలని కేవీపీఎస్ నగర నగర అధ్యక్షులు ఎం దశరథ్, నగర కార్యదర్శి బి సుబ్బారావు అన్నారు. సోమవారం మహిళపై దాడికి నిరసనగా నగర కమిటీ ఆధ్వర్యంలో అంబర్‌పేట శివం రోడ్డులో చేపట్టిన నిరసనకు హాజరై మాట్లాడారు. తెలంగాణ ఏర్పడ్డ నుంచి దళితులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వాలు మారిన దళితుల స్థితిగతులు మారటం లేదన్నారు. అశ్వరావుపేట దళిత ఎస్సై ఆత్మహత్య మరువకముందే షాద్‌నగర్‌లో మరో ఘటన చోటుచేసుకోవడం దారుణమని విమర్శించారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రామ్ రెడ్డితో పాటు నలుగురు పోలీసుల వీరంగం సృష్టించారని తెలిపారు. మహిళను మగ పోలీసులు చిత్రహింసలు పెట్టడం సిగ్గు చేట్టన్నారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి పై అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మహేందర్, జి రాములు,వరలక్ష్మి ,షబానా, అశోక్ పాల్గొన్నారు.

'క్రైస్తవులంతా ఐక్యతను చాటి పోరాడాలి'



నవతెలంగాణ - ధూల్ పేట్

క్రైస్తవులంతా ఐక్యతను చూపిస్తూ సమస్యపై ఒకతాటిపై నిలిచి పోరాటాలు చేస్తూ ప్రేమానురాగాలు చూపించాలని హైదరాబాద్ న్యూ జెరూసలేం మినిస్ట్రీ బిషప్ ధనరాజ్ కోట అన్నారు. ఫలక్‌నూమలోని బిన్ ట్రిక్ ఫంక్షన్‌హాల్లో ఏర్పాటు చేసిన ఆర్ట్ ఆఫ్ సర్వైవల్, సేవకుల సన్మానం కార్యమంలో మాట్లాడారు. అన్ని విషయాల్లో క్రైస్తవులు ఐక్యతను చూపించాలన్నారు. ఈ కార్యక్రమానికి లివింగ్ హెఫ్ మినిస్ట్రీ ప్రెసిడెంట్ పి. ఆనంద్ కుమార్ అధ్యక్షతన వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సీయోను ఫెలోషిప్ చైర్మన్ రెవరెండ్ డాక్టర్ మోహన్ బాబు, హోలీ టెంపుల్ చర్చ్ రెవరెండ్ ప్రసాద్ చౌదరి, ఓల్డ్ సిటీ చర్చెస్ కన్వీనర్ చార్మినార్ డివిజన్ ప్రెసిడెంట్ బుర్రగల్ల ఆనందం, కార్వాన్ నుంచి రామ్నాథ్ తో పాటు వివిధ చర్చల పాస్టర్లు పాల్గొన్నారు.

వాతావరణ సమతుల్యతకు మొక్కలు నాటాలి



- కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

నవతెలంగాణ - ముషీరాబాద్

వాతావరణ సమతుల్యతకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి అని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ధనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్ చిక్కడపల్లి బాపునగర్ లో జిహెచ్ఎంసి అధికారులతో కలిసి చెత్తను తొలగించి మొక్కలు నాటాలని డెంగ్యూ మలేరియా లాంటి సీజనల్ వ్యాధులను అరికట్టాలని ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పావని మాట్లాడుతూ. మన చుట్టూ పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే డెంగ్యూ మలేరియా లాంటి సీజనల్ వ్యాధులు విపరీతంగా వ్యాప్తి చెందుతాయి అన్నారు.వ్యక్తిగత పరిశుభ్రత, ప్లాస్టిక్ వాడకంతో వచ్చే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించి పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాల్లో పారిశుధ్య పనులు చేపట్టలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్,డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మొహియుద్దీన్, ఏఎంసి ప్రవీణ్ చంద్ర , అంతమోలజీ, పారిష్యుధ్య,హార్టికల్చర్, అధికారులు వారి సిబ్బంది నాయకులు శ్రీకాంత్, పి.నర్సింగ్ రావు,సత్తి రెడ్డి,ఆకుల సురేందర్,సురేష్, ఆనంద్ రావు,తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనంతోనే పరిశుభ్రత..

- జోనల్ కమిషనర్ టీ. వెంకన్న



నవతెలంగాణ - ధూల్ పేట్

స్వచ్ఛదనంతోనే పరిశుభ్రత అని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న అన్నారు. స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం సందర్భంగా సోమవారం మలక్‌పేట్ సర్కిల్ సైదాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమానికి సైదాబాద్ కార్పొరేటర్ అరుణ రవీందర్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చెప్పట్టిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య సమస్యల పరిష్కారాని కి బస్తీలు, కాలనీ, వాణిజ్య సముదాయాలు , ఆర్టీసీ బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్స్, శ్మశాన వాటికలు, పార్కులో ప్లే గ్రౌండ్లలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నమన్నారు. పర్యావరణ పరిరక్షణ కొరకు అన్ని ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. వన మహోత్సవంలో అన్ని బస్తీలు, కాలనీలు , విద్యా సంస్థల్లో మొక్కలు పంపిణీ, నాటే కార్యక్రమాలు నిర్వహించనున్నమన్నారు. ఈ కార్యక్రమం లో మలక్‌పేట్ డిప్యూటీ కమిషనర్ జయంత్, వివిధ విభాగాలు అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కన్‌స్ట్రక్షన్ కంపెనీలో పని చేస్తున్న వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ - ముషీరాబాద్

కన్స్ట్రక్షన్ కంపెనీలో పని చేస్తున్న వ్యక్తి అదృశ్యమైన ఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాగ్‌లింగంపల్లి అచ్చయ్య నగర్‌లో జైనీ పల్లవి, జైప్రకాష్ దంపతులు నివాసముంటున్నారు. జైనీ ప్రకాష్ వృత్తిరీత్యా కన్స్ట్రక్షన్ కంపెనీలో పని చేస్తున్నాడు. తన పనిలో భాగంగా అప్పుడప్పుడు అవుట్ ఆఫ్ స్టేషన్ వెళ్లి వస్తుంటాడు. అందులో భాగంగానే గత నెల 26వ తేదీన ఆదిలాబాద్ కు కన్స్ట్రక్షన్ పనిమీద వెళ్లిన జై నీ ప్రకాష్ 29వ తేదీన తన భార్య జైని పల్లవికి ఫోన్ చేసి పని నిమిత్తం బెంగళూరు వెళుతున్నానని చెప్పాడు. ఆ తర్వాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా కలవక పోగా చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నాట్యరీతుల ముగ్ధమనోహరి యామిని



భరతనాట్యానికి నవ్యసొగసులద్దిన నాట్యమయూరి. కూచిపూడి కళాప్రాంగణ వెలుగులను దశదిశలా చాటిన నృత్యభామిని. మూడు నాట్యరీతుల ముగ్ధమనోహరి. రసహృదయులను సమ్మోహితులను చేసిన ఆ కళాదిగ్గజం. ఆమెనే ఉత్తుంగ తరంగంలా ఎగసి, ప్రపంచమంతా ప్రభంజనాలు సృష్టించిన యామినీ కృష్ణమూర్తి. అంతటి గొప్ప కళాకారిణి ఆగస్టు 3వ తేదీన అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. 'కమనీయ నృత్యం కూడా ఒక కదనమే. కళాకారుల భాష అర్థంచేసుకోలేని పదివేల మంది ప్రేక్షకులపై సమ్మోహనాస్త్రం విసిరి దారికి తెచ్చుకొవటం ఓ యుద్ధమే' అన్న ఆమె కళా ప్రస్థానం నేటి మానవిలో...

ఆంధ్రదేశంలోని మదనపల్లెలో 1940 డిసెంబరు 20న యామిని జన్మించారు. రిషివ్యాలీ పాఠశాలలో విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. తరచూ కళాకారుల రాకతో, పండిత చర్చలతో వారి ఇల్లు సందడిగా ఉండేది. ఆ కళా స్పర్శతో చిన్నారి యామిని నృత్య కళాకారిణి కావాలని కలలు కనేది. ఆమె ఇష్టాన్ని గుర్తించిన తండ్రి కూతురిని కళాకారిణిగా తీర్చిదిద్దాలని నిశ్చయించారు. యామిని నాట్య శిక్షణ కోసం వారి కుటుంబం చెన్నైకి తరలివెళ్లింది. అక్కడ రుక్మిణీదేవి అరుండేల్ స్థాపించిన కళాక్షేత్రంలో చేరారు. ఓవైపు బీసెంట్ పాఠశాలలో చదువుతూనే మరోవైపు భరతనాట్యంలో శిక్షణ తీసుకున్నారు.

జిజ్ఞాసను గుర్తించి

రుక్మిణీదేవి యామినిని నాట్యకళా ప్రదర్శనలకు తరచూ తీసుకెళ్లేవారు. అక్కడ పెద్ద కళాకారుల అభినయాన్ని ఆసక్తితో గమనిస్తూ సాధన చేసేవారు. అప్పట్లో రుక్మిణీదేవి పండుగలు, పర్వదినాలు, జాతరల సందర్భంగా రుక్మిణీ దేవి తమిళనాట పర్యటిస్తూ 'కురవంజి' అనే జానపద దృశ్యరూపకాన్ని ప్రదర్శించేవారు. మన దగ్గర సోదెమ్మల కళారూపానికి దగ్గరగా ఉండే ఆ కళాంశంలో యామిని చెలికత్తెపాత్రను వేసి మెప్పించారు. ఆమెలో జిజ్ఞాసను గుర్తించిన రుక్మిణీదేవి, యామినిని తంజావూరు బృహదీశ్వరాలయానికి తీసుకువెళ్లి అక్కడ రకరకాల నృత్యరీతులను ప్రదర్శించే గొప్ప కళాకారులను పరిచయం చేశారు.

చెరగని ముద్ర

1954లో యామిని నృత్యజీవితం ఓ మలుపుతిరిగింది. చెన్నై రసికరంజని సభకు వెళ్లారు. అక్కడ బాలసరస్వతీదేవి ఇచ్చిన నాట్య ప్రదర్శన ఆమె మనసుపై చెరగని ముద్రవేసింది. ఆమె భైరవ రాగంలో 'మోహమనే ఎందవేశై' ఒక వర్ణానికి నత్యం చేస్తున్నారు. శాస్త్రీయ నృత్యకళ మీద అంతులేని మమకారం ఏర్పడటానికి బీజం వేసింది.

నాట్య కళాకారిణి కావాలన్న ఆమె ఆకాంక్షను మరింతగా బలపరిచింది. బాలసరస్వతి శిష్యురాలిగా ఉంటూ, నట్టువాంగం చెప్పే కంచీపురం ఎల్లప్పపిళ్లయ్ దగ్గర భరత నాట్యరీతులను ఔపాసన పట్టారు

నృత్య కళాకారిణిగా అరంగేట్రం

ప్రతి నృత్య కళాకారిణి తన జీవితంలో అపురూపంగా భావించే సుమధుర ఘట్టం అరంగేట్రం. లయాన్వితంగా అడుగులు వేస్తూ యామిని వేదికమీదికి వచ్చింది. అందమైన ఆహార్యం, ఆకట్టుకునే



అభినయాన్ని చూసి ఆమెకు ఉజ్వల భవిష్యత్తు ఉందని గురువులు గ్రహించారు. ఒక కళలో పూర్తిగా పట్టుసాధించాలన్న తండ్రి మాటలు ఆమె మనసులో నిలిచిపోయాయి. యామిని మైలాపూర్ కపిలేశ్వర ఆలయ సంప్రదాయ నాట్యంలో పేరుపొందిన కళాకారిణి మైలాపూర్ గౌరి అమ్మాళ్ వద్ద కొంతకాలం శిష్యరికంచేసి

నాట్యతారగా వెలుగులు వెదజల్లి

యామినీ దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా అసమాన నాట్యతారగా వెలుగులు వెదజల్లారు. 1990ల తొలినాళ్లలో కూడా బిజీగా గడిపారు. ఊపిరి సలపనంత ఒత్తిడిలో దేశవిదేశాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. అనేక విశ్వవిద్యాలయాలకు వెళ్ల విజిటింగ్ ప్రొఫెసర్‌గా విద్యార్థులకు నృత్యాంశాలు బోధించారు. 1990లో ఢిల్లీలో స్కూల్ ఆఫ్ డ్యాన్స్‌ను ప్రారంభించి వందలాదిమందికి శిక్షణనిచ్చి తీర్చిదిద్దారు.

అరుదైన పదాలు, జావళీలు నేర్చారు.

మలుపుతిప్పిన సంఘటన

శంకరాభరణ రాగంలో వర్ణానికి ఆమె వేగంగా చేసిన నృత్యానికి ప్రేక్షకలోకం ఆశ్చర్యపోయింది. సంస్కృత పండితుడైన తండ్రి కృష్ణమూర్తి పేర్చిన పదాలను యామిని నృత్యరూపకంగా కూర్చారు. అలా ఒక్కో పదానికి, వర్ణానికి నర్తిస్తూ దేశమంతా గుర్తింపు పొందుతున్నారు. భరతనాట్యంలో యువకళాకారిణిగా తనదైన ముద్రవేసుకున్నారు. సరిగ్గా అప్పుడే చెన్నయ్‌లో తెలుగువారి నృత్య కళారూపం 'కూచిపూడి'లో శిక్షణనిచ్చే వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి దృష్టిలో పడ్డారు యామిని. 'తెలుగునాట పుట్టావు. తెలుగువారి కళారూపం కూచిపూడి జ్ఞాపకంగానే చరిత్రపుటల్లో మిగిలే దుస్థితి దాపురిస్తోంది. అంతరించిపోతున్న కళారూపాన్ని కొంతయినా నిలబెడదాం' అని ఆమెకు చెప్పారు. దీనికి తండ్రి ప్రోత్సాహం కూడా తోడయ్యింది. అప్పటి నుండి



వేదాంతం లక్ష్మీనారాయణ ఆమెకు స్వయంగా శిక్షణనిచ్చారు. తొలిసారి కూచిపూడిలో దశావతారం శబ్దం నేర్చుకున్నారు.

కొద్ది కాలంలోనే పట్టుసాధించి

ఆరోజుల్లో కూచిపూడి అంటే నాట్య ప్రపంచానికి చిన్నచూపు. సంగీత నాటక అకాడమీ సైతం కూచిపూడిని సంప్రదాయ నృత్యంగా గుర్తించలేదు. అటువంటి పరిస్థితుల్లో కూచిపూడి నేర్చి ఆ కళారూపంమీద కొద్ది కాలంలోనే పట్టుసాధించారు. 'కృష్ణశబ్దం' యామినిలా మరెవరూ సమర్పించలేరని పేరు తెచ్చుకున్నారు. 'భామాకలాపం'లో సత్యభామ పాత్రలో అద్భుత నటన ప్రదర్శించారు. 'క్షీరసాగర మథనం'లో మోహినిగా మెప్పించారు. ఆ రూపకంలో నాట్యగురువు వెంపటి చినసత్యం శ్రీకృష్ణుని వేషం వేశారు. సంవాదపూర్వకంగా సాగే అంశం'దశావతారం'లో యామిని నృత్యాభిన యానికి సాక్షాత్తూ నాటి ఉపరాష్ట్రపతి డా. సర్వేపల్లి





రాధాకృష్ణన్ ముగ్ధులై స్వయంగా అభినందించారు. 'భామవేణి' అనే జడను ఆమెకు బహూకరించారు.

ప్రవేశం ఓ సంచలనం

కేవలం మగవాళ్లకే పరిమితమైన కూచిపూడి కళారంగంలో యామిని ప్రవేశం ఓ సంచలనం. గురు శిష్యుల సాయంతో ఆమె కూచిపూడి నృత్యానికి కొత్త సొగసులద్దారు.

మొట్టమొదటి ఫిమేల్ సూపర్ స్టార్ డ్యాన్సర్‌గా పేరు ప్రఖ్యాతులు గడించారు. అలాగే ఒడిస్సీ అభినయ పాఠాలు నేర్చి దేశ విదేశాల్లో నృత్య ప్రదర్శనలిచ్చారు. ఆలయ నాట్యాలు తప్ప అన్ని నృత్యాలలో పురుషులదే పైచేయిగా ఉండే కాలమది. స్త్రీలకు కట్టుబాట్ల కాలంలో సంకెళ్లను ఛేదించి ముందుకెళ్లారు. స్వాతంత్ర్యోద్యమకాలంలో పుట్టిపెరిగిన ఆమె మహాత్మాగాంధీ బోధనలకు ఆకర్షితురాలయ్యారు. ఈ స్ఫూర్తితోనే 'గాంధీయన్ ఆర్డర్ ఆఫ్ లైఫ్' అనే నృత్యరూపకాన్ని చేశారు. భరతనాట్యంలో ఎంతో క్లిష్టమైన తాళ గతులను సంస్కరించారు. 'నాన్న నుంచి నాకు అలవడిన లక్షణం స్థితప్రజ్ఞత' అంటారు యామిని.

విశ్వవేదికలపై...

కూచిపూడిని సోలో డ్యాన్స్‌గా తీర్చిదిద్దటంలో యామిని కృషి మరువలేనిది. ఆమెకు కూచిపూడి ప్రాణం, భరతనాట్యం ధ్యానం, ఒడిస్సీ అంటే అభిమానం. దూరదర్శన్‌లో నృత్యరీతులపై 13 భాగాల సీరియల్‌కు రూపకల్పన చేశారు. ఆమె ఆంగ్లంలో 'ఎ ప్యాషన్ ఫర్ ఎ డ్యాన్స్' అనే పేరుతో జీవిత చరిత్ర రాశారు. పళ్లెం, కలశంతో డ్యాన్స్ చేసే పద్ధతిని తొలిసారి ఢిల్లీ ప్రేక్షకుల ముందు ప్రదర్శించారు ఈమె. కాళిదాస, భవభూతి, శంకర పద్యాల ఆధారంగా కొన్ని నృత్యాంశాలను తయారు చేశారు. తొలిసారిగా లండన్ కామన్వెల్త్ కాన్ఫరెన్స్ లో యామిని ప్రదర్శన ఇచ్చారు. అమెరికా, రష్యా, యూకే, ఫ్రాన్స్, మెక్సికో, పాకిస్థాన్ దేశాల్లో పర్యటించి ప్రదర్శనలిచ్చి కళానీరాజనాలం దుకున్నారు యామిని. భారత రాష్ట్రపతి వివి గిరితో బ్యాంకాక్‌కు బయల్దేరిన భారత ప్రతినిధి బృందంలో సభ్యురాలు.

పురస్కారాలు

భారతీయ నృత్యరీతుల్లో చేసిన కృషికి గుర్తింపుగా యామినికి అనేక పురస్కారాలు లభించాయి. 1968లో కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీతో గుర్తించింది. 1977 సంగీత నాటక అకాడమీ అవార్డు లభించింది. 2001లో పద్మభూషణ్ వరించింది. అ ఏడాది మరోసారి కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం, 2002 భారతీయ నృత్యరీతులకు ప్రాచుర్యం కల్పించిన యామిని కృషికి గుర్తింపుగా కళింగ పురస్కారం లభించింది. 2014లో బెంగళూరు శాంభవి స్కూల్ ఆఫ్ డ్యాన్స్ యామినిని నాట్యశాస్త్ర పురస్కారంతో సత్కరించింది. 2016 దేశ అద్వితీయ పురస్కారం, పద్మ అవార్డుల్లో అత్యుత్తమమైన పద్మవిభూషణ్ పురస్కారంతో భారత ప్రభుత్వం ఆమెను సత్కరించింది. ఆమె కళా వైశిష్ట్యాన్ని గుర్తించిన తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన నర్తకిగా నియమించింది. ■

దుర్మార్గం

(మొదటిపేజీ తరువాయి)

విదితమే. షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు వాణిదేవి, నవీన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, మాజీ ఎంపీ మంద జగన్నాథం, నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తోపాటు పలువురు పరామర్శించారు. ఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు తదితరులు బాధితురాలిని కలిసి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. మహిళపై థర్డ్ డిగ్రీ ఉపయోగించడంతో సభ్యసమాజం తలెత్తుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఫ్రెండ్లీ పోలీసులు ఉండరని, లాఠీ పోలీసులు మాత్రమే ఉంటారని ఎద్దేవా చేశారు. మహిళ అని చూడకుండా చిత్రహింసలకు గురిచేయడం సిగ్గుచేటన్నారు. తక్షణమే డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డితోపాటు ఈ కేసులో ఉన్నవారందరిపైనా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాత్రి సమయంలో మహిళలను పోలీస్ స్టేషన్‌లో ఉంచే హక్కు పోలీసులకు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. బాధితురాలు సునీత నోటి వెంట నిజాలు వింటుంటే తమకు ఎంతో బాధ కలిగిందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి, హోంమంత్రి ఒక్కడేనని, ఆయన అండ చూసుకొనే పోలీసులు ఇలా చెలరేగిపోతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. రౌడీ షీటర్లతో పోలీసులు సెటిల్‌మెంట్లు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ తరపున తక్షణ సాయంగా బాధితురాలి కుటుంబానికి ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రూ.లక్ష అందజేశారు. వారి వెంట మున్సిపల్ చైర్మెన్ నరేందర్, మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ ఈట గణేష్, వెంకట్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మెన్ నటరాజ్ తదితరులు ఉన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు

దళిత మహిళ సునీతపై షాద్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, మరో నలుగురు కలిసి థర్డ్ డిగ్రీ ప్రయోగించిన కేసులో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు డిమాండ్ చేశారు. బాధ్యులను ఉద్యోగాల నుంచి డిస్మిస్ చేయాలని కోరారు. షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో బాధితురాలు సునీతను కేవీపీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బోడ సామేలు, యం.ప్రకాష్ కరత్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు



జి.లక్ష్మీదేవి తదితరులతో కలిసి పరామర్శించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను బాధితురాలిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. దొంగతనం నెపంతో మహిళపై పోలీసులు ఇష్టానురీతిగా దాడి చేయడం దుర్మార్గమన్నారు. బాధిత పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలని డిమాండ్ చేశారు. వారి వెంట సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎన్.రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనునాయక్, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్‌నాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్, సీఐటీయూ సీనియర్ నాయకులు వడ్ల చంద్రమౌళి, నాయకులు కావలి రాజు, రాజశేఖర్, శ్రీనివాస్ ఐద్వా నాయకురాలు లక్ష్మి, కేవీపీఎస్ నాయకులు కొంగరి నర్సింహులు, మహమ్మద్, బాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే పలు దళిత, మహిళా చైతన్యం సంఘం నాయకులు సునీతను పరామర్శించారు.

డీఐ రాంరెడ్డితోపాటు మరో ఐదుగురిపై వేటు

షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో దళిత మహిళ సునీతపై థర్డ్ డిగ్రీ ఉపయోగించిన ఘటనలో డీఐతోపాటు మరో ఐదుగురిపై వేటు పడింది. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, ఐదుగురు పోలీసులు మోహన్‌లాల్, కరుణాకర్, అఖిల, రాజు, జాకీర్‌ను సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి సస్పెండ్ చేశారు.

వాస్తవాలే ఆయువుపట్టుగా..

(మొదటిపేజీ తరువాయి)

సమస్యల గురించి ఉన్న గందరగోళాన్ని తొలగించి మంచి సామాజిక విశ్లేషణతో ప్రజలను చైతన్య పరుస్తున్నది. రాజకీయంగా పదునైన అంశాలకు చోటిచ్చి ప్రజా రాజకీయాలపై అవగాహన కలిగిస్తోంది. సాహిత్యానికి సముచిత స్థానం నవ తెలంగాణాలో ఉంది. ఒక వార్తా పత్రిక ప్రజల యెడల ఎంత బాధ్యతగా ఉండాలో అంత బాధ్యతగా ఉంటున్న నవ తెలంగాణాకు అభినందనలు. మరెన్నో సంవత్సరాలు ఇలా ప్రజలకు మార్గ నిర్దేశం చేయగలదని ఆశిస్తూ.

కృష్ణమ్మ ఉరకలు

(మొదటిపేజీ తరువాయి)

లోతట్టు ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. రెండేండ్ల తర్వాత సాగర్ నిండింది. చివరి సారిగా 2022 ఆగస్టు 11న క్రస్ట్‌గేట్లను ఎత్తారు. వరద ప్రవాహం కొనసాగే అవకాశం ఉండటంతో డ్యామ్ గరిష్ట నీటిమట్టం కొనసాగిస్తూ.. దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. వరద పెరిగే కొద్దీ మరికొన్ని గేట్లు కూడా ఎత్తుతామని అధికారులు తెలిపారు. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 584 అడుగుల వద్ద నీరు నిల్వవుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా, ప్రస్తుతానికి 294.5500 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 29,110 క్యూసెక్కుల నీటిని, కుడి కాలువ ద్వారా 8452 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాల్వ ద్వారా 4746 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కుల నీటిని, లోలేవల్ కెనాల్ ద్వారా 600క్యూసెక్కుల నీటిని మొత్తం 1,63,220 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

'బేర్'మన్న మార్కెట్లు

ముంబయి : అమెరికాలో ఆర్థిక మందగమనం భయాలు ప్రపంచ మార్కెట్లను బెంబేలెత్తించాయి. ఈ క్రమంలోనే సోమవారం భారత మార్కెట్లు భారీ నష్టాల పాలయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 2222 పాయింట్లు లేదా 2.74 శాతం పతనమై 78,768కు దిగజారింది. ఇంట్రాడేలో ఏకంగా 78,296 పాయింట్లు లేదా 3 శాతం విలువ కోల్పోయింది. ఒక్క పూటలోనే రూ.15.34 లక్షల కోట్ల సంపద ఆవిరయ్యింది. దీంతో బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.457 లక్షల కోట్ల నుంచి రూ.441.82 లక్షల కోట్లకు పరిమితమయ్యింది. తీవ్ర అమ్మకాల ఒత్తిడితో దలాల్ స్ట్రీట్‌లో ఒక్కసారిగా ఏర్పడిన కుదుపునతో సాధారణ మదుపర్లు బోరుమన్నారు.బీఎస్ఈలో బాటలోనే ఎన్ఎస్ఈ నిఫ్టీ 662 పాయింట్లు లేదా 2.68 శాతం పతనమై 24,055 వద్ద ముగిసింది. నిఫ్టీ-50లో 45 స్టాక్స్ నష్టాలను చవి చూశాయి. టాటా మోటార్స్, ఓఎన్‌జీసీ, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, హిందాల్కో షేర్లు అత్యధికంగా 7 శాతం వరకు పతనమయ్యాయి. బీఎస్ఈ-30లో హిందుస్థాన్ యూనిలీవర్, నెస్లే మినహా 28 స్టాక్స్ నేల చూపులు చూశాయి. నిఫ్టీలో స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీ లు వరుసగా 4.5 శాతం, 3.5 శాతం చొప్పున విలువ కోల్పోయా యి. అన్ని రంగాల సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. ఆటో, లోహ, ఐటీ, బ్యాంకింగ్ సూచీలు అత్యధికం గా 4.85 శాతం వరకు క్షీణించాయి.

ప్రధాన ప్రతికూలాంశాలు..

అమెరికా మాంద్యంలోకి జారుకుంటుందనే విశ్లేషణలు, సంకేతాలు ప్రపంచ మార్కెట్లను తీవ్ర ఒత్తిడికి గురి చేశాయి. ఆ దేశంలో ఉపాధి పడిపోతుందనే గణాంకాలు ఆందోళన రేపాయి. ఈ ఏడాది జులై నెలలో వ్యవసాయేతర రంగాల్లో 1.14 లక్షల ఉద్యోగాలు మాత్రమే నమోదయ్యాయని అమెరికా లేబర్ డిపార్ట్‌మెంట్ గణంకాలు వెల్లడించాయి. జనాభా పెరుగుదలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలను కల్పించాలంటే కనీసం 2 లక్షల ఉద్యోగాలను సృష్టించాల్సి ఉంది. కానీ ఆ స్థాయి, అంచనాలకు తగ్గట్లుగా ఉద్యోగాల సృష్టి లేకపోవడం.. నిరుద్యోగిత రేటు 4.3 శాతానికి పెరగడం ప్రపంచ మార్కెట్ల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. మార్కెట్ల పతనానికి ఇదే ప్రధాన కారణం. దీంతో పాటు బ్యాంక్ ఆఫ్ జపాన్ ఇటీవల వడ్డీరేట్లను 0.25 శాతం పెంచడం, బాండ్ల కొనుగోళ్లను తగ్గించడంతో అక్కడి నికాయ్ సూచీ 14 శాతం పడిపోవడం.. ఇతర ఆసియన్ మార్కెట్లపై ప్రభావం చూపింది. ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడి చేయవచ్చని అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ సంకేతాలు ఇవ్వడం ప్రపంచ మార్కెట్లను మరింత కలవరానికి గురి చేశాయి.

నెలాఖరులో డీఎస్సీ ఫలితాలు ?

ముగిసిన రాతపరీక్షలు
రాష్ట్రవ్యాప్తంగా 87.61 శాతం హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ) రాతపరీక్షలు సోమవారంతో ముగిశాయి. ఆన్‌లైన్ ద్వారా కంప్యూటర్ ఆధారిత విధానం (సీబీఆర్టీ)లో ఈ పరీక్షలు గతనెల 18 నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. ప్రశాంతంగా ముగిశాయని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2,79,957 మంది దరఖాస్తు చేయగా, 2,45,263 (87.61 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారని వివరించారు. 34,694 (12.39 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) పోస్టులకు 1,61,745 మంది దరఖాస్తు చేస్తే, 1,37,872 (85.24 శాతం) మంది పరీక్ష రాశారని తెలిపారు. 23,873 (14.76 శాతం) మంది గైర్హాజరయ్యారని వివరించారు. సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ) పోస్టులకు 88,005 మంది దరఖాస్తు చేయగా, 81,053 (92.10 శాతం) మంది హాజరయ్యారని పేర్కొన్నారు. 6,952 (7.9 శాతం) మంది గైర్హాజరయ్యారని తెలిపారు. లాంగ్వేజ్ పండితులు (ఎల్పీ) పోస్టులకు 18,211 మంది దరఖాస్తు చేస్తే, 16,092 (88.36 శాతం) మంది పరీక్ష రాశారని వివరించారు. 2,119 (11.64 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ) పోస్టులకు 11,996 మంది దరఖాస్తు చేయగా, 10,246 (85.41 శాతం) మంది

హాజరయ్యారని తెలిపారు. 1,750 (14.59 శాతం) మంది గైర్హాజరయ్యారని వివరించారు. ఈనెలాఖరులో డీఎస్సీ రాతపరీక్షల ఫలితాలను విడుదల చేయాలని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నట్టు తెలిసింది. ఆన్‌లైన్‌లో రాతపరీక్షలను నిర్వహించడంతో వీలైనంత త్వరగానే ఫలితాలు విడుదల చేసే దిశగా అధికారులు కసరత్తు ప్రారంభించినట్టు సమాచారం. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే.

డీఎస్సీ పరీక్ష వివరాలు

కేటగిరీ	పోస్టులు	దరఖాస్తు	హాజరు	శాతం	గైర్హాజరు
స్కూల్ అసిస్టెంట్	2,849	1,61,745	1,37,872	85.24	23,873
ఎస్జీటీ	7,304	88,005	81,053	92.10	6,952
లాంగ్వేజ్ పండిట్స్	727	18,211	16,092	88.36	2,119
పీఈటీ	182	11,996	10,246	85.41	1,750
మొత్తం	11,062	2,79,957	2,45,263	87.61	34,694

జూనియర్ కాలేజీలకు పత్రికలను పంపిణీ చేయండి
గ్రంథాలయ సంస్థ చైర్మెన్‌కు టీజీజేఎల్ఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు దినపత్రికలు, పోటీ పరీక్షల పత్రికలను ఉచితంగా పంపిణీ చేయాలని టీజీజేఎల్ఏ-475 డిమాండ్ చేసింది. ఈ మేరకు గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రియాజ్‌ను సోమవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధి మరింత జరగాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే పేద విద్యార్థులకు పోటీ పరీక్షలు రాయడానికి వివిధ దినపత్రికలు, పోటీ పత్రికలను పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూర్ణచందర్, గణపతి, హరగోపాల్, రాజిరెడ్డి, వెంకన్న, శ్రీనివాస్, భాస్కర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

డెత్ చాంబర్లుగా మారాయి

(మొదటిపేజీ తరువాయి)

ఎలాంటి సమర్థవంతమైన చర్యలు తీసుకున్నారో మాకు తెలియడం లేదు. తమ భవిష్యత్తు కోసం కోచింగ్ సెంటర్లలో చేరిన యువత ప్రాణాలు తీసిన దురదృష్టకరమైన సంఘటనలు అందరి కళ్లను తెరిపించాయని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన బెంచ్ వ్యాఖ్యానించింది. కేంద్రానికి, ఢిల్లీ పట్టణాభివృద్ధి శాఖకు నోటీసులు జారీ చేసింది. ఇలాంటి మరణాలను నివారించేందుకు తీసుకున్న భద్రతా చర్యలేమిటో తెలియచేయాల్సిందిగా అధికారులను ఆదేశించింది. దేశం నలుమూలల నుంచి చదువుకునేందుకు ఇక్కడకు వస్తారు, అలాంటివారు ఇక్కడ ప్రాణాలు కోల్పోవాలా అని జస్టిస్ కాంత్ ప్రశ్నించారు. అసలు ఈ సంఘటన ఎలా జరిగిందో కూడా అర్థం కావడం లేదని ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించింది. కొద్ది రోజుల క్రితమే ఢిల్లీ హైకోర్టు ఈ కేసును సీబీఐకి బదిలీ చేసింది.

బదిలీ, డిప్యూటేషన్, ఓడీ కోసం కమిటీ
ఉత్తర్వులు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాఠశాలలు, కాలేజీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు బదిలీ, డిప్యూటేషన్, ఆన్ డ్యూటీ (ఓడీ) కోసం రాష్ట్ర ప్రభుత్వం అధికారుల కమిటీని నియమించింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో కళాశాల విద్యాశాఖ కమిషనర్, సాంకేతిక విద్యా కమిషనర్, ఉన్నత విద్యామండలి కార్యదర్శి, ఇంటర్ విద్యా డైరెక్టర్ సభ్యులుగా ఉంటారనీ, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. బదిలీ, ఓడీ, డిప్యూటేషన్ కోసం ఆ కమిటీకి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పైరవీలకు తావులేకుండా సరైన కారణాలను చూపుతూ నేరుగా లేదా ఆన్‌లైన్ ద్వారా ప్రత్యేక వెబ్‌పోర్టల్‌లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతీ ఏడాది మే, ఆగస్టు, నవంబర్ నెల మొదటి వారంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వచ్చిన దరఖాస్తులను ఆ కమిటీ ఆయా నెలల్లో మూడో వారంలో సమావేశమై నిర్ణయం తీసుకుని అదే నెలలో 25వ తేదీలోపు సంబంధిత హెచ్ఓడీలకు ఆదేశాలను జారీ చేస్తుందని వివరించారు. కమిటీ తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా ఆయా శాఖల ఉన్నతాధికారులు బదిలీలు, ఓడీ, డిప్యూటేషన్‌పై చర్యలు తీసుకుంటారని తెలిపారు.

స్వేచ్ఛ కోసం చేసే పోరాటం



విక్రమ్ హీరోగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్'. ఈ చిత్రాన్ని దర్శకుడు పా రంజిత్ రూపొందిస్తున్నారు. నీలమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి స్టూడియో గ్రీన్ ఫిలింస్ బ్యానర్ పై నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. పార్వతీ తిరువోతు, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో యదార్థ ఘటనల ఆధా రంగా ఈ సినిమా తెరకెక్కింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు ఈ సినిమా రాబోతోంది. తెలుగులో ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ రిలీజ్ చేస్తోంది.
హీరో విక్రమ్ మాట్లాడుతూ, 'పా రంజిత్ నా ఫేవరేట్ డైరెక్టర్. ఆయన తీసిన ప్రతి సినిమా నాకు ఇష్టం. ఆయన ఈ కథ నా దగ్గరకు తీసుకొచ్చినప్పుడు చాలా హ్యాపీగా ఫీలయ్యా. ఇది తెలుగు, తమిళ, కన్నడ అని కాదు ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ రిలేట్ అయ్యే స్టోరీ. బంగారం వేట అనేది హైలెట్ అవుతున్నా. ఈ కథలో స్వేచ్ఛ కోసం చేసే పోరాటం ఉంది. థియేటర్‌లో మిమ్మల్ని ఈ సినిమా సర్‌ప్రైజ్ చేస్తుంది' అని అన్నారు.

బేబీతో మరోమారు రుజువైంది



ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య ప్రధాన పాత్రల్లో మాస్ మూవీ మేకర్స్ బ్యానర్ పై ఎస్ కేఎన్ నిర్మాణంలో దర్శకుడు సాయి రాజేశ్ రూపొందించిన చిత్రం 'బేబి'. తాజాగా జరిగిన ఫిల్మ్ ఫేర్ సౌత్ 2024 అవార్డ్స్‌లో ఈ సినిమాకు 5 అవార్డ్స్ దక్కాయి.
డైరెక్టర్లు సాయి రాజేశ్, డైరెక్టర్ మారుతి, నిర్మాత ఎస్ కేఎన్ మాట్లాడుతూ, 'అవార్డ్స్ అంటే స్టార్స్ సినిమాలకే వస్తాయనే అపోహ తొలగి పోయిన సందర్భం ఇది. కంటెంట్ బాగుంటే చిన్న సినిమాలకూ అవార్డులొస్తాయని మా 'బేబీ'తో మరోమారు రుజువైందిరి' అని అన్నారు.



డబుల్ బ్లాక్‌బస్టర్ ఖాయం

రామ్ పోతినేని, డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న పాన్ ఇండియా మూవీ 'డబుల్ ఇస్మార్ట్'. ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ వైజాగ్‌లో చాలా గ్రాండ్‌గా జరిగింది.
ఈ సందర్భంగా రామ్ పోతినేని మాట్లాడుతూ,'ఇస్మార్ట్ శంకర్ క్యారెక్టర్ గురించి చెప్పాలంటే మెంటల్ మాస్ మ్యాడ్ నెస్ వాడు. యాక్ట్ చేస్తున్నపుడు నాకు వచ్చిన కిక్ వేరు. అలాంటి మెంటల్ మాస్ మ్యాడ్ నెస్ క్యారెక్టర్‌తో ఒక కిక్-యాస్ స్క్రిప్ట్ ఉంటే ఎలా ఉంటుందని అనుకున్నాం. అప్పుడు ఈ 'డబుల్ ఇస్మార్ట్' స్క్రిప్ట్ రాశారు. ఇదొక పక్కా మాస్ కమర్షియల్ సినిమా. కమర్షియల్ సినిమా హిట్ అయ్యిందంటే వచ్చే కిక్కే వేరు. అలాంటి కిక్కు ఈ సినిమాతో నాకు మళ్ళీ వస్తుందని ఆశిస్తున్నా. డబుల్ మ్యాడ్‌నెస్‌తో ఈ సినిమాని థియేటర్లలో అందరూ సెలబ్రేట్ చేసుకుంటారు. ఈ సినిమా నా కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలుస్తుందని ఆశిస్తున్నాను. ఈ సినిమాని అంత బాగా పూరి తెరకెక్కించారు' అని అని తెలిపారు. ఈ సినిమా ఈనెల 15న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఫస్ట్ లవ్ మ్యూజిక్ అద్భుతం : తమన్



"ఫస్ట్ లవ్' సాంగ్ ఒక బ్యూటీఫుల్ సినిమా చూసిన ఎక్స్‌పీరియన్స్ ఇచ్చింది. చివర్లో హార్ట్ బ్రేక్ అయ్యింది. తప్పకుండా ఈ సినిమా బిగ్ హిట్ అవుతుంది' అని సంగీత దర్శకుడు తమన్ అన్నారు.
దీపు జాను, వైశాలిరాజ్ లీడ్ రోల్స్‌లో బాలరాజు ఎం డైరెక్ట్ చేసి బ్యూటీఫుల్ మ్యూజికల్ ఆల్బమ్ 'ఫస్ట్ లవ్'. వైశాలిరాజ్ నిర్మించిన ఈ ఆల్బమ్ టీజర్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. తాజాగా సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ ఫస్ట్ లవ్ సాంగ్‌ని గ్రాండ్‌గా లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఫస్ట్ లవ్ మ్యూజిక్ వీడియో చాలా బ్యూటీఫుల్‌గా ఉంది. సాంగ్‌లో ఒక అద్భుతమైన కథ చూపించారు. ఒక మంచి సినిమా చూసిన ఫీలింగ్ కలిగింది. మధు పొన్నాస్ బ్యూటీ ఫుల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ చేశారు. సంజీవ్ థామస్, సిడ్ శ్రీరామ్ ప్రాణం పెట్టి చేశారు' అని అన్నారు. 'తమన్ చాలా బిజీగా ఉండి కూడా మమ్మలి సపోర్ట్ చేయడానికి రావడం చాలా ఆనందాన్ని ఇచ్చింది' అని హీరోయిన్, ప్రొడ్యూసర్ వైశాలిరాజ్ చెప్పారు.



యువ షట్లర్ లక్ష్యసేన్ ఆశలు ఆవిరయ్యాయి. మెన్స్ సింగిల్స్‌లో చారిత్రక ఒలింపిక్ మెడల్‌పై కన్నేసిన లక్ష్యసేన్.. కాంస్య పతక పోరులో పోరాడి ఓడాడు. దీంతో మూడు ఒలింపిక్స్ తర్వాత తొలిసారి భారత్ బ్యాడ్మింటన్‌లో పతకం లేకుండా నిష్క్రమించింది!. షూటింగ్‌లో మహేశ్వరి, అనంత్ జోడీకి సైతం భంగపాటు తప్పలేదు. స్కీట్ మిక్స్‌డ్ టీమ్ కాంస్య పతక మ్యాచ్‌లో మన జోడీ స్వల్ప తేడాతో పతకం చేజారింది. బ్యాడ్మింటన్, షూటింగ్‌లో నాల్గో స్థానంలో నిలువటంతో భారత్ రెండు కాంస్య పతకాలు చేజార్చుకుంది.

ఛ్.. మెడల్స్ మిస్!

- బ్యాడ్మింటన్‌లో లక్ష్యసేన్, షూటింగ్‌లో మహేశ్వరి-అనంత్ జోడీకి నిరాశే
- నాల్గో స్థానంతో దూరమైన కాంస్య పతకాలు

పారిస్ 2024 ఒలింపిక్స్

నవతెలంగాణ-పారిస్

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ మరో పతకం సాధిస్తుందని అనుకుంటే.. సోమవారం భంగపాటు తప్పలేదు. బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్ కాంస్య పతక మ్యాచ్‌లో యువ షట్లర్ లక్ష్యసేన్ పోరాడి ఓడాడు. మలేషియా షట్లర్, ఏడో సీడ్ లీ జి జియతో ఉత్కంఠ మ్యాచ్‌లో 1-2తో పరాజయం పాలయ్యాడు. షూటింగ్‌లో మహేశ్వరి చౌహాన్, అనంత్ జీత్ సింగ్ జోడీ సైతం నిరాశపరిచింది. స్కీట్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో నాల్గో స్థానంతో సరిపెట్టుకుంది. పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ షూటింగ్‌లో నాల్గో స్థానానికి పరిమితం కావటం మూడోసారి. మను బాకర్, అర్జున్ బబుత సైతం తమ విభాగాల్లో నాల్గో స్థానంలో నిలిచి మెడల్‌కు అడుగు దూరంలో నిలిచిపోయారు.

లక్ష్యసేన్.. పోరాడినా! : పురుషుల సింగిల్స్ (బ్యాడ్మింటన్)లో లక్ష్యసేన్ పతక ఆశలు ఆవిరి



అయ్యాయి. భారత బ్యాడ్మింటన్ దిగ్గజం ప్రకాశ్ పదుకొణె స్వయంగా లక్ష్యసేన్‌కు శిక్షకుడిగా బరిలోకి దిగటంతో అంచనాలు అమాంతం ఎక్కువైయ్యాయి. ఏడో సీడ్ మలేషియా షట్లర్ లీ జి జియపై లక్ష్యసేన్ దూకుడుగా ఆడాడు. 71 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో లక్ష్యసేన్ 21-13తో తొలి గేమ్‌ను అలవోకగా సొంతం చేసుకున్నాడు. 20 నిమిషాల్లోనే మలేషియా షట్లర్‌పై పైచేయి సాధించాడు. కానీ రెండో గేమ్‌లో మలేషియా షట్లర్ పుంజుకున్నాడు. లక్ష్యసేన్‌ను 21-16తో వెనక్కి నెట్టి స్కోరు సమం చేశాడు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో లక్ష్యసేన్ అంచనాలను అందుకోలేదు. 11-21తో లీ జి జియ ముందు తేలిపోయాడు. చివరి రెండు గేములు 26 నిమిషాలు సాగాయి. లక్ష్యసేన్ ప్రతి పాయింట్ కోసం తీవ్రంగా పోరాడినా ఫలితం దక్కలేదు. మెన్స్ సింగిల్స్ గోల్డ్ మెడల్ మ్యాచ్‌లో విక్టర్ అక్సెల్సెన్ (డెన్మార్క్) 21-11, 21-11తో కునాల్ (థాయ్‌లాండ్)పై విజయం సాధించాడు.

మరోసారి గురి తప్పింది : పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు మూడు కాంస్య పతకాలు దక్కగా.. షూటర్లే ఆ ఘనత సాధించారు. పలు క్రీడాంశాల్లో భారత్ మెడల్‌కు చేరువగా వచ్చినా గెలుపు గీత తాకలేదు. షూటింగ్‌లో మరో మెడల్ వచ్చినట్టే వచ్చి చేజారింది. స్కీట్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ కాంస్య పతక రౌండ్‌లో మహేశ్వరి చౌహాన్, అనంత్ జీత్ సింగ్‌లు నిరాశపరిచారు. చైనా షూటర్లు జియాంగ్, జిన్‌లిన్ జోడీ 44-43తో కాంస్య పతకం సొంతం చేసుకుంది. మహేశ్వరి, అనంత్‌లు వరుసగా 7, 6, 7, 7, 8, 8 స్కోరు చేయగా.. చైనా షూటర్లు 8, 5, 7, 8, 8, 8తో మెరిశారు. ఆఖరు మూడు రౌండ్లలో పర్‌ఫెక్ట్ 8తో చైనా కాంస్య పతకం సొంతం చేసుకుంది.

నిశ నిష్క్రమణ : రెజ్లింగ్‌లో నిశ దహియ పోరాటం ముగిసింది. మహిళల 68 కేజీల విభాగం క్వార్టర్‌ఫైనల్లో ఉత్తర కొరియా రెజ్లర్ గమ్ పాక్ చేతిలో పరాజయం పాలైంది. 18 ఏండ్ల పాక్ ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న అతి పిన్న వయస్కురాలైన రెజ్లర్. క్వార్టర్‌ఫైనల్ దంగల్‌లో 4-0తో ముందంజలో నిలిచిన నిశ దహియ.. ఆఖర్లో విలవిల్లాడింది. నిశ కుడి కాలును పట్టుకుని టేక్‌డౌన్ చేసిన పాక్ తిరుగులేని పైచేయి సాధించింది. నొప్పితో నిశ కన్నీంటి పర్యంతమైంది. ఉత్తర కొరియా అమ్మాయి ఈ విభాగం సెమీఫైనల్లోకి ప్రవేశించింది.

నీరజ్ వస్తున్నాడు..!

- జావెలిన్ త్రో అర్హత రౌండ్ నేటి నుంచి
- జర్మనీతో హాకీ ఇండియా సెమీస్ నేడు

పారిస్ : భారత సూపర్‌స్టార్ అథ్లెట్, టోక్యో ఒలింపిక్స్ గోల్డ్ మెడలిస్ట్ నీరజ్ చోప్రా నేడు పారిస్ బరిలోకి దిగుతున్నాడు. మెన్స్ జావెలిన్ త్రో విభాగం అర్హత రౌండ్‌లో కిశోర్ కుమార్ జెనాతో కలిసి నీరజ్ చోప్రా పోటీపడనున్నాడు. నేడు మధ్యాహ్నం 1.50 గంటలకు జావెలిన్ త్రో అర్హత రౌండ్ ఆరంభం కానుంది. టాప్-12 అథ్లెట్లు లేదా 84 మీటర్లు అందుకున్న అథ్లెట్లు ఫైనల్స్‌కు అర్హత సాధిస్తారు. గ్రూప్-బిలో ఉన్న నీరజ్ చోప్రా 3.20 గంటలకు బల్లెం విసరనున్నాడు. ఇక భారత గుండెచప్పుడు హాకీ ఇండియా కీలక సెమీఫైనల్ సైతం నేడే. వరల్డ్ చాంపియన్స్ జర్మనీతో భారత్ పోటీపడనుంది. వరుసగా ఆస్ట్రేలియా, గ్రేట్ బ్రిటన్‌లను ఓడించిన ఉత్సాహంలో ఉన్న భారత్.. చారిత్రక ఫైనల్‌పై కన్నేసి బరిలోకి దిగుతోంది. డిఫెండర్ అమిత్ రోహిదాస్‌పై ఓ మ్యాచ్ నిషేధం భారత్ 15 మందితో కూడిన జట్టులోనే సెమీస్‌లో తలపడనుంది. స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగట్ సైతం నేడు దంగల్‌కు సిద్ధం కానుంది. వినేశ్ పోటీపడుతున్న విభాగంలో క్వార్టర్‌ఫైనల్, సెమీఫైనల్ నేడే కావటంతో మెడల్ లక్ష్యంగా ఆమె బరిలోకి దిగుతుంది.











కార్పొరేట్ల కోసమే సింగరేణి ప్రయివేటీకరణ

నియంత్రించకుంటే బీఎస్ఎన్ఎల్ తరహాలోనే కోల్‌బ్లాక్‌ల దుస్థితి | పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది

- మోడీ ప్రభుత్వ విధానాలతో సామాన్యులకు తీరని నష్టం : బహిరంగసభలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు విజయరాఘవన్
- కొత్తగూడెంలో ముగిసిన సింగరేణి పరిరక్షణ యాత్ర

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/కొత్తగూడెం

కార్పొరేట్ల కోసమే లాభాల్లో ఉన్న సింగరేణిని మోడీ ప్రభుత్వం ప్రయివేటీకరిస్తోందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ ఎంపీ విజయరాఘవన్ అన్నారు. సింగరేణిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. భవిష్యత్తులో గనుల వేలం పేరుతో మొదలైన ఈ చర్యలను నియంత్రించకపోతే బీఎస్ఎన్ఎల్ తరహా లోనే కోల్‌బ్లాక్‌ల దుస్థితి తయారవుతుందని హెచ్చరించారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గతనెల జులై 29న బెల్లంపల్లిలో చేపట్టిన 'సింగరేణి పరిరక్షణ యాత్ర' సోమవారం కొత్తగూడెంలో ముగిసింది. ఈ సందర్భంగా కొత్తగూడెం రైల్వేస్టేషన్ ఆవరణలో పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగసభలో విజయరాఘవన్ మాట్లాడారు. కోల్‌బెల్ట్ ప్రాంతంలోని ఐదు నుంచి ఆరు జిల్లాల ప్రజల జీవితాలు, హక్కులను ముందుకు తీసుకెళ్లేందుకు సీపీఐ(ఎం), ట్రేడ్ యూనియన్ నాయకులు ఈ పరిరక్షణ యాత్రను చేపట్టారని తెలిపారు. 'బీజేపీ పాలనలో ప్రజలు అనేక సామాజిక సమస్యలతో సతమతం అవుతున్నారు. భూమితో పాటు తినేందుకు తిండి...ఉండేందుకు ఇల్లులేని స్థితి నెలకొంది. బీజేపీ, నరేంద్రమోడీ పాలనలో కేవలం ధనవంతులు, కార్పొరేట్లు, అధానీలు, అంబానీలు మాత్రమే లబ్ది పొందుతున్నారు' అని అన్నారు. ప్రపంచంలోనే నిరుద్యోగితలో భారతదేశం ప్రథమస్థానంలో ఉందన్నారు. దేశంలో నిరుద్యోగం 40శాతం పెరిగిందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రజల జీవనస్థితిగతులు దిగజారయన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకాయని, ప్రజల కొనుగోలు శక్తి పడిపోయిందన్నారు. మోడీ ప్రభుత్వాన్ని ప్రజలు వ్యతిరేకించి తక్కువ సీట్లు ఇచ్చారని, కొన్ని పార్టీలు ఆయనకు మద్దతు ఇచ్చి అధికారం ఇవ్వడానికి సహకరించాయని తెలిపారు. వారికి బహుమతిగా సింగరేణి బొగ్గు బ్లాకులను కట్టబెడుతున్నారని విమర్శించారు. లాభాల్లో ఉన్న సింగరేణిని ఎందుకు ప్రయివేటీకరణ చేయాల్సి వస్తుందని ప్రశ్నించారు. లాభాల్లో ఉన్న సంస్థను ప్రయివేటీకరిస్తే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుంది కాబట్టి ప్రస్తుతం ఉన్న బొగ్గు బ్లాక్‌లను కాకుండా భవిష్యత్తు బ్లాక్‌లను మాత్రమే ప్రయివేటీకరిస్తున్నామని చెబుతున్నారని వివరించారు. ప్రస్తుతం ఉన్న గనుల్లో బొగ్గు అయిపోతే ఏ బొగ్గు బ్లాక్‌ల మీద ప్రజలు ఆధారపడాలని ప్రశ్నించారు. ప్రయివేటుకు అప్పగించిన కొత్త బొగ్గు బ్లాక్‌ల మీద ఆధారపడాల్సి వస్తుందన్నారు. గనుల మీద ఆధారపడిన పేద ప్రజలకు ప్రత్యామ్నాయం చూపించకుండా ఉపాధి, ఆదాయ వనరులు చూపించకుండా ప్రయివేటుకు కట్టబెట్టే కుట్ర చేస్తున్నారని విజయరాఘవన్ మండిపడ్డారు. బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్‌ల విషయంలోనూ ఇలాగే జరిగిందన్నారు. టెలిఫోన్‌లను ప్రయివేటీకరించట్లేదు... భవిష్యత్తులో వచ్చే మొబైల్స్ (సెల్‌ఫోన్)ను మాత్రమే ప్రయివేటీకరిస్తున్నామని నాటి ప్రభుత్వాలు చెప్పాయన్నారు. కాలక్రమేణా ల్యాండ్ ఫోన్‌లు అనేవి లేకుండా పోయాయని, ఇప్పుడు మొత్తం సెల్‌ఫోన్‌లు మాత్రమే ఉన్నాయన్నారు. మొబైల్ నెట్‌వర్క్ సంస్థల్లో 96శాతం ప్రయివేటులోనే ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. కోల్‌బ్లాక్‌ల విషయంలోనూ అదే జరగబోతుందన్నారు. ఈ ప్రయివేటీకరణంతా ఓ పద్ధతి ప్రకారం జరుగుతుందన్నారు. ప్రయివేటీకరణతో పేదలు అదనంగా వ్యయం చేయాల్సి వస్తుందన్నారు. కార్పొరేట్ల కోసమే ఇలాంటి చర్యలన్నారు. ఓవైపు ప్రపంచవ్యాప్తంగా బొగ్గు ధరలు పెరుగుతుంటే విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న బొగ్గును 10శాతమైనా వాడాలని మోడీ ప్రభుత్వం నిర్ణయించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రయివేటుకు కట్టబెట్టడం కోసమే ఇలా చేయడం అన్నారు. క్రమేణా గనులపై ప్రభుత్వ నియంత్రణ కోల్పోయి కార్పొరేట్ల ఆధిపత్యం ఎక్కువవుతుందన్నారు. దీనివల్ల ఎస్సీ, ఎస్టీలు, కార్మికవర్గాలు, పేద ప్రజలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంటుందన్నారు. సింగరేణిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

ప్రయివేటీకరణను కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేకించాలి

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సైతం ప్రాధేయపడుతున్నానని, ఎన్డీఏ ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నిలబడాలని విజయరాఘవన్ కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలు వ్యతిరేకించే దమ్ము ఎర్రజెండాకు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. అందుకే సింగరేణి పరిరక్షణ కోసం సీపీఐ(ఎం) నికరంగా పోరాడుతోందని, దేశ భక్తిని చాటుకుందన్నారు. సింగరేణి లాభాల్లో నడుస్తుందని అందుకే కార్పొరేట్ కళ్ళు దానిపై పడ్డాయన్నారు. కార్పొరేట్ల లాభాల కోసమే ప్రయివేటీకరణ చేస్తున్నారని ఆరోపించారు. సింగరేణి ప్రయివేటీకణ చేయమని చెబుతూనే బొగ్గు బ్లాకుల వేలం ప్రక్రియ పెడుతుండటాన్ని ఎలా చూడాలని ప్రశ్నించారు. పోరాటాలు చేసి సింగరేణిని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు.

సింగరేణి పరిరక్షణ తెలంగాణ ప్రజల కర్తవ్యం..... : భూపాల్

సింగరేణి పరిరక్షణ పూర్తిగా తెలంగాణ ప్రజల కర్తవ్యం. తెలంగాణ అభివృద్ధి, యువతకు ఉపాధి, తెలంగాణ అభివృద్ధి కావాలంటే సింగరేణి సంస్థ బతికి బట్టకట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ అన్నారు. సింగరేణిని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని అన్నారు. సింగరేణి అన్వేషించిన బొగ్గు బ్లాకులను ప్రయివేటు పరంచేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. 9 రోజుల పాటు సాగిన బస్సుయాత్రను ఆదరించిన కార్మిక లోకానికి కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యను తీవ్రంగా పరిగణించాలి... : ఆశయ్య

వంద ఏండ్ల చరిత్ర ఉన్న సింగరేణి చరిత్రను కనుమరుగు చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయని, బొగ్గు బ్లాకులు ప్రయివేటు పరం చేసే సమస్యను తీవ్రంగా పరిగణించని పక్షంలో పెద్దఎత్తున ప్రమాదం ఉందని సీపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఆశయ్య అన్నారు. తెలంగాణలో సింగరేణి ఉన్నందుకే తెలంగాణలో యువతకు ఉపాధి ఉందని చెప్పారు. బీజేపీ మంత్రులను తెలంగాణ ప్రజలు గెలిపిస్తే ఇక్కడి ప్రజలకు కొంగు బంగారం అయిన సింగరేణిని ప్రయివేటుపరం చేసేందుకు బొగ్గుబ్లాకులు వేలం వేస్తున్నారని, దీనికి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం వత్తాసు పలుకున్నతీరును తీవ్రంగా పరిగణించాలని ప్రజలకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజల పక్షాన నిలబడాలని డిమాండ్ చేశారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో మరోసారి సకల జనుల సమ్మెను చేయాల్సిన పరిస్థితి తీసుకు రావద్దని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కాసాని ఐలయ్య, మందా నరసింహరావు, జగదీష్, మచ్చా వెంకటేశ్వర్లు, ఏజీ.రమేష్,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యం.జ్యోతి, లిక్కీ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సంపదనను కాపాడు కోవాలి: పోతినేని సుదర్శన్‌రావు



ప్రకృతి సంపదను మనం కాపాడుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మొదటి సంతకం పెట్టి ప్రయివేటుకు బొగ్గు బ్లాక్‌లను కట్టబెడుతున్నారన్నారు. అప్పటి ప్రభుత్వాలు మొదటి సంతకం ప్రజల ప్రయోజనం కోసం చేస్తే, బిజెపి మంత్రి కిషన్ రెడ్డి మాత్రం తెలంగాణ రాష్ట్రంలోని బొగ్గు బ్లాకులను ప్రయివేటు వారికి కట్టబెట్టేందుకు, ప్రజలకు నష్టం కలిగించేందుకు సంతకం చేశారని చెప్పారు. ప్రకృతి ప్రజలకే చెందాలని ఉన్నప్పటికీ బిజెపి మాత్రం ప్రయివేటు వారికి కట్టబెట్టడం అన్యాయమన్నారు. గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల్లో ఆదివాసీ, గిరిజనుల సంపదను ప్రయివేటుకు కట్టబెడుతుంటే సహించేది లేదన్నారు. ఇప్పటికే ఇల్లందు పట్టణం సింగరేణి బొగ్గు బ్లాకులు మూసి వేశారు. ఇదే విధంగా మణుగూరు, కొత్తగూడెం పట్టణాలు అంతరించి పోతే ఇక్కడి ప్రజలకు మనుగడ ఉండదని హెచ్చరించారు. రానున్న రోజుల్లో యువతకు సింగరేణిలో ఉద్యోగాలు లేకుండా పోతాయన్నారు. ఇది అందరికి సంబంధించిన సమస్య అందుకే అందరూ కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు.

సింగరేణి పరిరక్షణ ఉద్యమం కొనసాగిస్తాం ఎస్.వీరయ్య




తెలంగాణలో సింగరేణి పరిరక్షణ కోసం ఉద్యమం కొనసాగిస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య స్పష్టం చేశారు. సింగరేణి పరిరక్షణ కోసం అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని రాష్ట్ర ప్రభుత్వం పోరాటం చేయాలని కోరారు. బొగ్గు బ్లాకుల వేలం ప్రక్రియకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. సింగరేణి ప్రయివేటీకరణ అయితే విద్యుత్ రేట్లు పెరిగిపోతాయిని, ఇంట్లో కరెంటు బుగ్గలు వెలగవన్నారు. ఉచిత విద్యుత్ లేకుండా పోతుందని, ఇది సింగరేణి కుటుంబాలకు మాత్రమే కాదని, రాష్ట్ర ప్రజలకు కూడా పెద్దఎత్తున నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. ప్రజల సంపదను భావితరాలకు అందించడం కోసం భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

అగాథంలోకి రూపాయి

- 31 పైసలు పతనమై ఆల్‌టైం కనిష్ట స్థాయి 84.03కి..



న్యూఢిల్లీ : అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయి విలువ రికార్డ్ స్థాయిలో పడిపోయింది. సోమవారం అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ 31 పైసలు పతనమై ఆల్‌టైం కనిష్ట స్థాయి 84.03కి దిగజారింది. అమెరికాలో మాంద్యం భయాలకు తోడు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, భారత మార్కెట్ల భారీ పతనం తదితర పరిణామాలు రూపాయి విలువను మునుపెన్నడూ లేని విధంగా అగాథంలోకి పడేశాయి. భారతీయ ఈక్విటీ మార్కెట్ల తీవ్ర పతనం, విదేశీ నిధులు తరలిపోవడం ప్రభావం చూపాయని ఫారెక్స్ వ్యాపారులు తెలిపారు. ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో రూపాయి విలువ 83.78 వద్ద ప్రారంభమైంది ఇంట్రాడేలో గరిష్ఠ స్థాయి 83.76 నుంచి 84.03 కనిష్ట స్థాయిని తాకింది. రూపాయి విలువ పడిపోవడంతో దిగుమతులు భారం కావడంతో పాటు విదేశీ అప్పులపై అధికంగా చెల్లింపులు చేయాల్సి వస్తుంది. ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడిని పెంచుతుంది.

రూ.264 కోట్ల నిధుల సమీకరణలో స్టాండర్డ్ కాపిటల్

న్యూఢిల్లీ : నాన్‌కన్వర్టేబుల్ డిబెంచర్ల (ఎన్‌సిడి)లను జారీ చేయడం ద్వారా రూ.264 కోట్లు సమీకరించడానికి తమ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపిందని స్టాండర్డ్ కాపిటల్ తెలిపింది. ఈ నిధులను ప్రయివేటు ప్లేస్‌మెంట్స్ ద్వారా పొందనున్నట్లు పేర్కొంది. ప్రతీ ఎన్‌సిడి ధరను రూ.10,00,000గా నిర్ణయించింది. 2,648 ఎన్‌సిడి యూనిట్లను జారీ చేయడం ద్వారా రూ.264.8 కోట్లు సమీకరించాలని నిర్దేశించుకున్నట్లు ఆ సంస్థ తెలిపింది.

భారతీ ఎయిర్‌టెల్ లాభాలు 158% వృద్ధి

న్యూఢిల్లీ : టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ లాభాలు భారీగా పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో 158 శాతం వృద్ధితో రూ.4,159 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1,612 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన క్యూ1లో ప్రతీ వినియోగదారుడి నుంచి సగటు రాబడి (ఎఆర్‌పియు) 5.5 శాతం పెరిగి రూ.211కు చేరింది. కంపెనీ రెవెన్యూ 10.1 శాతం పెరిగి రూ.29,046 కోట్లుగా చోటు చేసుకుంది.

పిసి జువెలర్స్ ఒటిఎస్‌కు ఐఒబి ఆమోదం

హైదరాబాద్ : పిసి జ్యువెలర్స్ లిమిటెడ్ తన రుణ చెల్లింపులకు సంబంధించిన వన్ టైం సెటిల్‌మెంట్ (ఒటిఎస్) ప్రతిపాదనలకు ప్రభుత్వ రంగంలోని ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ (ఐఒబి) ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని పిసి జ్యువెలర్స్ ఓ ప్రకటనలో తెలిపింది. సంస్థ బకాయిలు చెల్లించడానికి ఒటిఎస్‌ను ఎంచుకున్నట్లు వెల్లడించింది. ఒటిఎస్ నిబంధనలు, షరతులు సెటిల్‌మెంట్ కింద చెల్లించవలసిన నగదు, ఈక్విటీ భాగాలు, సెక్యూరిటీల విడుదల, తనఖా పెట్టిన ఆస్తులు మొదలైనవి ఉన్నాయని తెలిపింది. ఇటీవల బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్‌లతోనూ బకాయిల చెల్లింపునకు ఆ సంస్థ వన్ టైం సెటిల్‌మెంట్ ఒప్పందాన్ని కుదర్చుకుంది.

ఎసోలర్‌కు కోహ్లీతో కొత్త ప్రచారం



న్యూఢిల్లీ : ప్రముఖ కళ్ళజోళ్ల విక్రయదారు ఎసోలర్‌కు ప్రముఖ క్రికెటర్ విరాట్ కోహ్లీ బ్రాండఅంబాసీడర్‌గా నియమితులయ్యారు. కోహ్లీతో కలిసి కొత్త ప్రచార క్యాంపెయిన్‌ని ప్రారంభించినట్లు ఆ సంస్థ తెలిపింది. దీంతో తమ బ్రాండ్‌ను మరింత బలోపేతం చేసుకోనున్నట్లు వెల్లడించింది.

దళిత మహిళపై థర్డ్ డిగ్రీ దారుణం

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి :వ్యకాస

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దొంగతనం చేశారన్న అనుమానంతో దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం దారుణమనీ, ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. థర్డ్‌డిగ్రీ ప్రయోగించిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బాధిత దళిత మహిళకు మెరుగైన వైద్యం అందించాలనీ, ఆ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు.

స్పీకర్ నిర్ణయం తర్వాతే న్యాయ సమీక్ష

- పార్టీ ఫిరాయింపులపై ఏజీ

నవతెలంగాణ - హైదరాబాద్

పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ ఆ పార్టీ ఎమ్మెల్యేలు వేసిన పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో వాదనలు జరిగాయి. ఏజీ వాదిస్తూ, స్పీకర్‌కు కోర్టులు ఆదేశాలు జారీ చేయడానికి వీల్లేదన్నారు. స్పీకర్ నిర్ణయం తీసుకున్నాకే కోర్టులు వాటిపై విచారణకు వీలుందని సుప్రీంకోర్టు ఉత్తర్వుల గురించి చెప్పారు. స్పీకర్‌కు ఆదేశాలు జారీ చేయొచ్చంటూ పిటిషనర్ల న్యాయవాది మోహన్‌రావు చెప్పారు. ఖైరతాబాద్, భద్రాచలం, స్టేషన్ ఘన్‌పూర్‌ల నుంచి బీఆర్‌ఎస్ పార్టీ తరపున గెలిచిన దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలో చేరడంపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద వేర్వేరుగా వేసిన పిటిషన్లను జస్టిస్ బి విజయసేన్‌రెడ్డి సోమవారం విచారించారు. పిటిషన్ వేసి నెల రోజులు దాటిందని ఇప్పటికీ స్పీకర్ నిర్ణయం ఎందుకు తీసుకోలేదని ఏజీని హైకోర్టు ప్రశ్నించింది. విచారణ మంగళవారానికి వాయిదా పడింది.

పత్రికల అక్రిడేషన్ల వర్గీకరణ రద్దు : హైకోర్టు

పత్రికల్లో పనిచేసే జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డుల జారీ విషయంలో 2016లో జారీ చేసిన జీవోను సవాల్ చేసిన కేసులో హైకోర్టు తీర్పు చెప్పింది. చిన్న పత్రికల జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డుల విషయంలో ఏబీసీడీలుగా విభజన చేయడాన్ని తప్పుపట్టింది. జీవో 230లో కొంత మేరకు రద్దు చేసింది. రెండు నెలల్లోగా చిన్న పత్రికలకూ అక్రిడేషన్ కార్డుల జారీకి మార్గదర్శకాలను జారీ చేయాలని ఆదేశించింది. మహబూబ్‌నగర్‌కు చెందిన టి కృష్ణ ఇతరుల పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ ఆలోక్ ఆరాదే, జస్టిస్ జె శ్రీనివాసరావులతో కూడిన డివిజన్ బెంచ్ పై విధంగా తీర్పు చెప్పింది.

ఒబిసి జాబితాలో 77 కులాలు

- వివరణ ఇచ్చేందుకు బెంగాల్‌కు ఛాన్స్

న్యూఢిల్లీ : రాష్ట్ర ఒబిసి జాబితాలో 77 కులాలను చేర్చడంపై వివరణ ఇచ్చేందుకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సోమవారం అవకాశం ఇచ్చింది. అనేక కులాలను ఒబిసి జాబితాలో చేర్చడాన్ని కొట్టివేస్తూ మే 22న కొల్‌కత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టును పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఆశ్రయించింది. ఈ పిటీషన్ విచారణలో భాగంగా సుప్రీంకోర్టు ఈ అవకాశం ఇచ్చింది. పశ్చిమ బెంగాల్ పిటీషన్‌ను విచారించిన ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఒబిసి కులాలను గుర్తించడానికి చేపట్టిన సర్వే స్వభావం, పరిధిని స్పష్టం చేయాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అనేక కులాలను ఒబిసిలో చేర్చే సమయంలో బిసి కమిషన్‌తో అర్థవంతమైన సంప్రదింపులు జరపలేదని హైకోర్టు చేసిన వ్యాఖ్యలపై కూడా స్పందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రిజర్వేషన్ల ప్రయోజనం కోసం ఈ కులాలను ఉపవర్గీకరణ చేసేటప్పుడు చర్చలు జరిగాయా లేదా అనే వివరాలను స్పష్టం చేయాలని కూడా కోరింది. ఈ విచారణలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తరుపున సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్, న్యాయవాది అస్తా శర్మ వాదనలు వినిపించారు.

బంగ్లాదేశ్ నేత షేక్ హసీనా ప్రస్థానమిదే

- దేశ రాజకీయాల్లో.. ఆమే కీలక నేత



ఢాకా: బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం నెలకొన్న ఆందోళనలతో ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసి, దేశం విడిచి వెళ్లిపోయారు షేక్ హసీనా. ఆమె బంగ్లాదేశ్ పాలక పార్టీ అవామీ లీగ్ నాయకురాలు మాత్రమే కాదు బంగ్లాదేశ్ వ్యవస్థాపక అధ్యక్షులు కూడా. బంగ్లాదేశ్ జాతిపితగా పిలిచే షేక్ ముజిబుర్ రెహ్మాన్ కుమార్తె. ప్రపంచంలో అత్యంత ఎక్కువ కాలం ప్రభుత్వాధినేతగా వ్యవహరించిన మహిళగా హసీనా పేరొందారు. ఆమె 1996 నుంచి 2001 మధ్య.. అనంతరం 2009 నుంచి తాజాగా రాజీనామా చేసేవరకూ బంగ్లాదేశ్‌ను పరిపాలించారు. ఆమె 1960లో ఢాకా విశ్వవిద్యాలయంలో ఉన్నప్పటికే హసీనా రాజకీయాల్లో చురుగ్గా ఉండేవారు. 1968లో ప్రముఖ శాస్త్రవేత్త ఎంఎ వాజెద్ మియాను హసీనా వివాహమాడారు. బంగ్లాదేశ్ తొలి అధ్యక్షునిగా ముజిబుర్ రెహ్మాన్ ఎన్నికయ్యారు. అయితే అధ్యక్ష పదవి చేపట్టిన కొన్ని నెలలకే 1975 ఆగస్టు 15న ముజిబుర్ రెహ్మాన్ సైన్యం చేతిలో హత్యకు గురయ్యారు. ఆయనతోపాటు హసీనా తల్లిని, ముగ్గురు సోదరులను కొందరు సైనికాధికారులు ఇంట్లోనే హత్య చేశారు. ఈ హత్యలు జరిగినప్పుడు ఆమె బంగ్లాదేశ్‌లో లేరు. అప్పట్లో హసీనా ఆరేళ్ల ప్రవాసంలోనే ఉన్నారు. ఆ సమయంలోనే అవామీ లీగ్ నాయకత్వ బాధ్యతలు చేపట్టారు. 1981లో ఆమె బంగ్లాదేశ్ తిరిగి వచ్చాక రాజకీయాల్లో కీలక నాయకురాలిగా మారారు. ఆ సమయంలో కొన్నిసార్లు గృహనిర్బంధానికి గురయ్యారు. 1990 డిసెంబర్‌లో ప్రజల ఒత్తిడికి తలొగ్గిన బంగ్లాదేశ్ చివరి సైనిక పాలకుడు లెఫ్టినెంట్ జనరల్ మొహ్మద్ ఎర్షాద్ రాజీనామా చేశారు. 1991లో జరిగిన ఎన్నికల్లో హసీనా పార్టీకి మెజారిటీ లభించలేదు. ఆమె ప్రత్యర్థి ఖలీదా జియా నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) విజయంసాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత ఐదేళ్లకు 1996లో జరిగిన ఎన్నికల్లో అవామీ లీగ్ విజయం సాధించడంతో హసీనా తొలిసారి ప్రధానమంత్రి అయ్యారు.

2004లో గ్రనేడ్ దాడి నుంచి బయటపడి..


1996 జూన్‌లో జరిగిన ఎన్నికల్లో అవామీ లీగ్ విజయం సాధించి, హసీనా ప్రధానమంత్రి అయ్యారు. 2001 అక్టోబరులో జరిగిన ఎన్నికల్లో ఖలీదా జియా నేతృత్వంలోని బీఎన్‌పీ, మూడు సంకీర్ణ భాగస్వామ్య పక్షాల చేతిలో అవామీ లీగ్ ఓడిపోయింది. అనంతరం 2004 ఆగస్టులో దేశ రాజధాని ఢాకాలో అవామీ లీగ్ ర్యాలీపై జరిగిన గ్రనేడ్ దాడిలో 22 మంది మృతి చెందారు. ఆ దాడి నుంచి హసీనా బయటపడ్డారు. 2008 డిసెంబరులో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 300 స్థానాలకుగాను 250కి పైగా స్థానాల్లో హసీనా సారథ్యంలోని అవామీ లీగ్ జయకేతనం ఎగరవేసింది. 2009 జనవరిలో మరోసారి ప్రధానిగా హసీనా ప్రమాణం చేశారు. 2014 జనవరిలో సార్వత్రిక ఎన్నికలను బీఎన్‌పీ బహిష్కరించింది. దీంతో హసీనా మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. 2024 జనవరిలో మళ్లీ బంగ్లాదేశ్ ప్రధానిగా షేక్ హసీనా ఎన్నికయ్యారు.

హసీనా-భారత్ సంబంధాలు

ముజిబుర్ రెహ్మాన్ హత్యకు గురైన తర్వాత షేక్ హసీనాకు, ఆమె కుటుంబానికి భారత్ ఆశ్రయమిచ్చింది. అప్పట్లో ఢిల్లీలో షేక్ హసీనా కుటుంబం ఆశ్రయం పొందిన విషయాన్ని పూర్తిగా రహస్యంగా ఉంచారు. కానీ షేక్ హసీనా కుటుంబం ఢిల్లీలో ఉన్న సంగతి బంగ్లాదేశ్ ప్రభుత్వానికి తెలుసని చరిత్రకారులు చెబుతారు. తొలిసారి 1996లో షేక్ హసీనా బంగ్లాదేశ్ ప్రధానమంత్రి పదవిని చేపట్టిన నాటి నుంచి భారత్‌తో స్నేహపూర్వక సంబంధాలు మరింత బలపడ్డాయి. 2022లో భారత్ వచ్చిన సమయంలో హసీనా మాట్లాడుతూ, 'బంగ్లాదేశ్ ఎన్నటికీ భారత్‌ను మర్చిపోదు' అని అన్నారు. 1971 స్వాతంత్ర్యోద్యమ సమయంలో భారత ప్రభుత్వం, సైనికదళం, భారత ప్రజలు తమ పక్షాన నిలబడ్డారని గుర్తుచేసుకున్నారు. 2009లో షేక్ హసీనా అధికారం చేపట్టాక.. బంగ్లాదేశ్ సరిహద్దుల నుంచి ఈశాన్య భారత రాష్ట్రాల్లో కార్యకలాపాలు సాగించే తిరుగుబాటు సంస్థల పట్ల కఠినంగా వ్యవహరించారు. అలా తన నిర్ణయాలతో విశ్వాసాన్ని చూరగొన్నారు షేక్ హసీనా.

కులగణన చేపట్టాల్సిందే

సుప్రీం తీర్పు తర్వాత పెరుగుతున్న డిమాండ్



న్యూఢిల్లీ : ప్రభుత్వ ఉద్యోగాలలో, విద్యా సంస్థల్లో ప్రవేశాలలో ఎస్సీ, ఎస్టీలకు కల్పిస్తున్న రిజర్వేషన్ కోటాలో ఉప వర్గీకరణకు అనుమతిస్తూ సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కులగణన చేపట్టాలని దేశవ్యాప్తంగా డిమాండ్లు పెరుగుతున్నాయి. కులగణన నిర్వహించాలని ప్రతిపక్షాలు ఎప్పటినుండో కోరుతున్న విషయం తెలిసిందే. కులాలపై సమగ్ర సమాచారం లేకుండా ఉప వర్గీకరణ సాధ్యంకాదని రాజ్యాంగ నిపుణులు, కాంగ్రెస్ సహా పలు ప్రతిపక్ష పార్టీలు అభిప్రాయపడుతున్నాయి.

ఉప వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనేక రాజకీయ పార్టీలు, రాష్ట్ర ప్రభుత్వాలు స్వాగతించాయి. ఎస్సీ, ఎస్టీలలో ఉప కులాలను గుర్తించాలంటే కులగణన అనివార్యమని అవి వాదిస్తున్నాయి. కులగణన చేయడం ద్వారానే కులాల వారీగా జనాభాను, ప్రాతినిధ్యాన్ని నిర్ణయించగలమని కర్నాటక మాజీ ముఖ్యమంత్రి వీరప్ప మొయిలీ చెప్పారు. 'ఎస్సీల ఉప వర్గీకరణ తప్పనిసరి. వారు ఒకే జాతికి చెందిన వారు కారు. అందరినీ ఒకే గాటన కట్టడం అంటే ఎస్సీలలో కొన్ని ఉప కులాలకు రిజర్వేషన్లు అందకుండా చేయడమే అవుతుంది. ఆయా సమాజాల సామాజిక, విద్యాపరమైన వెనుకబాటుతనాన్ని అంచనా వేయడానికి కమిటీని ఏర్పాటు చేయాలి' అని ఆయన సూచించారు. జనాభా లెక్కల సేకరణ సందర్భంగా ప్రతి పది సంవత్సరాలకు ఎస్సీ, ఎస్టీల జనాభాను లెక్కిస్తారని, అయితే చిట్టచివరిసారిగా 2011లో జనగణన జరిగిందని, ఆ లెక్కలనే ఇప్పుడూ ప్రామాణికంగా తీసుకుంటున్నారని చెప్పారు. 2011 తర్వాత ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో కులాల వారీ ప్రాతినిధ్యంపై సమాచారాన్ని సేకరించేందుకు ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నాలు చేయలేదని విమర్శించారు. ఆ సమాచారం లేనిదే సుప్రీంకోర్టు తీర్పు వాస్తవరూపం దాల్చబోదని మొయిలీ చెప్పారు.

అట్టడుగు కులాల వారిని గుర్తించేందుకు, విధాన నిర్ణయాలలో వారిని భాగస్వాములను చేసేందుకు కులగణన తప్పనిసరి అని కాంగ్రెస్, సమాజ్‌వాదీ, ఆర్జేడీ సహా పలు ప్రతిపక్ష పార్టీలు వాదిస్తున్నాయి. దేశం పురోభివృద్ధి సాధించాలంటే కులగణన అనివార్యమని కాంగ్రెస్ ఎంపీ మాణికమ్ ఠాకూర్ అన్నారు. సమాచారం లేకుండా ఎస్సీల ఉప వర్గీకరణ అసంభవమని, కులగణనలో జాప్యం జరిగితే ఉప వర్గీకరణకు, మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుకు ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు. కులగణనను ఆలస్యం చేయడమంటే ఎస్సీల ఉప వర్గీకరణను ఆపేందుకు, పార్లమెంటులోకి మహిళలు ప్రవేశించకుండా అడ్డుకునేందుకు కుట్ర పన్నడమే అవుతుందని చెప్పారు. కులగణన జరపనిదే ఓబీసీల ఉప వర్గీకరణపై జస్టిస్ రోహిణి కమిషన్ నివేదికను అమలు చేయడం కూడా సాధ్యం కాదని ఠాకూర్ తెలిపారు.

222కు చేరిన మృతుల సంఖ్య

- మరో 206 మంది అచూకీ గల్లంతు
- వాయనాడ్‌లో ఏడు రోజూ కొనసాగిన గాలింపు, సహాయక కార్యక్రమాలు



తిరువనంతపురం : వాయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రమాదంలో మృతుల సంఖ్య 222గా ఉన్నట్లు కేరళ ప్రభుత్వం సోమవారం అంచనా వేసింది. అలాగే ఏడో రోజైన సోమవారం కూడా శిథిలాల కింద ప్రాణాలతో ఉన్న వారి కోసం, మృతదేహాల కోసం అన్వేషణ కొనసాగింది. మృతుల్లో 37 మంది చిన్నారులు, 88 మంది మహిళలు ఉన్నట్లు గుర్తించారు. మొత్తం మృతదేహాల్లో 172 మృతదేహాలను గుర్తించారు. చూరల్‌మల, ముండక్కై, అట్టమల ప్రాంతాల్లో బురదతో నిండిన శిథిలాల నుంచి 180 శరీర భాగాలను రెస్క్యూ సిబ్బంది వెలికితీశారు. మృతదేహాలకు, శరీర భాగాలకు ఫోరెన్సిక్ వైద్యులు పోస్టు మార్టం నిర్వహించారు, డిఎన్ఎ నమూనాలను సేకరించారు. కాగా, ఇంకా 206 మంది అచూకీని గుర్తించలేకపోయారు. గాలింపు, సహాయక కార్యక్రమాలు ఇంకా కొనసాగుతున్నందున మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. అటవీ శాఖ మంత్రి ఎకె శశీంద్రన్ విలేకరులతో మాట్లాడుతూ నిపుణులు గుర్తించిన నాలుగు ప్రాంతాల్లో భూమిలోకి చొచ్చుకునిపోయే రాడర్లు కలిగిన డ్రోన్లతో గాలింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చూరల్‌మల, ముండక్కైను కలిపే ఇరువన్నిపుజా నదిపై ఉన్న బెయిలీ వంతెనకు ఇరువైపులా దృష్టి కేంద్రీకరించినట్లు మంత్రి చెప్పారు.

మరోవైపు కొండచరియలు విరిగిపడిన ప్రాంతంలోకి సాధారణ పౌరులు ప్రవేశించడాన్ని కేరళ రాష్ట్ర ప్రభుత్వం నిషేధించింది. ఈ ప్రాంతంలో సుమారు 1,500 మంది ప్రభుత్వ సిబ్బంది, దాదాపు ఇదే సంఖ్యలో ఉన్న వాలంటీర్ల సహాయంతో సహాయక, గాలింపు చర్యలు నిర్వహిస్తున్నారు. అయితే ఈ ప్రాంతానికి వెలుపల 'రక్షిత జోన్'లో సంబంధిత అధికారుల ముందస్తు అనుమతితో బాధితులకు ఆహారాన్ని పంపిణీ చేయడానికి స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కాగా, గుర్తు తెలియని 31 మృతదేహాలకు, 158 శరీర భాగాలకు పిథుమల శ్మశాన వాటికలో వయనాడ్ జిల్లా యంత్రాంగం సామూహిక అంత్యక్రియలు కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముందు అన్ని ప్రధాన విశ్వాసాలకు ప్రాతినిధ్యం వహించే విధంగా అయా మత పెద్దలు చేత ప్రార్థనలు నిర్వహించారు.

అలాగే ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధ్యక్షతన సోమవారం వయనాడ్‌లో గాలింపు, రెస్క్యూ, సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్న క్యాబినెట్ సబ్‌కమిటీ ఆన్‌లైన్ సమావేశం జరిగింది.

బాధితులకు డాక్యుమెంట్ల కోసం త్వరలో ప్రక్రియ : మంత్రి రాజేష్

కొండచరియలు విరిగిపడిన ప్రమాదంలో బాధితుల రక్షణ, పునరావాసం కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని స్థానిక స్వపరిపాలన శాఖ మంత్రి ఎంబి రాజేష్ సోమవారం తెలిపారు. బాధితులకు సంబంధించిన గల్లంతైన అన్ని డాక్యుమెంట్లను పొందేందుకు త్వరలో ఒక ప్రక్రియ ప్రారంభిస్తామని మంత్రి చెప్పారు. ఈ ప్రక్రియలో ముందుగా విపత్తు నిర్వహణ అథారిటీ మార్గదర్శకాల ప్రకారం స్థానిక స్వపరిపాలన శాఖ నేతృత్వంలో, పునరావాస శిబిరాల్లో ఉన్న వ్యక్తుల వద్ద నుంచి వారు పోగొట్టుకున్న డాక్యుమెంట్ల గురించి ప్రాథమిక సమాచారాన్ని సేకరిస్తామని తెలిపారు. తరువాత వివిధ శాఖల సహకారంతో తదుపరి రెండు రోజుల్లో ఈ సేకరణ ప్రక్రియ పూర్తి చేస్తామని మంత్రి చెప్పారు. తరువాత డాక్యుమెంట్ల పంపిణీ ఉంటుందని తెలిపారు. అలాగే, ఈ ప్రమాదంలో 352 ఇళ్లు పూర్తిగా, 122 ఇళ్లు పాక్షికంగా ధ్వంసమైనట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు. వైతిరి తాలూకాలోని కొత్తపాడి, వెల్లరిమల, త్రికేపేట గ్రామాలను రాష్ట్ర ప్రభుత్వం విపత్తు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించి ఉపాధి హామీ పథకం ద్వారా 150 రోజుల ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా రోడ్డు నిర్మాణ పరిమితిని 10 శాతం పెంచనున్నారు. మెటీరియల్ వర్క్ పరిమితిని కూడా 40 శాతం పెంచనున్నారు. ఈ ప్రమాదంలో గల్లంతైన వ్యక్తుల వివరాల సేకరణ వేగంగా జరుగుతోందని మంత్రి చెప్పారు.

మెరుగైన పాలనే లక్ష్యం

- ఆర్థిక సంస్కరణలతో గతంలో వృద్ధి
- అక్టోబర్ 2న విజన్ డాక్యుమెంట్:

కలెక్టర్లకు చంద్రబాబు దిశా నిర్దేశం



అమరావతి: రానున్న రోజుల్లో నాలుగు 'పి'లతో ముందుకు వెళ్లాలని జిల్లాల కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర సచివాలయంలో కలెక్టర్ల సమావేశం సోమవారం జరిగింది. అన్ని జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సదస్సును ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వివిధ అంశాలను ప్రస్తావిస్తూ ప్రసంగించారు. సదస్సు ప్రారంభం నుండి చివరి వరకు సమావేశంలోనే ఉన్న ఆయన వివిధ సందర్భాల్లో కూడా జోక్యం చేసుకుని మాట్లాడారు. సదస్సు ప్రారంభంలో గతంలో తమ ప్రభుత్వం అనుసరించిన విధానాలు, సాధించిన ఫలితాలు, భవిష్యత్తులో ప్రాధాన్యతలను, పాలన సాగే తీరును కలెక్టర్లకు వివరించారు. గతంలో అమలు చేసిన పబ్లిక్, ప్రైవేటు పార్టనర్ షిప్ విధానాన్ని ప్రస్తావించిన ఆయన, ఆ విధానంతో మంచి అభివృద్ధిని సాధించామని చెప్పారు. ప్రస్తుతం పబ్లిక్, ప్రైవేటు, పీపుల్స్ పార్టనర్‌షిప్ (నాలుగు 'పి'లు) విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. కలెక్టర్లు ఈ విధానాన్ని అమలు చేస్తూ ముందుకు వెళ్లాలని, మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. ఆర్థిక సంస్కరణలు అమలు చేయడం ద్వారా గతంలో మంచి ఫలితాలు సాధించినట్లు చెప్పారు. 'రాష్ట్రంలో కాంపిటేటివ్ గ్రోత్ వచ్చింది' అని చెప్పారు. ఇప్పుడు కూడా మెరుగైన పాలన అందించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. అక్టోబర్ రెండవ తేదీన విజన్ డాక్యుమెంట్ విడుదల చేయనున్నట్లు తెలిపారు.

ఇసుక అక్రమ మైనింగ్‌పై వివరణ ఇవ్వండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

నవతెలంగాణ - హైదరాబాద్

కామారెడ్డి జిల్లా బిచ్కుకుంద మండలంలో ఇసుక అక్రమ మైనింగ్‌పై తీసుకున్న చర్యలేమిటో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. అక్రమ ఇసుక మైనింగ్ అరికట్టడానికి తీసుకున్న చర్యలపై పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాథే, జస్టిస్ శ్రీనివాస్‌రావులతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. భూగర్భ, గనుల శాఖ, రెవెన్యూ, హోం, రవాణా శాఖల ముఖ్యకార్యదర్శులు, గనుల శాఖ ఎండీ, సహాయ డైరెక్టర్, కామారెడ్డి కలెక్టర్, ఎస్పీ, బిచ్కుకుంద తహసిల్దార్లు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ప్రయివేటు వ్యక్తులతో అధికారులు కుమ్మక్కు కావడంతో యథేచ్ఛగా అక్రమ మైనింగ్ జరుగుతోందంటూ కామారెడ్డి జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎ ప్రకాష్ రాసిన లేఖను హైకోర్టు పిల్‌గా మలిచి విచారణ చేపట్టింది.

కొత్తపల్లిలో గ్రానైట్ పరిశ్రమలపై పిల్

కరీంనగర్ జిల్లా బావోపేట్ కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్ గ్రామంలో గ్రానైట్ క్వారీలతో పరిసరాల కాలుష్యంపై తీసుకున్న చర్యలేమిటో తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. కాలుష్యం కారణంగా పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారంటూ డాక్టర్ డి అరుణ్‌కుమార్ హైకోర్టుకు లేఖ రాశారు. దీన్ని సుమోటో పిల్‌గా పరిగణించిన హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే, జస్టిస్ శ్రీనివాస్‌రావులతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. ప్రతివాదులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పరిశ్రమల శాఖ, పర్యావరణ శాఖ ముఖ్యకార్యదర్శులు, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, కరీంనగర్ జిల్లా కలెక్టర్, గనుల శాఖ సహాయ డైరెక్టర్, పర్యావరణ ఇంజినీరు, కొత్తపల్లి తహసిల్దార్లకు నోటీసులు ఇచ్చింది. విచారణను వాయిదా వేసింది.

ఉప కులాలకు అందని రిజర్వేషన్ ఫలాలు

- వేలాదిగా పేరుకుపోతున్న బ్యాక్‌లాగ్ పోస్టులు



న్యూఢిల్లీ : ఎస్సీ, ఎస్టీలలో ఉప కులాలు, తెగలకు రిజర్వేషన్ ఫలాలు అందకపోవడంతో ప్రభుత్వోద్యోగాలలో ఆయా తరగతుల వారికి కేటాయించిన ఖాళీలు ప్రతి ఏటా అలాగే ఉండిపోతున్నాయి. ఫలితంగా ఆయా ఉప కులాలు ప్రయోజనం పొందలేకపోతున్నాయి. భర్తీ కాని ఉద్యోగాల సంఖ్య పెరుగుతూనే ఉన్నదని గణాంకాలు చెబుతున్నాయి. కింది స్థాయి నుండి సీనియర్ పోస్టుల వరకూ ఇదే పరిస్థితి. ఎస్సీ, ఎస్టీల సంక్షేమంపై గత సంవత్సరం పార్లమెంటరీ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలలో ఎస్సీ, ఎస్టీలు తమ రిజర్వేషన్ కోటా కంటే అధికంగా పొందినవి గ్రూప్-సీ ఉద్యోగాలు మాత్రమే. కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల్లో 37 శాతానికి పైగా ఎస్సీలు, 7.4 శాతం ఎస్టీలు ఉన్నారు.

గ్రూప్-ఏ పోస్టుల్లో ఎస్సీలు 13 శాతం, ఎస్టీలు 5.5 శాతం మంది మాత్రమే పనిచేస్తున్నారు. దిగువ స్థాయి ఉద్యోగాలలో మాత్రం ఎస్సీ, ఎస్టీల సంఖ్య కోటా కంటే ఎక్కువగా ఉంటోంది. స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టినా, విద్యార్హతలో సడలింపులు ఇచ్చినా, పదోన్నతికి ముందు శిక్షణ కల్పించినా మంత్రిత్వ శాఖలు కానీ, విభాగాలు కానీ వేలాది బ్యాక్‌లాగ్ రిజర్వ్‌డ్ పోస్టులను భర్తీ చేయలేకపోతున్నాయి. ప్రాబల్యం కలిగిన కొన్ని ఎస్సీ, ఎస్టీ కులాలు రిజర్వేషన్ల ప్రయోజనాలు పొందుతున్నప్పటికీ సంవత్సరాల తరబడి పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. 45 కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. టీచింగ్ పోస్టుల్లో ఎస్సీలు 11 శాతం, ఎస్టీలు ఐదు శాతం కంటే తక్కువగానే ఉన్నారు. బోధనేతర సిబ్బంది పోస్టుల్లో ఎస్సీల వాటా పది శాతం కంటే తక్కువగా, ఎస్టీల వాటా ఐదు శాతం కంటే కొంచెం ఎక్కువగా ఉంది. సీనియర్ పోస్టుల విషయంలో ఈ వాటాలు మరింత తక్కువగా ఉంటున్నాయి. ఎస్సీలలో కేవలం 1.9 శాతం మంది మాత్రమే నెలకు యాభై వేల రూపాయల కంటే అదనంగా వేతనం పొందుతున్నారని ఐఆర్‌ఎస్ అధికారి ఎంఎస్ నేత్రపాల్ చెప్పారు. ఎస్సీలలో ఉప కులాలకు సంబంధించి పెద్దగా సమాచారం లేదని, ఎస్సీలను ఒకే కేటగిరీగా చూపుతూ సమాచారాన్ని సేకరించారని ఆయన తెలిపారు. ఉప వర్గీకరణ జరపకపోవడమే ఈ పరిస్థితి కారణమా అన్న ప్రశ్నకు ఖాళీలన్నీ భర్తీ అయితేనే సమాధానం లభిస్తుంది. ప్రభుత్వం నడిపే వైద్య కళాశాలలు, ఇంజినీరింగ్ కాలేజీలు, విశ్వవిద్యాలయాలలో మాత్రం రిజర్వేషన్ కోటా సీట్లన్నీ నిండిపోతున్నాయి.

బంగ్లాదేశ్ మరో పాకిస్తాన్‌లా మారుతుంది

- హసీనా కుమారుడు జోయ్

ఢాకా: షేక్ హసీనా కుమారుడు ప్రధానిసలహాదారు అయిన నజీబ్ వాజేద్ జోయ్ దేశంలో చోటుచేసుకున్న హింసాత్మక నిరసనలను ఖండించారు. హసీనా రాజకీయంగా పునరాగమనం ఇక ఉండకపోవచ్చని సోమవారం నాడు బిబిసికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన అన్నారు. తన తల్లి ఎంతో కష్టపడి పనిచేశారని, మైనార్టీలు ఎదురు తిరగడం ఆమెను నిరాశపరిచిందని అన్నారు. హసీనా నేతృత్వంలో దేశం సాధించిన పురోభివృద్ధికి తీవ్ర విఘాతం కలిగిందని, మధ్యంతరంగా ఎన్నుకోబడని ప్రభుత్వం ఆధ్వర్యంలో బంగ్లాదేశ్ మరో పాకిస్తాన్‌లా మారుతుందని జోయ్ అన్నారు.

ఏలూరు జిల్లాలో ఘోరం

- చిన్నారిపై ఆగంతకుని లైంగిక దాడి



నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడు మండలం పల్లెర్లమూడిలో నాలుగు సంవత్సరాల చిన్నారిపై లైంగిక దాడి జరిగింది. ఈ ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. కుటుంబంతో కలిసి ఇంటి వద్ద ఆరుబయట నిద్రిస్తున్న చిన్నారిని ఎత్తుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడడం అందరినీ కలిచి వేసింది. ఇందకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం... పల్లెర్లమూడిలో ఎస్‌టి సామాజిక తరగతికి చెందిన ఒక కుటుంబ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తోంది. ఉక్కబోత ఎక్కువగా ఉండడంతో ఇంటి ఆరు బయట నిద్రిస్తున్న తాత, నానమ్మతో కలిసి చిన్నారి ఆదివారం రాత్రి పడుకుంది. తల్లిదండ్రులు, మరో ఇద్దరు పిల్లలు ఇంటి లోపల నిద్రించారు. అంతా ఆదమరిచి నిద్రిస్తున్న సమయంలో ఆగంతకుడు ఇంటి గోడపై ఉంచిన బాలిక తండ్రి సెల్‌ఫోన్‌ను దొంగిలించాడు. అనంతరం ఆరు బయట నిద్రిస్తున్న చిన్నారిని అపహరించి సమీపంలోని పామాయిల్ తోటలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. స్పృహ కోల్పోయిన చిన్నారి పట్టీలను సైతం అపహరించి అక్కడ నుంచి పరారయ్యాడు. బాలికకు స్పృహ వచ్చాక తోటలోనుంచి రోడ్డుపైకి వచ్చింది. అదే సమయంలో సోమవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో పొలం వద్దకు వెళ్తున్న ఆ ఊరి పెద్ద... ఆ బాలికను చూసి ఆరా తీయడంతో తన తల్లిదండ్రుల పేర్లు చెప్పింది. వెంటనే ఆయన సమీపంలోని గ్రామస్తులకు, ఆ చిన్నారి తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. వారిచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చిన్నారిని నూజివీడు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. నూజివీడు ఆర్‌డిఒ భవానీ శంకరి సంఘటనా స్థలాన్ని సందర్శించారు. పోలీసులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటన నేపథ్యంలో చిన్నారి తీవ్ర భయాందోళనతో ఉంది.

అఘాయిత్యానికి పాల్పడిన ఆగంతకుడిని గుర్తించి శిక్షించండి : మంత్రి పార్థసారథి

చిన్నారిపై లైంగిక దాడి పట్ల రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అఘాయిత్యానికి పాల్పడిన అంగతకుడిని గుర్తించి తక్షణం అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని జిల్లా యంత్రాంగాన్ని, పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. అవసరమైతే జాగిలాలను రంగంలోకి దించాలని సూచించారు.